# రాముడు - కృష్ణుడు



రచన :

యల్లంరాజు శ్రీనివాసరావు

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# రాముడు - కృష్ణుడు



రచన :

యల్లంరాజు శ్రీనివాసరావు

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# రాముడు - కృష్ణుడు

ముద్రణ :
తారణ సం॥ జ్యేష్ఠ మాసం

**యల్లంరాజు శ్రీనివాసరావు**
పాపరాజు వీధి,
సత్యనారాయణపురం,
విజయవాడ-520 011.
ఫోన్ : 2538526

వెల : **రూ. 60-00**

టైప్ సెట్టింగ్ :
**ప్రసాద్ గ్రాఫిక్స్**
పటమట, విజయవాడ.

ఆఫ్‌సెట్ ప్రింటింగ్ :

విజయవాడ.

Brahmasri
Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# - సభా వేదిక -

దశావతారాలలో రెండే ఉన్నాయి విభవావ తారాలు. రాముడు. కృష్ణుడు. ఒకటి ధర్మానికి మరొకటి మోక్షానికి ప్రతీకలు. అందుకేనేమో భక్తులందరూ చాలా వరకు రాముణ్ణి పట్టుకొంటే - జ్ఞానులైన వారు కృష్ణుణ్ణి భజిస్తారు. మేము అద్వైతులం. మాకు రాముడైనా ఒకటే - కృష్ణుడైనా ఒకటే. ఇద్దరూ భగవ దవతారాలే. అందులో జ్ఞానం భగవత్స్వరూపమైతే- ధర్మం దాని విభూతి. ఇక వైరుధ్యమేముంది. ఇది గమనించేనేమో మహాభక్తుడూ మహాజ్ఞాని అయిన పోతన మహాకవి నల్లని వాడు పద్మనయనంబుల వాడని ఒకే మూసలో బోసి ఇద్దరి మూర్తులనూ మన ముందు నిలిపాడు. రెండు పద్యాలలో ఒకటి చక్రవర్తి రూపమైతే వేరొకటి చక్రధారి స్వరూపం. ఆమాటకు వస్తే స్వరూపమే విభూతి. విభూతే స్వరూపం.

కనుకనే రామకృష్ణులిద్దరూ నిలబడ్డారొకే వేదిక మీద. దూరంగా గాదు. పక్క పక్కనే నిలుచున్నారు. మౌనంగా మనలను పలకరిస్తున్నారు కూడా. ఏమని. మేమిద్దరమూ అభ్యర్థులమే. మాలో ఎవరికి వేసినా మీరు ఓటు వేయవచ్చు. వేస్తే ఇద్దరమూ పంచుకొని ఒకే పదవి నందుకొని కలిసి కట్టుగా పనిచేస్తాము. మమ్ముల నాశ్రయించి బ్రతుకుతున్న మీ కందరికీ సమానంగా శాంతి సౌఖ్యాలు పంచి పెడతా మని హామీ ఇస్తున్నారు. చూడ ముచ్చటగా లేదూ వారి మూర్తి. విన ముచ్చటగా లేదూ వారి మాట. విందా మెంత వరకూ నిలబడతారో - నిలబెడతారో ఈ మహానుభావులు తమ వాగ్దానం.

ఇతి

**రామకృష్ణ చరణ ద్వయదాసః**

**యల్లంరాజ శ్రీనివాసః**

Yallamrajusrinivasarao
www.advaitavedanta.in

# - రాముడు -

నల్లనివాడు - పద్మ నయనంబుల వాడు - మహా శుగంబులు॥
విల్లును దాల్చు వాడు - కదు విప్పుగు వక్షము వాడు - మేలుపైఁ
జల్లెడు వాఁడు - నిక్కిన భుజంబుల వాడు - యశంబు దిక్కులం
జల్లెడు వాడు నైన రఘు సత్తము డిచ్చుత మీ కభీష్టము॥

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# - రామ తత్త్వము -

రామాయణ కథానాయకుడైన రాముడెవరు. ఉత్తమ పురుషుడా లేక పురుషోత్తముడా. ఉత్తమ పురుషుడంటే పరమాత్మ. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృత:- అని భగవద్గీతా వాక్యం, అలా కాక పురుషోత్తము డనుకొన్నామో, మానవులలోనే ఒకానొక ఉత్తముడైన మానవుడు. అందరికీ అదర్శప్రాయమైన వాడని అర్థం. మొదటి పక్షంలో సాక్షాత్తూ భగవంతుడే అవుతాడు రాముడు. రెండవ పక్షంలో సర్వశ్రేష్ఠుడైన మానవుడవుతాడు. ఇందులో ఎవడీ రాముడు. ఎవడనే ప్రశ్న అసలెందుకు వచ్చింది. దశావతారాలలో రాముడు కూడా ఒక అవతార విశేషమే ననిగదా పరిగణించారు పురాణాలలో. అలాంటప్పుడు మిగతా అవతారాల లాగ ఇదీ భగవంతుడే కావాలి గదా. వాటిలో దేనిలోనూ కలగని విచికిత్స ఇందులో మాత్రమే ఎందుకేర్పడింది. నిజమే. అలా ఏర్పడటానికి వీలులేదు. విభవాతారాలలో కృష్ణావతారమెంతో రామావతారమూ అలాంటిదే. పరిత్రాణాయ సాధూనామ్ - వినాశాయ చ దుష్కృ తా - మన్నట్టు దుష్టశిక్షణ శిష్ట రక్షణా చేసి విశ్వధర్మాన్ని స్థాపించటానికే గదా భగవంతుడు లోకంలో అవతరిస్తాడని చాటుతున్నది శాస్త్రం. అది కృష్ణుడూ చేశాడు. రాముడూ చేశాడు. ఇరువురూ దుష్టులైన రాక్షసులను సంహరించి శిష్టులైన ధర్మజ విభీషణాదులను కాపాడారు.

అంతే కాదు. అసలు జయ విజయుల వృత్తాంత మొక్కటి మనసుకు తెచ్చుకుంటే చాలు. విమర్శకులు చేసే అభియోగం ఎంత మాత్రమూ అర్థంలేనిదని తెలిసిపోతుంది. జయవిజయులు వైకుంఠ ద్వారపాలకులు. వారిని సనకసనందనాదులు శపించారు భూలోకంలో పోయి పుట్టండని.

వారు దానికి వగుస్తుంటే స్వామివారనుగ్రహిస్తారు వారిని. మూడు జన్మలలో నాతో విరోధం సాధించి వస్తారా లేక బహుజన్మలలో విహితంగా వస్తారా చెప్పండని. విరోధమైతే అయింది మూడు జన్మలలోనే ముగించుకొని వస్తామని సమాధాన మిస్తారు వారు. అలా వచ్చి జన్మించిన వారే కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్య కశిపులూ - త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులూ - ద్వాపరంలో శిశుపాల దంత వక్త్రులూ, వారిని సంహరించటానికి ఆ శ్రీ మహావిష్ణువే అవతరించాడు. కృతంలో వరాహ నృసింహావ తారాలెత్తి హిరణ్యుల నంతమొందించాడు. ద్వాపరంలో కృష్ణావతారమెత్తి శిశుపాల దంతవక్త్రులను రూపుమాపాడు. మరి త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులను కూడా అ దేవుడే గదా సంహరించ వలసింది. అలాంటప్పుడు రాముడా విష్ణు దేవుని అవతారం గాక మరెవరవుతాడు. ఆ మూడూ అవతారాలయి ఇది ఒక్కటీ కాకపోతుందా. అలా చెప్పటం ఏమి బాగు ఏమి సబబు. పురాణ ప్రక్రియకే అది విరుద్ధం గదా.

అంతే కాదు. రాముడవతార పురుషుడు కాడంటే అది పురాణాలకేగాక రామాయణానికి కూడా విరుద్ధమే. వేదవతిని విష్ణువుకే ఇచ్చి పెండ్లి చేయాలనుకున్నాడు తండ్రి. ఆయన సంకల్పం నెఱవేఱకుండానే మరణించాడు హఠాత్తుగా. తండ్రి సంకల్పం ఎలాగైనా సాధించాలని తపస్సు చేస్తుంది వేదవతి. మధ్యలో రావణుడు బలాత్కరించబోతే సహించలేక మరుజన్మలో సీతగా జన్మించి ఆ విష్ణువునే వివాహం చేసుకొని అతని చేత నిన్నూ నీవంశాన్నీ సమూలంగా నాశనం చేయిస్తానని శాపమిచ్చి యోగాగ్నిలో దగ్ధమవుతుంది. ఆవిడేగదా సీతగా అయోనిజ అయి జన్మించింది. మరి ఆవిడ చేసుకొన్న రాముడు విష్ణువుగాకపోతే ఆ ప్రతిజ్ఞ కర్థమేముంది. అలాగే ఇక్ష్వాకు వంశీయుడైన అనరణ్యుడు రావణుడి కిచ్చిన శాపవృత్తాంతం కూడా రాముడు దేవుడేననే సత్యాన్ని చాటుతున్నది. మరి

పరుశురాముడి మాటలలో - మందోదరి విలాపంలో యుద్ధానంతరం బ్రహ్మాది దేవతలు సాక్షాత్కరించి ఆయనను సంబోధించిన తీరులో కథలో ఎక్కడ చూచినా రాముడు విష్ణు అవతారమనే సత్యం అతి స్పష్టంగానే మనకు గోచరమవుతున్నది. ఇంత సాక్ష్యాధారాలున్నా సరే కృష్ణుడి విషయంలో కలిగిన నమ్మకం మనకు రాముడి విషయంలో కలగటం లేదు. ఏమి కారణం.

దీనికి కారణమొకటి గాదు. చాలా ఉన్నాయి. అందులో మొదటిది రామావతారానికి ముందు జరిగిన వృత్తాంతం. రావణుడు తన కెవరివల్లా చావులేకుండా అనుగ్రహించమని బ్రహ్మదేవుణ్ణి వరం కోరుతాడు. సర్వామరత్వ మనేది అసంభవం. మరొక వరం కోరమంటాడు బ్రహ్మ. అలాగైతే వీరి వల్ల నా కవధ్యత్వం ప్రసాదించమని కోరుతూ నహిచింతా మమాన్యేషు - తృణ భూతాహితేమన్యే ప్రాణినోమానుషాదయః- అని మిగతా మనుష్యాది ప్రాణులను తృణీకరించి మాటాడుతాడు. భవిష్యత్యేవమేతతే- అలాగే జరుగుతుంది పొమ్మని పితామహుడు దీవించి వెళ్లుతాడు. దీనిని బట్టి తేలిందేమిటి. వాణ్ణి వధించాలంటే మానవుడుగానే అవతరించాలి పరమాత్మ. దీని కనుగుణంగా దశరథుడు పుత్రకామేష్టి చేసే సందర్భంలో హవిర్భాగాలు గ్రహించటానికి వచ్చిన దేవతలు రావణుడి బాధలు బ్రహ్మతో మొరపెడితే ఆయన వారితో నా తర్క యదవజ్ఞానా - త్త్రదక్షో మానుషాంస్తదా - తస్మాత్సమానుషాద్వధ్యః మృత్యుర్నాన్యోస్యవిద్యతే- అంటాడు. అతడు మనుష్యుని వల్లనే చావాలిగాని మరొకరివల్ల చచ్చేవాడుకాదు. కనుకనే అక్కడికి వచ్చిన విష్ణువును వారు ప్రార్థించినపుడుకూడా వధాయదేవ శత్రూణాం - నృణాంలోకేమనః కురు రాక్షసులను - వధించటానికి స్వామీ నీవు మనుష్యలోకంలో మనసు పెట్టమంటారు. ఆయనకూడా దశవర్ష సహస్రాణి దశవర్ష శతానిచ - వత్స్యామి మానుషేలోకే - పాలయన్ పృథివీమిమామ్ - పదకొండు వేల సం. భూమిని పాలిస్తూ

మనుష్యలోకంలోనే నివసిస్తానని హామీ ఇస్తాడు. మధ్యలోకూడా అత్మానమ్ మానుషమ్మన్యే - నన్ను నేను మనుష్యుడననే భావిస్తున్నానంటాడు. దీనిని బట్టి మనుష్యుడుగా జన్మించి మనుష్యుడుగా భావిస్తూ రావణాదులకు కూడా మనుష్యుడనే భ్రమ కలిగించటానికి మానవోచితంగానే ప్రవర్తించటం వల్ల రాముడు భగవంతుడనే భావం ఎవరికీ కలగటంలేదు.

దీనికి తోడు రెండూ విభవావతారాలే అయినా కృష్ణావతారంలోలాగా వేషభాషలు గాని - లీలలు గానీ- ఏవి చూచినా రాముడు మానవుడనే తోస్తుంది గాని భగవదవతారమనే భావ మెక్కడా కనపడదు మనకు. కృష్ణుణ్ణి లీలామానుషుడనీ -రాముణ్ణి మాయామానుషుడనీ - లోకులు వ్యవహరిస్తుంటారు. మాయామానుషుడని రాముణ్ణి వర్ణించటం మాయకతీతుడనే దృష్టితోగాదు. దానిక ధీనుడయి ప్రవర్తించాడనే అభిప్రాయంతో అనేమాట. రాముడి జీవితం కొనామొదలు ఎక్కడ ఏ ఘట్టం చూచినా మానవోచితంగానే సాగందిగాని తదతీతంగా సాగినట్టెక్కడా కనిపించదు. అలా సాగింది కృష్ణావతారంలోనే. మాయకధీనుడు కాడాయన. అతీతుడు. కనుకనే ఈయన మాయామానుషుడైతే ఆయన లీలా మానుషుడని ప్రఖ్యాతి గాంచారు. మానవ శరీరంతో అవతరించా డనిమాటే. ఆయన జీవితంలో ప్రదర్శించింది ప్రతి ఒకటీ ఒక లీలే. అసలు జీవితమంతా లీలామయమే. భగవదవతారమనే సత్య మదుగడుగునా మనకు కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. గరుత్మంతుడు పిలిస్తే పలుకుతాడు కృష్ణుడికి. ఎక్కడికి వెళ్ళాలన్నా గరుత్మంతుడిపైనే. రాముడి జీవితంలో ఎక్కడా కనిపించదు గరుత్మంతుడు. ఎప్పుడో యుద్ధ సమయంలో నాగపాశబద్ధుడయి నప్పుడాపద్ధర్మంగా మాత్రమే దర్శనమిస్తాడు. అదీ అవసరం తీరగానే మాయమయి పోతాడు.

సముద్రం రాముడికి దారే ఇవ్వలేదు. కోపం వచ్చి మీద బాణ ప్రయోగం చేయబోతేగాని దర్శనమీయదు. అప్పటికీ సేతువు నిర్మించి

వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చాడేగాని దారి ఇవ్వటాని కుద్యుక్తుడు కాలేదు. మరి కృష్ణుడికో. పార్థసారథికమైన రథాన్ని అల్లంత దూరాన చూచాడో లేదో హడలిపోయి ఆ రథం వెళ్లినంత దూరం శిలారూపుడై పడిపోయాడు. కృష్ణుడి రథం సప్తకుల పర్వతాల మీదుగా కూడా ఎగిరిపో గలిగితే రాముడి రథం భూమిమీద పయనించటమే ఎక్కువయింది. అంతేకాదు. రాముడు తన జీవితంలో ఎవరికిగాని గురుత్వం వహించలేదు. ఒకరి కుపదేశం చేయలేదు. మీదు మిక్కిలి వసిష్ఠ విశ్వామిత్రాగస్త్యాదు లందరికీ శుశ్రూషచేసి వారి వల్ల అన్ని విద్యలూ అభ్యసించవలసి వచ్చింది. కృష్ణుడలా కాదు. గర్గసాందీపనాదు లాచార్యులని ఒక లాంఛనమేగాని వారితో సహా అందరికీ తానే ఆచార్యకం వహించాడు. కష్టసమయాలలో వారి నాదుకొన్నాడు. అద్భుతమైన లీలలు ప్రదర్శించి వారి కుపదేశంతోపాటు ఉపకారం కూడా చేశాడు. ఇంతెందుకు. అసలు ప్రతి ఒక్కటీ ముందుగానే తెలిసి చేసినట్టు కనిపిస్తుంది కృష్ణావతారంలో. రామావతారంలో ఏ ఉపద్రవ మెప్పుడు వచ్చిపడితే అప్పుడది అనుభవించినట్టే తోస్తుంది మనకు. చివర కంతమంది కాంతలతో సతమతమై కూడా కృష్ణుడు వారి నవలీలగా వదులుకో గలిగితే రాముడు ఒకే కాంత నొక సంవత్సరకాల మెడబాసి బ్రతకటానికి బెంబేలు పడతాడు.

ఇలా జీవిత విధానమేగాదు. వేషభాషలు చూచినా ఇద్దరికీ ఎంతో అంతరం కనిపిస్తుందని చెప్పాము. కృష్ణుడి రూపంలో కనిపించినట్టు రాముడిలో మూల విరాట్టయిన విష్ణువురూపం కనిపించదు. కృష్ణుడు చతుర్బాహువైతే రాముడు మనలాగే కేవలం ద్విబాహువే. ఆయన పీతాంబరమూ - వనమాలా - కౌస్తుభమూ - ఇలాంటి విష్ణుచిహ్నాలన్నీ ధరించితిరిగితే ఈయన కేవలం ధనుర్బాణాదులు ధరించి ఒక సుక్షత్రియుడి వేషంలోనే కనిపిస్తాడు. ఒకేసారి అనేక రూపాలు ధరించగలడు కృష్ణుడు. రాముడు జీవితాంతమూ ఒకే రూపంలో తప్ప ఇన్ని రూపాలలో ఎప్పుడూ

కనిపించలేదు. మరి నాలుగు మార్లు చూపాడు విశ్వరూపాన్ని కృష్ణుడు తన జీవితంలో. అలాంటి ఘట్టం ఒక్క మారుకూడా చూడబోము రాముడి జీవితంలో. ఇక గోవర్ధనోద్ధరణం దగ్గరనుంచీ - కాళీయ మర్ధనం దగ్గరనుంచీ - చివరిదాకా కృష్ణుడు చేసిన చూపిన అతి మానుషమైన చర్యలూ లీలలూ ఇన్నీ అన్నీకావు. ఎప్పటి కప్పుడు బంధుమిత్ర శత్రు భక్త జనావళి నంతా ఆశ్చర్య రసార్ణవంలో ముంచి తేలుస్తూ ఆయన గారి అవతారతత్త్వాన్ని చెప్పకుండానే చెబుతూ వచ్చింది. ఇలాంటి అద్భుత చర్యలలో ఒక్కటి కూడా మనకు దాఖలా అయినజాడా గోచరంకాదు రామావతారంలో. మొదటినుంచీ చివరిదాకా అంతా మానవోచితమైన వ్యవహారమే. మాటలే. సుఖదుఃఖాద్యనుభవమే. సామాన్య మానవుడికంటే ఇంకా తక్కువస్థాయిలో వ్యవహరించినట్టుగా కూడా కనిపిస్తుం దక్కడక్కడా, కడకు లక్ష్మణుడు, సుగ్రీవుడు - ఇలాంటి వారు కూడా ఆయనకు ధైర్యం చెప్పవలసి వచ్చింది. స్వాస్థ్యం భద్రం భజస్వార్య - త్యజ్యతాం కృపణామాతిః అని సీతా వియోగంలో అలమటిస్తుంటే లక్ష్మణుడు - అలంవైక్లబ్య మాలంబ్య - ధైర్యమాత్మ గతంస్మర - త్వద్విధానా మసదృశ - మీదృశం విద్ధిలాఘవమ్ - మయాపి వ్యసనం ప్రాప్తం - భార్యాహరణ జం మహత్ - నచాహమేవం శోచామి - నచ ధైర్యం పరిత్యజే - అని సుగ్రీవుడూ - సుతిమెత్తని మాటలతోనే ఘాటుగా మందలిస్తా రాయనను.

మొత్తాని కిదంతా గమనించి చూస్తే కృష్ణుడిలాగా రాముడు లీలా మానుషమైన అవతారం కాదని అది మానవోచితమైన జీవితమేనని మహాఅయితే మానవులలోనే ఒక ఆదర్శప్రాయుడైన మానవోత్తముడి వ్యవహారమేనని తేట పడుతున్నది. దీనికి తగినట్టు వాల్మీకి మహర్షి ఎక్కడా తన కావ్యంలో రాముణ్ణి భగవంతుడని పేర్కొనడు. దాశరథిః కౌసల్యా నందవర్ధః - రాజపుత్రః - అని ఇలాంటి మాటలతోనే వర్ణిస్తూ పోతాడు. ఏ మిత్రుడుగాని, బంధువుగాని, మహర్షి గాని తుదకు గుహశబర్యాది

భక్తులుగాని భగవన్నని ఆయన నెక్కడా సంబోధించినట్టు నిదర్శన కనిపించదు. భగవంతుడి అవతారమేనని రూఢి అయినప్పుడు భగవంతుడని సంబోధిస్తే తప్పేముంది. మరచి కూడా అలాంటి మాట ప్రయోగించడు వాల్మీకి. మరి కృష్ణుడి విషయ మలాకాదు. ఎక్కడ చూచినా భగవాన్ భగవాన్ అనే మాట మారుమ్రోగుతూ పోతుంది సాహిత్య ప్రపంచంలో. అసలు భగవద్గీత భాగవతమని గ్రంథాలకు చేసిన నామకరణమే చాలు ఈ సత్యాన్ని మనకు చాటటానికి. దీనిని బట్టి చూచినా చెప్పవచ్చు రాముడి భగవత్త్వ విషయం సందిగ్ధమేనని.

ఏతావతా తేలిందేమిటి. కృష్ణుడిలాగా రాముడు భగవదవతారం కాదేమోనని గదా. ఇదంతా మన భ్రాంతేగాని - వేరుగాదు. కృష్ణుడూ భగవంతుడే రాముడూ భగవంతుడే. ఒకరు మాత్రమే అయి మరొకరు కాకపోలేదు. ఇంతకుముందు చెప్పినట్లు ఇద్దరూ దుష్ట శిక్షణకోస మవతరించినప్పుడే తద్వారా ధర్మ సంస్థాపనం చేసినప్పుడు ఇలాంటి సందేహాని కాస్పద మేముంది. పైగా జయవిజయుల శాపవృత్తాంత మొకటి ప్రమాణ ముండగా మరొక విధంగా భావించటాని కవకాశ మెక్కడిది. అయితే ఇంతవరకూ ఉదాహరిస్తూ వచ్చిన ఉదంతాల మాట ఏమిటి - అవంతా రాముడి భగవత్తత్త్వాన్ని గాక మానవత్వాన్నే చాటుతున్నాయి గదా అని అడగవచ్చు.

అదంతా అవిచారిత రమణీయమని మా సమాధానం. పూర్వాపరాలు కలియ బోసుకొని చక్కగా ఆకళించు కోక అపాతతః చూచి చేసే ఆక్షేపణలవన్నీ. అలాకాక రామాయణ మహాకావ్యాన్ని ఆ మూలాగ్రమూ బాగా లోతుకుదిగి తడవి చూచామంటే అప్పుడదర్థ మవుతుంది మనకు కృష్ణుడికన్నా ఎక్కువ లీలామానుషుడు రాముడేనని, లీలా విషయంలో ఆయనకన్నా ఈయన ఇంకా నాలుగాకు లెక్కువ చదివినవాడే గాని తక్కువ చదివినవాడు కాదు. అయితే తక్కువ వాడిలా కనిపిస్తాడు. అదేమోసం.

అంతకన్నా ఎక్కువ మోసమిది. ఎంచేతనంటే కృష్ణుడేలీలకూడా బయటపడి లోకానికి ప్రదర్శించాడు. తన వేషంలో తన భాషలో తన చేష్టలలో - ప్రతి ఒక్క కదలికలో ఇతడు భగవంతుడని లోకుల కడుగడుగునా అర్థమయ్యే లాగా ప్రవర్తించాడు. అలా ప్రవర్తించలేదు రాముడు. మనో వాక్కాయాలలో ఎక్కడా కూడా తాను భగవంతుడని ఎవరికిగానీ ఏమాత్రమూ ఆచూకీ ఇవ్వలేదు. ఇవ్వకపోగా నేనుకూడా మీలాగే కేవలం మానవుడే నన్నట్టు వ్యవహరిస్తూ వచ్చాడు జీవితంలో. అది చూచి చుట్టూ ఉన్న బంధుమిత్రాదులంతా ఆయనను మానవ మాత్రుడేనని భ్రమిస్తూ వచ్చారు. వారితోపాటు రామాయణ పాఠకులమైన మనంకూడా ఈనాడు అలాగే భ్రాంతి పడుతున్నాము.

అయితే ఇదంతా మన భ్రాంతేకాని కథానాయకుడైన రాముడికి లేదు. అంతకన్నా ఆ నాయకుణ్ణి తీర్చిదిద్దిన వాల్మీకి మహర్షికి లేదీ భ్రాంతి. వాల్మీకి రాముణ్ణి భగవంతుడని సంబోధించక పోవచ్చు. అలా వర్ణించక పోవచ్చు. పైకి వాచ్యంగా చెప్పలేదు. అంతమాత్రమే. వాచ్యంగా చెప్పకపోయినా ఆయన భగవత్తత్త్వాన్ని అడుగడుగునా మనకు ప్రతీయ మానం చేస్తూనే వచ్చాడు తన రచనలో. కాకున్నా వాచ్యంగా చెబితేనే అయినట్టు కాకుంటే కానట్టు భావించరాదు ఏవిషయం గానీ లోకంలో. అసలు వాచ్యంగా చెబితే అది కవి నైపుణ్యానికి దీపకంగాదు లోపకమని కూడా చాటుతారు కావ్య విమర్శకులైన ఆలంకారికులు. రసపోషణ చేసేకవి ఇది శృంగారమిది వీరమిది కరుణమని స్వశబ్దంచేత దాన్ని వాచ్యంగా ఎక్కడా పేర్కొనరాదు. అలా చెబితే అది ఒక పక్షి బొమ్మగీచి దాని క్రింద ఫలానా పక్షి అని దాని పేరు వ్రాసినట్టవుతుంది. దాన్ని చూడగానే ప్రేక్షకులు గ్రహించాలి గాని చిత్రకారుడు ఫలానా అని చెబితేగాదు. చెప్పవలసి వచ్చిందంటే ఆ చిత్తరువులో దాన్ని గుర్తుపట్టకుండా చేసే లోపమేదో ఒకటి ఉందన్నమాట. అలాగే శృంగారాది రసాలను కూడా ఫలానా అని పేర్కొనటంకంటే విభావాది

Yalamarti Brahmasri Srinivasa Rao www.advaitananda.in

సామగ్రిని చక్కగా పోషిస్తే చాలు. దాని బలంతో భావుకుడైనవాడి కా రసానుభవం కలిగితీరుతుంది. అప్పుడా రసస్వరూపం కవి చెప్పకుండానే తెలిసిపోతుంది. ఇదే మహాకవి కుండవలసిన నైపుణ్యమూ - ప్రౌఢి.

అది వాల్మీకి మహర్షి కన్నా ఎక్కువ ఉన్న వాడెవడు సాహితీ ప్రపంచంలో. కనుకనే మహర్షి భగవచ్ఛబ్దాన్ని బాహాటంగా ఎక్కడా ప్రయోగించకపోయినా కథాగమనంలో దాన్ని సమయం వచ్చినప్పుడల్లా చాటుమాటుగా ధ్వనింపజేస్తూనే ఉన్నాడు. ధ్వని మార్గంలో నడచిన ఆ వ్యవహార మెలాంటిదో కావ్యారంభం నుంచీ అరసి చూస్తే తెలుస్తుంది మన కందులోని గాంభీర్యం. ఉపక్రమోప సంహారాలలో ఏకవాక్యత (consistency) అనేది శాస్త్రానికే గాదు. కావ్యానికి కూడా ఆవశ్యకం. అప్పుడే కావ్యాత్మ అనేది పదహారు కళలతో మన కన్నులకు కడుతుంది. రామాయణా ద్యంతాలలో ఇది ఐతిహాసిక మర్యాదలో కంఠోక్తిగానే చాటాడు మహర్షి. కథానాయకుడు సామాన్యుడు కాడు. లోక నాయకుడైన భగవానుడేనని. చూడండి. దశరథుడు ఋశ్యశృంగాదుల సహాయంతో పుత్రకామేష్టి సలుపు తుంటాడు. ఆ సందర్భంలో తమ తమ హవిర్భాగాలకోసం దేవతలంతా అంతరిక్షంలో గుమిగూడి సమయాని కక్కడికి వచ్చిన బ్రహ్మతో తమ గోడు విన్నవిస్తుంటారు. అతడిది విష్ణుదేవుని వల్లనే కాని మరొకరివల్ల సాధ్యమయ్యేది కాదని చెబుతూండగా విష్ణువే స్వయంగా వస్తాడక్కడికి. వారు నారాయణుడికి సాష్టాంగపడి రావణుడి వల్ల తమకు వాటిల్లిన కీడు బపమని ప్రాధేయపడితే అలాగేనని మాట ఇచ్చి పుత్రకాముడైన దశరథుడికి రాముడనే పేరుతో అవతరించాడని గదా వర్ణించాడు కవి. పైగా మానవులవల్ల తప్ప మరెవరివల్లా చావులేకుండా వాడు వరం సంపాదించాడు కాబట్టి మానుష్యే చింత యామాస - జన్మభూమి మథాత్మనః- మనుష్యలోకంలో మనుష్యుడుగానే జన్మించాలని సంకల్పించాడు. పైగా దేవతలతో ఇలా అంటాడా దేవదేవుడు. హత్వాక్రూరమ్ దురాత్మానమ్ దేవర్షీణామ్ భయావహమ్ - దశవర్ష సహస్రాణి - దశవర్షశతానిచ -

వత్స్యామి మానుషేలోకే - పాలయన్ పృథివీమిమామ్ - క్రూరుడైన ఆ రావణుణ్ణి రూపుమాపి ఆ తరువాత కూడా పదకొండువేల సంవత్సరాలదాకా ఈ భూమండలాన్ని పాలిస్తూ అక్కడే ఉండిపోతానని భవిష్య ద్వృత్తాంతాన్ని కూడా ముందుగానే సూచిస్తాడు. తదనుగుణంగానే కృత్వాత్మానమ్ చతుర్విధమ్ - పితరం రోచ యామాస తదా దశరథమ్ నృపమ్ - తన ఒకే ఒక రూపాన్ని నాలుగు రూపాలుగా మలుచుకొని రామలక్ష్మణ భరత శత్రఘ్నులనే నలుగురు సోదరులుగా అవతరించాడని ఉంది.

అంతేకాదు. పరమాత్మ మీ కోసం మానవ లోకంలో అవతరిస్తున్నాడు కాబట్టి మీరుకూడా ఆయనకు తోడ్పడడానికి ఆయా ఋషులకూ అప్సరసలకూ వానరాది రూపాలతో జన్మించండి పొండని చతుర్ముఖుడు దేవతల నాజ్ఞాపిస్తాడు కూడా. పూర్వమేవమయా సృష్టో - జాంబవా నృక్షపుంగవః - ఆవులిస్తూంటే అకస్మాత్తుగా నా వక్త్రబిలం నుంచి జాంబవంతుడనే భల్లూక వల్లభుడు ముందుగానే ఆవిర్భవించాడు. పోతే మిగతా వాళ్ళనంతా మీ మీ అంశలలో సృష్టించమంటాడు. వారు సరేనని అలాగే సృష్టిస్తారు. అలా సృష్టి అయిన మహావీరులే వాలిసుగ్రీవ హనుమన్నల కుముదపనస గజగవయ గంధమాదనాదులంతా. వారంతా రెండు పాయలుగా చీలిపోయి కొందరు వాలిని కొందరు సుగ్రీవుణ్ణి సేవిస్తూ కూచుంటారు. బభూవ భూర్భీమ శరీర రూపైః సమావృతా రామసహాయహేతోః - రామ సహాయార్థం జన్మించిన ఆ యోధవీరు లందరిచేతా ఈ వసుంధర క్రిక్కిరిసి పోయిందట.

కాబట్టి గ్రంథారంభమే మనకు సాక్ష్య మిస్తున్నది రాముడు విష్ణ్వంశ సంభూతుడేనని. ఆరంభమే గాదు. అంతంలో కూడా మరలా మనకిలాగే తార్కణ మవుతున్నది. అదేమిటంటే రాముడింకా రాజ్యపాలన సాగిస్తుంటే బ్రహ్మదు లాయనకు స్వవిషయం జ్ఞాపకముందో లేదో తెలిపిరమ్మని యమధర్మరాజు నాయన దగ్గరకు పంపుతారు. అతడు సన్యాసి వేషంలో

వచ్చి ఏకాంతంగా కలుసుకొని మాటాడుతూ పితామహుడిమాట విన్నవిస్తాడు. ఏమని. కాలోయమ్ తే నరశ్రేష్ఠ - సమీప ముపవర్తి తుమ్ - యది భూయో మహారాజ ప్రజా ఇచ్ఛస్యుపాసితుమ్ - వసవా వీర భద్రంతే-అధవా విజిగీషాతే సనాధా విష్ణునాదేవాః స్వామీ నీవీ కర్మభూమిలో ఉండివస్తానని చెప్పిన గడువు సమాప్తమయింది. మరి రావచ్చు వైకుంఠానికి. లేక ఇంకా ఈ ప్రజాపాలన చేయటం నీ కిష్టమైతే ఉండిపోవచ్చు. అలా కాక రావాలనుకుంటే దేవలోకం విష్ణు సాన్నిధ్యంతో సనాథ మవుతుంది. ఇంతకన్నా సాభిప్రాయమైన మాట ఏముంటుంది. దానికి తగినట్టే ఉంది రాముడిచ్చిన జవాబు కూడా చూడండి. త్రయాణా - మపిలోకానామ్ - కార్యార్థం మమసంభవః - భద్రం తేస్తు గమిష్యామి - యత ఏవాహమా గతః హృద్గతో హ్యసి సంప్రాప్తో - నమేతత్ర విచారణా - ఓయీ నేనీ - త్రిలోక వాసులకు సంబంధించిన కార్యమేదో దానికోస మవతరించాను. అది సక్రమంగా ముగిసింది. ఇక నాకు పనిలేదు వచ్చిన చోటికే వెళ్లిపోతాను. నా మనసులో ఉంది నీవు వస్తావని. రానే వచ్చావు. చాలా సంతోషం. ఇంతకన్నా రాముడి స్వరూపస్మృతికి తార్కాణ మేముంది.

మరొక సన్నివేశం చూచినా తేటపడుతుందిది మనకు. రామనిర్యాణం కూడా ఒక అద్భుతమైన సందర్భమే. సరయూసలిలే రామః పద్భ్యామ్ సముపచక్రమే - సరయూ జలంలో రాముడు ప్రవేశిస్తాడు. తతః పితామహోవాణీ- మంతరిక్షా దభాషత - వెంటనే బ్రహ్మదేవు డాకాశంలో నుంచి ఇలా అంటాడు. ఆగచ్ఛవిష్ణో భద్రంతే - దిష్ట్యా ప్రాప్తోసి రాఘవ - తామ్తనుమ్ ప్రవిశస్వకామ్ వైష్ణవీమ్. వైష్ణవమైన నీ దివ్య శరీరాన్ని ప్రవేశించమని కోరుతాడు. వివేశ వైష్ణవం - తేజ స్సశరీర స్సహానుజః - అనుజులతో కూడా వైష్ణవమైన మూర్తినే భజించాడట రాముడు. అనుజులు కూడా తన అంశలే కాబట్టి అంతా కలిసి ఒకేమూర్తి అయిందని భావం. పైగా సశరీరంగా అనటంవల్ల ఇది మరణంకాదని తెలుస్తున్నది. రాముడు

జన్మించాడు కాని మరణించలేదు. దీనికి భిన్నంగా కృష్ణుడు జన్మించలేదు. కాని మరణిస్తాడు. మరణించటం వల్లనేగదా అర్జునుడాయన కళేబరాన్ని దహనం చేయవలసి వచ్చింది. ఇందులో మనం గ్రహించవలసిన సూక్ష్మమేమంటే ఇద్దరూ అసలు జన్మించనూలేదు - మరణించనూలేదు. ఎందుకంటే జన్మఉందంటే మరణ ముండితీరుతుంది. మరణముందంటే జన్మా ఉండక తప్పదు. అందులో ఏ ఒకటి లేక పోయినా మరొకటి ఉండటానికి లేదు. దీనిని బట్టి రెండూ జనన మరణాలు లేనివే. కనుకనే రెండూ భగవ దవతారాలేనని సాకూతంగా ద్యోతనం చేసిన ట్టవుతున్నది.

ఇంతకూ తేలిందేమంటే రామాయణ మాద్యంతాలు ఏ మాత్రం తడవి చూచినా రాముడి భగవత్తత్త్వం మనకు కంఠోక్తిగానే బయట పెడుతున్నాడు మహర్షి. పోతే ఈ రెండు దరులనూ ఒరసి కొని పారే కథా వాహినిలో మాత్రమే అలా కంఠోక్తిగా వర్ణించ లేదాయన. బాహాటంగా వర్ణించ లేదనేగాని చాటు మాటుగా సూచన చేయటం మత్రం మాన లేదాయన. ఆద్యంతాలలో ఐతిహాసిక ధోరణిలో వాచ్యంగా చెబితే - మధ్యలోనంతా కావ్యమార్గంలో ఆ సత్యాన్ని ప్రతీయ మానం చేస్తూ వచ్చాడు. అదే ఆయన గారి రచనా చాతుర్యం. ఎంత మహర్షో అంత మహాకవి కూడా కదా వాల్మీకి. మధుమయ ఫణితీనామ్ మార్గదర్శీ - అని తరువాతి కవులంతా - ఆయనను కీర్తించారంటే మరి ఆ పరిధిలో ఆ మాత్రం చమత్కృతి లేకుంటే ఎలాగ ? అది భాగీరథిలాంటి కథలో వెతుకుతూపోతే అక్కడక్కడా మణికర్ణికాది ఘట్టాలలాగ కనులకు కట్టినట్టు దర్శనమిస్తూ వస్తుంది మనకు. చూతామది ఎలాటిదో. బాలకాండలో విశ్వామిత్రుడు వస్తాడు దశరథుడి దగ్గరకి రాముణ్ణి తనతో పంపమని అడగటానికి. ఆ మాటవింటూనే హడలిపోతాడు దశరథుడు. అప్పుడు విశ్వామిత్రుడనేమాట వినండి. అహంతే ప్రతిజానామి -హతాంస్తాన్ విద్ధిరాక్షసాన్ - అహంవేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం పసిష్ఠోపి మహాతేజా - యేచేమే తపసిస్థితాః రాముడు ఆ

రాక్షసులను చంపలేడనే మాట మరిచిపో. ఆయన మహాత్ముడు, సత్యపరాక్రముడు. ఆయన సంగతి నీకేమి తెలుసు. నాకు తెలుసు. ఈ వసిష్ఠుడికి తెలుసు. ఇంకా ఇక్కడ ఉన్న మహర్షులందరికీ తెలుసు. అంటే నీకు పుత్రుడుగా కన పడుతున్న వాడీ జగత్తుకంతా పితామహుడైన బ్రహ్మదేవుడికి కూడా పితృదేవుడని – ఆ తత్త్వం తపస్సంపన్నులకు తప్ప ప్రాకృత బుద్ధుల కర్థమయ్యేది కాదని భావం. వసిష్ఠుడుకూడా గట్టిగా అలా బలపరిచిన మీదట ఒప్పుకొంటాడు దశరథుడు. రాముణ్ణి పిలిపించి విశ్వామిత్రుడి కప్పగిస్తాడు. ఆ తరువాత విశ్వామిత్రో యయావగ్రే- తతో రామో మహో యశా: అని వర్ణిస్తాడు కవి. తండ్రితోగాని – ఆచార్యుడితోగాని – కడకు విశ్వామిత్రుడితో గాని – ఒక్క మాట మాటాడకుండా ఆయన నడుస్తుంటే ఆయనతోపాటు మౌనంగా నడుస్తూపోతాడు రాముడు. చూడండి ఇది ఎంత చిత్రమో. ఎక్కడికీ ఎందుకని అడగకుండా వెళ్లే వాడెవడైనా ఉంటాడా. తెలియని మానవుడైతే అడగాలిగానీ అన్నీ తెలిసిన భగవాను డడగటం దేనికి. తెలుసు గనుకనే మౌనంగా వెళ్ళిపోయాడు.

అంతేకాదు. మార్గమధ్యంలో బలాతి బలాదులైన అస్త్రవిద్యల నాయనకు ప్రదానంచేస్తాడు విశ్వామిత్రుడు. అవి కూడా మౌనంగానే స్వీకరిస్తాడు గాని ఒక్క మాట మాటాడడు రాముడు. చూడబోతే ఇవన్నీ ముందే తనకు తెలుసునన్నట్టు ఇలాగే జరుగబోతుందన్నట్టు తోస్తుంది మనకు. పోతే కందర్పుడి ఆశ్రమం దగ్గరకు వచ్చినప్పుడే నోరు దెరచి మాటాడా డాయన. ఇది ఎవరి ఆశ్రమం చెప్పమని అడుగుతాడు. ఫలానా అని చెబుతాడాయాన. ఆరాత్రి అక్కడే ఉంటారంతా. అక్కడ ఉన్న మహర్షులంతా వచ్చి వారిని పూజిస్తారు తెల్లవారి గంగా తరణం చేస్తుంటారు గురుశిష్యులు. అప్పుడు మరలా అడుగుతాడు రాముడు. ఈ జలమధ్యంలో ఈ తుములమైన శబ్దమేమిటని. దానికి మానస సరస్సరయూ వృత్తాంతాన్ని చెబుతాడు మహర్షి. తరువాత తాటకా సంహారం – సిద్ధా శ్రమ ప్రవేశం జరుగుతాయి.

తాటకను వధించాలని ఉన్నా స్త్రీవధ చేయటం ధర్మమా అధర్మమా అని ప్రశ్నించటం - ఆయన ధర్మమేనని చెబితే వధించటం - ఇది కూడా ఒక చమత్కారమే. తెలిసీ తెలియనట్టు నటించడం భగవానుడికొక వినోదం. మారీచ సుబాహులలో సుబాహుణ్ణి చంపి మారీచుణ్ణి దూరంగా దండకారణ్యంలో విసరివేయటం కూడా సాభిప్రాయమే. భావి సీతాహరణ వృత్తాంతం తప్పక జరగాలనే అలాచేశాడని చెప్పుకోవలసి ఉంటుంది.

మరి యజ్ఞరక్షణా నంతరం మిథిలకు తరలిపోవటంలో కూడా ఒక చమత్కారముంది. ఆజ్ఞాపయ యథేష్టం వైశాసనం కరవావకిమ్ - ఇంకా మేము చేరవలసిన పనేముందో ఆజ్ఞాపించమంటాడు. ఆయన మిథిలా పురానికి వెళ్లుదాము. అద్భుతమ్ చ ధనూరత్నం - తత్రైకమ్ ద్రష్టుమర్హసి - కర్తుమారోపణేశక్తా- సకథంచన మానుషాః- అక్కడ ఒక గొప్ప ధనుస్సున్నది. మానవమాత్రు లెక్కుపెట్టలేరు. అదికూడా చూడవచ్చు లెమ్మంటాడు. మానవమాత్రు లెక్కుపెట్టలేరంటే ఏమిటర్థం. రాముడు కూడా మానవుడు కాడనా అవుననా. అయితే ఎలగూ ఎక్కుపెట్టలేడిక తీసుకెళ్లటం దేనికి. ఇక్కడే ఉంది మర్మం. కాడు గనుకనే ఆవిషయం తెలుసుగనుకనే తీసుకెళ్ళాడు ఆచార్యుడు. శిష్యుడికీ తెలుసు తాను మానవుణ్ణి కానని. కనుకనే ధైర్యంగా వెళ్ళాడాయన వెంట. మార్గమధ్యంలో రాముడడుగుతుంటే చెబుతూనే పోతా డెన్నో కథలు. కుశనాభుడి కథా - తనవంశ కథా - ఉమాగంగావతరణ కథా - కుమార సంభవ కథా - సాగర వృత్తాంతమూ - గంగావతరణ కథా - సముద్ర మథన వృత్తాంతమూ - ఒకటిగాదు. అనేక కథా వృత్తాంత లేకరువు పెడుతూ వస్తాడు. రాముడన్నీ ఆలకిస్తుంటాడు. అవన్నీ తనకు తెలీదనా. తనకు ప్రమేయమున్నవే చాలావరకవి. అయినా గురు ముఖంగా వినాలని కుతూహలం. అంతలో గౌతమాశ్రమ ప్రవేశం - అహల్యా శాపవిమోచనం - కూడా జరుగుతుంది. ఇది చాలు రాము డవతారపురుషుడని చెప్పటానికి. అహల్యను

Brahmasri Vallabhajosyula Srinivasa Rao
www.advaitaeda.in

శపించినప్పుడే గౌతము డామెకు శాపమోక్షణం సూచించాడు రామ దర్శనం కలిగినప్పుడే గాని శాపం నివృత్తి కాదని. రాముడి రాకకోసం కనిపెట్టుకొని ఉన్నదావిడ. మరి విశ్వామిత్రుడివెంట ఆయన గారలా రాకపోతే ఎలాగ.

పిమ్మట మిథిలలో జనకసమాగమం కలుగుతుంది. జనకుడు వారిని చూచి ఆశ్చర్యపడుతూ అడిగితే వారుచేసిన ఘనకార్యాలన్నీ వివరించి ధనుస్సు మీద వారికి మక్కువ ఉండి వచ్చారంటాడు. నిజానికి మక్కువ ఉన్నది తనకు. రాముడికి కాదు. అయినా ఈ మాట అన్నాడంటే పైకి లేనట్టు నటించినా లోపల రాముడికీ ఉందన్నమాట. అది విశ్వామిత్రుడికి తెలిసే అని ఉంటాడు జనకుడు దాని పూర్వ చరిత్ర అంతా ఏకరువు పెట్టి అలాంటి ఈ విల్లు రాముడెక్కు పెట్టగలిగితే సీతనిచ్చి పెండ్లి చేస్తానంటాడు. అంతావిని విశ్వామిత్రుడు ధనుర్దర్శయ రామాయ - మా రాముడికి ధనుస్సు చూపించవయ్యా చాలునంటాడు. వెంటనే అయిదువేల కింకరులు దాన్ని అష్ట చక్రమంజూషలో కొని రాగానే వత్సరామధనుః పశ్య - వెళ్ళి చూడు రామా ఆ ధనువునంటాడు మళ్లీ గురువుగారు. గురు హృదయం తెలిసిన శిష్యుడు మంజూషాం తామపావృత్య దృష్ట్వాధనురభాషత చూచాను - గురుదేవా ఏమి చేయమంటారీ ధనువును - తోలనమా పూరణమా ఏమి చేయమంటారని అడుగుతాడు. అలాగే నన్నాడోలేదో ఎక్కుపెట్టి లాగగానే దానిపాటికది విరిగిపోయింది విల్లు. చూడండి. తనకు తెలుసు దాన్ని ఆరోపించే శక్తి ఉందని. దానివల్ల సీత పాణిగ్రహణం కూడా కలుగుతుందని, అయినా ఆ గురువు మాట జవదాటనట్టు ఆయన మాటమీదనే నడచు కొన్నట్టు నటన.

తరువాత దశరథాదులు రావటమూ - వివాహమహోత్సవం జరగటమూ - అయోధ్యకు తరలిరావటమూ - ఎంతో జరిగింది. ఏ ఒక్క ఘట్టంలోనూ వారు వారు మాటాడుకో వలసిందే గాని రాముడు ఒక్క మాట మాటాడడు. అసలు మొదటి నుంచీ అంతే. అతి మిత భాషి.

భాషించక భాషించక ఎప్పుడో ఒక్కసారి భాషిస్తాడు. అది అన్నీ తెలిసిన భగవానుడు భాషించినట్టే ఉంటుంది. అక్కడక్కడ ఇదేమిట దేమిటని మాత్రమే అడిగింది రాముడు. ఇక ఎప్పుడేది ఏ కరువు పెట్టినా విశ్వామిత్రుడే. కేవలం తానొక సాక్షిమాత్రుడుగానే ఆలకిస్తూ ఆయన చెప్పింది ఆచరిస్తూ ఉండిపోతాడు. చూడబోతే ఆయన ప్రణాళికంతా తన ప్రణాళికే గనుక అలా మౌనం వహించాడని తోస్తుంది. మౌన మర్థాంగీ కారమనే మాట ఉండనే ఉందికదా. పోతే అంతవరకూ తొణకని రాముడాఖరున పెండ్లివారితో పాటు అయోధ్యకు తరలిపోయే సమయంలో విజృంభిస్తాడు. పరశురాము డెదిరించి నిలిచినప్పుడే ఆయన ఘాటుగా మాటాడింది. పరశురాము దూరక ప్రగల్భాలు పలుకుతుంటే అంతావిని రాముడు శ్రుతవానస్మి యత్కర్మ కృతవానసి భార్గవ - నీవు చేసిన ఘనకార్యాలన్నీ ఎరుగుదును లేవోయి మహాత్మా పశ్యమే ద్యపరాక్రమమ్ - ఇక నా పరాక్రమంచూడు అని ధనుస్సు ఆరోపించటంతో పాటు అతని తేజస్సు లాగివైచి బాణం విడవబోయేసరికి ఆ మహాత్ముడు ఆదినారాయణుడని అర్థమైపోతుందా బాపడికి. వెంటనే అక్షయం మధుహంతారం జానా మి త్వామ్ సురోత్తమమ్ - ధనుషో స్యపరామర్శాత్ - స్వస్తి తేస్తు వరంతప - స్వామీ నీవు ఈ ధనుస్సును పట్టుకోటం ఎక్కు పెట్టటంలోనే అర్థమయింది నీవు సాక్షాత్తు ఆ మధుసూదనుడవే నని నమస్కరించి వెళ్లిపోతాడు. చూడండి రాముడికీ తెలుసు పరశురాముడికీతెలుసు ఒకరి సంగతి ఒకరిక. శివధనువు విరిచాడంటే తప్పక అతడు విష్ణువేనని తెలుసు పరశురాముడికి. అందుకే వైష్ణవ ధనుస్సు తీసుకొని వచ్చాడాయన ధనుస్సు నాయనకే ఇచ్చిపోదామని. అలాగే ఆ ధనుస్సుతో ఇకమీదట తనకు చాలా అవసరముందని రాముడికితెలుసు. అందుకే ఇవ్వగానే చేతికి తీసుకున్నాడు. ఇక నీ అవతార ప్రయోజన మయిపోయింది. ఇక నాకే ఉంది రాక్షస సంహారభార మన్నట్టు. తీసుకోగానే కోపవ్యాజంతో ఆయనగారిని వెనక్కు పంపివేశాడు. మరి ఇరువురూ భగవత్స్వ రూపులు కాకుంటే ఒకరి మర్మమొక రెలా గ్రహించగలరు.

ఇక అయోధ్యలో అడుగిడి నప్పటినుంచీ అభిషేక భంగమయ్యే దాకా నోరు మెదపలేదు రాముడు.. అభిషేకం చేయాలన్నా - మానాలన్నా - ఏ మల్లగుల్లాలుపడ్డా - అదంతా దశరథుడే. తన్మూలంగా ఏ హర్ష విషాదాల ననుభవించినా కైకేయీ మంథరలే. కౌసల్యా వసిష్ఠాదులే. అభిషేకం చేస్తానన్నా జవాబివ్వలేదు. చేయను పొమ్మన్నా ఇవ్వలేదు. తండ్రి రెండుసార్లు పిలిపించి మాటాడుతాడు రాముడితో. పౌరజానపదులంతా అనుమోదించారు. నీకు యౌవ రాజ్య మప్పగిస్తానని ఒకమారు. పుష్యమీ నక్షత్రం రేపే శుభముహూర్తం అభిషేకిస్తానని మరొక మారు. ప్రకృతులంతా అభినందిస్తున్నారని చెప్పినప్పుడు రాముడు పొంగిపోనూలేదు భరతుడు రాకుండానే పట్టాభిషిక్తుణ్ణి చేస్తానంటే అదేమిటినాన్నా భరతుడేమి పాపం చేశాడు. అతణ్ణి రానీయండని అభ్యంతరం చెప్పనూలేదు. రెండు మాటలకూ తల ఊపి వెళ్ళిపోతాడు. పైగా తల్లి దగ్గరికి వెళ్ళి అమ్మా రాజుగారు రేపు నాకభిషేకం చేస్తారట. సీతా నేనూ ఈ రాత్రి ఉపవసించాలట. రేపు గదా అభిషేకం. మరి మాంగళిక విధులన్నీ చేయించమని అంటాడు. అది చూస్తే ఎలాగ జరిగేదికాదు గదా అని నిర్లక్ష్యంగా అన్నట్టు తోస్తుంది. దీనికి మెరుగుపెట్టినట్టు లక్షణుణ్ణి చూచి లక్ష్మణేమాం మాయాసార్థమ్ - ప్రశాధిత్వం వసుంధరాం - భుంక్ష్వభోగాం స్త్వమిష్టాన్ - రాజ్యఫలానిచ జీవితం చాలు రాజ్యంచ - త్వదర్థ మభికామయే - నీవుకూడా నాతో పాటీ - రాజ్యభారాన్ని వహించు. రాజ్య భోగాలన్నీ అనుభవించు - నీ కోసమే గదా ఈ రాజ్యాన్ని కోరటం - అని అంటాడు. ఎంత హేళనగా ఎంత పట్టీ పట్టనట్టున్న మాటలో చూడండి ఇవి. ఎలాగూ జరిగే వ్యవహారం కాదిది. ముసలాయన పిచ్చేగాని ఈ అభిషేకం జరుగుతుందా పెడుతుందా - నేనూ అనుభవించను. నీవూ అనుభవించవు. చివరకు భరతుడు కూడా అనుభవించేదిలేదు. పదునాలుగేండ్లూ ఎవరి ఆలనా పాలనా లేక ఊరక దైవా ధీనంగా ఉండబోయేదే సమస్తమూనని ఇంత భావ గాంభీర్యముంది ఈ మాటల్లో.

తరువాత కైక వల్ల అభిషేకానికి భంగమేర్పడి తన్ను సుమంత్రుడు వచ్చి తండ్రి దగ్గరకు తోడ్కొని పోయేటప్పుడు అన్న మాటలు చూడండి ఇంకా ఎంత భావగర్భితమో. నిన్ను మీ తండ్రిగారు చూడాలని కోరుతున్నారు. ప్రస్తుతం వారు కైకేయీ మందిరంలో ఉన్నారని నివేదిస్తాడు సుమంత్రుడు. కైకేయీ మందిర మనగానే గ్రహించాడు రాముడు ప్రస్తుతం పిలవనంపట మిక తన ప్రస్థానానికేనని. ఏవ ముక్తస్తు సంహృష్టో - నరసింహో మహాద్యుతిః అని వర్ణిస్తాడక్కడ వాల్మీకి. ఇంతకుముందు రెండుమార్లు పిలిపించినా కలగని ఆనందమిప్పుడు కలిగిందట. అది ముఖంలో కొట్టవచ్చినట్టు ఒక కళాకాంతీ తెచ్చిపెట్టిందట. దానితో నరసింహు డయ్యాడట రాముడు - చూడండి. ఇక ఎలాగూ అరణ్యాలకు వెళ్ళుతానని నిశ్చయమాయనకు. అందుకు ఇంత హర్షం, ఇంత ఉత్సాహం. రాక్షస సంహారం చేయాలంటే ఇక నరసింహావతారాన్నే తలపింప జేయాలతడు. సీతను చూచి అంటాడు గదా. అమ్మా నాన్నా ఇరువురూ నా అభిషేక విషయమేదో ఆలోచిస్తూన్నట్టున్నారు. లక్షయిత్వాహ్యభిప్రాయం - ప్రియకామా సుదక్షిణా - సంచోదయతి రాజానమ్ మదర్థం మదిరేక్షణా - అభిప్రాయం బాగా కనిపెట్టి మంచి చేయాలనే మంచిది గనుక మాతల్లి నాకోసం మాసాయనను బహుశా తొందర పెడుతుండవచ్చు. ఇది నాకు అర్థకామకరం. ఈ దూత వచ్చిన వాలకం చూస్తే - ధ్రువమద్యైవమాం రాజా యౌవరాజ్యే - భిషేక్ష్యతి-ఇంకేమి తప్పకుండా నన్ను మాతండ్రి రేపు యౌవరాజ్యంలో అభిషేకిస్తాడు. ఎంత ఎకసక్కెమైనమాటో చూడండి ఇది. కైక వేసిన ప్రణాళిక తనదే అయినట్టు అదితన కిష్టమే అయినట్టు - ఊరక ఈ పిచ్చిరాజు వ్యామోహంలో పడి దైవికమైన విధాన మర్థం చేసుకోటం లేదన్నట్టు ఎంత అభిప్రాయ మిమిడి ఉందో ఈ మాటల్లో.

ఆ పిమ్మట కైక దగ్గర విషయం బయట పడ్డప్పుడావిడతో అన్న మాటలు చూడండి. నాహ మర్థపరో దేవి నాకు రాజ్యమే కావాలని కాంక్షలేదు.

అనుక్తోప్య త్రభవతా - భవత్యా వచనా దహం - వనేవత్స్యామి. ఆయన చెప్పకపోయినా నీవు చెబితే చాలు నాకు. ఆరణ్యంలో వెళ్లి ఉండగలను. యద్రాజాన మహోచస్త్వమ్ - మమేశ్వరతరా సతీ - నీవే నన్ను శాసించవచ్చు గదా. రాజుమీద మరలా నెపం దేనికి. సవాధర్మ స్పనాతనః - నీవు చేసిన పని చాలా మంచిది. ధర్మబద్ధం. చూడండి. ఎప్పుడెప్పుడు పరిగెత్తి పోదామా అనేంత తొందరలో ఉన్నాడు రాముడు. దానికి తగ్గట్టే ఆ తల్లికూడా నాయనా! మీ నాన్నగారు చెప్పలేదనేది ఒక మాట గాదు. తవత్వహమ్ క్షమమ్మన్యే - నోత్సుకస్య విలంబనమ్ - ఎలాగూ కుతూహలంగా ఉన్నావు నీవు. ఇక విలంబం దేనికి బయలుదేర మంటుంది. ఆవిడకు తెలుసు రామావతార ప్రయోజనం. పోతే ఆవిడ చర్య నొక మిషగా చేసుకొని నాటకమాడదలచినట్టుంది రాముడి వ్యవహారం. తరువాత సీత కూడా తనతో వస్తానంటే రావద్దని నిరుత్సాహ పరుస్తాడు. ఆవిడ గట్టిగా పట్టుపట్టి నిష్ఠూరంగా మాటాడుతుంది. అప్పుడన్న మాటలుకూడా గమనిస్తే తెలుస్తుంది తెలిసి కూడా నాటకమాడే స్వభావం. నదేవి తవదుః ఖేన - స్వర్గమప్యభిరోచయే -సవిహాతుం మయాశక్యా - శక్తి రాత్మవతాయథా - యత్సృష్టాసి మయాసార్థం - వనవాసాయ మైథిలి - అనుగచ్ఛ స్వ మాంభీరు - సహధర్మచరీభవ - నీవునాతో వనవాసం చేయటానికే సృష్టింపబడ్డావు. నిన్ను ఎడబాసి పోవటమంటూ ఉండబోదు. నాతో వచ్చి సహధర్మచారిణి వనే పేరు సార్థకం చేసుకో, ఏమిటీ మాటలు మొదట రావద్దనట మేమిటో ఇప్పుడు వచ్చితీరాలనట మేమిటో తవసర్వమభిప్రాయమ విజ్ఞాయ అనే మాటలో ఉంది దీనికి జవాబు. నాకు తెలిసినా నీ అభిప్రాయ మేమిటో నేను తెలుసుకోవాలిగదా అంటాడు. ఎంత లోతైన స్వభావమో చూడండి రాముడిది. మరి లక్ష్మణుడు కోపావేశం పట్టజాలక కైకను కొడతాను - చంపుతానంటుంటే అనునయిస్తూ రాముడన్న మాటలు చూస్తే - ఆయన పరావరజ్ఞాన మోలాటిదో మనకు పట్టి ఇస్తాయి. కృతాంతస్త్వేవసౌమిత్రే

– ద్రష్టవ్యో మత్ప్రవాసనే – రాజ్య స్యచ వితీర్ణస్య – పునరేవనివర్తనే – కైకేయ్యాః ప్రతిపత్తిర్హి – కథంస్యా న్మమపీడనే – యది భావోన దైవోయమ్ – కృతాంతవిహితో భవేత్ – కథమ్ – ప్రకృతి సంపన్నా – రాజపుత్రీ హ్యానిందితా – ఉన్నత వంశంలో పుట్టి నన్నింత వాత్సల్యంతో చూచే మా తల్లికైక ఇంత దారుణంగా ప్రవర్తించిందంటే ఇదికేవలం దైవప్రేరణేగాని ఆమె అపరాధం కాదు. మరొక కారణం కాదు అంటాడు. ఈ దైవమెవరో గాదు. తానే. తన్ను గూర్చి తానే వ్యంగ్యంగా సూచిస్తున్నాడు అంతేకాదు. తరువాత వల్కల ధారణ మొదలుకొని వన ప్రస్థానం వరకూ ఎన్ని విషయాలు జరుగుతున్నా ఎవరెన్ని దీనా లాపాలు చేస్తున్నా అందరూ కలిసి కైక నెంతగా ఆడిపోసు కొంటున్నా – ఒక్క మాట అయినా మాటాడక మౌనంగా పట్టణాన్ని దాటి వెళ్లిపోవటమింకా గంభీరమైన విషయం.

తరువాత భాగీరథీ తీరంలో గుహుణ్ణి కలుసుకొన్నాడు రాముడు. భరద్వాజుణ్ణీ కలుసుకొన్నాడు. ఇద్దరూ తనకు పూర్వ పరిచితులే. ఇద్దరికీ తెలుసు ఆయన పట్ట భంగమై అక్కడికి వచ్చాడని. అయ్యో ఇలా జరిగిందని మాకు తెలుసు నంటారేగాని అంతకుమించి దాన్ని వ్యాఖ్యానించరు వారు. రాముడు దాన్ని గూర్చి ప్రస్తావించడు. ఒక్క భరతుడు వచ్చి తన్ను తిరిగి రమ్మని బలవంతం చేసినప్పుడే కొంత దీర్ఘంగా చర్చ జరిగింది. అక్కడ ఒక విశేషమేమంటే భరతుడెంత బ్రతిమాలుతున్నా వాటి కొక్కటే జవాబిస్తాడు రాముడు. సమయా శాసనం తస్యత్యక్తుమ్ న్యాయ్య మరిందమ – తత్త్వయాపిసదా మాన్యమ్ – ఋణాన్మోచయ రాజానమ్ మత్కృతే – నాకు గాని నీకు గాని తండ్రిగారి శాసన ముల్లంఘించటం ధర్మంకాదు. ఆయనను నీవు ఋణవిముక్తుణ్ణి చేయాలంటాడు. ఋణమేమిటి – విమోచన మేమిటని ఆశ్చర్యం వేస్తుంది మనకు. అది ఒక రహస్యం. రాజరహస్యం. తప్పనిసరి అయి బయటపెడతాడు రాముడు. పురాభ్రాతః పితానస్స – మాతరంతే సముద్వహన్ మాతామహేసమాశ్రౌషీ – ద్రాజ్యశుల్క

మనుత్తమమ్ - దైవాసురేచ సంగ్రామే - దదౌ రాజావరమ్ - ఇంతకు ముందు నీతల్లి కైకను పరిణయమాడే సమయంలో మీ మాతామహుడితో ఒక సమయం చేసుకుని ఉన్నాడు మన తండ్రి. ఆవిడకు పుట్టిన కుమారుడికే రాజ్యమప్పగిస్తానని, ఆ తరువాత తల్లికి రెండు వరాలు కూడా ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అదే ఆయనకున్న ఋణం. దాన్ని తీర్చి ఆయనను ధర్మాత్ముడు సత్యవచనుఢని లోకానికి నిరూపించ వలసిన బాధ్యత నీమీదా నామీదా ఉంది. చూడండి. ఈ రహస్యవృత్తాంతం బహుశా కైకకు మంథరకూ తప్ప మరెవరికీ తెలిసి ఉండదు గదా. రాముడికెలా తెలిసింది. అంతకుముందు గడచిన కథలో ఈ ప్రస్తావనే రాదెక్కడా. ఉన్నట్టుండి బయటపెట్టాడంటే రాముడు పరావరజ్ఞుడైన అవతారపురుషుడు గనుకనే గ్రహించగలిగాడు. బయట పెట్టగలిగాడు.

సరే భరతుడు పాదుకలు తీసుకుని వెళ్లిపోతాడు. ఆ తరువాత అక్కడి మహర్షులు కొందరు తమ్ముచూచి గుసగుసలాడటం చూస్తాడు. రాముడు. వారిలో ఒక వృద్ధును కలుసుకుని దేనికీ మీరంతా ఇలా ఆందోళన చెందుతున్నారు. మావల్ల అపచారమేమీ జరగలేదుగదా అని అడుగుతాడు. దాని కాయన ఇలా సమాధానమిస్తాడు. అయ్యా ! రావణుడి తమ్ముడు ఖరుడని ఒకడున్నాడు. వాడికి నీవిక్కడికి రావటమిష్టంలేదు. నీవు వచ్చినప్పటి నుంచీ మమ్ములనందరినీ పట్టి బాధిస్తున్నాడు. అంచేత మేమీ అరణ్యాన్ని విడిచి మరొక చోటికి వెళ్ళుదామని చూస్తున్నాము. నీకు కూడా వాడు త్వరలోనే కీడు చేయవచ్చు. నీవూ ఇక్కడినుంచి వెళ్లిపోవటం మంచి దంటాడు. ఇది చూచారా ఈ ప్రసంగం. రాముడు తమకు శత్రువు - రాక్షస సంహారం కోసమే వచ్చాడని రాక్షసుల కందరికీతెలుసు. అంటే ఆయన విష్ణువని వారికి గుర్తేనన్నమాట. అందులోనూ రావణుడి తమ్ముడు ఖరుడు. రావణుడు చెబితేనే వాడికికూడా తెలిసి ఉంటుంది.

అప్పటినుంచీ రాముడిక సీతా లక్ష్మణులతో పాటు ఆ మహర్షి ఆశ్రమం ఈ మహర్షి ఆశ్రమం తిరుగుతూనే ఉంటాడు. మొదట అత్రిమహర్షిని దర్శిస్తారువారు. అక్కడ సీతకు అనసూయాదేవి దివ్యాలంకారాలు ప్రసాదిస్తుంది. ఆవలవారు దండకారణ్యం ప్రవేశిస్తారు. అక్కడ విరాధుడనే రాక్షసు డడ్డగిస్తాడు వారిని. వాడు తుంబురు డనే గంధర్వుడు. శాపగ్రస్తుడయి అలా జన్మించాడు. వాణ్ణి శపించిన కుబేరుడు రామదర్శనమైతే చాలునీకు శాపవిమోచన మవుతుందని చెబుతాడు. రాముడివల్ల ముక్తశాపుడయి వాడు శరభంగముని దగ్గరికి వెళ్లండని చెప్పి తిరోహితు డవుతాడు. మరి ఇలా విరాధుడు ఆయనచేతిలో శాపముక్తుడు కావాలన్నా శరభంగుడు ఆయనగారి దర్శనంచేసి తరించాలన్నా - అది భగవ దవతారం కాకపోతే ఎలాగా. తత్ప్రయోజనార్థం రాజ్య పరిత్యాగం చేసి అరణ్యగమనం చేయకపోతే ఎలాగ. అందుకు నిదర్శనమే ఇదంతా. మరి ఆ తరువాత అక్కడి తాపసులంతా వచ్చి రాక్షసులవల్ల తమకుకలిగే ఉపద్రవాలు మనవి చేసి మమ్ములను కాపాడమంటే ఇలా అంటాడు రాముడు వారితో. భవతా మర్థసిద్ధ్యర్థమ్. ఆగతోహం యదృచ్ఛయా - తస్యమే యం వనేవాసో - భవిష్యతి మహా ఫలః - మీ కార్యం సాధించటానికే నేనసలీ అరణ్యాలకు వచ్చాను. ఇక్కడ నా నివాసానికి తగినంత ఫలం తప్పకుండా కలిగితీరుతుంది. చూడండి. ఎంత గూఢమైన భావమో ఇది. తండ్రిమాట నిమిత్త మాత్రమే గాని నిజంగా తాను వచ్చింది కేవలేనాత్మ కార్యేణ అని ఆయన అన్నట్టే తనపని కోసమే. అంటే దుష్టశిక్షణ కోసమే వచ్చాడు. ఆ పని సాధించటమే తన కర్తవ్యం అంటే భగవత్ ప్రయోజన మదేననిగదాఅర్థం.

శరభంగుడు సుతీక్ష్ణుడి దగ్గరికి వెళ్లమని చెప్పటం - సుతీక్ష్ణుడాయన కాతిథ్యంచేసి మళ్లీ ఒకసారి నా దగ్గరికి రమ్మని చెప్పటం - రెండూ భావ్యర్థ సూచనే. మరలా కొంతకాలానికి సుతీక్ష్ణుడి దర్శనం చేసుకుంటాడు రాముడు. కొన్నాళ్ళక్కడ ఉండి ఒకరోజు ఆయనను అడగుతాడు అగస్త్యుని ఆశ్రమ

మెక్కడో చెప్పమని. ఆయనగారే సూచిస్తాడు ఫలానాచోట అని. తరువాత మరొక విశేషమేమంటే ధర్మభృదాదులైన ఋషులెవరు తనకు తటస్థపడినా ఆగస్త్యులవారి ఆశ్రమమెక్కడ – వారిని చూడాలని అడుగుతూ పోతాడు రాముడు. మనోరథో మహానేష – హృదిమేపరివర్తతే. ఎంతో కుతూహలంగా ఉందట తన కాయనను చూడాలని. దీనికంతా ఒక గూఢమైన కారణమున్నది. అది అగస్త్యుడి దగ్గర బయటపడుతుంది. ఆ మహర్షి చాలామంది క్రూరరాక్షసులను వధించినవాడని సుతీక్ష్ణాదులు చెబుతారు. తన కర్తవ్యమూ అదే రాముడికి. అంతేకాదు. ఆయన దగ్గర తనకు కావలసిన అస్త్రశస్త్రాదు లెన్నో ఉన్నాయి. అవన్నీ రాముడి కప్పగిస్తాడాయన. ఇదమ్ దివ్యమ్ మహచ్చాపమ్ – హేమరత్నవి భూషితమ్ – వైష్ణవం పురుషవ్యాఘ్ర – నిర్మితం విశ్వకర్మణా – అమోఘస్సూర్య సంకాశో – బ్రహ్మదత్తశ్శరోత్తమః – దత్తామమ మహేంద్రేణ – తూణీచాక్షయ సాయకే. మహారజత కోశోయమసిః ఇవిగో వైష్ణవమైన ధనుస్సు – బ్రహ్మదత్తశరం – అక్షయబాణతూణీరాలు – ప్రచండమైన ఖడ్గం – అనేన ధనుషా రామహత్వాసంఖ్యే మహాసురాన్ ఆజహారశ్రియం దీప్తాం – పురావిష్ణు ర్దివౌకసామ్ జయాయ ప్రతిగృహ్ణీష్వ ఈ ధను ర్బాణాదులతో పూర్వం విష్ణుదేవుడు రాక్షస సంహారం చేసి దేవతలకు వారి స్వర్గరాజ్యాన్ని మరలా తెచ్చి ఇచ్చాడు. నీకు కూడా విజయం కలగాలని వీటిని నీకర్పిస్తున్నాను. స్వీకరించమని ఇస్తాడు. రాముడు మాటాడకుండా ఇచ్చిందే తడవుగా ప్రతిగ్రహిస్తాడు. ఏమిటీ వ్యవహారం, ఆగస్త్యుణ్ణి చూడాలనుకొన్న దిందుకా తాను. శరభంగ సుతీక్ష్ణాదులను దర్శిస్తూ వారిని వీరినడుగుతూ రావటమిందుకే నన్నమాట. తన పూర్వాయుధ సామగ్రిని మరలా పరిగ్రహించటానికే. అవి ఆగస్త్యుడి దగ్గర న్యాసమున్నాయని తెలుసు ఆయనకు. తనకోసమే ఆయన దాచాడనీ తెలుసు. తనకోసం కాకపోతే ఆ ముసలాయనకు వాటితో ఏమి పని. పైగా విష్ణువు పూర్వం వాటితోనే

రాక్షస సంహారం చేశాడట. అవే తనకూ కావలసి వచ్చాయట ప్రస్తుతం. రాముడు భగవదవతారమని ఇక వేరుగా నిరూపించాలా. ఈ ఒక్క చిన్న సన్నివేశం చాలదా. చమత్కార మేమంటే అన్నీ తెలిసికూడా ఏమీ తెలియనట్టు అమాయికత్వం నటించడంలో ఉంది కథానాయకుడి ధూర్తత్వం. ఇది కృష్ణ పాత్రకన్నా ఎక్కువ ధూర్తత్వం.

తరువాత పంచవటికి వెళ్ళి అక్కడే నివసించమని సలహా ఇస్తాడు మహర్షి. ఆయుధా లివ్వటం అక్కడికి వెళ్ళి ఉండమని చెప్పటం - ఇది కూడా భావ్యర్థ ద్యోతకమే. అంతేకాదు. అక్కడికి వెళ్లారో లేదో జటాయువు ప్రత్యక్ష మవుతుంది. అది నేనుమీకు సహాయంగా ఉంటానంటుంది. ఇదందుర్గంహి కాంతారం - మృగరాక్షస సేవితం - సీతాంచాపిరక్షిష్యే - త్వయియాతే సలక్ష్మణే - ఇది మహారణ్యం. రాక్షస సంచారమెక్కువ ఉంటుందిక్కడ. ఎప్పుడైనా నీవు లక్ష్మణుడితో ఎక్కడికైనా వెళ్లినా నీను నీదేవిని సీతను కాపాడుతానంటుంది. ఎంత సాభిప్రాయమైన మాట ఇది. ఇంత రాక్షసాకీర్ణమైన చోటికి వెళ్లమని ఆగస్త్యు డెందుకు సలహా ఇచ్చాడో ఇప్పుడర్థమయింది. ఇక్కడే ఉన్నారు ఖరదూషణాది రాక్షసులంతా. వారంతా రావణుడి పరివారం. తప్పకుండా వారితో ఘర్షణ ఏర్పడుతుం దక్కడ ఉంటూ ఉంటే. తద్వారా రావణుడికి వారి వృత్తాంతం తెలిసిపోతుంది. చివరకు వాడితోనూ పోరాటం రాకతప్పదు. ఇదంతా ఊహించే ఆగస్త్యుడాయుధా లిచ్చాడు. రాముడు మౌనంగా పరిగ్రహించాడు. ఆయన సలహామేర కక్కడికే వచ్చి పర్ణశాల వేసుకొని స్థిరంగా అక్కడ కాపురమున్నాడు. ఈ మౌనచర్యలో ఎంత మర్మమున్నదో చూస్తే మన కాశ్చర్యం వేస్తుంది.

ఇంకా ఆశ్చర్యమేమంటే ఖరదూషణాదు లెక్కడ తనమీది కెత్తి రారోనని శూర్పణఖతో ఎకసక్కాలాడి దానికి కోపం తెప్పించి లక్ష్మణుడిచేత దాని ముక్కు చెవులు కోయించి పంపటం. అది సరాసరి వెళ్లి ఖరదూషణాదులను యుద్ధానికి పురికొల్పింది. తద్వధానంతరం మరలా అదేగదా రావణుణ్ణి

ప్రేరేపించింది. మరి వాడు వస్తేగాని సీతాపహరణం జరగదు. అందుకు నిమిత్తం మారీచుడు కావలసి ఉంది. అది ముందుగా తెలిసే తాను బాల్యంలో సుబాహుణ్ణి చంపినా వాణ్ణిమాత్రం చంపకుండా దండకలో పారవేయటం, పూర్వాపరాలు కలిపి చూచుకొంటే ఎంత నాటక మాడాడో చూడండి రాముడు. త్రికాలదర్శి భగవానుడు కాకుంటే ఆడగలడా ఈ నాటకం. పైగా సీత ఆ మృగాన్ని చూచి ప్రలోభపడటం - దాన్ని పట్టి తెమ్మని తన్ను బలవంతం చేయటం - అలాంటి అద్భుతమైన మృగమెక్కడా ఉండదని చెబుతూనే దాన్ని ఆమె కోసం పట్టి తెస్తానని పంతగించటం కూడా వింతగానే ఉంది. లక్ష్మణు డిదంతా రాక్షస మాయ అని చెప్పినా మాయ అయితే మరీ మంచిది దాన్ని ఛేదించటం కూడా మన కర్తవ్యమేగదా అని తన చర్యను సమర్థించ బూనటం కూడా చిత్రమే. చిత్రమే మరి. భగవల్లీల లన్నీ చిత్రమే మనపాలిటికి.

తరువాత సీతా వియోగంవల్ల ఏర్పడిన పరితాప మింతా అంతాగాదు. అంతకు ముందంత బరవసా. ఆ తరువాత ఇంత వేదనా - ఇదీ ఒక లీలే. ఒక ప్రదర్శనే. ఇంతలో కబంధ ప్రతిరోధమూ - అతడి శాపవిమోచనమూ - సుగ్రీవుడితో సఖ్యంచేయమని బోధించటమూ - ఇది కూడా భావిసూచనే. శరభంగుడి దగ్గనుంచీ ప్రతి ఒక్కరూ ముందుకు నడుపుతూనే ఉన్నారు తన్ను. తన అవతార ప్రయోజనాన్ని తనకు గుర్తు చేస్తూనే ఉన్నారు. వారు చేయటం కాదు. వారి ద్వారా తనకు తానే చేసుకొంటున్నాడు. వారు కేవలం నిమిత్త మాత్రులే. కనుకనే ఎవరేది చెప్పినా తనకేది చేతికిచ్చినా మౌనంగా వింటూ మౌనంగానే స్వీకరిస్తూ వచ్చాడు. తన ప్రణాళిక వారు సూచిస్తుంటే తనలో తాను సంతోషిస్తున్నాడు. ఇప్పుడూ అంతే. వాలి సుగ్రీవులిద్దరిలో వాలి పరాక్రమశాలి అయినా మంచివాడు కాడు సుగ్రీవుడే స్నేహపాత్రుడని చెబితే- అదేమిటి బలవంతుడితోనే గదా సఖ్యం చేయవలసిందని ప్రశ్నించకుండా అలాగేనని కిష్కంధకు బయలు

దేరుతాడు. అక్కడ హనుమంతుడు సుగ్రీవ ప్రేషితుడయివచ్చి పలకరిస్తే అతణ్ణి తానెప్పుడూ చూడకపోయినా ఎంతో పరిచయమున్న వాణ్ణిలా చూస్తాడు. అతడి గుణగణాలన్నీ తమ్ముడికి వర్ణించి చెబుతాడు. ప్రశంసిస్తాడు. భగవంతుడికి పరిచయమేమిటి. అపరిచయమేమిటి. దుర్లభోహిద్భృ శోబంధుః అని సుగ్రీవుణ్ణి పేర్కొనటంలో వాలి తనకు శత్రువని చాటినట్టయింది. వాలి తనకేమి అపకారం చేశాడని శత్రువయ్యాడు. అది భగవానుడికే ఎఱుక. నీకూ నాకూ తెలిసే విషయం కాదు. తరువాత దాని పాటికదే బయటపడుతుందీ రహస్యం. కాదు కాదు. ఆయన మౌనచర్యే మనకు బయటపెడుతుంది.

పోతే సీతాన్వేషణార్థం ఎంతోమంది ఎన్నోదిక్కులకు పయనమయ్యారు. హనుమదాదులు మాత్రమే దక్షిణ దిశగా వెళ్లారు. దక్షిణ దిశలోనే లంక ఉందని అక్కడే సీత ఉందని - అంతమాత్రమే తెలుసునందరికీ. కాని రాముడికింకా ఒక విశేషం తెలుసు. ఆ సీతను వెదకి చూడగలవాడు హనుమంతు డొక్కడేనని. వ్యవసాయశ్చ తేవీర-సత్త్వ యుక్తశ్చ విక్రమః సుగ్రీవస్యచ సందేశః సిద్ధిం కథయతీవమే - నాయనా నీ ధైర్యమూ - నిశ్చయమూ - పరాక్రమమూ - సుగ్రీవుడికి నీమీద ఉన్న విశ్వాసమూ చూస్తే నీవే కార్యం సాధించగలవని తోస్తున్నది. ఇదిగో నా నామాంకితమైన అంగులీయకం - సీతా అభిజ్ఞానార్థమని చెప్పి చేతికిస్తాడు. ఇవన్నీ పయిమాటలు. తప్పకుండా హనుమంతుడే సాధిస్తాడని సరజ్ఞుడైన రాముడి కెప్పుడో తెలుసు. కనుకనే అంత మందిలో ఆయనకే ఈ అంగులీయక ప్రదానం. మార్గమధ్యంలో స్వయంప్రభా వృత్తాంతమూ - సముద్ర మధ్యంలో సురసా సింహికా గర్వభంగమూ - లంకలో లంకిణీ సంహారమూ - ఇవన్నీ తట్టుకొని నిలిచేశక్తి హనుమంతుడికే ఉందని ఎప్పుడో గ్రహించి ఉంటాడు రాముడు. అందుకే ఈ అంగులీయక ప్రదానం.

పోతే ఇక హనుమ త్పురాగమనా నంతరం సేనా సహితుడయి సముద్రతీరం చేరి సముద్రుణ్ణి దారి ఇవ్వమని కోరి అతడు పలకక పోతే దానిపైన బ్రహ్మాస్త్రం సంధిస్తాడు. దానితో సముద్రుడేగాక త్రిలోకాలు ఆకులమై పోతాయి. అతడు భీతభీతుడై వచ్చి దాసుడి తప్పు మన్నించమని ప్రాధేయపడతాడు. ఇక్కడ దాఖలా అవుతుంది రాముడి దివ్య స్వరూపం మనకు. మామూలుగా బయటపడదది. మానుష వేషంలో మరుగుపడి ఉంటుంది. ఎప్పుడో సమయంచూచి పడగవిప్పుతుంది. అప్పుడర్థ మవుతుంది దాని ప్రభావం మనకు. విభీషణుడు హఠాత్తుగా వచ్చి శరణు వేడటం – సుగ్రీవాదులను సలహా అడగటం వారు వద్దని చెప్పినా శరణాగత రక్షణం – తన కర్తవ్యమని చెప్పి అతని నాదరించటం – ఇదంతా ఒక అభినయమే. అంతేకాదు. ఇంకా లంకలో ప్రవేశించింది లేదు. రావణ సంహారం చేసిందిలేదు. అప్పుడే అంతా జరిగిపోయినట్టు విభీషణుడికి లంకా రాజ్యాభిషేకం చేస్తాడు. ఇది మరీ సాహసం. అల్పజ్ఞుడైన మానవుడికైతే సాహసం. సర్వజ్ఞుడు పరమాత్మ. సర్వజ్ఞుడు గనుకనే రావణుడు చస్తాడని తెలుసు. తాను గెలుస్తానని తెలుసు. గెలిస్తే ఇక దానవ రాజ్యానికి విభీషణుడే వారసుడనీ తెలుసు. అలా తెలిసే చేశాడనుకోవాలి ఈ అభిషేకం.

అనంతరం యుద్ధకాండలో ఇంద్రజిత్తు వల్ల అన్నదమ్ములిద్దరూ నాగపాశ బద్ధులవుతారు. అప్పుడు అంతరిక్షం నుంచి గరుత్మంతుడే స్వయంగా వచ్చి పాశచ్ఛేదంచేసి వెళ్ళిపోతాడు. ఇదికూడా రాముడి విష్ణుతత్త్వానికి నిదర్శనమే. అంతేకాదు. రావణుడితో పోరాడే సందర్భంలో దేవసారథి మాతలి స్వయంగా ఒక దివ్యమైన రథం తీసుకువస్తాడు రాముడి దగ్గరకు. ఇదీ తార్కాణమే మనకు. అంతేకాదు. రావణ వధానంతరం యుద్ధభూమికి మండోదరి వచ్చి ఆక్రందన చేస్తూ ఇలా అంటుంది. కథమ్ జఘానత్వాం – మానుషో వనగోచర: ఒక మానవుడు నిన్ను వధించటమా,

నేను నమ్మలేను. యద్దైవ చ జనస్థానే – రాక్షసైర్బహు భిర్వృత:– ఖరస్తవహాతో భ్రాతా తద్దైవాసౌ నమానుష : – య ద్దైవ వానరైర్ఘోరై ర్బద్ధస్సేతు ర్మ హార్ణవే తద్దై వహృదయేనాహం – శంకేరామ మమానుషమ్. జనస్థానంలో ఖరదూషణుల నంతమంది సైన్యంతో సహా అంత మొందించాడంటేనే రాముడు మానవ మాత్రుడు కాడు. అపారమైన సాగరంమీద అంత పెద్ద వంతెన నిర్మించి వచ్చాడంటేనే మానవుడు కాడు. అయితే మరెవడు. వ్యక్త మేషమహాయోగీ – పరమాత్మా సనాతనః తమసః పరమోధాతా – శంఖచక్ర గదాధరః మానుషం వపురాస్థాయ – విష్ణుస్సత్యపరాక్రమః సర్వైః పరివృతోదేవైః వానరత్వముపాగతైః లోకానాం హితకామ్యయా – సరాక్షస పరీవారమ్ హతవాంస్త్వామ్ మహాద్యుతిః – ఆ శంఖ చక్ర గదా ధరుడైన లక్ష్మి వరుడే వానరరూప ధరులైన దేవతల నందిరినీ వెంటబెట్టుకుని శ్రీరాముడనే పేరుతో మానవరూపాన్ని ధరించి వచ్చి అనన్య వధ్యుడవైన నిన్ను చివరకు వధించి వెళ్లాడని విలపిస్తుంది. చూడండి. విలాపంచేస్తూ అన్నా ఆవిడనోట వచ్చిన ఈ మాట లెంత సత్యాన్ని మనకు చాటి చెబుతున్నాయో. మహాపతివ్రత నోటవచ్చింది సత్యంగాక అసత్యమెలా అవుతుంది. ఎంత కాలంనుంచో తన హృదయంలో దాగి ఉన్న పరమ సత్యాన్నే వెళ్లగ్రక్కిందా మహాతల్లి.

పోతే వీటన్నిటికీ మకుటాయ మానమైన సన్నివేశం ఆఖరుసారిగా సీతాగ్ని ప్రవేశం. అగ్నిదేవుడే స్వయంగా ఆవిడను రాముడికి తెచ్చి సమర్పిస్తారు. వెంటనే అంతరిక్షంలో బ్రహ్మేంద్రాది దేవతలంతా స్వస్వరూపాలతో సాక్షాత్కరిస్తారు. రాముడి విరాడ్రూపాన్ని వేనోళ్ల కీర్తిస్తారు. అంతావిని రాముడు ఆత్మానమ్ మానుషమ్మన్యే రామం దశరథాత్మజమ్. నేను దాశరథి అయిన రాముడను నన్నునేను మానవుడననే భావిస్తున్నాను. మీరేమిటి నన్ను భగవాను డంటున్నారు. అది ఎలాగో వివరించమని

అడుగుతాడు. చూడండి. ఎంత ధూర్తత్వమో ఇది. భగవంతుడని తనకు తెలియదట. మానవుడనే అని అనుకుంటున్నాడట. వారు చెబితే తెలసుకోవాలని ఉందట. ఒకరు చెప్పట మేమిటి. తానేగా మానవలోకంలో మానవుడుగా అవతరిస్తానని దేవతలతో చెప్పి వచ్చాడు. అప్పుడే మరిచిపోయాడా. మరిస్తే పరమాత్మ ఎలా అవుతాడు. సరిగా ఇక్కడ కృష్ణుడు మాటాడుతున్నట్టుంది గాని రాముడు మాటాడుతున్నట్టు లేదు. ఆ నటనే ఈ నటన అని చెప్పటానికింతకన్నా మంచిఘట్టం మరొకటి కానరాదు. అందుకేనేమో బ్రహ్మ వెంటనే అందుకొని భవాన్నారాయణోదేవః - అజితః ఖడ్గభృద్విష్ణుః కృష్ణశ్చైవ బృహద్బలః - అని - కృష్ణనామంతోకూడా సంబోధిస్తాడా ఆది దేవుణ్ణి. సహస్ర చరణః శ్రీమాన్ - శతశీర్షస్సహస్రదృక్ - అని విరాడ్రూపాన్ని మరోమారు కీర్తిస్తాడు. మహేశ్వరుడు కూడా అలాగే స్తుతిస్తాడు. ఆఖరుకు తండ్రి దశరథుడుకూడా వారితో పాటు ఆయనకు దర్శనమిచ్చి నీ అరణ్యగమనాదికంలోని అంతరార్థమంతా ఇప్పటికి నాకు బోధపడిందని నివేదిస్తాడు. ఇంద్రుడు యుద్ధ భూమిలో చనిపోయిన వానరులనందరినీ ఆయన ప్రీత్యర్థం మరలా బ్రతికిస్తాడు. ఆయన ప్రీత్యర్థ మేమిటి. అది తన ప్రీత్యర్థమే. వారంతా ఎవరా వానరులు. తన పరివార దేవతలే గదా. తరువాత పుష్పకారూఢుడై బంధుమిత్ర పరివార సమేతంగా సాకేతపురానికి రావటం మహావైభవంగా పట్టాభిషేకం చేసుకోవటం దానికి ఋష్యాదులంతా విచ్చేయటం ఇదంతా ఒక విధంగా భగవద్విభూతి ప్రదర్శనమే. దాని కొక నిదర్శనమే.

మరొక విశేషమేమంటే పట్టాభిషేకానంతరం అగస్త్యాదులందరూ వచ్చి తన్ను శ్లాఘిస్తుంటే ఏదో ప్రసంగవశాత్తూ అడిగినట్టు పైకి నటిస్తూ తన ప్రత్యర్థిఅయిన రావణాదుల పూర్వవృత్తాంతాన్ని అడిగి తెలుసుకోటం. ఉత్తరకాండలో సగభాగమదే. పూర్వం రామాయణమైతే ఉత్తరం రావణాయనం. ప్రత్యర్థిఅని పేరేగాని వాడూ తనవాడేగా. తన ద్వార

పాలకుడే. పాపం ఏదోశాపం కారణంగా వచ్చి పడ్డాడీ లోకంలో. తనతో శత్రుత్వం వాడు నటిస్తే తానూ నటించాడు. చివరకు తన వల్లనే శాపమోక్షమై వెళ్లిపోయాడు వాడు. తీగకదిలిస్తే డొంకకదిలినట్టు అతడి చరిత్ర లోతుకుదిగితే అది మరొక విధంగా తన చరిత్రే అయినా ఆశ్చర్యంలేదు. అయిందికూడా. వాడు కైలాసంలో నందితో కలహించి శాపంపాలయ్యాడన్నా – తనవంశీయుడైన అనరణ్యుడి శాపానికి గురి అయ్యాడన్నా – కడకు వేదవతిని బలాత్కరించబోయి యోగానల దగ్ధ అయిన ఆవిడచేత శాపం నెత్తికి తెచ్చుకొన్నాడన్నా – రంభా కామసంరంభంలో నల కూబరుడిచేత శప్తుడయ్యాడన్నా – అదంతా అతణ్ణి వధించటానికి తాను అవతరించక తప్పదనే రహస్యం చెప్పటానికే. దానికోసం ఒక పూర్వరంగాన్ని సిద్ధం చేయటానికే కాకపోతే మరెందుకీ ప్రస్తావన అంతా. ఇంకా తడవి చూస్తే రావణుడు వాలిచేతిలో పరాభవం పాలు కావటం – కార్తవీర్యుడి చేతిలో అవమానితుడు కావటం – ఇవికూడా భంగ్యంతరంగా రాముడి లోకోత్తర పరాక్రమాన్నీ – లోకోత్తరమైన ఆయన అవతారతత్త్వాన్ని చాటి చెప్పటమే. ఆ వాలి నొక్క బాణంతో అవలీలగా వధించాడు. ఆ కార్తవీర్యుడి వేయిచేతులూ నరికిన పరశురాముణ్ణి బాణమింకా విడవకుండానే నిర్వీర్యుణి చేశాడాయె తాను. ఇక వాలిచేతిలో ఓడిపోయిన రావణుణ్ణి జయించట మేమి ఆశ్చర్యం. అదే ఆశ్చర్యం కాకపోతే శ్వేతద్వీప నివాసినులైన విలాసినుల చేతిలో చిక్కి ఒక బక్క కోతిలాగా ఉక్కిరి బిక్కిరి అయిన రావణుడికి తాను విద్రావణుడు కావటమొక ఆశ్చర్యమా. ఆ శ్వేతద్వీప మెవరిది. క్షీరసాగరశాయి అయిన తనదేగదా. ఆ విలాసినులెవరు. తన సహవాసినులే గదా. అంచేత పూర్వవృత్తాంత కథనవ్యాజంతో అగస్త్యుడు జ్ఞాపకం చేస్తే – తచ్ఛ్రవణవ్యాజంతో తనవైభవం తానే స్మరిస్తూ సంతసించటమే ఇదంతా. చుట్టూ ఉన్న హనుమదాదులను సంతసింపజేయటమే. కడపట లోకాపవాదమనే పేరుతో సీతను పరిత్యజించటమూ – ప్రతిజ్ఞ అనే మిషతో



Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

లక్ష్మణుణ్ణి దేశంనుంచి బహిష్కరించటమూ - కూడా యముడికి తాను చేసిన వాగ్దానాని కనుగుణంగా త్వరలోనే వైకుంఠాన్ని చేరటాని కేర్పరుచుకొన్న ప్రయాణ సన్నాహమే. మరేదీగాదు.

ఈ విధంగా చూస్తూపోతే రామాయణ మాద్యంతాలలోనేగాక మధ్యవర్తి అయిన కథా భాగాల నెక్కడెక్కడ తడవిచూచినా కథా నాయకుడు మన మనుకొన్నట్టు ప్రాకృత మానవుడు కాడని - సాక్షాత్తు పరమాత్మేనని చెప్పకుండానే తెలిసిపోతుంది. శబరీ శరభంగ సుతీక్ష్ణాదులను తరింపజేయటమేగాదు. జటాయువుకు పుణ్యలోకాలు ప్రసాదించటమేగాదు - విరాధాదులకు శాపమోక్ష మను గ్రహించటమేకాదు - కాకాసురుణ్ణీ ముప్పుతిప్పలు పెట్టి మూడు లోకాలు తిప్పటమే గాదు - మరి సప్తసాలై కకాల విభేదనాపాది బాణ ప్రయోగమేగాదు. ఇలాటి అతి మానుషచర్యలే కొన్ని చూచినా దాఖలా అవుతుంది రాముని దివ్యానుభావం. అయితే ఒక్కమాట. పరమాత్మే అయి కూడా ఆయా సందర్భాలలో మనబోటి జీవులకంటే కూడా దీనంగా పామరంగా ఎందుకు ప్రవర్తించా డాయన. ఏమి అవసరమని ప్రశ్న. దాని కాయన ఇచ్చాడు సమాధానం. ఆత్మానమ్ మానుషమ్మన్యే - అని మానవుడుగా జన్మిస్తానని మొదట దేవతలకు హామీ ఇచ్చాడు. వత్స్యామి మానుషే లోకే - అని. అలాగే మనుష్యలోకంలో జీవించాడు. చివరకు వివేశ వైష్ణవంతేజ స్సశరీర స్సహానుజః - ఈ మానవ శరీరాన్ని వైష్ణవమైన తన దివ్యతేజస్సులో ప్రవిలయం చేసుకొని దివ్యమైన శరీరంలో వెలుగొందాడు. అద్దైనా ఎందుకని అడిగితే - అలాగైతే గాని రావణుడు వధ్యుడు కాడని సమాధానం. సృష్టిలో ఏ ప్రాణివల్లా చావగూడదని పరమేష్ఠివల్ల వాడు పొందినవరం. అందులో మానవుడిదేమిలే అని వాడి సంగతి ఏ మాత్రమూ పట్టించుకోలేదా దానవుడు. మరి వాణ్ణి చంపాలంటే మానవుడుగా జన్మించాలి పరమాత్మ. మరో మార్గంలేదు. అలా జన్మిస్తేనే పితామహుడి వరాన్ని తాను మన్నించినట్టూ అవుతుంది. వాణ్ణి మట్టు

పెట్టినట్టా అవుతుంది. ఒక దెబ్బకు రెండు పక్షులు. అందుకే తన తత్వాన్ని మభ్యపరచి చివరిదాకా సాగిస్తూ వచ్చిన మహాభినయమిది. తనకు కాకపోయినా లోకాని కలాగే కనపడాలిగదా - అలా కనపడటంవల్లనే తనకు సుగ్రీవాదులందరూ సాయపడుతూ వచ్చారు. రావణుడు మానవుడే కదా అనే నిర్లక్ష్యంతో బరవసాపడి మోసపోయాడు.

ఏమి. అలా మభ్యపరుచుకోవలసిన అవసరమేమిటి. కృష్ణుడిలాగా తన వైభవాన్ని బయటపడి ప్రదర్శించనే వచ్చు గదా - అంటే భాగవతం మాదిరిగాదు రామాయణం. భాగవతం పురాణమైతే రామాయణ మితిహాసం. పురాణం మోక్షపురుషార్థాన్ని బోధిస్తుంది. ఇతిహాస మలాకాక ధర్మ పురుషార్థాన్ని ప్రధానంగా బోధిస్తుంది మనకు. ధర్మ పురుషార్థ మన్నప్పుడది చెప్పేదిగాదు. చేసిచూపేది. ఆ చూపటం తనకోసంగాదు. మానవులకోసం. తాను చేసి చూపేది చూచి మానవులందరూ అలాగే చేయాలని తాత్పర్యం. ఇది మోక్షంలాగా ఏ కొందరుత్తమాధి కారులకో నియతమయింది కాదు. ధర్మమనేది సర్వలోకం సాధారణం. అది లోకులకు బోధించాలంటే యద్యదా చరతిశ్రేష్ఠః - అన్నట్టు తానాచరించి చూపాలి. అందుకోసం అద్భుతమైన లీలలూ మహిమలూ ప్రదర్శిస్తే లాభంలేదు. అవన్నీ మానవుల కతీతమైనవి. జీవితంలో వారికవి ఉపయోగపడవు. కనుక ఆయా వర్ణాశ్రమాల వారి కాయా లింగవయోవస్థాదుల కనుగుణంగా ఎవరికేది విహితమో అలాటి ధర్మం వారికి బోధిస్తూ అందుకు తన జీవితమే ఒక ఆదర్శంగా చూపుతూ వచ్చాడు పరామాత్మ. అందుకే ఏయే సందర్భాలలో మానవుడెలా ప్రవర్తిస్తాడో ప్రవర్తించాలో అలాగే ప్రవర్తించాడు. అదంతా మానవ స్వభావానుకరణమేగాని నిజమైన ఆచరణం కాదు. నర్తకుని భంగి పెక్కగు మూర్తులతోనన్నట్టు ఒక నటుని లాంటివాడు పరమాత్మ. ఏ వేషం వేస్తే ఆ వేషాని కనుగుణంగా నటిస్తూపోతాడు. కృష్ణ వేషం వేసుకొని మోక్షపురుషార్థాని కనుగుణంగా ఆయాలీలలు ప్రదర్శిస్తూ వచ్చాడు.

రామవేషం వేసుకొని ధర్మ పురుషార్థాని కుచితంగా ఒక ఉత్తమ మానవుడిగా ఉత్తమ ధర్మాలను ప్రవచించాడు లోకానికి. లోకం కోసమేగాని ఈ వ్యవహారం తనకోసంగాదు. నానవాప్త మవాప్తవ్యమని ఏ కోరికా లేనివాడికి ఏ వ్యవహారం గానీ ఏముంది. అయినా వ్యవహరించాడంటే అది మనబోటి జీవకోటి కోసమే. ఒకచోట బయటపడి - మరొకచోట పడక - ఇంతే తేడా. పడనిచోట కూడా అంతరాంతరాల్లో దాగి ఉన్నదిదే. ఆంతర్యాన్ని భేదిస్తే ఇది కూడా అదే. కృష్ణుడికి చతుర్భుజాలుంటే రాముడికీ ఉన్నాయి నాలుగు భుజాలూ. సుగ్రీవ విభీషణులే మిగతా రెండు భుజాలు. ఆయనకు శంఖ చాక్రాలుంటే ఈయనకూ ఉన్నాయవి భరత శత్రఘ్నరూపాలలో. మరి అక్కడ రుక్మిణి అయితే ఇక్కడ సీత. అక్కడ శేషావతారుడు బలరాముడిక్కడ లక్ష్మణుడే. శార్ఙమిక్కడ కోదండమైతే - నందక మగస్త్యుడిచ్చిన ఖడ్గమైతే కౌమాదకి ఆయన ఇచ్చిన మోదకి అనే గద అయితే ఇక తక్కువే ముంది రాముడికి. మందహాస సుందరవదనారవిందాని కేలాటి కొదవాలేదు. ఇద్దరికీ కావలసినంత ఉందది. పోతే గరుత్మంతుడొక్కడు లేడే అనే కొఱత ఎవరికైనా ఉంటే అది తీర్చటానికి తయారుగా ఉన్నాడు హనుమంతుడు.హనుమంతుడు గరుత్మంతుడే. ఆకాశగమనం చేశాడు. ఎక్కడికంటే అక్కడికి ఆయనను మోసుకెళ్ళాడు. సీతను కూడా మోసుకెళుతా నన్నాడు అయితే అవిడ ఒప్పుకోలేదు గాని. ఇలా దర్శిస్తూ పోతే అంతా రామలీలే. అంతా కృష్ణలీలే. తుదకంతా భగవల్లీలే భావకుడి దృష్టికి.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ధర్మ పాలనము

రామోవిగ్రహవాన్ ధర్మః - మూర్తీభవించిన ధర్మమే నంటాడు రాముణ్ణి. ధర్మభృతామ్ వరః- అని వాల్మీకి మాట. ధర్మమంటే ధనుస్సని కూడా అర్థమే. ధనుస్సు నెలా ధరించాడో రాముడు ధర్మాన్ని కూడా అలాగే ధరించాడు. తన ధనుస్సులాగే తన ధర్మంకూడా గురితప్పదు. నిర్లక్ష్యంగా వర్తించదు. లక్ష్యంమీదనే దృష్టి. తండ్రి దశరథుడు విడిచిన బాణమైనా గురితప్పి వధ్యుడు కానివాణ్ణి వధించిందేమో గాని తనయుడి బాణం మాత్రం చాటునుంచి ప్రయోగించినా వధ్యుడైన వాణ్ణే వధిస్తుంది. ఒకేబాణం - ఒకేమాట - ఒకేపత్ని - అనేది రాముణ్ణి చూచి పుట్టినమాటే. ధర్మానికి మారుపేరే శ్రీరాముడు.

అసలు రామాయణారంభంలోనే వస్తుందొక చక్కని ప్రస్తావన. ఇంకా రామాయణేతిహాస రచన కుపక్రమించలేదు వాల్మీకి. సర్వలక్షణ లక్షితుడైన మహాపురుషు డెవడైనా నీ ఎఱుకలో ఉంటే చెప్పమని అడుగుతాడాయన నారద మహర్షిని. త్రిలోక సంచారి అయిన నారదుడు బేరీజువేసి అందరినీ త్రోసిపుచ్చి చివరకొక్క శ్రీరాముడికే పట్టాభిషేకం చేస్తాడు. సకల సద్గుణాలూ ఆయన ఒక్కడిలోనే రాశీభూతమయి ఉన్నాయి. కావలసి ఉంటే ఆయననే కథా నాయకుణ్ణి చేసుకొని కావ్యనిర్మాణం చేయమని చెప్పివెళ్లిపోతాడు. ఆ సందర్భంలో ఆయన ఉదాహరించిన నాయక లక్షణాలొకటిగాదు రెండు గాదు. చాలా ఉన్నాయి. ధర్మజ్ఞ - స్సత్యసంధశ్చ - ప్రజానాం చహితేరతః మొట్టమొదటనే ధర్మజ్ఞుడని పేర్కొంటాడు రాముణ్ణి. ధర్మాని కాయన జీవితంలో అంత ప్రాధాన్యముంది. ధర్మం తెలిసినవాడు ధర్మజ్ఞుడు, కనుకనే సత్యసంధుడు కూడా. సంధ అంటే ప్రతిజ్ఞ. చెప్పినమాట నెరవేర్చటమే సత్యసంధత్వం. ఇవి రెండూ ఉన్నవాడు తప్పకుండా ప్రజాహిత కార్య ధురంధరుడవుతాడు. ఉత్తమ మానవుడికే గాక దేశమేలే ఉత్తమ క్షత్రియుడి

కవశ్యంగా ఉండలసిన వీమూడు లక్షణలూ. యశస్వీ జ్ఞానసంపన్నః శుచిర్వశ్య స్స మాధిమాన్ - అని మూడూ అలవడితేచాలు దిగంతవిశ్రాంత యశస్సంపన్ను డవుతాడు. దానికితోడు జ్ఞానమూ - ఆ జ్ఞానానికి తగిన శుచిత్వము కూడా ఉంటే ఇక చెప్పనే అక్కరలేదు. శుచిత్వమంటే ఆర్జవం లేదా నిజాయితీ. అదే ఒక వశీకరణ విద్యలాగా పనిచేస్తుంది లోకంలో. దానితో సర్వలోక ప్రియస్సాధుః- సకల జన ప్రియం భావుకుడని పేరు గడిస్తాడు. అంతమాత్రాన చవట పిటికి అయితే మరలా సుఖంలేదు. అది అశక్తత క్రిందికి వస్తుంది. కాలాగ్ని సదృశః క్రోధే - క్షమయా పృధివీసమః సమయానుగుణంగా నిగ్రహానుగ్రహాలు ప్రదర్శిస్తుండాలి మరలా. సముద్రంలాంటి గాంభీర్యమూ - హిమాలయంలాంటి ధైర్యగుణమూ- వైశ్రవణునివంటి త్యాగబుద్ధీ - సర్వసమత్వం - ఇలాంటి ఆర్యగుణ సంపత్తి అంతా అలవడి ఉండాలి. ఇవన్నీ పుడికి పుచుకొన్న వాడొకడే ఉన్నాడు లోకంలో. వాడే రాముంటాడు నారదుడు.

నారదుడీ లక్షణాలన్నీ ఏకరువు పెట్టాడంటే ఆసలా లక్షణాలను గూర్చి ప్రశ్నించినవాడు వాల్మీకే. ఆయన ప్రశ్నిస్తేనే ఈయనగారీ వర్ణన చేసింది. వాల్మీకి నారదుణ్ణి అడిగిన మహాపురుష లక్షణాలు పదహారు. కోస్వస్మిన్ సాంప్రతంలోకే - గుణవాన్ కశ్చవీర్యవాన్ - అని ఆరంభించి కస్య బిభ్యతి దేవాశ్చ - జాతరోషస్య సంయుగే - అనే వరకూ ఈ గుణాలుగల మహానుభావుడెవరో చెప్పమని కోరుతాడు. ముక్తసరిగా పేర్కొన్న ఈ పదహారు గుణాలకూ వ్యాఖ్యానమే తరువాత నారటు దేకరువు పెట్టిన గుణాలన్నీ. ఇవన్నీ ఏదో ప్రస్తావవశంగా చెప్పినవికావు. అన్నీ రామాయణ కథా భాగంలో అక్కడక్కడా మనకు దాఖలా అయ్యేవే. ధర్మజ్ఞత అనేది సరేసరి. ఇదివృత్తమంతా పనగలిసి ఉందనుకోండి. కృతజ్ఞత అనేది జటాయువు కంత్యసంస్కారాదులు చేయటంలో - హనుమదాది వానరులను సవిశేషంగా సత్కరించటంలో కనిపిస్తుంది మనకు. మరి సత్యవాక్య మనేది

సుగ్రీవాదులకు మాట ఇచ్చి నేరవేర్చటంలో – దృఢవ్రతం భరతుడు వచ్చి ఎంత వేడినా పట్టణానికి తిరిగిరాక పోవటంలో సాక్షాత్కరిస్తుంది. చారిత్రమంటే సత్ప్రవర్తన. ఆయన ఏకపత్నీ వ్రతంలో కనబడుతుందది. శూర్పణఖ అందమైన రూపం కూడా భ్రమపెట్టలేదాయన అంతరంగాన్ని. పోతే సర్వభూతాలనూ దయగా చూడటమనేది కాకాసురాదులనూ మారీచాదులనూ మన్నించటంలో తార్కాణమవుతుంది. విద్వాన్ అనే మాట హనుమంతుడి పాండిత్య ప్రకర్షను మెచ్చుకోటంలో విదితమవుతుంది. సమర్థత సముద్ర తరణాదులలో తెలుస్తుంది. ఏకప్రియ దర్శనత్వం మానవ దానవ వానర మహర్షి దేవతాది జాతులన్నీ ఆయన దర్శన స్పర్శన సాన్నిధ్యాదు లభిలషింటంలోనే వ్యక్తమవుతుంది. ఆత్మవాన్ అంటే ఆత్మతత్త్వజ్ఞత. అది భరతాదులకు అక్కడక్కడా చేసిన ఆధ్యాత్మిక ప్రబోధంలో తేట పడుతుంది. జితక్రోధత్వం సుగ్రీవాదులను క్షమించటంలో దాఖలా అవుతుంది. ద్యుతిమాన్ అంటే తేజస్విత. అది రాముడి విషయంలో చెప్పనే అక్కరలేదు. అలవోకగా దగ్గరకి వచ్చినా దశరథుడాయనను చూచేసరి కలంకృతమి వాత్మాన మాదర్శతలసంస్థితమ్ – బాగా ముస్తాబు చేసుకొని తన రూపాన్ని తానే అద్దంలో చూచు కొన్నట్టున్నాడట రామచంద్రు డాయన కండ్లకు. ఆఖరు కభిషేక భంగమై అరణ్యానికి బయలుదేరే సమయంలో కూడా నచాస్యమహతీం లక్ష్మీమ్ రాజ్యనాశో పకర్షతి – ముఖద్యుతి ఏ ఏమాత్రమూ వాడి పోలేదట. పోతే అనసూయకః అసూయ అంటే గుణంలో దోషాన్ని వెదికేపాడు బుద్ధి. ఇది అసలేలేదు సరిగదా – నిజంగా దోషమున్న చోట కూడా గుణాన్నే చూస్తాడు రాముడు. కైక విషయంలో ఇది ముమ్మూర్తులా సాక్షాత్కరిస్తుంది. లక్ష్మణుడు నిందించినా భరతు డుపాలంభించినా వారిని నివారిస్తాడు రాముడు. తుదకు మంథరలాంటి దాసీని పట్టి చంపబోయిన శత్రుఘ్నుణ్ణి కూడా నివారిస్తాడు. ఇక అన్నిటికన్నా ఆఖరుది కస్యబిభ్యతి దేవాశ్చ – జాతరోషస్య సంయుగే – సామానికి సామమే

– దండానికి దండమే. దేనికదే. కోపం వస్తే దేవతలైనా భయపడవలసిందే ఆయనకు. సముద్రాదు లలాగే కదా హడలిపోయారు.

షోడశ కళాధరుడైన చంద్రుడిలాగా షోడశ గుణాకరుడైన రామచంద్రుణ్ని ఇలా వర్ణించటం జరిగింది కావ్యారంభంలోనే. దానికను రూపంగానే కథా వస్తువు కూడా రూపుదిద్దుకొంది. పోతే రామోవిగ్రహవాన్ ధర్మః– అని ప్రసిద్ధి గాంచినందు కాయన తన జీవితంలో పాటించిన పాలించిన ఆ ధర్మ మెలాంటిది. ఏయే ధర్మాలెక్కడ ఎలా పాలించాడు. ఎంత దీక్షతో పాలించాడు. దానివల్ల ఎదురయిన కష్టసుఖాలనెలా భరించాడలా పాటించిన వారి నెలా ఆదరించాడు. పాటించని వారి నెలా శిక్షించాడు. ఇలాంటి ధర్మమీమాంస చేయవలసి ఉంది మన మిప్పుడు. ముక్తసరిగా చెప్పుకొంటే బాల నుంచి ఉత్తర దాక ఏడు కాండల కథా జీవితంలో ఏడు ధర్మాలు సాగించాడు రామచంద్రమూర్తి . బాలలో శిష్య ధర్మం – అయోధ్యలో పుత్రధర్మం – అరణ్యలో క్షత్ర ధర్మం – కిష్కింధలో మిత్ర ధర్మం – సుందరలో స్వామి ధర్మం – యుద్ధలో వీర ధర్మం. మరి ఉత్తరలో రాజధర్మం. ఇలా ఏడు ఉత్తమ ధర్మాలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి ఆయన సమగ్రమైన ధర్మ స్వరూపాన్ని మనకు కన్నులగట్టినట్టు సాక్షాత్కరింపజేస్తాయి.

బాల కాండలో శిష్య ధర్మ మన్నాము. ఎలాంటి దా శిష్య ధర్మం. ఎవరాయన శిష్యత్వం నెరపిన గురువులు. ఇద్దరే ఇద్దరు. ఒకరు ఆయన పుట్టక ముందు నుంచీ నిర్యాణ మయ్యేదాకా అనుసరిస్తూ వచ్చిన వసిష్ఠుడు. మరొకరు బ్రహ్మచారిగా ఉన్నప్పుడు వచ్చి వివాహం కాగానే నిష్క్రమించిన విశ్వామిత్రుడు. ఇద్దరూ ఇద్దరే మహానుభావులు. బ్రహ్మర్షిగానే ఉద్భవించి శక్తి పరాశర వ్యాసాది మహనీయులకు పితృ పితామహస్థానంలో ఉన్న వారొకరైతే – రాజర్షి అయినా తపః ప్రభావం చేత బ్రహ్మర్షి పదవి నందుకొని తన పేరు చెబితేనే మూడు లోకాలనూ గడగడలాడించి ఎంత రాజసుడో

అంత శమదమాది సంపన్నుడయి సాక్షాత్తూ గాయత్రీ మంత్ర ద్రష్ట అయిన వారొకరు. కనుకనే ఆయన వసిష్ఠుడు - సర్వశ్రేష్ఠుడు. ఈయన విశ్వానికంతా మిత్రుడు - విశ్వామిత్రుడు. ఇలాంటి వారి శిక్షణలో రాటు దేరిన రాముడెలాంటివాడు కావచ్చునో మన మూహించవచ్చు.

రామాదులు జన్మించగానే జాత కర్మాదులూ నామకరణమూ చేసిన వాడు వసిష్ఠుడు కులపురోహితుడు గదా ఆయన. ఆయనే తరువాత వేదవేదాంగాది విద్యలు నేర్పి ఉంటాడు. దానితో వారు సర్వేవేదవిదః శూరాః - సర్వేలోకహితే రతాః సర్వేజ్ఞానోపసంపన్నాః సర్వే సముదితాగుణైః - అని లోకంలో పేరు గాంచారు. మరి ధనుర్వేద - గజస్కంధ - అశ్వపృష్ఠ - రథచర్యాది క్షాత్ర విద్యలన్నీ తండ్రి దశరథుడి వల్లనే అభ్యసించి ఉంటారు. పితృశుశ్రూషణేరతాః అనే మాటలో అదే ధ్వనిస్తుంది. తండ్రి కూడా గురువే గదా శాస్త్రీయంగా. తేషాం కేతు రివ జ్యేష్ఠో - రామోరతికరః పితు- రాము దందరిలోనూ పతాకలాగా ఎత్తుగా కనిపించేవాడు. విద్యాభ్యాసమంతా పూర్తి అయింది. కాని వాటికి మెరుగుపెట్టే ఘట్టమింకా జీవితంలో ఎదురవలేదు. మానుషదైవ శక్తులు రెండూ సమకూడ వలసి ఉంది. అవి సమకూడిన తరువాత కళ్యాణ ప్రాప్తికూడా అయి జీవితంలో ఒక స్థాయి నందుకోవలసి ఉంది. భావి రాక్షససంహారానికి కావలసిన శక్తి సామర్థ్యాలు సాధించి తన అవతార ప్రయోజనాన్ని నిరూపించుకునే అవకాశం కోసమెదురు చూస్తున్నాడా మహాపురుషుడు.

సరిగా సమయానికి బయలుదేరి వచ్చాడు విశ్వామిత్రుడు. అధర్మపరులైన దానవులను తునుమాడి విశ్వానికంతా మేలు చేయాలని ఆయన సంకల్పం. అది సిద్ధించాలంటే ధర్మ సంస్థాపనకోస మదేపనిగా అవతరించిన రామచంద్రుడే సమర్థుడని తెలుసు నాయనకు. కనుకనే హడావుడిగా వచ్చాడు దశరథుడి దగ్గరకు. రాముణ్ణి తనతో పంపమన్నాడు. దశరథుడు పుత్ర వ్యామోహంలో పడి వెనుకాడుతుంటే ధైర్యం చెబుతాడు.

అహంవేద్మి మహాత్మానమ్ నాకు తెలుసు రాముడంటే ఎవరో. నీకేమి తెలుసు. ఇంకా వసిష్ఠాదులకూ- తెలుసు. నీకు యశోధర్మలాభం మీద లోభముంటే నాతో పంపమని ఒప్పించి తీసుకుపోతాడు. ఆయన అలా తీసుకెళ్లుతుంటే ఎందుకు - ఎక్కడికనే ప్రశ్నేలేదు. ఆయన ఎన్నాళ్లనుంచో తనకు పరిచయ మున్నట్టూ - ఆయన వెంట వెళ్లటమే తన కర్తవ్య మయినట్టూ సంతోషంగా వెళ్లుతాడు రాముడు. గుర్వనువర్తన మంటే ఇది. ఆ గురువుగారి మీద అంత నమ్మకం శిష్యుడికి. వసిష్ఠుడందరిలో చెప్పనే చెప్పాడు కృతాస్త్ర మకృతాస్త్రంవా - నైనం ద్రక్ష్యంతి రాక్షసాః గుప్తమ్ కుశిక పుత్రేణ - జ్వలనేనామృతం యథా తన కులగురువు వసిష్ఠుడంత వాడంత ప్రశంసాపత్ర మిచ్చిన విశ్వామిత్రుడెంత గొప్పవాడో ఇక ఎవరూ చెప్పనక్కరలేదు. రాముడికి. అందుకే మౌనంగా ఆయన ననుసరించాడు. అంతే గాదు ఏషోఽస్త్రాన్ వివిధాన్ వేత్తి - సర్వాస్త్రాణి భృశాశ్వస్యపుత్రాః పరమ ధార్మికాః కౌశికాయ పురాదత్తాః సమస్త శస్త్రాస్త్ర విద్యలూ కరతలామలక మీయనకు- భృశాశ్వపుత్రులైన దివ్యాస్త్రాలన్నీ ఆయనకు పిలిస్తే పలుకుతాయని వసిష్ఠుడు చెప్పటం విన్నాడు. తన భవిష్యత్ప్రణాళిక కది చక్కగా సరిపోయిందను కొన్నాడు వినయంతో గురువు ననుసరించాడు.

గురు జనం పట్ల మొట్టమొదట ఉండవలసింది వినయం. అది సంపూర్ణంగా ఉంది రాముడికి. విశ్వామిత్రోయయా వగ్రే- తతోరామో మహాయశాః - ముందు గురువుగారు నడుస్తుంటే వెనుక తాను నడుస్తున్నాడు. కాక పక్షధరుడయి కమనీయ రూపుడైన ఆ శిష్యుణ్ణి చూస్తే ఆ గురువు కూడా వాత్సల్యంతో కరిగిపోయేవాడు. రామా అని మధురంగా పిలిచేవాడు. నాయనా జలం చేతికి తీసుకో. చాల దూరం నడిచావు. శ్రమ అనిపించవచ్చు. క్షుత్పిపాస లేర్పడవచ్చు. రెండింటికి నివారణగా బలాతిబలలనే విద్యలు మీకుపదేశిస్తా నంటాడు. చూడండి. నాకే విద్యలూ చెప్పమని అడగడు రాముడు. వినయంగా అనుసరిస్తూ పోయా డంతవరకే.

అలసటో ప్రయాసమో గురువుగారికి చెప్పక్కరలేదు. అంతా ఆయనే చూచుకొంటాడు. శిష్యుడు యోగ్యుడని పించుకోవాలే గాని సమర్థుడైన గురువు అతని యోగ్యత కనిపెట్టి తానే అతనికి కావలసిన వన్నీ అనుగ్రహిస్తాడు. అందుకోసం శిష్యుడు ముందుగానే అఱ్ఱులు చాచ నక్కరలేదు. ఇదుగో ఇలాంటి నమ్మకమూ బరోసా ఉండాలి గురవు పట్ల శిష్యుడికి. శిష్యుడి గుణాలూ గురువుకు బాగా నచ్చినట్టే ఉన్నాయి. కామంబహు గుణాస్సర్వే - త్వయ్యేతే నాత్రసంశయః - అని అప్పుడే కితాబిస్తాడు. సకల విద్యలూ బోధిస్తాడు.

ఇచ్చినవి పరిగ్రహించటమే గాని తానుగా ఏదీ కోరడా శిష్యుడు. నోరువిప్పి మాటాడడు కూడా. మరీ మాటాడకపోతే అది స్తబ్దత జడత్వం కావచ్చు. అది మరలా పనికి రాదు శిష్యుడికి. పరిప్రశ్నేన సేవయా అన్నారు. పరిచర్యచేస్తూనే అప్పుడప్పుడు ప్రశ్నిస్తూ తెలుసుకోవాలి తెలుసుకోవలసిన విషయాలు. ఏముంటాయి తెలుసుకొవలసినవి రాముడికి. అన్నీ తెలిసినవే భగవానుడికి. అయినా తెలియనట్టు గదా ఇప్పుడు నటిస్తున్నాడు. గురువుకు మర్యాద ఇచ్చినట్టు తనకు జిజ్ఞాస ఉన్నట్టు కనపడాలి. అందుకే మార్గ మధ్యంలో కామాశ్రమం కనపడ్డా ఒక గౌతమాశ్రమం కనపడ్డా అదేమిటిదేమిటని అడుగుతూ పోతాడు. అడిగితే దానికి సంబంధించిన పూర్వవృత్తమంతా ఆ గురువుగా రేకరువు పెడుతుంటాడు. శిష్యుడైన వాడికి బహు దేశాటనమే గాక - ఆయా దేశ చరిత్రలన్నీ తెలిసి ఉండాలనే విద్యా సంప్రదాయ రహస్యాలు కూడా మనకు బోధపడతాయి. పైగా అవన్నీ ఆయా దేవతల కథలూ, మహర్షుల కథలూ. నిజంలో అవన్నీ తన కథలే. తానేగా దేవ ఋష్యాదులందరికి ఆరాధనీయుడు. ఇంకా ఒక చిత్రముంది ఇందులో. కథలు చెబుతూ చెబుతూ తన కథ గూడా కొంత ప్రస్తావించాడు. విశ్వామిత్రుడు. ఇది రాము డడగలేదు. గురువుగారి స్వీయ చరిత్ర చెప్పుమని



Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedantam

శిష్యుడడగటం ధర్మం కాదు. తెలుసుకోవాలని ఎంత కుతూహలమున్నా వినయపరుడైన శిష్యుడికది శోభనివ్వదు. అది తెలిసే రాముదూర కున్నాడు. అయినా ప్రస్తావ వశంగా అది గురువుగారి నోటనే వచ్చింది. అయితే తాను చేసిన ఘన కార్యాలూ - మేనకాదులతోడి తన విహారాదులూ - తన నోటనే రాగూడని విషయాలు. అవి జనక మందిరంలో అహల్యానందనుడైన శతానందునిచేత పలికిస్తాడు వాల్మీకి. శిష్యుడి ఎదుట ఆయన గురువుగారి మాహాత్మ్యం మరొకరిచేత చెప్పించటంలోనూ తన్ముఖంగా శిష్యుడు గ్రహించటం లోనూ ఎంతైనా ఔచిత్యముంది. ఔచిత్యంతో పాటు ఒక నాటకీయత కూడా చోటు చేసుకొన్నది.

ఆచార్యుడంటే అన్నీ తెలిసిన రాముడికి కూడా ఎంతో గౌరవం ఆయన ఎడల ఎంతో ప్రామాణ్య బుద్ధీ. తాటకను వధించమని గురువుగారా దేశిస్తే స్త్రీని వధించట మెలాగా అని పై కనక పోయినా లోపల సందేహంగానే ఉంది రాముడికి. అది గమనించి విశ్వామిత్రుడునహితే స్త్రీ వధకృతే ఘృణాకార్యా నరోత్తమ - చాతుర్వర్ణ్యహితార్థాయ - కర్తవ్యమ్ రాజసూనునా - అని అతని సందేహ నివృత్తి చేస్తాడు. దానితో సంతుష్టుడైన రాము డాయనతో ఇలా అంటాడు. నన్ను మీతో పంపేటప్పుడు మా తండ్రిగారు శాసించారు గురువు మాట జవదాటరాదని. సోహం పితుర్వచః శ్రుత్వా - శాసనా ద్బ్రహ్మవాదినః - కరిష్యామి న సందేహః - తాటకా వధ ముత్తమమ్ - అని ఆయన మీద తనకున్న అచంచలమైన గౌరవాన్ని ప్రకటిస్తాడు. ఇలాంటి ప్రామాణ్య బుద్ధి ఉండాలి గురువుల విషయంలో ఏ శిష్యుడికైనా, గురువైన వాడు తనకే విషయం బోధించినా తెలియకుండా బోధిస్తాడా అనే శ్రద్ధాభక్తులుండట మెంతైనా అవసరం. అదే ప్రస్తుతం రాముడి పట్ల కూడా మనకు కనిపిస్తుంది.

అంతేకాదు. గురువు ధర్మదీక్షలో ఉన్నప్పుడాయన కెలాటి విఘ్నాలూ ఉపద్రవాలూ సంభవించకుండా చూడటం శిష్యుడి బాధ్యత, ఛాత్రుడని గదా శిష్యుణ్ణి పేర్కొంటారు. ఛాదయతీతి ఛత్త్రం – ఛత్రవ దాచరతీతి ఛాత్త్రః ఒక ఛత్రంలాగా గురువును కాపాడే వాడు కాబట్టి ఆ పేరు వచ్చింది శిష్యుడికి. ఆరు రాత్రుల వరకూ దీక్షలో ఉన్న ఆచార్యుణ్ణి మారీచసుబాహుల బారి నుంచి కాపాడి ఆ పేరు సార్థకం చేసుకొన్నారు రామలక్ష్మణులు. పైగా అద్యైవ దీక్షాం ప్రవిశ – భద్రమ్‌తే మునిపుంగవ సిద్ధాశ్రమోయం – సిద్ధఃస్యాత్ – సత్యమస్తు వచస్తవ – ఇవాళే తాము దీక్షలో ప్రవేశించండి. మీకు తప్పక విజయం కలుగుతుంది. ఇది సిద్ధాశ్రమం గదా. సిద్ధి కలగక పోవటమేమిటని బరవసా ఇస్తారు. ఆ తరువాత ప్రీతుడైన ఆచార్యుడు వారికి మరలా అస్త్ర ప్రదానం చేస్తాడు. కథలు చెబుతాడు. అంతేగాక తన తపస్సును సఫలం చేసినందుకాయన బ్రహ్మచర్యాన్ని కూడా ఫలవంతం చేయాలనుకొన్నాడు. బ్రహ్మచర్యానికి ఫలమేమిటి. గార్హస్థ్యమే. అది సీతా కళ్యాణంతో గాని జరగదు. దానికి ధనుర్భంగం పణమని తెలుసు విశ్వామిత్రుడికి. అది చేయగలవాడు తన ప్రియ శిష్యుడు రాముడేననీ తెలుసు. అందుకే వచ్చినపని నెరవేరినా ఇంకా అతనితో పని ఉన్నట్టు రాముణ్ణి వెంట బెట్టుకొని మిథిలాపుర ప్రయాణం. గురువనుజ్ఞ లేకుండా ఏ పనీ తలపెట్టరాదు శిష్యుడు. అందులో తనకెంత అభిలాష ఉన్నా సరే. సామర్థ్యమున్నా సరే ధనుర్దర్శయ రామాయ – అంటాడు జనకుడితో విశ్వామిత్రుడు. తెప్పించి చూపుతాడు. వత్స రామ ధనుః పశ్య రామ ! వెళ్లి ఆ ధనువుచూడు – అంటాడు మరలా రాముణ్ణి చూచి. అలాగేనని వెళ్లి ధనువును మంజూషలో నుంచి బయటకి తీసి దీనిని తోలనం చేయమంటారా పూరణం చేయమంటారా ఏమిచేయమని మీ ఆజ్ఞ అని అడుగుతాడు. బాఢమిత్యేవ తంరాజా – మునిశ్చ సమభాషత – అలాగే చేయమని రాజు – మునీ ఒకేసారి అంటారు. కుతూహలం కొద్దీ జనకుడూ – శిష్యుడందుకు సమర్థుడేనని విశ్వామిత్రుడు.

ఇలా చూస్తూపోతే రాముడిలో సచ్ఛిష్యుడి కుండవలసిన లక్షణా లొకటిగావు, రెండుగావు. ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. కనుకనే గుర్వనుగ్రహం వల్ల ఆయన సమస్తాస్త్రశస్త్ర కుశలుడూ - ప్రతీప శక్తి నిర్వాపణదక్షుడూ - కావటమే గాక సాక్షాల్లక్ష్మీ స్వరూపిణి అయిన మైథిలిని కరగ్రహణం చేసి గురుకులం నుంచి సమావర్తనం కూడా చేసి ఉత్తమ గృహస్థ జీవితంలో ప్రవేశించినవాడూ అయ్యాడు. అంతేకాదు. తాను శిష్య ధర్మ మెలా పాటించాడో అలాగే గురువులు కూడా గురుధర్మాన్ని పాటించాలని ఆయన దృష్టి. అలా పాటించిన ఆచార్యుణ్ణి ఎలా అనుసరిస్తాడో పరమాత్మ - పాటించని వారినలా శిక్షిస్తాడు కూడా. సరిగా పరశురాముడి విషయంలో సాక్షాత్కరించిందిది. బ్రాహ్మవంశంలో పుట్టి క్షత్త్రియుడైన తనకు గౌరవ పాత్రుడు కావలసిన అతడు నిష్కారణంగా సమస్త క్షత్త్రియవంశాన్ని నిర్మూలించటమే గాక క్రొత్తగా వివాహితుడయి వెళ్లుతున్న తనతోనే దారిలో జగడం పెట్టుకొన్నాడు. సగర్వంగా మాటాడాడు. అలాంటి ఔద్ధత్యమెవరిలో ఉన్నా సహించడు భగవానుడు. కనుకనే ఇది మీ బోటి పెద్దలకుండవలసిన లక్షణం కాదన్నట్టు సుకుమారమైన శిక్ష విధించా డాయనకు.

పోతే శిష్య ధర్మమైన తరువాత రెండవది పుత్త్రధర్మం. అయోధ్యలో తార్కాణమవుతుంది మనకు. మాతృదేవోభవ - పితృదేవోభవ అన్నారు. తనయుడికి తల్లిదండ్రులే మొదటి గురువులు. దేవతలలాగా ఆరాధనీయులు. రాముడు తన జననీ జనకుల విషయంలో అలాగే ప్రవర్తించాడు. తుదకు సీతను తాను పెండ్లి చేసుకొన్నది కూడా వీర్యశుల్క అని కాదట. దారాః పితృకృతా ఇతి - తన తల్లిదండ్రులు చూచి చేశారని అంటాడు వాల్మీకి. అసలు దశరథుడు తన కుమారులు నలువురూ తన శరీరం నుంచి వెలువడిన నాలుగు చేతులని భావించే వాడట. వారిలో కూడా రామో రతికరః పితుః రాముడాయన కంటికి దీపం లాంటివాడు. అలాంటివాడు కనుకనే కదానామ సుతం ద్రక్ష్యా మ్యభిషిక్త మహం ప్రియమ్మని ఎంతో

కాంక్షిస్తాడు. వెంటనే పౌరజానపదుల నందరినీ సమావేశం చేస్తాడు. తన మనసులో అభిలాష బయట పెడుతాడు. వారూ ఆమోదిస్తారు. కుమారుడి గుణగణాలన్నీ కీర్తిస్తా రు. ఎంతగానో మురిసిపోయి ఆ తండ్రి కుమారుణ్ణి పిలుచుకొని రమ్మని సుమంత్రుణ్ణి పంపుతాడు. పంపితే ఆయన వెళ్లి ఏమి చెప్పాడో – రాముడేమి బదులిచ్చాడో – అదేమీ తెలియదు మనకు. రామం తత్రా నయాం చక్రే – రథేన – రాముణ్ణి రథంలో తెచ్చాడు. అవతార్య సుమంత్రస్తం – రాఘవం స్యందనోత్తమాత్ – అక్కడ సభా మందిరం ముందు ఆయనను రథంలో నుంచి క్రిందికి దించాడు. పితుస్సమీపం గచ్ఛంతమ్ పృష్ఠతో న్వగాత్ – ఆయన తండ్రి దగ్గరికి నడిచి వెళ్ళుతుంటే వెంబడిస్తూ వెళ్లాడట. చూడండి. తండ్రి అంటే ఎంత గౌరవమో. ఈ మూడు మాటల్లో తెలిసిపోయింది మనకు. తండ్రి రమ్మన్నాడని చెబితే చాలు. ఎందుకు ఏమిటనే ప్రశ్నలేదు. తీసుకెళ్లుతుంటే వెళ్లటమే ఎదురు నడవటమే మౌనంగా.

అక్కడ కూడా ఆయన చెబితే వినవలసిందే. తానేమి మాటడేది లేదు. నామ సంశ్రావయన్ రామో– వవందే చరణౌపితుః తన పేరు ఫలానా అని చెప్పి తండ్రి పాదాలు పట్టుకొన్నాడట. సదాచారమెంత చక్కగా పాటిస్తున్నాడో చూడండి. దానికెంతగానో పరవశుడయి పోయాడు తండ్రి గాఢంగా కౌగిలించుకొని తగిన అసనం చూపితే అప్పుడు వెళ్ళి కూచుంటాడు రాముడు. ఏ పని చేసినా పెద్దల అనుమతితోనే చేయాలి. స్వతంత్రించగూడదే విషయంలోనూ. తరువాత దశరథుడు తన అభిప్రాయమూ– దానికి ప్రజల ఆమోదమూ– అన్నీ ఏకరువు పెట్టి యౌవ రాజ్యభిషేకానికి తయారయి ఉండమని చెబితే – అవునని గాని కాదని గాని ఒక్కమాట అనదు రాముడు. కనీసం తనకింత వేడుక జరగబో తున్నదనే ఉత్సాహమూ కనబరచడు. ఆ ఉత్సాహం తన పరిజనులు పంచుకొని ముందుగానే వెళ్ళి కౌసల్యకు చేరవేస్తారా శుభవార్త. పోతే రాముడు అథాభివాద్య రాజానమ్ – రథ

మారుహ్యా రాఘవః యయౌస్వం ద్యుతిమ ద్వేశ్మ - జనౌఘై ః పరిపూజితః జనమాంతా చుట్టూ పొగడుతూ వస్తుంటే తండ్రి కభివాదం చేసి రథ మధిరోహించి మౌనంగా మరలా తన మందిరానికి వెళ్ళుతాడు.

తండ్రి ఒకప్పుడు తనకిష్టంగాని మాట చెప్పినా అది అసంగత మనుచితమని తన కనిపించినా గుణవంతుడైన పుత్రుడు ప్రత్యక్షంగా ఎదిరించి మాటాడరాదు. ఇది కూడా రాముడి విషయంలో సాక్షాత్కరిస్తుంది మనకు. మరలా రెండవ మారు పిలిపించి ఏకాంతంగా రాముడితో ప్రసంగిస్తాడు దశరథుడు. తాను ముసలివాడ నయ్యానని రాజ్యభారం మోయలేనని తన గోడంతా చెప్పుకొని వెంటనే రెండవరోజే నీకు పట్టాభిషేకం చేయాలని ఉంది. అదీ భరతుడు వచ్చే లోపలే అయిపోవాలి. వాడు నీకెంత అనురక్తుడైనా చెప్పలేము. మానవుల బుద్ధులు నమ్మరాదుగదా అని లేనిపోని అభాండలాన్నీ వేస్తాడు. తనలో దాగి ఉన్న భయాన్ని మరొక భంగిమలో బయటపెడతాడు. ఇదంతా వాస్తవంలో రాముడి కిష్టంలేదు. అయినా పితృ గౌరవంతో సహించాడు. పల్లెత్తు మాట బదులాడకుండా వెళ్ళిపోయాడు. మాటలాడటం చేతగానివాడా అంటే అలాకాదు మరలా. ఆ ఆవేదన అంతా తల్లి దగ్గర వెళ్ళగక్కుతాడు. అదీ ఎంతో నాజూకుగా. అంబపిత్రా నియుక్తోస్మి-ప్రజాపాలన కర్మణి-భవితా శ్వోభిషేకోయం- యథామే-శాసనం పితుః అమ్మా తండ్రి గారంటున్నారు. నాకు రాజ్యపాలన ఒప్పజెబుతారట. రేపేనట అభిషేకం. ఇలాగని ఆదేశిస్తున్నాడు. మరి విన్నావా అంటాడు. రేపేనంటే ఆవిడకు తెలియదా భరతు డయోధ్యలో లేడని. రెండవరోజుకే రాలేడని. భరతుడు కూడా లేకుండా ఇంత హడావుడిగా తండ్రి ఈ పట్టాభిషేకం నాకు తలపెట్టట మేమిటి. ఇది జరిగేదేనా. ఆయన చేయాలేడు. నేను చేసుకొనేది లేదు. అని ఎంత కాకువుగా ఆక్షేపించటమో చూడండి ఇది. అయినా తండ్రినా తల్లి ఎదుట ఆక్షేపిస్తున్నా ఎంత నిగ్రహమో చూడండి మరలా.

తరువాత అభిషేక భంగమయి మరలా తన్ను పిలిపించినపుడు కూడా ఏదో మహత్తరమైన పని అయి ఉంటుందని ఆలోచిస్తూ వచ్చి తండ్రిని చూడగానే ఆయన రామా అని మాటాడలేక పడిపోతే ఎంతగానో భయపడతాడు. ఎప్పుడు వచ్చినా ఆనందంగా పలకరించే తండ్రి ఎందుకిలా ఆయాస పడుతున్నాడు. బహుశ నా వల్లనే ఏదైనా అపచారం జరిగి ఉంటుందని బాధపడుతాడు. పైగా ఒకమాట అంటాడు. అతోషయన్ మహారాజ - మకుర్వన్వా పితుర్వచః- ముహూర్త మపి నేచ్ఛేయం-జీవితుమ్ -తండ్రి మాట పాటించకుండా ఆయన మనసుకు సంతోషం కలిగించకుండా ఒక్క క్షణం కూడా బ్రతకలే నంటాడు. ఇంకా తండ్రి తనతో పలకలేదు. భాషించలేదు. అది తన అపరాధమే అయి ఉంటుందని ఎలాగైనా ఆయనను సంతోష పెట్టి తన అపరాధం పాపుకోవాలని భావించాడంటే ఎంతటి పితృప్రేమో ఇది చూడండి. పిమ్మట కైక చెబితే జరిగిన సంగతి తెలిసి ఇలా అంటాడామెతో. అమ్మా ఆయన నాతో చెప్పబనిలేదు. నీవు మాత్రం నాకు ఆరాధ్యవు కావా. నీవు చెప్పినా నేను వెళ్లటానికి సిద్ధమే. అయితే ఆయన నోరు విప్పి మాట్లాడలేదే అని నా బాధ అంటాడు. తల్లిదండ్రుల మాట పాటించటంలో ఎంత సంసిద్ధతో చూడండి. అంతేకాదు. ననూనం మయికైకేయి - కంచి దాశంససే గుణమ్ - నీకు నా మీద హక్కుండికూడా తండ్రి మీద నెపం పెడుతున్నావంటే నిజంగా నాలో పుత్రుడి కుండవలసిన గుణమే కొంచెమూ లేదని తోస్తుందంటాడు. తల్లిని తప్పుపట్ట వలసిన చోట కూడా ఆ తప్పు తనది గానే భావించాడంటే తల్లి దండ్రుల పట్ల ఎంత వినయమో- ఎంత గౌరవమో చూడండి. వందిత్వా చరణౌరామో - విసంజ్ఞస్య పితుస్తదా -కైకేయ్యాశ్చా ప్యనార్యాయా - నిశ్చక్రామ మహాద్యుతిః తరువాత తెలివి తప్పిపడి ఉన్న తండ్రికి - దారుణంగా ప్రవర్తించిన తల్లికి - ఇద్దరికి పాదాభివందనం చేసి మౌనంగా నిష్క్రమించాడట మందిరాన్ని, ఎంత గంభీరమైన మాటోఇది. అన్నీ తెలిసి కూడా ఏమీ ఆక్షేపణ చేయకుండా పోవటమే ఉత్తమకుమార లక్షణం.

లక్ష్మణుడా తరువాత ఆగ్రహం పట్టలేక హనిష్యేపితరం వృద్ధమ్ కైకయ్యాసక్త మానస - మని ఎగురు తుంటే కౌసల్య కూడా అది సమర్థిస్తుంటే అంతా విని రాముడు ఇలా అంటాడు. నాస్తి శక్తిః పితుర్వాక్యం. సమతిక్రమితుం మమ-తండ్రి మాట కాదని పోయే ధైర్యం సాహసం నాకులేదు. ఇది మన పూర్వులంతా పాటించిన ధర్మం. నేను కాదనటంలో అర్థం లేదని చెబుతూ లక్ష్మణుణ్ణి చూచి నీకు నా మీద అభిమాన మున్నందుకు చాలాసంతోషం. కాని తండ్రి చెప్పిన మాట అధర్మంకాదు. ధర్మసంశ్రితమే నని తెలుసుకో. తదేనాం విసృజానార్యాం-క్షత్రధర్మాశ్రితాం మతిమ్ -ధర్మ మాశ్రిత్య మాతైక్ష్ణ్యం-మద్బు ద్ధిరను గమ్యతామ్-చంపుతాను కొడతాననే బుద్ధి అనార్యుల నుసరించే బుద్ధి. కేవల క్షాత్ర బుద్ధి పనికిరాదు. అలాంటి తీక్ష్ణమైన బుద్ధి వదలిపెట్టి ఆర్యమైన నాబుద్ధి ననుసరించమని మెత్తగా చీవాట్లు పెడతాడు. అమ్మా! నా కనుజ్ఞ ఇవ్వు. ప్రతిజ్ఞ నెరవేర్చి మరలా తప్పక వచ్చి నీ సేవ చేసుకొంటానని తల్లికి నచ్చచెబుతాడు. పితృ గౌరవానికిది పరాకాష్ఠ. తల్లిదండ్రుల దుఃఖాన్ని చూచి సహించలేడు రాముడు. వారి నెనరైనా ఒక మాట అంటే భరించలేడు. వారు చేసిన పని ఎంత కాని పని అని నలుగురికీ అనిపించినా తానుగా ఆక్షేపించబోడు. భరతుడు వచ్చి తన తల్లి చేసిన దుండగాన్ని నలుగురి ఎదుట ఖండిస్తూ మాట్లాడినపుడు కూడా నచాపి జననీం జ్ఞాత్వా - త్వం విగర్హితు మర్హసి-కామకారోమహాప్రజ్ఞ- గురూణాం సర్వదానఘ - ఉపపన్నేషుదారే షు-పుత్రేషుచ విధీయతే - తెలిసీ తెలియక మూర్ఖంగా నీవు నీ తల్లిని నిందించవద్దు. పెద్దలు తమ పిల్లల పట్ల ఎలా ప్రవర్తించినా చెల్లుతుంది. యావత్పితరి ధర్మజ్ఞే-గౌరవమ్ లోకసత్కృతే-తావద్ధర్మ భృతాం శ్రేష్ఠ-జనన్యామపిగౌరవమ్-ధర్మజ్ఞుడైన తండ్రియెడల నీకెంత గౌరవమున్నదో అంతే నీ తల్లి యెడల కూడా ఉండి తీరాలి. ధర్మ విధులలో శ్రేష్ఠుడని పించుకొన్న నీకీ మాత్రం ధర్మం తెలియకపోతే ఎలాగ అని మందలిస్తాడు.

Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

ఇంత ప్రగాఢమైనది రాముడి పితృభక్తి. పుత్ర అనే పేరు సార్థకం చేసుకున్న వ్యక్తి ఆయన. పున్నామ నరకం నుంచి కాపాడేవాడనే గాక పూరణాత్పుత్ర– తండ్రి చేయలేక వదిలివేసిన కోరికలను సఫలం చేయటం వల్ల కూడా పుత్త్రుడు పుత్రుడవుతాడట. ప్రస్తుతం దశరథుడు చేయలేనిది తాను మామగారి కిచ్చిన మాట నిలబెట్టుకోలేక పోవటం. అది నిలబెట్ట గలిగాడు రాముడు. కనుకనే సుపుత్త్రుడాయన. పుత్ర ధర్మాన్ని ఎంతగానో అంతగా అనుష్ఠించాడు. తన తండ్రి విషయంలోనే గాదు. తండ్రి కత్యంత ప్రియ మిత్రుడూ తండ్రితో సమానుడైన జటాయు విషయంలో కూడా అలాంటి ధర్మాన్నే కనబరిచాడు. సీతను కాపాడటానికి రావణుడితో పోరి ప్రాణాలు కోల్పోయిన ఆ దిక్కులేని పక్షిని చూచి రాజా దశరథః శ్రీమాన్ – యథామమ మహాయశాః పూజనీయశ్చ మాన్యశ్చ – తథాయం పతగేశ్వరః గృధ్రరాజమ్ దిధక్షామి – మత్కృతే నిధనంగతమ్ – మన తండ్రి దశరథుడెలా మనకు పూజనీయుడో – అలాగే ఈ గృధ్రరాజు కూడా, నా కోసంగా ప్రాణాలు వదిలిన మహానుభావుడు. ఇతనికి దహన సంస్కారం చేయటం నా విధి అంటాడు లక్ష్మణుడితో. తిర్యక్కులకు కూడా ప్రేత కార్యాలు నిర్వర్తిస్తా నంటాడు చూడండి. అంతకంటే పుత్ర ధర్మాన్ని పాటించే దీక్షాపరుణ్ణి మరొకణ్ణి చూడగలమా మనం.

పుత్ర ధర్మం తరువాత రాముడిలో చెప్పుకోవలసింది క్షత్ర ధర్మం. అది మన కరణ్యకాండలో కనిపిస్తుంది. క్షతాత్కిల త్రాయత ఇతిక్షత్రః క్షతము నుండి కాపాడే వాడెవడో వాడు క్షత్త్రియుడు. క్షతమంటే దెబ్బ. పరుల వలన కలిగే ఉపద్రవం. ఎవరా పరులు. ఖరదూషణాది రాక్షసులు. అరణ్యంలో ఉండే దంతావారే. నిష్కారణ వైరులువారు. వారి వల్ల నిత్యమూ ఉపద్రవమే అక్కడ నివసించే తాపసులకు. వారినా రాక్షసులు వచ్చి క్షతగాత్రులనే గాదు. హతగాత్రులనే చేస్తున్నారు. రాముడా పరిసరాలలో ప్రవేశాంచాడని తెలియగానే వచ్చి వారంతా మొరపెట్టు కుంటారు. నీవు

క్షత్రియ వంశజుడవు. సకల ధర్మజ్ఞుడవు. అనాథులను రక్షించడం నీ కర్తవ్యం. నీలాంటి వాడు రక్షకుడయి కూడా రక్షణ లేక బ్రతుకుతున్నాము మేము. త్వంహి పశ్య శరీరాణి- మునీనాం భావితాత్మనాం- హతానాం రాక్షసైర్ఘోరైః కావలిస్తే నీవే వచ్చి చూడు ఎంత మంది మహర్షుల నా దుర్మార్గులు వధించారో. వారి కళేబరాలెన్నెన్ని గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయో. నీవు వారి ఉపద్రవం నుంచి మమ్ములను కాపాడలేకపోతే మాకు వేరే శరణ్యం లేదని వాపోతారు. అలా వాపోతే ఇక మీదట ఇలాంటి దారుణమేదీ జరగకుండా చూచే పూచీ నాదని వారి కభయమిస్తాడు రాముడు.

ఆ తరువాత సీత ఒకనాడు రాముణ్ణి చూచి ఇలా అంటుంది. ప్రతిజ్ఞాత స్త్వయావీర - దండకారణ్యవాసినా- మృషీణాం రక్షణార్థాయ- వధస్సంయతి రక్షసామ్-మీరు ఆ తాపసులకోసం రాక్షసులందరినీ సంహరిస్తానని శపథం చేశారే. అది నా కేమాత్రమూ సరిపోలేదు. మీరిక్కడికి వచ్చింది తాపస ధర్మాన్ని సేవించటానికి గాని క్రూరమైన క్షాత్ర ధర్మాన్ని సేవించటానికి గాదు. రాక్షసులతో మనకేమి వైరం. వైరం లేకుండానే వారిని వధించటానికి పూనుకోటం నా కిష్టంలేదు. క్వచ శస్త్రం - క్వచ వనం - క్వచ క్షాత్రం - తపః క్వచ - క్షత్త్రియులు చేయవలసింది ఆర్తత్రాణ మనేది. మనమిప్పుడు క్షత్త్రియ వృత్తిలో లేము. తాపసవృత్తిలో ఉన్నాము. అంచేత క్షాత్ర ధర్మాన్ని పాటించటం పనికిరాదని హెచ్చరిస్తుంది. దీనికి రాముడిచ్చిన సమాధానం చూడండి ఎలా ఉందో. త్వయైవోక్త మిదంవచః-క్షత్త్రియై ర్ధార్యతే చాపో -నార్తశబ్దో భవేదితి దేవీ! నీవే గదా అన్నావిప్పుడు క్షత్త్రియుడే ధరించాలి చాపాన్ని ఆర్తనాదం వినపడరాదని. అందుకు పోయినా నేనుగా తాపసులను రమ్మని ఆహ్వానించలేదుగదా వారంతటవారే వచ్చి నాతో మొఱపెట్టుకొన్నారు. రక్షణ ఇవ్వమని ప్రాధేయపడ్డారు. పైగా ఆ రాక్షసులను మేము శాపమిచ్చి భస్మం చేయడానికి కూడా తపోవ్యయం చేయట మిష్టంలేక వారాఖరుకు మమ్మల్ను చంపి తింటున్నా సహించి చూస్తున్నాము. ఎలాగైనా మా దీక్షారక్ష

చేయమని కాళ్లవేళ్లా పడ్డారు. అందుకే నేను వారికి మాట ఇచ్చాను. అసలు వారడగకపోయినా ఇవ్వవలసిన మాట అది. అలాంటిది ఇచ్చి తప్పటమా. అది కలలో జరగని విషయమంటాడు. చూడండి ఉత్తమక్షత్ర ధర్మమంటే ఎలాంటిదో. ఇలాంటి ధర్మాన్నే చివరదాకా వదలకుండా పాటిస్తూ వచ్చాడు రాముడు. కడకు వాలి తన్ను వధించట మన్యాయమని తప్పు పట్టినా మేము క్షత్త్రియులం. ఆర్తత్రాణ పరాయణత్వమే మా కర్తవ్యమని అతనికి తన క్షత్ర ధర్మాన్ని వివరించి చెబుతాడు.

క్షత్త్రధర్మమైన తరువాత నాలుగవది మిత్ర ధర్మం. ఇది కిష్కింధలో మనకు దాఖలా అవుతుంది. సుగ్రీవుడి విషయంలో పాటించింది మిత్ర ధర్మమే. ఆ మాటకువస్తే అయోధ్యలోనే వస్తుందీ మిత్ర ధర్మం. గుహుడనే నిషాద రాజాయన కెంతో ప్రియ మిత్రుడు. తన నిషాద రాజ్యాన్నే ఆయన కప్పగిస్తానన్న ప్రాణ స్నేహితుడు. పోతే ఇక సుగ్రీవుడి విషయం చెప్పనే అక్కరలేదు. అతని పట్ల రాముడు చూపిన మైత్రి ఎనలేనిది. అతణ్ణి అంత వరకూ చూడలేదు పెట్టలేదు రాముడు. కబంధుడు చెప్పేవరకు అతడి ఊసే తెలియదు. కబంధుడు తన చేత శాపవిముక్తుడయి సుగ్రీవుడనే వానర రాజున్నాడు. అతడు సత్యసంధుడు. వినీతుడు. ధృతిమాన్ మతిమాన్ మహాన్ – అని అతడి గుణగణాలు వర్ణించి సతే సహాయోమిత్రంచ భవిష్యతి–అని ఎప్పుడన్నాడో అదే రాముడి కతని మీద మైత్రికి కారణ మయింది. సుగ్రీవుడు కూడా వారిని దూరం నుంచి చూచి భయపడ్డా ఒక అవ్యక్తమైన మధురానుభూతి ననుభవిస్తూనే వచ్చాడు. దీర్ఘబాహూ విశాలాక్షౌ శరచాపాసిధారిణౌ – కస్యనస్యా ద్భయం దృష్ట్వా – హ్యేతౌ సురసుతోపమౌ– అని మొరపెడతాడు హనుమంతుడితో. ఈ వర్ణన చూస్తే ఇలాంటివాడు తనకు మిత్రుడైతే ఎంత బాగుండు వాలిని తప్పకుండా జయించవచ్చుననే ఆశ కూడా ఇమిడి ఉంది ఇందులో. వీరిని చూస్తే ఎవరికి భయం కలగదనటంలో వాలి అయినా సరే భయపడ వలసిందే. అంచేత వీరితో

స్నేహం చేయటమే వాంఛనీయం. అయితే స్నేహపాత్రులో కారో తెలిసేదెలాగా. అందుకే శుద్ధాత్మానౌ యదిత్వేతౌ జానీహి - మంచివారో కారో తెలుసుకొని రమ్మని పంపుతాడు హనుమంతుణ్ణి. రాముణ్ణి చూడగానే ఎన్నడూ చూడని వాడికి కూడా చూడండి ఎలాంటి స్నేహభావం కలుగుతున్నదో.

ఇలాంటి భావమూ సుగ్రీవుడికే గాదు. హనుమంతుడికి కూడా అదే గొప్ప భావం. సుగ్రీవుడికి మైత్రీ భావమైతే ఆయనకు స్వామి భావమేర్పడింది రాముడి మీద. కనుకనే సన్న్యాసివేషంలో ప్రచ్ఛన్నంగా వచ్చి మాటాడుతున్నా తీరా అయనను సమీపించే సరికా వేషానికి స్వస్తి చెప్పి తాను హనుమంతుడు గానే బయటపడుతాడు. యువాభ్యాం సహ ధర్మాత్మా - సుగ్రీవస్సఖ్య మిచ్ఛతి - మీతో మా సుగ్రీవుడు సఖ్యం కోరి నన్ను మీ దగ్గరకు పంపాడంటాడు. దానికి రాముడు సంతోషించి లక్ష్మణుడితో చూచావా మనతో స్నేహం చేయాలని సుగ్రీవుడే మనవద్దకు దూతను పంపాడాతనితో మాటాడు. ఇతణ్ణి చూస్తే సామాన్యుడిగా కనపడటంలేదని ఎంతగానో ప్రశంసిస్తాడు. అతడు వారిని సుగ్రీవుడి దగ్గరకు చేర్చి అతనితో భవతా సఖ్యకామౌ తౌ-భ్రాతరౌ-నీతో మైత్రి కోరి వచ్చారీ అన్నదమ్ము లంటాడు. సుగ్రీవుడప్పుడు సుందరమైన మనుష్య వేషం ధరించి రాముడితో- నీ గుణగణాలు మా హనుమంతుడు చెప్పగా విన్నాను. తన్మమై వైష సత్కారో - లాభశ్చై వోత్తమః ప్రభో - యత్త్వ మిచ్ఛసి సౌహార్దం-వానరేణ మయాసహ-నీవీ వానరుడితో సఖ్యం కోరి వచ్చావంటే అది నాకే లాభం నాకే ఒక సత్కారమంటాడు. తిర్యక్కులతో కూడా సఖ్యం చేయాలనే రాముడి బుద్ధి తిర్యగ్జ జంతువులకే ఆశ్చర్యం కొలిపిందంటే చూడండి. అంతే కాదు. అన్యోన్య మభివీక్షంతౌ-నతృప్తి ముపజగ్మతుః- ఒకరి నొకరు చూచుకొంటూ తనివి చెందలేదట వారు. త్వంవయస్యోసి మేహృద్యో-హ్యేకం దుఃఖం సుఖంచనౌ - మనమిద్దరమూ మిత్రుల మయ్యాము. ఇకమీదట నీ సుఖదుఃఖాలు

నావి-నాసుఖదుఃఖాలు నీవి- అనుకోవా లంటాడు రాముడు. ఉత్తమమైన మైత్రి సుఖదుఃఖాలు సమానంగా పంచుకోటంలోనే ఉంటుంది. అనంతరం వాలి వల్ల జరిగిన పరాభవమంతా వినిపిస్తే సుగ్రీవుడు-రాముడంటాడు. ఉపకారఫలం మిత్రం విదితం మేమహాకపే-మిత్రుడంటే ఒక కష్టంలో ఆదుకొనేవాడేనని నాకు తెలుసు. తప్పకుండా వాలిని వధించి నీకు మేలు చేస్తానంటాడు. ఇదే వాక్య మభిమానా-త్సమీరితం-అనృతం నోక్త పూర్వంమే-నచపక్ష్యే-కదాచన- ఎంతో అభిమానముంది నీ మీద నాకు. అందుకే ఇలాంటి ప్రతిజ్ఞ చేశానంటాడు.

అప్పటికీ నమ్మలేక పోయాడు సుగ్రీవుడు. నమ్మలేక గాదు. వాలి పరాక్రమ మెంతటిదో తెలుసు అతనికి. రాముడి బలపరాక్రమాలా ఇంకా తెలియవు. అందుకే అవి తెలుసుకోవాలని కోరిక. తెలిసిందో ధైర్యం తప్పకుండా వాలిని చంపగలడని. అందుకే వాలి పూర్వ వృత్తాంతమంతా ఏకరువు పెడతాడు. అతడు వధించి దూరంగా పారవేసిన దుందుభి కాయాన్ని చూపుతాడు. దానిని తన పాదాంగుష్ఠంతో పారజిమ్ముతాడు రాముడు. చిమ్మితే అది పది యోజనాల దూరం పోయి పడుతుంది. రక్తమాంసా లెండిపోయిన శుష్కమైన కళేబరాన్ని చిమ్మి సుఖమేమి టంటాడు సుగ్రీవుడు. ఇదిగో చూడు. ఇటువైపు సప్తసాలాలు నిలిచివున్నాయి. వీటిలో ఒకదాన్ని నీ బాణంతో మీటు చూతామంటాడు. ఒకటేమిటి. సప్త సాలాలనూ ఒక్క బాణంతోనే భేదిస్తాడు రాముడు. ఆ బాణ మా వృక్షాల నవలీలగా చీలగొట్టి నేలలో దూరి మరలా వచ్చి తూణీరంలో చేరిపోతుంది. దానితో ఆశ్చర్యచకితుడై సుగ్రీవుడు పాదాల మీద వాలిపోతాడు. రాముడతణ్ణి గాఢాలింగనం చేసుకొని కిష్కంధకు వెళ్లి వాలిని యుద్ధాని కాహ్వానించమని ఆదేశిస్తాడు. ఒకసారి యుద్ధంలో దెబ్బతింటాడు సుగ్రీవుడు. రాముణ్ణి నిష్ఠుర మాడుతాడు రాముడంటాడు గదా. తతోహం రూపసాదృశ్యా న్మోహితః

నోత్సహేహం శరమ్ మోక్తుమ్ - జీవితాంతకరమ్ - మూలఘాతోననః స్యాద్ధి-త్వయివీరే విపన్నేహి- దత్తాభయవధో నామపాతకమ్ మహదుచ్యతే- ఇద్దరూ ఒకేలా ఉండటం మూలాన బాణంవిడవలేదు. ఏదైనా నీకు ప్రమాదం జరిగితే భరించగలనా. అది మొదలు చెడ్డ బేరమేగాక అభయమిచ్చి మిత్రుణ్ణి మృత్యుముఖంలో దోసిన వాడను కానాఅని ఒడ్డు కొంటాడు. మిత్రభావాని కిది గీటురాయి ఈ మాట.

అయితే ఒక్కమాట. రాముడెంతటి మిత్ర ధర్మం పాటించాడో అది ఆ మిత్రుడు నిలబెట్టుకొన్నంత వరకే. నిలబెట్టుకొనలేక మాట దప్పి కృతఘ్నుడయి ప్రవర్తించాడో మరలా అతణ్ణి శిక్షించటానికి కూడా వెనుదీయడు. వర్షర్తువు వెళ్లిపోయినా శరదృతువు వచ్చి చాలా రోజులైనా సుగ్రీవుడు సీతాన్వేషణార్థం వానరులను పంపటంలో జాగుచేస్తాడు. చేయలేదు వాస్తవానికి. అప్పటికే పంపి ఉన్నాడు సేనలను. వారు తిరిగి వచ్చిన తరువాత వచ్చి వార్త చెబుదా మనుకొన్నాడు రాముడికి. అంతలోనే తొందర పడతాడు రాముడు. ప్రతిజ్ఞాయ హరీశ్వరః వ్యతీతాం శ్చతురో మాసాన్-విహర న్నావబుద్ధ్యతే-ప్రతిన చేసికూడా నాలుగు మాసాలు గడిచిపోయినా సరకు చేయక ప్రమత్తుడయి తిరుగుతున్నాడు దుర్మార్గుడు. లక్ష్మణా! నీవు పోయి ఇలా హెచ్చరించు ఆ కృతఘ్నుణ్ణి. నచ సంకుచితః పంథా యేన వాలీ హతోగతః సమయే తిష్ఠసు గ్రీవ-వాలి వెళ్లిపోయిన దారి ఇంకా మూతపడలేదు- సుగ్రీవా! మాట నిలబెట్టుకో. ఒక్క వాలి మాత్రమే చచ్చాడు నా బాణంతో అప్పుడు. ఇప్పుడో నాబాణం నీ ఒక్కణ్ణేగాదు నీ పరివారాన్నంతటినీ తుదముట్టిస్తుందని తెలుసుకో చూడండి. ఎంత కఠినమైన మాటో ఇది. ఇంతకూ రాముడు మిత్ర ధర్మం పాటించటంలో ఎంతఅనుగ్రహమో అంతనిగ్రహంకూడా చూపుతూ వచ్చా డప్పుడప్పుడూ.

పోతే ఇక సుందరకాండలో అయన చూపింది స్వామిధర్మం. భృత్యుల విషయంలో స్వామిధర్మమే గదా చూపవలసింది. భృత్యులెవరు రాముడికి. అందరూ భృత్యులే నిజానికి. అయితే విశేషించి వానరులందరూ ఆయన భృత్యులు. ఆయన గారికి కైంకర్యం చేయటాని కాయారూపాలలో అవతరించిన దేవతలే గదా వారు. తమ కార్యం కోసమే అయనను సేవిస్తూ వచ్చారు. వానరులైనా అందుకే. వానరరాజైన సుగ్రీవుడైనా అందుకే. అయితే వారందరూ ఒక ఎత్తు. వాయుపుత్రుడైన హనుమంతుడొక ఎత్తు. వారు చిన్న పెద్ద మేడలు మిద్దెలైతే ఇతడన్నిటికన్నా ఎత్తుగా పైకి లేచిన ఒక పతాక లాంటికాడు. కిష్కింధలో స్వామిదర్శనం చేసుకొన్నది ప్రప్రథమంగా హనుమంతుడే. స్వామిదర్శనంతోనే భాగ్యవంతుడ నయ్యాననుకొన్న హనుమంతుడు. చరిత్రలో ఎన్నడూ చూడకపోయినా ఎన్నాళ్లనుంచో చూస్తూ ఉన్నంత భక్తి ప్రవత్తులు ప్రదర్శించాడు. ఎంతగానో ప్రస్తుతి చేసి ఆయన గారి ప్రశంసలందు కొన్నాడు. సుగ్రీవుడితో సఖ్యం చేయించాడు. రామకార్యం సుగ్రీవుడెక్కడ మరచిపోతాడో ఏమరి ప్రవర్తిస్తాడో నని మునుముందే అతణ్ణి హెచ్చరిస్తూ వచ్చినవాడు. అది మొదటి నుంచి కనిపెడుతూ ఉన్నాడా స్వామి. విశేషించి సుగ్రీవుడు తన ఎదుటనే అతణ్ణి కీర్తించటం గుర్తించాడు. తతః కార్యసమాసంగ - మవగమ్య హనూమతి - విదిత్వా హనుమంతంచ - చింతయామాస - కార్యమతడి వల్లనే నెరవేరవలసి ఉందని గ్రహించి - హనుమంతుడు గదా అని తెలిసి ఆలోచించాడట రాముడు. హనుమంతుడని తెలిసి ఏమిటి. ఏమో మనకేమి తెలుసు - ఆ స్వామికే తెలియాలి ఆభృత్యుడి వ్యవహారం. ధ్రువఃకార్య ఫలోదయః ఏ కార్యమైనా ఫలించాలంటే ఇతడి విషయంలో తిరుగులేదని నిశ్చయించుకొంటాడు. ప్రహృష్టేంద్రియ మానసః అతణ్ణి చూస్తుంటే మనస్సుకెంతో ఆహ్లాద మయిందట స్వామికి. వెంటనే అంగుళీయక మిచ్చి పంపుతాడు.

పంపటమే గాదు. మార్గ మధ్యంలో అతడికెలాటి అవాంతరాలూ జరగకుండా కాపాడినవాడూ రాముడే. సురసా – సింహికా – లంకిణ్యాదులు సామాన్యులు కారు. అలాంటి వారిని నిర్జించి లంకలో ప్రవేశించాడంటే హనుమంతుడు – శ్రీరాముడి ప్రభావం వల్లనే. రామనామమే – రామస్మరణే – అతనికి శ్రీరామరక్ష. సర్వజగద్రక్ష గదా అది. జగద్ధిత కరుడైన ఒక వానరుణ్ణి రక్షించక పోతుందా. అతడే అంటాడు మహేంద్ర పర్వతం మీది నుంచి వినువీధికి లంఘిస్తూ. యథారాఘవ నిర్ముక్త – శ్శరశ్శ్వసన విక్రమ స్తద్వల్లంకాం గమిష్యా మి – రామధను ర్విముక్తమైన బాణంలాగా అతివేగంగా ఆకాశంలో దూసుకుపోతాను. లంకలో ప్రవేశిస్తాను. హనుమంతుడంటే రామ బాణమేనట. నిజమే మరి. రెండూ స్వామి వారి చేతిలోనివే. స్వామి బలంతో పనిచేసేవే. స్వామి కార్యాన్ని సాధించే సేవకులే.

మధ్యలో తనకు మైనాకు డాతిధ్యం చేస్తానన్నా తామసించలేదా సేవకుడు. త్వరతే కార్యకాలోమే – ప్రతిజ్ఞాచమయాదత్తా – నస్థాతవ్య మిహాంతరే. నీవేమి అనుకోకు. ప్రతినబూని వచ్చాను. స్వామి కార్యం నన్ను తొందరచేస్తున్నదని వెళ్లిపోతాడు. సురసతో కూడా అదే మాట అంటాడు. అన్నివిఘ్నాలు తన స్వామి మహిమవల్లనే దాట గలుగుతాడు. అదృష్టంగా స్వామిహస్తం పనిచేస్తూనే వస్తున్నది. అది ఆ భృత్య భక్తుడెప్పుడో గ్రహించాడు. కనుకనే లంకలో ఎక్కడెక్కడో వెదకి అమ్మవారిని గానక చివరకు దూరంగా కానవచ్చే అశోకవనంలో ఉండవచ్చునని ఆశపడి సముహూర్త మివధ్యాత్వా – ఉదతిష్ఠన్ మహాతేజాః– ఒక్క క్షణం కండ్లు మూసుకుని ధ్యానం చేసి వెంటనే లేచి నిలుచుంటాడు. నిలుచొని నమోస్తు రామాయ సలక్ష్మణాయ– అని రామమంత్రం జపిస్తాడు. ఆ మంత్ర బలమే పనిచేసి అమ్మవారి దర్శనం చేయగలుగుతాడు. దారి పొడుగునా కాపాడుతూ వచ్చింది రాముడి కాయన పయినున్న అవ్యాజ కారుణ్య ముద్ర ఒక్కటే.

చిత్రమేమంటే తన ప్రభావం వల్ల అతడు కార్యాన్ని సాధించినా అతని సామర్థ్యం వల్లనే అది తనకు సమకూడినట్టు భావించటం అతణ్ణి దీవించటం. కృతం హనుమతాకార్యం- సుమహ ద్భువిదుష్కరం - మనసాపి యదన్యేన నశక్యం ధరిణీతలే - హనుమంతుడు సాధించిన మహాకార్యం లోకంలో ఎవరూ సాధించలేదని ప్రశంసిస్తూ భృత్యుడి లక్షణాలూ అందులో తర తమ భావాలు ఉగ్గడించి ఇలాంటి మహనీయుడు చేసిన ఉపకారానికి నేను ప్రత్యుపకార మేమి చేయగలనని మధన పడతాడు. ఏష సర్వస్వ భూత్తస్తు పరిష్వంగో హనూమతః- అని అనన్యలభ్యమైన తన పరిష్వంగాన్ని ఆయనకు ప్రసాదిస్తాడు. ఉత్తరకాండలో కూడా ఆ వీర హనుమంతుడి సేవా ధర్మాన్ని వేనోళ్ల పొగడుతూ ఇలాగే అంటాడు రాముడు. మదంగే జీర్ణతామేతు యత్త్వ - యోపకృతంకపే-నీవీ జీవితంలో గావించిన ఉపకారం నాయీ శరీరంలోనే జీర్ణించిపోవును గాక. నీకు మరలా నేనుపకారం చేయాలంటే నాలాగే నీ కొక కష్టం రావాలని కోరుకోటమే గదా అని చాలగొప్పమాట అంటాడు స్వామి. రాముని స్వామి ధర్మమంటే ఇలాంటి ది. ఈ మాటకన్నా విలువైన మనసుకు హత్తుకునే మాట ప్రపంచ వాఙ్మయంలోనే మరొకటి ఉండబోదంటే దానికి తిరుగులేదు.

పోతే స్వామి ధర్మమైన తరువాత వీర ధర్మం. ఇది మనకు యుద్ధకాండలో తార్కాణ మవుతుంది. అసలు యుద్ధమేమిటి. బాల నుంచి ఉత్తర దాకా ఎక్కడబడితే అక్కడ అవుతుంది. కశ్చవీర్యవాన్- అని గదా ప్రశ్నించాడు వాల్మీకి. వీరత్వమనేది రామచంద్రునికి ఆ జన్మసిద్ధం. సూర్య వంశజుడు. ఆది విష్ణువు అవతారం. వీరత్వానికేమిటి లోపం. కాకపక్షధరు డయిన కాలంలోనే తాటకను వధించాడు. మారీచసు బాహులను పీచమడచాడు. శివధనుర్భంగం చేశాడు. పరుశురాముడికి గర్వభంగం చేశాడు. దండకారణ్యవాసులైన ఖరదూషణ త్రిశిరులను శిరశ్ఛేదం గావించాడు. దుందుభి కాయాన్ని పదాంగుష్ఠంతో పారజిమ్మాడు.

సప్తసాలాలను నిర్మూలించాడు. బలశాలి అయిన వాలిని ఒక్క కోలతో కూలనేశాడు. దారివ్వని సాగరాన్ని పూరి గరిపించాడు. ఇంత చేసిన మహావీరుడుకి సంగ్రామ రంగంలో విజృంభించట మిక అసంభవమా. రావణుడు కాదు. శతసహస్ర రావణులైనా విద్రావణం చిత్తగించవలసిందే. కోపమే రాదు రాఘవుడికి. వచ్చిందో రాముడు కాదు. మహోద్దాముడే. శాత్రవ విరాముడే. కస్యబిభ్యతి దేవాశ్చ-జాతరోషస్య సంయుగే-రోషావిష్టుడైడే త్రివిష్టప వాసులైనా చీకాకు పడి కాందిశీకులు కాక తప్పదు. అసలే రావణుడు. లోకవిద్రావణుడు. పితామహ వరగర్వితుడు. సమస్తలోక చర్వితుడు. దశాననుడు - విపక్షమృగ శిక్షాదక్షపంచాననుడు. అనన్యసాధ్యుడు మానవులచేత వధ్యుడు. అలాంటి వాణ్ణి సామాన్య మానవ రూపంలో వచ్చి ఎదిరించి నిలవటమంటే ఎంత అసామాన్య వీరలక్షణమది.

విభీషణుడు శరణాగతుడయి వచ్చినప్పుడితడు శత్రుపక్షంవాడు. ఛద్మ బుద్ధితో మన దగ్గరకు వచ్చాడు ఇతణ్ణి చేరదీస్తే తమకేదో ముప్పు తెచ్చి పెట్టటం ఖాయ మితణ్ణి వదిలి వేయండని సుగ్రీవాదులు హెచ్చరిస్తారు రాముణ్ణి. అప్పుడు రాముడు మందహాసం చేసి వారితో ఇలా అంటాడు. సూక్ష్మమప్యహితం కర్తుమ్ - మమాశక్తః కథంచన - నాకొకడు కీడు చేయటమనేది కలలోనివార్త. పిశాచాన్ దానవాన్ యక్షాన్ - పృథివ్యాంచన రాక్షసాన్ - అంగుళ్యగ్రేణతాన్ హన్యామిచ్ఛన్ హరిగణేశ్వర - దేవదానవ యక్షరాక్షసులెవరైనా సరే. నేను తలుచుకొన్నానంటే కొనగోటితో మీటి పారేయగలను. నన్ను శరణని వేడితే వాడు విభీషణుడేగాదు. రావణుడైనా సరే అభయ మిస్తాను. ఎంత ఉదాత్తమైన మాటో చూడండి. తలచుకొంటే ఎంతపనైనా చేయగలడట. ఇదుగో ఈ తలచుకోట మనే మాటల లో ఉంది మర్మమంతా. ఇంతపని చేయగలడా ఏమిటింత దీనంగా అమా యికంగా ఉన్నాడనిపిస్తుంది రామాయణంలో రాముడి వ్యవహారం మనకు. కాని సమయం వచ్చిందో ఇక ఆయనను పట్టపగ్గాలుండవు. అప్పుడు

తెలుస్తుందాయన అతిలోకమైన పరాక్రమమెట్టిదో. ఒకే బాణ మది అమోఘం. రెండవ బాణ మక్కరనేలేదు. ఒక్క బాణమే హతమార్చింది తాటకాదులను. ఒక్కటే జవాబు చెప్పింది పరుశురాము డి అహంకారానికి. చాటు నుంచి వేసినా గురి తప్పక ప్రాణాలు తీసింది వాలినది. కావు కావు మని అరచి పరచి మరలా తన కాళ్లమీద పడేదాకా తరమికొట్టింది కాకాసురుణ్ణి. కడకు కోపం వచ్చి కడలి మీద కూడా ఒక్క బాణమే ఎక్కుపెట్టింది. సముద్రుడు పాదాల మీద పడ్డా విడిచిపెట్టదది. దాని పని అది చేయవలసిందే. తాటకాదుల దగ్గరి నుంచీ అలాగే గదా చేస్తూ వచ్చింది. కనుక అతడి సలహా మేరకు తనకు బాధ కలిగించే ఉగ్ర కర్ములైన ఆ భీరాదిదస్యుల నందరినీ అది అంతమొందించింది.

కాబట్టి రాముడి వీర్యమంటే అలాంటిది. పైగా ఉత్తమ వీరగుణ సంపన్నుడెప్పుడూ తేలిక బుద్ధి చూపడు. తనకు సరిదీటైన వీరుడితోనే పోరాడుతాడు తప్ప దీన హీన మానవుల జోలికిపోడు. తెలియక తప్పుచేసినా శరణువేడినా వారిని కరుణించి క్షమించగలడు. ముందు చెప్పిన మాటలలోనే చూడవచ్చు ఆ లక్షణం. సకృదేవ ప్రపన్నాయ- తవాస్మీ తిచ యాచతే - అభయం సర్వభూతే భ్యో - దదామ్యేత ద్వ్రతంమమ - ఒక్కసారి వచ్చి మరుగుచొచ్చితే చాలు. వాడెలాటి నీచుడైనా అభయ మిస్తానంటాడు. కడకు రావణుడైనా సరేనట. శుకసారణులను కాకాసురుణ్ణి అలాగే కాపాడాడు. శుకసారణులు గూఢచారులయి వచ్చి పట్టుబడి ఆయనను శరణు వేడితే శత్రుపక్షీయులని తెలిసికూడా యదిదృష్టం బలం కృత్స్నం - వయంవా సుపరీక్షితాః- మా సైన్యాన్ని మమ్ములను అందరినీ బాగా పరీక్షించారు గదా. మీరు మా సైనికులకు చిక్కిపోయామని భయపడకండి. - న్యస్త శస్త్రులను మేమెప్పుడూ కష్టి పెట్టము. నిర్భయంగా మరలిపొండి. ఒకవేళ ఇంకా చూడవలసింది మిగిలిపోతే తొందరేమీ లేదు. నిదానంగా చూచి వెళ్ళండి. వెళ్ళి మీ రావణుడికి చెప్పండి నా మాటగా - ఏ బలాన్ని

నమ్ముకొని సీత నపహరించావో ఆ బలం రేపు యుద్ధరంగంలో చూపమని. వీరంలో దయా వీర మని పేర్కొంటారు దీన్ని. ఇదే వీరుడికి శోభ నిచ్చేగుణం.

తీరా యుద్ధానికి దిగే ముందు కూడా రావణుడి కొక అవకాశ మిద్దామని ఆలోచిస్తాడు రాముడు. అంగదుణ్ణి రాయబారం పంపుతాడు. మాయోపాయంతో సీత నపహరించి నట్టుకాదు. రేపుదానికి యుద్ధంలో పరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఇప్పటికైనా మునిగిపోయింది లేదు. విభీషణుడిలాగా నీవూ శరణంటే నీ ప్రాణాలు కాపాడుతాను. లేదా నీతో పాటు సర్వరాక్షసులూ లంకాపట్టణంతో సహా మట్టిపాలు కావలసివస్తుంది. పక్షిలాగా పదునాలుగు లోకాలకూ ఎగిరిపోయినా నాకు పట్టుపడక తప్పదు అని చాటుతాడు. ఎంతమాటో చూడండి ఇది. ధీరోదాత్తుడైన వాడి నోట మాత్రమే వినగలిగిన మాట. అలాంటి వీరుడికి నికృష్టమైన చాటుమాటు వ్యవహారం నచ్చదు. రావణుణ్ణి రణరంగంలో కలుసుకొన్నప్పు డాయన అన్న మాటలు వినండి. శూరోహమితి చాత్మాన - మవగచ్ఛసిదుర్మతే - నైవలజ్జాస్తితే సీతాం చోరవద్వ్యపకర్షతః - శూరుణ్ణి వీరుణ్ణి అని చెప్పుకొంటున్నావు. సిగ్గులేదా నీకు. దొంగలాగా నేను లేని సమయంలో సీత నపహరించి తెచ్చావు. యదిమత్సన్నిధౌ - సీతాధర్షితాస్యాత్త్వయా బలాత్- నాసమక్షంలోనే ఆ పని చేసి ఉంటే నీవీపాటికి భ్రాతరంతు ఖరంపశ్యే-స్తదామత్సాయకైర్హతః-నా బాణాగ్ని కాహుతి అయి నీ తమ్ముడు ఖరుణ్ణి పోయి కలుసు కొనేవాడివి. రావణుడి బ్రతుకంతా బయట పెట్టాడీ మాటల్లో.

ఇక్కడ ఒక రహస్యం గ్రహించాలి మనం. మోసంతో చేసిన కార్యాన్ని మోసంతో సాధించట మిష్టంలేదు రాముడికి ఇది గొప్పవీరుడికుండే గొప్ప లక్షణం. అది సీతా లక్ష్మణాదు లందరికీ తెలుసు. ఆ మాటకు వస్తే రావణుడికి కూడా తెలుసు. హనుమంతుడు సీతను తానే తీసుకెళ్లుతానంటే ఆవిడ వద్దని చెప్పింది ఇందుకే. అది జగదేకవీరుడైన రాముడికి శోభనివ్వ

దంటుం దావిడ. అమ్మా అలాంటి వీరపత్ని నీవనవలసిన మాటే నంటాడు హనుమంతుడు. ఇలాంటదే మరొక సన్నివేశం యుద్ధానంతరం ఏర్పడుతుంది. రావణ వధానంతరం సీతను తీసుకు రమ్మని హనుమంతుణ్ణి పంపుతాడు రాముడు. ఆవిడ తన ఎదుటికి రాగానే ఇలా అంటాడు. దైవికంగా వచ్చిపడిన ఉపద్రవాన్ని మానుషమైన బల పరాక్రమాలతో నేను త్రిప్పికొట్టాను. ఇది నీ కోసం కాదు. నా పౌరుషాన్ని నిలబెట్టటం కోసం. దీని మూలంగా నాకు కలిగిన అవమానం నా శత్రువుతో పాటే అంతమయింది. నా మనసు తేలిక పడ్డది. రాముడి వీరగుణానికిది ఒక విధంగా పరాకాష్ఠ. అంతేకాదు. ఉత్తరకాండలో రావణుడి గుణగుణాలను ప్రశంసిస్తూ మహర్షుల వల్ల అతని పూర్వ చరిత్ర వినగోరటంలో సాటి వీరుల యెడ ఆయనకు గల అభినందనగుణం కూడా తేటపడుతుంది.

పోతే ఇక ఆఖరిది రాజధర్మం. ఇది మనకు రామాయణోత్తర భాగంలో బ్రహ్మాండంగా వ్యక్తవుతుంది. రామరాజ్యమని పేరు. ఏ ఆదర్శరాజ్యానికైనా అప్పటికీ ఇప్పటికీ ఆ మాట సార్థకం. అసలు యుక్త వయస్సు వచ్చినప్పటి నుంచీ రాజ లక్షణాలకు కూడా ఆయనతో పాటే వయసు పెరుగుతూ వచ్చింది. దశరథుడది గమనించే ఆయనకు యౌవ రాజ్యాభిషేకం చేయాలని చూచాడు. ప్రజాభిప్రాయం అడిగాడు. వారందరూ ఏకగ్రీవంగా అందుకను మోదించారు. రాముడిలో ఉండే గుణగుణా లెంతగానో వక్కాణించి చివరకు ఆయనను మించిన రాజు మరొకడుండ బోడని తీర్మానించారు. దశరథుడు మరలా రాముని పిలవనంపి మాట్లాడుతూ అద్య ప్రకృతయ స్సర్వాః త్వా మిచ్ఛంతి నరాధిపమ్- అతస్త్వామ్ యువరాజాన - మభిషేక్ష్యామి - అంటాడు. ప్రజలందరూ నిరపవాదంగా ఎవరిని కోరుతారో వాడే రాజు నిజానికి. వంశ పారంపర్యంగా సంక్రమించిందీ నిరంకుశంగా చేజి క్కించుకున్నదీ అది రాజ్యమూ కాదు. వాడు రాజూకాదు. తాత్కాలికంగా పైకి వచ్చినా నిలిచేది కాదది. ఈ ప్రజాస్వామిక వ్యవస్థ ఇప్పటిది కాదు.

ఎప్పటినుంచో ఉందనేందుకిదే మనకు దాఖలా. రామాయణం అయోధ్యాకాండలో కచ్చిత్సర్గ అని ఒక అధ్యాయముంది. అది భరతుడు రాముణ్ణి తోడ్కొని పోవటాని కరణ్యానికి వచ్చినప్పు డాయనతో రాముడు చేసిన సంవాదం. కచ్చిత్తంటే ఏమిటి ఎలా ఉందని అర్థం. ఒక 60, 70 శ్లోకాలు ఈ కచ్చి చ్ఛబ్దంతో మొదలైనవి కనిపిస్తా యందులో మనకు. ఇవన్నీ రాజనీతికి సంబంధించిన అతి రహస్యాలూ-ధర్మ సూక్ష్మాలూ. రాముడి రాజనీతి ప్రావీణ్యమంతా ఈ ప్రశ్న పరంపరలో పదహారు కళలతో సాక్షాత్కరిస్తుంది.

పోతే కిష్కింధలో వాలి నేల గూలి తనతో నిష్ఠుర మాడినప్పుడ తనికిచ్చిన సమాధాన పరంపరలో కూడా ఎంతో రాజనీతి దాఖలా అవుతుంది. అయితే ఇదంతా శాస్త్రజ్ఞానమేగాని అనుష్ఠానంలో కూడా అలాంటి అభినివేశముందా రాముడికనే ప్రశ్న రావచ్చు. జ్ఞానానికెప్పుడూ అనుష్ఠానమే పరిపూర్ణత నిచ్చేది. అది లేనిదే వట్టిమాటలెన్ని చెప్పినా అవి వట్టివే గాని గట్టితన ముండదు వాటిలో. మరి రాముడెంత శాస్త్ర పారంగతుడో అంత అనుష్ఠాన పారంగతుడు. అదే మనకు రామాయణోత్తర భాగంలో నిరూపిత మవుతుంది. రెండే రెండు ఘట్టాలు. ఒకటి సీతా పరిత్యాగమూ-మరొకటి శంబూక వధ. ఈ రెండూ చాలు రాముడి ప్రజానురంజక పరిపాలన మనేది ఎట్టిదో మనకు పట్టి ఇవ్వటానికి. ప్రియాహి సీతారామస్య-ప్రాణేభ్యోపి గరీయసీ-సీత అంటే రాముడికి ప్రాణం. రెండవ జీవితం. ఆవిడనొక సంవత్సరం చూడకపోతే తన జీవితమే నిరుపయోగమని భావించిన నిష్కల్మష ప్రేమయోగి. అలాంటివాడు ఉన్నట్టుండి ఒక పామరుడన్న మాటకు బద్ధపడి తృణ ప్రాయంగా పరిత్యజించి ఇక మరలా ఆవిడ ముఖం చూడనే లేదంటే ఎంత ధర్మదీక్ష-ప్రజాభిప్రాయమంటే ఎంత ప్రామాణ్య బుద్ధి. పదిమంది మెచ్చిందీ వారికి నచ్చిందీ పరిపాలన అంటే. తన కుట్రవడియంగా వచ్చిందికాదు. ఒక

పనిచేస్తే లోకులేమంటారో ననే సంకోచముండాలి ఎప్పుడూ ప్రభువైనవాడికి. అలాంటి స్వభావ మున్నవాడు గనుకనే ఇంకా ఎవరూ తన్ను తప్పు పట్టకముందే లంకానగరంలోనే అనుమానిస్తాడు సీతను. అగ్ని పరీక్షకు గురిచేస్తాడు. పోతే అదికూడా విశ్వసించని అయోధ్యావాసుల కోసం అసలావిడను నవమాసాలూ నిండిన నిండుచూలాలని గూడా చూడక నిర్దాక్షిణ్యంగా పరిత్యజించాడు. ప్రజల కోసం తన వ్యక్తిగత సౌఖ్యాన్నికూడా కాలదన్నాడంటే ఇంత కన్నా రాజ ధర్మపాలనా - పారతంత్ర్య మేముంది- చెప్పండి. ఇలాంటి ధైర్యసాహసాలు సంసిద్ధతా ఉన్నవాడు గనుకనే మొదటి నుంచీ సమయం వచ్చినప్పుడల్లా యదివా జానకీమపి - నా జానకినైనా సరే వదులుకోటానికి వెనుదీయనని ఒక మాట అంటూ వస్తాడు. ఏ వేళ ఏ నోట అన్నాడో గాని అది అలాగే ఫలించింది.

ఇక రెండవది శంబూకవధ. వర్ణాశ్రమ ధర్మాలనేవి శాస్త్రచోదితం. అవి మానవులంతా ఏ కాలంలోనైనా ఏ రాజ్యంలోనైనా పాటించి తీరవలసినదే. అప్పుడే అది సౌరాజ్యం. లేకుంటే ధర్మసాంకర్యమూ విప్లవమూ ఏర్పడి అస్తవ్యస్తమై పోతుంది లోక వ్యవస్థ. అదే మానవ జాతికి వినిపాతం. చివరకు జగత్ప్రళయం. అలాంటి అనర్థం నివారించాలంటే ధర్మమనేది నాలుగు పాదాలతో నడవాలి. నడవాలంటే అది నడిపే రాజును బట్టి ఉంటుంది. యథారాజా తథాప్రజాః పాలకులను బట్టే పాలితులు. రౌతు మెత్తనైతే గుఱ్ఱం మూడు కాళ్లతోనే నడుస్తుంది. లేదా అసలు నడవనే నడవదు. అది ఏదో అత్యాహితానికి కూడా దారి తీయవచ్చు. అలాగే తీసింది శంబూకుడి వ్యవహారం. వాడొక శూద్రుడు. తపస్సు చేయటం వాడి ధర్మంకాదు. అయినా చేశాడు. అందులోనూ ఏదో కామ్యం మనసులో పెట్టుకుని చెట్టుకొమ్మకు తల్లక్రిందులుగా వ్రేలాడుతూ క్రింద ధూమ పానం చేస్తూ తపస్సు సాగించాడు. అది ఒక ఆభిచారిక హోమంలాంటిది. దారుణమైన ఈ చర్య రాజ్యంలో ఎక్కడో ఒక విప్రకుమారుడి ప్రాణాలు

తీసింది. అతడు వచ్చి రాముడితో మొరపెట్టాడు. వెంటనే ఖడ్గం చేత పట్టాడు రాముడు. పుష్పక మెక్కి రాజ్యం నలుదిశలా అన్వేషించాడు. శూద్రతపస్వి కంటపడ్డాడు. వాడికంఠ మాఖడ్గంతో కరుక్కున త్రెంచాడు. వెంటనే ఆ బాలుడు లేచి కూర్చున్నాడు. అదీ ధర్మపాలనమంటే. పోతే లక్ష్మణుణ్ణి చంపట మిష్టంలేక దేశ బహిష్కృతుణ్ణి చేయటం కూడా ఆయన రాజధర్మ పాలనకొక కఠినమైన పరీక్షే. ఈ విధంగా చెబుతూ పోతే ఎంతైనా ఉంది. మొత్తం మీద రాముడి ధర్మపాలన అనన్యాదృశమైనది. లోకోత్తరమైనది. శిష్య ధర్మం దగ్గర నుంచి రాజధర్మం వరకూ దాని విరాడ్రూపాన్ని దర్శించవచ్చు ఆయన జీవితంలో. ధర్మమే రాముడు - రాముడే ధర్మమన్నంతగా ధర్మాన్ని పాటించిన పాలించిన మహానుభావుడాయన.

★★★

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ధర్మ సూక్ష్మములు

సమస్త ధర్మాలూ కరగించి కరువుబోసిన విగ్రహమే శ్రీరాముడని ఎంతగానో కీర్తించాము. మనం ఉత్తమ ధర్మాలని రాముడిలో ఎత్తి చూపిన వాటినే ధర్మాభాసలని కొందరు వేలెత్తి చూపుతున్నారు. మీదుమిక్కిలి ఉదాత్తనాయకుని కుండవలసిన లక్షణా లక్కడక్కడ కొరవడ్డాయని కొన్ని బలహీనతలను కూడా అంటగడుతున్నారు.

అందులో మొదటిది రాముడు సీతా లక్ష్మణసమేతంగా అడవికి వెళ్లిన తరువాత మొదటి రోజు రాత్రి అక్కడ నిద్ర పట్టక ప్రక్కనే ఉన్న లక్ష్మణుణ్ణి చూచి తన తండ్రి దశరథుణ్ణి గూర్చి అన్న మాటలు. అవి ప్రశంసిస్తూ అన్న మాటలు కావు. అధిక్షేపిస్తూ, కోహ్యవిద్వానపి పుమాన్ ప్రమదాయాః కృతేత్యజేత్–ఛందానువర్తినమ్ పుత్రమ్ – తాతో మామివ లక్ష్మణ–అర్థధర్మౌ పరిత్యజ్య యః కామమనువర్తతే–ఏవమాపద్యతేక్షిప్రమ్–రాజాదశరథోయథా అనాథశ్చహివృద్ధశ్చ– మయాచైవ వినాకృతః కింకరిష్యతి కామాత్మ–కైకేయ్యా వశమాగతః– మన్యే దశరథాంతాయ మమ ప్రవ్రాజ నాయచ–కైకేయీ సౌమ్యసంప్రాప్తా– రాజ్యాయ భరతస్యచ–లక్ష్మణా చూడు. ఎంత మూర్ఖుడైనా ఒక తండ్రి ఆడదాని మాటలు విని గుణవంతుడైన పుత్రుణ్ణి అడవుల పాలు చేసే వాడుంటాడా– ఒక మన తండ్రి దశరథుడు తప్ప. అర్థ ధర్మాలు రెండూ గాలికి వదిలేసి కామమే పురుషార్థమని ఎవడు గట్టిగా పట్టుకొంటాడో వాడు దశరథుడిలాగే దెబ్బ తింటాడు. అయినా అనాథుడూ–వృద్ధుడూ – నన్నూ దూరం చేసుకొన్నాడు. కైకేయి చేతులలో కీలు బొమ్మ అయ్యాడు. ఏమి చేయగలడు పాప మారాజు. అసలు నేననుకొంటాను దశరథుడి వినాశానికీ – నా ప్రవాసానికీ– భరతుడికి రాజ్యం కట్టపెట్టడానికీ– సంప్రాప్త మయింది ఆ తల్లి కైకేయి.

ఇలా లోపల ఒకటి బయట ఒకటిగా వ్యవహరించేవాడు ఉత్తమధర్మ పరాయణుడనే గౌరవానికి ఎలా పాత్రుడు కాగలడని ప్రశ్న. పైకి చూస్తే అలాగే అనిపిస్తుంది నిజమే. కాని అపాతతః గాక కొంచెం లోతుకుదిగి చూడవలసిన విషయమిది. రాముడు కేవలం మానవమాత్రుడు కాడు. ధర్మ సంస్థాపన కోస మవతరించిన పరమాత్మ. ధర్మాన్ని తాను ఆచరిస్తూ పదిమంది చేత ఆచరింప జేయవలసిన వాడాయన. అలా ఆచరించక పోయినా అందులో ఏవైనా అవకతవకలు చేసినా క్షమించడు. వాణ్ణి శిక్షించి మంచి మార్గానికి త్రిప్పటమే ఆయన కర్తవ్యం. దానికీ తరం కాకపోతే ఆయన నిజమైన శిక్షకు వాడు గురికాక తప్పదు. తాను గురుజనం పట్ల శిష్య ధర్మం పాటిస్తూ గురుధర్మం పాటించని పరశురాముణ్ణి అలాగే గదా శిక్షించాడు. అంతేకాదు. తాను తాపసుల యెడ క్షత్ర ధర్మాన్ని పాటిస్తూ తాపస ధర్మాన్ని ఉల్లంఘించిన మారీచుణ్ణి మరలా శిక్షించాడు. మిత్రధర్మాన్ని తాను పాటించినట్లు సుగ్రీవుడు పాటించ లేదని అతణ్ణి శిక్షించబోయాడు. స్వామి ధర్మం పాటిస్తూ భృత్యధర్మం పాటించలేదని సముద్రుడి మీద బాణం ప్రయోగించాడు. అలాగే వీర ధర్మం పాటించని రావణుణ్ణి మట్టుబెట్టాడు. రాజధర్మం తాను తప్పని వాడవుతూ ప్రజలు తమ ధర్మం తప్పితే మరలా ఆగ్రహం చూపాడు. అదే శంబూకుణ్ణి వధించటం. ఇలా తాను ధర్మం పాటించటం వరకే గాదు. ఎవరి ధర్మం వారు పాటించక పోయినా మన్నించడు. వారి వారికి తగిన శిక్ష విధిస్తూనే వచ్చాడు.

ప్రస్తుత మిక్కడ అలాగే జరిగింది వ్యవహారం. దశరథుడు చేసింది అక్షరాల తప్పు. అతడు కైక తండ్రికి చేసిన వాగ్దానమే ముప్పయింది. వెనుక ముందు లాలోచించకుండా ఆ రాజలా మాట ఇవ్వకూడదు. ఇచ్చిన వాడిక పుత్రకామేష్టి కుపక్రమించరాదు. ఉపక్రమించినా ఆ ప్రాజాపత్యుడిచ్చిన పాయసాన్ని రాణులందరికి పంచి పెట్టక కేవలం కైకకే ఇచ్చి ఉండవలసింది.

కైకకే ఇచ్చి ఉంటే ఆవిడకే పుత్రుడు జన్మించి వాడే జ్యేష్ఠుడై రాజనీతి ననుసరించి వాడికే రాజ్యం లభించి ఉండేది. నీతి తప్పినాడన్న అప్రతిష్ఠకు గురి అయ్యే వాడు కాదు. అలా కాక అందరికీ పంచి పెట్టేసరికి ముందుగా రాముడు జన్మించి జ్యేష్ఠుడయి కూచున్నాడు. భరతుడు తరువాత పుట్టి అతనికి తమ్ముడయ్యాడు. రాజ్యమిప్పు డితనికివ్వటమా– అతనికివ్వటమా– జ్యేష్ఠుడని ఇస్తే మాట తప్పిన వాడవుతాడు. మాట నిలెబెట్టుకుంటే రాజనీతికి జలాంజలి ఇచ్చినవాడవుతాడు. అయితే ఇప్పుడేమి చేశాడు. కైక కొడుకుకే కట్టబెట్టాడు రాజ్యం. ఏమి కారణం. జ్యేష్ఠుడైనా రాముణ్ణి కాదని వాడికే ఇవ్వవలసిన కారణమేమి. మాట నిలబెట్టు కోటాని కంటావా. ఏదో ఒకటి వదులుకో వలసినప్పుడు మాటనే వదులుకొని రాజనీతినే పాటించవచ్చు గదా– ఇక్కడ ఉంది రహస్యం.

దశరథుడు ముదుసలి అని పేరేగాని అతడు మొదటి నుంచీ కాముకుడు. కాంతా లోలుడు. రాముడి మాదిరి ఏకపత్నీ వ్రతుడూ – జితేంద్రియుడూ కాడు. ఆ కాముకమైన స్వభావంతోనే కైకను చేసుకొన్నాడు. బరోసాగా మాట ఇచ్చాడు. మరలా పుత్రకామంతోనే ఇష్టి చేశాడు. పాయస మందరికి అమాయికంగా పంచి ఇచ్చాడు. చివరకు దాని ఫలితం విషమించే సరికి కామంతోనే కైకకు వశుడయి పోయి కులక్రమాగతంగా రాముడికి చెందవలసిన రాజ్యమతణ్ణి కాదని భరతుడికి కట్టబెట్టాడు. అది మరలా బాహాటంగా బయట పెట్టలేక బాధపడుతూ వచ్చాడు. ఈ విషాదగాథ కంతా మూల మేదో గాదు. ఆ వృద్ధరాజు కామ పర్వతమే. స్త్రీలోలత్వమే. అది లోకంలో ఎవరికున్నా పనికిరాదు. ముఖ్యంగా దేశమేలే రాజుకు. తనకే గాక రాజ్యానికే ముప్పు తెస్తుంది అధర్మ చర్యకు దారి తీస్తుంది. నలుగురిలో నవ్వుల పాలు చేస్తుంది.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇదిగో అధర్మం అతనిలో ఉండటం పరమాత్మగా తాను సహించలేక పోయాడు రాముడు. ఎంత పెద్దవాడైనా పరుశురాముణ్ణి లాగా అతణ్ణి శిక్షించవలసిందే. అయితే పరశురాము డంటే పరాయివాడు. బ్రహ్మణుడయి కూడా కర్కశమైన క్షాత్ర ధర్మ మవలంబించి అనుచితంగా అనేక మందిని వధించి అందరి సానుభూతినీ కోలుపోయాడు. పైగా పెండ్లి కుమారుడని కూడా చూడకుండా తన్ను దారిలో అడ్డగించాడు. కయ్యానికి కాలు దువ్వాడు. అలాంటివాణ్ణి నిగ్రహించినా చుట్టూ ఉన్న వారేమనుకోరు. పైగా తగిన పాఠం చెప్పాడని మెచ్చుకొంటారు. ఇక్కడ అలా కాదు. ఇతడు తండ్రి హోదాలో ఉన్నాడు. అతడు కాముకుడో ధార్మికుడో వ్యక్తిగతమైన ఆ స్వభావం ప్రజలకు తెలిసేది కాదు. వారికది అక్కరలేదు. పైగా కైక తండ్రికి మాట ఇచ్చిన రాజరహస్య మెవ్వరికీ తెలియదు. అలాంటి సందర్భంలో తండ్రి చేసిన చర్య నలుగురిలో ఎలా బయటపెట్టటం. ఆయనను నలుగురిలో నిలదీసి అడగటం గాని నీవు చేసింది తప్పని చాటటం గారి అ సందర్భం. నలుగురి దృష్టిలో ఆయన ఇంకా పలచనయి పోతాడు. ఇది తనకే అవమానకరం. తండ్రిని గౌరవించటం తనయుడిగా తన కర్తవ్యం. అయితే ఆయనలో ఒక దోషమున్నది. ఒక దౌర్బల్య మున్నది. దానికి మాత్రం తగిన దండన విధించాలి. కాని అది పదిమందిలో బాహాటంగా చేయరాదు. లోకాని కాదర్శంగా తన పుత్ర ధర్మాన్ని తను పాటించాలి. తనకు లోపల దేవుడనే జ్ఞానమున్నా జీవుడి మాదిరే నడుచుకోవాలి పైకి. కనుక అలాగే నడుచుకొన్నాడు. అయోధ్యలో ఉన్నంతవరకూ పైకి తేలలేదు. పల్లెత్తుమాట అనలేదు. పరిస్థితు లెప్పటికప్పు డెలా మారుతున్నా ఉలకలేదు. పలకలేదు. మౌనంగా చూస్తూ, చేస్తూ వచ్చాడు.

కాని అంతమాత్రం చేత తండ్రి చేసింది అధర్మం కాకపోదని తెలుసు రాముడికి. పదిమందిలో కాకపోయినా ఎక్కడో ఒక చోట అది బయట

పెట్టి తీరవలసిందే. తగిన శిక్ష ఆయనకు తాను దేవుడుగా విధించవలసిందే. అందుకే అక్కడ ఎక్కడా గాక అడవిలో ఏకాంతంగా ఎవరూ వినకుండా ఒక్క లక్ష్మణుడితోనే అన్నాడీ మాటలు. ఈ మాటలు మనమిక్కడ దేవుడి హోదాలో అర్థం చేసుకోవాలి. జీవుడి హోదాలో కాదు. అర్థ ధర్మాల కన్నా మిన్నగా కామాన్నే సేవించట మధర్మం. అది రాజైన వాడి కేమాత్రమూ తగదు. అలాంటి తగని పని చేశాడు తండ్రి. తండ్రి అయినా అలా చేయట మనుచితమే. అనుచితం గనుకనే శిక్షకు పాత్రుడు. ఏమిటా శిక్ష. మయాచైవ వినాకృతః అనే మాటలో మన్యే దశరాథాంతాయ-అనే మాటలో సూచిత మవుతున్నది. నేను దూరమై పోవటమే ఆయనకు నేను విధించిన శిక్ష. తనకు దూరమైతే ఏమవుతాడు. అంతమైపోతాడు. కాముకుడు బ్రతకకూడదు. బ్రతికినా అది పనికిమాలిన బ్రతుకే. కామాన్ని అసలు సేవించగూడదని కాదు. ధర్మావిరుద్ధంగా సేవించాలది. అలా సేవించలే దిప్పుడు దశరథుడు. అంచేత తన వియోగానలాని కాయన జీవితం ఆహుత్త్రై పోవలసిందే తప్పదు. పరమాత్మగా తను విధించే శిక్ష ఇదే జీవుడికి.

కాబట్టి రాముడు చూచారా తండ్రి నెంతగా దూషించాడో అని కాదు మనం చూడవలసింది. తండ్రి ఏమిటి తల్లి ఏమిటి పరమాత్మకు. ఎవరైనా తప్పుచేస్తే దూషించవలసిందే. శిక్షించవలసిందే. అయినా మానవోచితంగా కూడా వ్యవహరించ వలసినవాడు కాబట్టి తండ్రిగా నలుగురిలో బయటపెట్టక ఆయన మర్యాద దక్కించాడు. జీవుడుగా తన వనగమన చర్యవల్ల శిక్షించాడు. ఎందుకు శిక్ష విధించాడో తెలపటం కోసం లక్ష్మణుడితో ఒక్కడితో మాత్రం బయటపడి అన్నాడు. అలా అనటంలో కూడా కామైక పరత్వ మనేది ముప్పు తెస్తుంది. ఎవరి జీవితానికైనా-కబర్దారని లోకానికి భంగ్యంతరంగా చాటటానికేనని అర్థం చేసుకుంటే చాలు. ఇక ఆక్షేపణ చేయబోము మనం.

ఇక రెండవ అక్షేపణ అరణ్యకాండలో శూర్పణఖా పరాభవ ఘట్టాన్ని గురించి. శూర్పణఖను పరాభవించి నందుకుగాదు. అది అనుచితంగా ప్రవర్తించినందుకు పరాభవించవలసిందే. తప్పులేదు. కాని అది ఒక రాక్షసి-పనికిమాలినదని తెలిసికూడా దానితో పరియాచక మాడటం పొరబాటు. ఊరక హస్యమాడటమే గాక అబద్ధమాడట మంతకన్నా తప్పు తానొక ధీరోదాత్తుడైన రాజపుత్రుడు. లోకంలో పేరు ప్రతిష్ఠ లున్నవాడు. అదా ఒక ఊరు పేరు లేని గయ్యాళి రాక్షసి. దానితోనా వేళాకోళాలూ-అబద్ధాలూ-రామో ద్విర్నాభిభాషతే- సత్యవాక్యో జితేంద్రియః అనృతంనోక్త పూర్వంమే నచ వక్ష్యే కదాచన- రాముడు రెండు సార్లు మాటాడడు. అతడేది మాటాడినా నిజమే తప్ప అబద్ధం మాటాడడు అని గదా మొదటి నుంచీ తనకు పేరు. అలాంటివాడు ఆ దానవితో ఎలా ఆడాడబద్ధం. ఏమిటా అబద్ధం. కృతదారోస్మి భవతి-భార్యే యం దయితా మమ- అనుజ స్త్వేషమే భ్రాతా- శ్రీ మాన కృత దారశ్చ- లక్ష్మణోనామ వీర్యవాన్ అనురూపశ్చతే భర్తా- రూపస్యాస్య భవిష్యతి- ఏనంభజ విశాలాక్షి భర్తారమ్- అమ్మా నేను పెండ్లయిన వాడను. నాకు నా భార్య అంటే చాలా ఇష్టం. నీవా సవతి పోరు భరించలేవు. ఇడుగో నా తమ్ముడు లక్ష్మణుడు. నీకు తగినవాడు. వాడికింకా పెండ్లి కాలేదు. వాణ్ణి పోయి పెండ్లాడు చక్కగా ఉంటుందంటాడు. పైగా వాడు పెండ్లాంకోసం పరితపిస్తున్నాడట. ఏమిటీ మాటలు. రాముడంత వాడన వలసినవా. పచ్చి అబద్ధం కదా. అంతేకాదు. తాను దానితో ఇంతగా హాస్యమాడి అలాటి హాస్యమే తమ్ముడు కూడా ప్రయోగించాడని చెప్పి వాణ్ణి మందలిస్తాడు మరలా. క్రూరై రనార్యై స్సౌమిత్రే- పరిహాసః కథంచన నకార్యః పశ్య వైదేహీం - కథం చిత్సౌమ్య జీవతీమ్ - పనికిరాని హల్కా మనుషులతో చదురులాడరాదు. చూడు సీతను చంపుతానని వచ్చిపైన బడుతున్నది. దీన్ని ముక్కు చెవులు కోసి పంపమని కోపంతో అంటాడు. ఇదీ వరస. ఇదెంతబాగుందో చూడండి ఈ వ్యవహారం. దీన్ని ఎలా సమర్థిస్తారని ప్రశ్న.

ఇది కూడా ముందు వెనుకలు చూడకుండా తొందరపడి చేసే విమర్శే. అసలు జరిగిన విషయం చక్కగా పరామర్శించి చూస్తే మనమిలా విమర్శ చేయలేము. జరిగిన దేమంటే రాముడు సీతా లక్ష్మణ సహితుడై పర్ణశాల ముందు కూచొని ఏవో కథలు చెప్పుకొంటున్నారు. అలాటి సమయంలో వచ్చిందా శూర్పణఖ. అదీ యాదృచ్ఛికంగా. వచ్చి రాముణ్ణి చూచింది. చూడగానే అతిలోకమైన ఆ సౌందర్యానికి మోహించింది తానెలాంటిది. ఏమైనా సౌందర్యవతా. కాదు. సుముఖమ్ దుర్ముఖీ-ప్రీతిరూపం విరూపా-తరుణం దారుణావృద్ధా- అతడు మంచి అందగాడైతే తాను కోతి. అతడు యువకుడైతే తాను ముసలి తొక్కు. పోనీ మాటయినా నాజుకుగా ఉందా అంటే దక్షిణం వామభాషిణీ - అతడు చక్కగా మాటాడే వాడైతే తన వన్నీ వక్రపు కూతలే. ఇలాగే వర్ణించాడు వాల్మీకి. దీనిని బట్టి కామరూపిణి అయినా అది రూపం మార్చుకోకుండా రాక్షసరూపంలో నైనా వచ్చి ఉండాలి. లేదా మార్చుకొని మనోహరమైన వేషంలో వచ్చినా రాముడి కలా కనిపించక నైనాపోవాలి. ఇది వాల్మీకి చాలా ద్వంద్వార్థంగా ధ్వనింప జేశాడొక మాటలో. సహితావన్మ నోజ్ఞాంగీ - రాక్షసీ ప్రతిభాసిమే - ఇది దాన్ని రాముడన్న మాట. దీనికి రెండర్థాలు చెప్పవచ్చు. నీ వింతరూపసివిగా కనబడుతున్నావు. రాక్షసివిగా నాకు కనిపించటం లేదు అనైనా అర్థమే. నీవు అందంగా కనపడటం లేదంటే తప్పకుండా రాక్షసివే అనైనా అర్థమే. అసలది మన్నోజమైన రూపంలోనే తన దగ్గరికి వస్తే రాక్షసివి కావని చెప్పవలసిన పనేమిటి రాముడికి. అంచేత రాక్షసిగానే దర్శన మిచ్చిందన్నమాట. కామ మోహిత కాబట్టి తొందరపడి ఆపని చేసి ఉంటుంది. అందుకే ఆయన తన రూపమెప్పటికీ ఇలాగే ఉంటుందని అసహ్యంచు కొంటాడేమోనని అహం శూర్పణఖానామ - రాక్షసీ కామ రూపిణీ - నేను రాక్షసినైనా కామరూపిణిని నా రూపంచూచి భయపడవద్దు.

ఇలాటి రాక్షసి రాముడి దగ్గరికి వచ్చింది. వచ్చి నీవేమిటి. చూస్తే తాపసుడిలా ఉన్నావు. భార్యతో ఉన్నావు. శరచాపాలు ధరించావు. నీవెవరు. ఎందుకిక్కడికి వచ్చావని అడుగుతుంది. అంతవరకు బాగానే ఉంది. అది రాక్షసి అని గ్రహించినా తొందరపడలేదు రాముడు. సవ్యంగా అడిగింది కాబట్టి సవ్యంగానే జవాబిచ్చాడు. ఋజుబుద్ధితయా సర్వ మాఖ్యాతు ముపచక్రమే- అంటాడు వాల్మీకి. నిజాయితీతో ఏదీ దాచకుండా ఉన్న విషయం చెప్పాడట. బుజుబుద్ధి అనే మాట ఇక్కడ గమనించ దగిన మాట. తన కథ అంతా సంగ్రహంగా చెప్పాడు దానికి. చెప్పి నీవెవరు-ఎందుకిక్కడికి వచ్చావు-అని దాన్ని మరలా ప్రశ్నిస్తాడు. అది కూడా ఉన్నవిషయమే చెబుతానని చెబుతుంది. రావణుడు నా అన్న అతడి పేరీపాటికి నీ చెవికి కూడా వచ్చి ఉండవచ్చు. కుంభకర్ణుడని ఒక సోదరుడు. నిద్రాళువు, విభీషణుడని ఇంకొక భ్రాత. రాక్షసుడైనా రాక్షసస్వభావుడు కాడు. ధర్మాత్ముడు. మరి ఖరదూషణులని మరి ఇద్దరు సోదరు లున్నారిక్కడే. ఇంతవరకూ బాగానే మాట్లాడుతూ వచ్చింది. ఇక్కడనుంచే చెడింది దాని వ్యవహారం - వాళ్లనందరినీ విడిచివచ్చాను - నీ రూపమపూర్వంగా కనిపిస్తే మోహించాను. నన్ను పెండ్లాడు. నాకు చాల శక్తులున్నాయి. నేనే నీకు తగినదాన్ని. సీతయాకిం కరిష్యసి-ఈసీతతో ఏమి చేస్తావు. వికృతాచ విరూపాచ - నచేయం సదృశీతవ-ఇది వికృత విరూప-ఇలాంటిది నీకు తగినదికాదు. ఇదుగో దీన్ని నీ తమ్ముడితో సహా ఒక్క క్షణంలో మ్రింగి పారేస్తాను. ఆ తరువాత మనమక్కడా ఇక్కడా హాయిగా తిరగవచ్చు. అంటుంది.

ఇదుగో ఇక్కడే చిక్కు. అంతవరకూ బాగా మాట్లాడిందిప్పుడీ ఆసందర్భపు మాటలేమిటి. ఆయన చెబుతున్నా డొకప్రక్క. ఈ విడ నాభార్య- ఇతడు నా తమ్ముడని. భార్య అన్నప్పుడు పెండ్లయిందనేగదా. పెండ్లయిన వాడిని నన్ను పెండ్లాడ మనటమేమిటి. పైగా ఆయన భార్యను పట్టుకొని

విరూప వికృత అనటమేమిటి. ఆ సీత తన కంటికి విరూపగా కనపడు తున్నదా. నిజానికి విరూప తాను. ఆవిడకాదు. ఆవిడ సురూపే. సురూపను విరూప అని వర్ణించట మేమిటి. ఇదొక అబద్ధం. పైగా ఆవిడను మింగుతాను చేస్తానని బెదిరించటమేమిటి. ఇదొక అహంకారం. దీనికి కారణం దాని కామ మోహితత్వమేనని తెలుసు రాముడికి. అది ఇన్నిఅవతవక ప్రేలాపనలకు దారి తీసిందని గ్రహించాడు. నవ్వు వచ్చింది రాముడికి. ప్రహస్య-అంటాడు. వాల్మీకి. మందహాసం చేశాడట. ఇదిగో ఈ మందహాసమే మహామోసమని చెప్పాను. కృష్ణుడి విషయంలో. అది ఇప్పుడు రాముడి విషయంలో కూడా. ఏమిటీ మందహాసాని కర్థం. ఓసి పిచ్చిదానా! నీవే నిజాన్ని కప్పిపుచ్చి నన్ను బేలు పుచ్చటాని కబద్ధమాడితే-నేను మాత్రమేమి తక్కువ చదివానా. ఆమాటకువస్తే నేనూ ఆడగలను అబద్ధం. కాని దానివల్ల సుఖం లేకపోగా లేనిముప్పు నెత్తికి తెచ్చుకోటమే అది. అంచేత అనవసరం. ఎవరిని మోసపుస్తున్నానని. అబద్ధాలాడి పాడయిపోరాదని హెచ్చరించటానికే ఇది. జీవుల అబద్ధాన్ని అనుకరిస్తూ చేసిన దీ మందహాసం. మోసానికి మోసమే సమాధానం. అంతవరకూ ఋజుబుద్ధితో మాట్లాడిన రాముడిక ఋజుబుద్ధి దీనిపట్ల పనికిరాదని భావించాడు. అది తాను సురూపయిన సీతను కురూప అంటున్నది. ఎంత అబద్ధం. పైగా ఆవిడను మింగుతా నంటున్నది. నిజంగా అంతపని చేసినా చేయవచ్చు. మీదుమిక్కిలి ఎక్కడో దూరంగా నిలుచొని అమాయికంగా చూస్తున్న లక్ష్మణుణ్ణికూడా మింగుతానని బెదిరిస్తున్నది.

దీనికంతా మూలం దాని కామోద్రేకమే గదా అని గ్రహించాడు స్వామి. కామ మెక్కడ ఉన్నా సహించడాయన. తన తండ్రి దశరథుణ్ణే క్షమించలేదా విషయంలో, ఇక ఈ రాక్షసి దేమిటి. పైగా స్త్రీకి సహజంగా ఉండవలసిన లజ్జకూడా చూపటం లేదిది. అసహ్యంగా ప్రవర్తిస్తున్నది. అబద్ధాలాడు తున్నది. దానితో అలాగే వ్యవహరించి తన్మూలంగా దాని కామానికి తగిన శిక్ష విధించదలచాడు పరమాత్మ. అందుకే దానితో పరిహాస మాడటం.

అటూ ఇటూ త్రిప్పి దాన్ని ఏడిపించటం. పాపం నీవెంత ముసలిదంటున్నా దీన్ని నేను వదలుకోను. నన్ను చేసుకొన్నా ఈ సవతిపోరు నీవు భరించలేవు. అదుగో వాడికే తగులమూ లేదు. వాణ్ణి చేసుకోమని లక్ష్మణుడి దగ్గరికి పంపుతాడు. ఎలాగూ వాడు పలకరించడని తెలుసు. అంతేగాక వాడొక ఆడదానితో ఎలా మాట్లాడుతాడో చూతామని వాడి మనసు తెలుసు కొందామనే పరీక్ష అయినా కావచ్చు ఆయన ఉద్దేశం. భగవానుడి సంకల్పం జీవులకంతు పట్టేదికాదు గదా. అన్నగారి మాటల్లో అంతరార్థమా తమ్ముడూ చక్కగా గ్రహించినట్టుంది. కనుకనే ఆయన సీతను ముసలిదంటే తానూ దానితో మావదినె నిజంగా ముసలిదే వెళ్ళి మళ్లీ ప్రయత్నించిచూడు. తప్పకుండా వదిలేసి నిన్ను చేసుకొంటాడని పంపుతాడు. అది తిరిగివచ్చి దీన్ని మింగుతానని ఇక పట్టలేక సీతమీదికి దూకబోతుంది. అక్కడికి వదిలేశాడు రాముడు హాస్యం. ఎందుకంటే అది అబద్ధా లాడినందుకు తానూ అలాగే దానికి జవాబిచ్చి ఏడిపించవలసినంత ఏడిపించాడు. ఇప్పుడది శ్రుతిమించి రాగాన పడింది. ఇక ఉపేక్షించరాదు. తగిన శిక్ష విధించాలి. అందుకే దానితో ఏమిటి పరిహాసం-శిక్షించిపంపమని లక్ష్మణుణ్ణి హెచ్చరిస్తాడు.

ముసలిదికాని దాన్ని ముసలిదని విరూపకాని దాన్ని విరూప అంటావా - విరూపవే అయిపొమ్మని చెప్పినట్టయిందిప్పుడు. ఋజుబుద్ధుల దగ్గర వక్రబుద్ధితో ప్రవర్తిస్తే ఇదే శిక్షఅని చెప్పినట్టయింది. దీని ద్వారా స్త్రీగాని పురుషుడుగాని కామానికి దాసులై ప్రవర్తించరాదని అలా కన్నుమిన్ను గానక ప్రవర్తిస్తే కీడు మూడటం ఖాయమనీ ఎవరి మాటలూ చేష్టలూ వారికే బెడిసికొడతాయని ఒక గొప్ప సందేశ మందిస్తున్నది రాముని ఈ చర్య. దానికొక అపదేశ మీ పరిహాసాలూ అనృతంగా భాసించే ఆయన భాషణలూ. ఇంకా ఒక లోతైన భావమున్నా ఉండవచ్చు రాముడి ఈ వ్యవహారంలో. తానవతరించింది రావణసంహారానికి గదా - శూర్పణఖ ఆ రావణుడి

చెల్లెలు. అది చెప్పనే చెప్పిందా విషయం నేను ఫలానా వాడి చెల్లెలినని. పైగా కుంభకర్ణుడు నిరంతర నిద్రాశీలుడని–విభీషణుడు పరమ ధార్మికుడనీ బయటపెట్టింది. ఇరుగో ఖరదూషణులు నా సోదరులే. వారిక్కడే ఉన్నారీ దండకారణ్యంలో అని వర్ణించింది. ఇదంతా తన భావికార్యక్రమం. తనకది జ్ఞాపకం చేసి నట్టయింది. ఇంకా ఆలస్యం దేనికి. తయారుగా యుద్ధానికని హెచ్చ రించినట్టయింది. అందుకే రాముడంతగా దానితో చదురులాడి దాన్ని రెచ్చగొట్టటం. ఏడిపించటం, రెచ్చిపోయి అది అఘాయిత్యం చేస్తుందని తెలుసు ఆయనకు. అప్పుడే చేద్దామనుకొన్నాడు దానికి శాస్తి. చేస్తే అది ఖరదూషణాదులను తన మీదికి పంపుతుంది. పంపితే వారిని చంపవచ్చు. చంపితే అది ఊరుకోదు. పోయి రావణుణ్ణే రెచ్చగొడుతుంది. అప్పుడూ కథ రసకందాయంలో పడేది. అందుకే ఈ నాటకమంతా. ఇంత ఉంటే ఇందులో – ఇదంతా గమనించక ఏదో మన బుద్ధులకు తోచినట్టు అసంబద్ధంగా ఆలోచిస్తే ఏమి ప్రయోజనం. అదీ ఆ శూర్పణఖ చేసిన అసంబద్ధ ప్రలాపన మాదిరే అయి కూచుంటుంది.

పోతే ఇక మూడవ ఆక్షేపణ రాముడి మీద ఆయన సీతా వియోగానంతరం పడిన ఆవేదన. రాముడంటే పరమాత్మ అని గదా మీరు బ్రహ్మరథం పడుతున్నారు. పరమాత్మే అయితే ఆయనకు కామక్రోధాది దౌర్బల్యా లుండగూడదు గదా. అలాంటి మాటలూ చేష్టలూ పనికిరావు గదా. పైగా శూర్పణఖాదులంతా కాముకంగా వ్యవహరించారని గదా వారిని నిర్దాక్షిణ్యంగా శిక్షించాడు. అలాంటివాడు తానే భార్యా వియోగాన్ని భరించలేక వాపోవట మేమిటి – వలవల ఏడవటమేమిటి. పైగా ఇంకా సిగ్గుబోయే విషయ మేమిటంటే తనకన్నా చిన్నవాడు లక్ష్మణుడు. అతడి దగ్గర వలపోసుకోవట మేమిటి. అరణ్య కాండాంతంలో కిష్కింధా రంభంలో ఎంతగానో వర్ణించాడు వాల్మీకి రామ విలాపాన్ని. –యది దృష్టా త్వయాసీతా– సీత మీకు కనపడి ఉంటే చెప్పి నా ప్రాణాలు కాపాడమని అరణ్యంలో

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రతి చెట్టునూ- ప్రతి పిట్టనూ బ్రతిమాలుతూ పోతాడు రాముడు. కింధావసి ప్రియేదూరం- తిష్ఠ తిష్ఠ వరారోహే - దూరంగా వెళ్లుతావేమి - నిలునిలు అని ఆవిడను చూచినట్టుగానే కలవరిస్తాడు. అనవసరంగా అందరిమీదా కోపం చేసుకొంటాడు. పాపం జటాయువు తనకు తోడ్పడబోయి ప్రాణాలు కోలుపోయే దశలో ఉంటే తన సీతను చంపిందని ఆగ్రహిస్తాడు. ఇక వాలి వధానంతరం వర్షాకాలం నాలుగు మాసాలూ ఋశ్యమూకం మీద నాలుగు యుగాలుగా గడిపాడా మహానుభావుడు. ఎక్కడ చూచినా సీతే. ఏది ఆలోచించినా సీతే. ఏది మాట్లాడినా సీతే. జంటగా తిరిగే పక్షి మృగాదులను చూచి అసూయ పడతాడు. చెట్లూ చేమలూ చూచి చీదరించుకొంటాడు.

ఏమిటీ వ్యవహారం. ఏమిటీ ఉన్మాదం. ఇలాంటి కామోన్మాదం తమ్ముడు లక్ష్మణుడికే లేదే. తన కుండటం ఎంత శోచనీయం. వాడు తన భార్యనే వదిలివచ్చి తనకు సేవ చేస్తున్నాడు. కలలో కూడా అనుకోటం లేదు తన ప్రియురాలిని. ఈయన కెందు కింత ఆరాటం. ఇంత తపన. అందుకేనేమో అప్పుడప్పుడు లక్ష్మణుడే ఆయనను మందలిస్తూ వచ్చాడు. సంస్తంభ రామ భద్రంతే-మాశుచః పురుషోత్తమ-నేదృశానాం మతిర్మందా- భవత్యకలుషాత్మానాం-మీలాంటి పెద్దలిలా బాధపడరాదు. బెంబేలు పడరాదు. మనసు కొంచెం చిక్కబట్టం డన్నయ్యా-పురుషోత్తముడవు గదా నీవు. త్యజ్యతాం కామ వృత్తత్వం - మహాత్మానం-కృతాత్మాన - మాత్మానం నావబుధ్యసే - కామోద్రేకాన్ని విడిచిపెట్టు. మహాత్ముడవయి కూడా నిన్ను నీవు తెలుసుకోలేక పోతున్నావేమిటి. వినయంగా చెప్పినా ఎంత ఘాటుగా చెప్పాడో చూడండి. లక్ష్మణుడు. లక్ష్మణుడేమిటి - ఆఖరుకు వానర జాతిలో పుట్టిన సుగ్రీవుడు కూడా చీవాట్లు పెట్టవలసి వచ్చిందాయనను. అలం వైక్లబ్య మాలంబ్య-ధైర్య మాత్మగతంస్మర - దైన్యాన్ని వదిలి ధైర్యాన్ని

అవలంబించు రామా. త్వద్విధానా మసదృశం, ఈ దృశం విద్ధిలాఘవమ్-మీలాంటి వారికి ఇలాంటి బేల తనం తగిన లక్షణం కాదు. మయాపి వ్యసనం ప్రాప్తం - భార్యాహరణజం మహత్ - నాకూ భార్యా వియోగదుఃఖం ప్రాప్తించింది, నచాహమేవం శోచామి - నచధైర్యం పరిత్యజే - కాని నేనెప్పుడూ ఇలా ఏడుస్తూ కూచోలేదు. నీలాగా ధైర్యం కోలుపోలేదు. ఇదంతా చూస్తే లక్ష్మణ సుగ్రీవులకున్న స్తిమితత కూడా రాముడికి లేదే. అలాంటి కామపరుడూ - వ్యసనపరుడూ - దుర్బలుడూ దేవుడెలా అయ్యాడు - ఆదర్శ పురుషుడెలా అయ్యాడని ఇప్పుడు ప్రశ్న.

కనుకనే ఆయన దేవుడయ్యాడని మా జవాబు. ఇదేమిటి చాలా విడ్డూరంగా ఉందే అనిపించవచ్చు. విడ్డూరంగానే ఉంటుంది మరి. దేవుడు గనుకనే ఆయన వ్యవహార మెప్పుడూ విడ్డూరమే జీవుడి దృష్టికి. మనకు విడ్డూరమైతే ఆయనకది వినోదం. ఆ వినోదాన్ని విడ్డూరాన్ని వర్ణించి చూపడమే వాల్మీకి రచనలోని విశేషం. నిష్కాముడూ నిరంజనుడూ అయిన భగవానుడు లోకంలో అవతరించి సకాముడుగా వ్యవహరిస్తే ఎలా ఉంటుందో చూపదలచాడు మనకు వాల్మీకి. అది నటన అని తెలియక నిజమేనని భ్రమపడే తోడి జీవుల వ్యవహారమెలా ఉంటుందో కూడా చూపదలచాడు. కనుకనే రాముడు సీతా వియోగం తట్టుకోలేక ఉన్మత్తుడి లాగా ప్రవర్తించటం - అది చూచి తట్టుకోలేక సుగ్రీవాదు లాయనను ఓదార్చటం - రెండూ అసత్యాలే. లోకసత్యాన్ని ధ్వనింపజేసే కావ్య సంకేతాలు. లోకంలో ఒక కాముకుడైన మానవుడు ప్రాణాధికంగా తాను ప్రేమించే ప్రియురాలు తనకు దూరమయినప్పుడెలా బాధపడుతాడు. ఎలా స్పందిస్తాడు. ఎంతగా ఆక్రందిస్తాడు. ఈ ప్రేమ రహస్యం మనకు తెలపాలి. తెలపాలంటే తనకది సహజంగా లేకున్నా ఉన్నట్టు చూపాలి. ఇది పరమాత్మ మానవ స్వభావాన్ని-మనస్తత్వాన్ని-అనుకరించి లోకానికి ప్రదర్శించే తీరు.

అయితే ఈ ప్రదర్శన దేనికి. ఎందుకు చేసినట్టిది. ఇలాంటి వ్యసనపరత్వం స్త్రీ పురుషులకు పనికిరాదని భంగ్యంతరంగా చాటటానికి. అందుకే మరలా లక్ష్మణుడి చేతా సుగ్రీవుడిచేతా మృదువుగా కఠినంగా హితోక్తులు పలికించటం. ఒక వ్యసనానికి గురి అయి బేలగా ప్రవర్తించి నప్పుడు మనకంటే చిన్నవాళ్ల దగ్గర కూడా మనం పలచ నయిపోతాము. వాళ్ల చేత కూడా చెప్పించుకొనే దురవస్థ మన కేర్పడగలదు సుమా అని లోకాన్ని చాటుగా హెచ్చరించట మిది. అంచేత శూర్పణఖతో ఆడిన తన చతురోక్తుల ద్వారా చేష్టల ద్వారా కామమోహితత్వం పరికిరాదని ఎలా ప్రబోధించాడో పరమాత్మ - అలాగే తన స్వవిషయంలో కూడా అలాంటి వ్యవహారాన్నే అభినయించి తద్ద్వారా కూడా ప్రబోధించాడు. అదే వాల్మీకి మనకు తన కావ్యం ద్వారా అందిస్తున్నాడు. కాబట్టి ఇదంతా రాముడు చూపిన కాముకాభినయమే గాని అనుభవం కాదని గ్రహించాలి. ఒక నటుడి నటనలాంటి దిది. ఒక నటుడు దుష్యంతుడి వేషం వేసుకొనివచ్చి రంగస్థలం మీద శకుంతలా వియోగవేదనంతా అభినయించి చూపుతాడు. వాస్తవ మేనని ప్రేక్షకులు భ్రమించేంతగా అభినయిస్తాడు. అనుభవం లేకున్నా అభినయిస్తాడు. అనుభవం చూచే ప్రేక్షకులది. వాడిదిగాదు. అలాగే ఈ కామ వృత్తానుభవం రాముడిది గాదు. ఆయన ఆత్మారాముడు. అభినయమే గాని అనుభవం కాదాయనది. పోతే ఇక ఎవరిదీ అనుభవం. అభినయమని తెలియక భ్రమించే సుగ్రీవాదుల స్థానంలో ఉన్న సాపాటు రాముల లాంటి మనది.

ఇందులో కూడా ముందు చెప్పుకొన్న ఒకానొక సూత్రాన్ని అనుసంధించుకొంటే సరిపోతుంది. రెండు పరస్పర విరుద్ధ ధర్మాలొక ఆదర్శప్రాయు డనుకొన్న పాత్రలో కవి వర్ణించి చూపాడంటే అవి రెండూ పరమార్థమని చెప్పటానికిలేదు. పరిహాస విజల్పితంసఖే- పరమార్థేన నగృహ్యతాంవచః- అని కాళిదాసు చెప్పినట్టు ఒకటి ఆ పాత్రకు స్వలక్షణమైతే

మరొకటి తత్తదుపాధి లక్షణాలను అనుసరిస్తూ అలా లోకానికి ప్రదర్శించటం కావాలి. రెండూ స్వలక్షణం కావటానికి లేదు. అలాగే అయిననాడు రాముడెప్పుడూ సీత నంటిపెట్టుకొనే ఉండాలి. విడిచి పెట్టగూడదు. ఎవరేమన్నా పట్టించుకోగూడదు. అలా చేశాడా మరి జీవితంలో. చేయలేదే. అప్యహం జీవితం జహ్యాం - త్వాంచ సీతే సలక్ష్మణాం - నతుప్రతిజ్ఞాం సంశ్రుత్య - నేను నా జీవితమైనా వదలుకోగలను - నిన్నైనా వదులుకోగలను - లక్ష్మణణ్ణైనా వదలగలను. కాని నాకు మాటంటే మాటే. అది మాత్రం వదలలేనని సీతతోనే అన్నాడాయన ఒకమారు. అలాగే నిలబెట్టు కొన్నాడామాట. ఎవరూ ఆక్షేపించకముందే ఆవిడ ననుమానించి పరీక్ష పెట్టాడు లంకలో. అయోధ్యలో మరలా ఎవడో ఆక్షేపించాడని అసలే పరిత్యజించా డావిడను. తరువాత ఇక తాకి తలుచుకోలేదు. లక్ష్మణుణ్ణైతే ప్రతిజ్ఞ కోసం దేశాంతరానికే వెళ్ల గొట్టాడు. అంత నిష్కామంగా వ్యవహరించ గలిగిన వాడంత కాముకడయి బేలగా పలవించాడంటే ఎలానమ్మటం. కనుకనే ఇది కేవల మభినయమని వాక్రుచ్చటం - లోకాని కలాటి వ్యసనం పరికిరాదని బోధించటమే ఈ అభినయాని కంతటికీ ఫలశ్రుతి అని కూడా హెచ్చరించటం.

ఇక్కడికి కామవ్యవహారం పరిష్కారమయింది. పోతే ఇక కిష్కింధలో పరిష్కరించవలసిన వ్యవహారం మరొకటున్నది. అది వాలి వధ వ్యవహారం. ఒక న్యాయస్థానంలో వ్యవహారంలోగానే అది కొన్ని శతాబ్దాలబట్టీవిమర్శ లోకంలో పాతుకొని ఉంది. ముఖ్యంగా హేతువాదులీ కాలంలో దాన్ని మరీ సాగదీస్తున్నారు. వారనేదేమంటే రాముడు వాలిని వధించటం అన్యాయం. అపచారం. అతడాయనకు చేసిన అపకారమేమిటి. సుగ్రీవుడు చేసిన ఉపకారమేమిటి. ఏదీ కాదు. వాలి సుగ్రీవులిద్దరూ తన కంతవరకూ అపరిచితులే. ఎవరివల్లా తనకు మంచిగాని చెడ్డగాని ఏదీ జరగలేదు.

అలాంటప్పుడందులో ఒకరి నెక్కదీసి మరొకరిని కుంగదీయవలసిన అవసరం తనకేమిటి. వారిద్దరూ అన్నదమ్ములు. పోట్లాడుకొన్నా పొందికగా ఉన్నా వారిలో వారు చూచుకొంటారు. తనకు దేనికి. తమ అన్నదమ్ముల వ్యవహారంలో మరెవరయినా కలగజేసుకొన్నారా. తాను దేనికితరుల వ్యవహారంలో జోక్యం చేసుకోటం. ఒకవేళ తనకార్యం సాధింటం కోసం చేసుకొన్నాడేమో. అందుకైనా బలవంతుడు వాలినే పట్టుకోవాలి గాని దుర్బలుడైన సుగ్రీవుణ్ణి పట్టుకొని ఏమిలాభం. కాబట్టి రాజనీతి కూడా కాదిది. అంతే కాదు. ఒక వీరుణ్ణి అంతమొందించాలనే ఆశయంతో ప్రవర్తించాడే అనుకోండి. అప్పటికీ వీరోచితంగా పోరాడి వాణ్ణి సంహ రించవచ్చు గదా. చెట్టుచాటునుంచి బాణం వేసి చంపవలసిన కర్మ ఏమి పట్టింది. ఇది ఇక్ష్వాకు వంశంలో పుట్టిన రఘుదిలీపాది రాజన్యులను తాతముత్తాతలుగా పేర్కొనే మహా వీరునికి తగిన చర్యయేనా. దీనివల్ల భీరుడనిపించు కొంటాడే గాని తాను వీరుడెలా అవుతాడు. ఇదుగో ఇలాంటి ప్రశ్న పరంపర లెన్నో శరపరంపరలాగా ఎదురవుతాయి ఈ సందర్భంలో. హేతువాదు లిప్పుడీ ఆక్షేపణలు చేస్తున్నారంటే మనం తప్పు పట్టనక్కరలేదు. ఎందుకంటే అసలీ హేతువాదులేమిటి. వాల్మీకి మహర్షికే తోచాయి ఆ శంకలన్నీ. తన మనసుకు తోచిన ఆ శంకలన్నిటినీ వాలి ముఖంగా తానే అనిపిస్తాడు రాముడి దగ్గర. కథం దశరథేనత్వం జాతః పాపోమహాత్మనా- పెద్దమనిషి అనిపించుకొన్న దశరథుడికింత నీచవర్తనుడివి నీవెలా జన్మించావు. నత్వాం వినిహతాచారం- ధర్మధ్వజ మధార్మికం జానేపాప సమాచారం-తృణచ్ఛన్నకూపాని వని తెలియక మోసపోయాను. అందుకే తార వద్దంటున్నా రాముడంటే కరుణాళుడు. ప్రజాహితకారి - సమయజ్ఞుడు - దృఢవ్రతుడు - అని లోకంలో నలుగురూ నిన్నిలా ప్రశంసిస్తుంటే విని అలాంటివాడు నా కెందుకు కీడు చేయబోతాడు లెమ్మని బరవసాతో వచ్చి

మా వాడితో తలపడ్డాను. నీవు కీడు చేయనేచేశావు. కనపడకుండా చాటు నుంచి చేశావు కాబట్టి బ్రతికి పోయావుగాని దృశ్యమానస్తు యుధ్యేథా - మయాయది నృపాత్మజ - అద్యవైవస్వతం దేవం - పశ్యేస్త్వం నిహతోమయా. నా కంటబడే నీవు యుద్ధం చేసి ఉంటే ఈ పాటికి నా చేత చావు దెబ్బలు తిని యమధర్మరాజును దర్శించే వాడివి. కాక పోయినా నీవెంత అమాయికుడివి, నిన్ను చూస్తే నాకు జాలి వేస్తుంది. సీత కోసమే ఇంతపని చేశావంటే సిగ్గుచేటు. సీత కోసమే అయితే కంఠే బద్ధ్వా ప్రదద్యాంతే-నిహతం రావణంరణే-ఆవిడ నపహరించిన రావణుణ్ణి చంపకుండానే పట్టి తెచ్చి నీ పాదాలముందు పడవేసేవాడిని. కుబ్రకుంక సుగ్రీవుడా నీకు తోడ్పడేవాడు ఏమయినా సరే నీవు చేసింది పొరబాటు. నేను చస్తే నా అనంతరం నా తమ్ముడు రాజ్యానికి రావటం ధర్మమే గాని నా తమ్ముణ్ణి నా నుండి చీలదీసి నీవు నన్ను అక్రమంగా వధించటం మాత్రమే మాత్రమూ ధర్మం కానేరదు.

ఇలా ఒకటిగాదు-రెండుగాదు. సవాలక్ష నిష్ఠురా లాడాడు వాలి రాముణ్ణి. అంతకన్నా నీవూ నేనూ ఆక్షేపించలేము కూడా. అయితే ఈ ఆక్షేపణలన్నింటికీ ఏమిటి సమాధానమని అడగవచ్చు. అది కూడా వాల్మీకే చాటి చెప్పాడు లోకానికి. ఆక్షేపణ వాలి ముఖంగా వినిపించి అందులో ప్రతి ఒక్కదానికీ సమాధానం రాముడి ముఖంగా మనకు వినిపిస్తాడాయన. అవిజ్ఞాయ కథం బాల్యా - న్మామిహాద్య విగర్హసే - అని మొదట చీవాట్లు పెడతాడు రాముడు వాలిని. వాలీ నీకు ధర్మం తెలీదు. అర్థం తెలీదు-కామమూ తెలీదు. పురుషార్థమంటే ఏమిటో తెలీదునీకు. ఏదీ తెలియకుండానే నన్నధిక్షేపిస్తున్నావు. ఇక్ష్వా కూణా మియం భూమిః- ఈ భూమండల మంతా ఇక్ష్వాకు చక్రవర్తులది. ఇందులో నివసించే మృగ పక్షి మనుష్యజాతులలో ఎవరే తప్పు చేసినా శిక్షించే అధికారి భరతుడు. ఆయన నియమించిన అధికారులం మేము. వన భూముల కంతా పాలకులం.

నీవు రాజువై కూడా కామమనే వ్యసనానికి వశుడివయి పోయావు. తండ్రి అన్న ఆచార్యుడు-వీరు ముగ్గురూ కూడా తండ్రులే వాస్తవానికి. అలాంటి తండ్రి హోదాలో ఉన్న నీవు పుత్రుడిలాంటి నీ తమ్ముడి భార్యతో సంగమించే సాహసం చేశావు. వాడు బ్రతికి ఉండగా నీవాపని చేయరాదు. మహాపరాధం. అపరాధివి గనుక నీకునేను శిక్ష విధించాను. భరతుడు రాజు. మేమాయన ప్రతి నిధులము. నీవపరాధివి. దండించకుండా ఎలా ఉండగలము. అయితే సుగ్రీవుడితో ఎందుకు సఖ్యమంటావా-వాడు నాకు లక్ష్మణుడి వంటి వాడు. నా శ్రేయస్సు కోరేవాడు. శపథం కూడా చేశాను నేను వాడికి మేలు చేస్తానని. మరి దాన్ని భంగం చేయట మేమిబాగు. నీవు కూడా వాడికది చేసి ఉండవలసినది. కాని చేయలేదు. మరి చాటు నుంచి బాణం వేసి చంపావని గదా ఆక్షేపించావు. మేము క్షత్రియులం. మృగాలను వేటాడటం మాకలవాటు. వాటికెదురుగా ఉండే చంపనక్కరలేదు. వెనుకనుంచి ప్రక్క నుంచి దూరం నుంచి దగ్గర నుంచి కనపడుతూ కనపడకా - ఎలా చంపినా చంపవచ్చు వాటిని. నీవూ అలాంటి ఒక శాఖా మృగానివే. కాబట్టి చాటు నుంచి చంపినా నీవు తప్పు పట్టటానికి లేదు. అంచేత ధర్మసూక్ష్మం తెలుసుకోకుండా మాట్లాడకు. చపలుడివినీవు. పుట్టుగ్రుడ్డివి. నీకు ధర్మమే మెఱుక, స్వయంగా ఎఱుగవు. ఎఱుక గల పెద్దల నడిగి తెలుసు కోవు. సూక్ష్మమూ పరమాద్భుతమూ ధర్మమంటే. ఇప్పటికైనా తెలుసుకోటం మంచిది. ఇదీ రాముడిచ్చిన సమాధానం.

దీనితో వాలి ఇక నిరుత్తరుడయి పోయాడు. యత్త్వమాత్థనర శ్రేష్ఠ తదేవ-నాత్రసంశయః-నీవేది చెప్పావో అది అంతే. దానికిక తిరుగు లేదు. అనవసరంగా నిన్ను తూలనాడాను. నన్ను మన్నించమని వేడుకొంటాడు. అయితే అతడు మన్నించమన్నా మనం మన్నించలేక పోతున్నాము రాముణ్ణి. ఎన్ని సమాధానాలిచ్చి వాలిని నోరుమూయించినా అవన్ని కుంటి గుడ్డి

సమాధానాలేనని మనవాళ్ళ అభియోగం. భరతుడు రాజుగాని రాముడేమిటి రాజు. రాజ్యాధికార మతనికెక్కడిది. భరతుడెప్పుడు నియోగించా డతణ్ణి. ఇది ఒక ప్రశ్న. మానవుల శిక్షా స్మృతి పశుపక్షి మృగాదుల కెలా వర్తిస్తుంది. ఇది రెండవ ప్రశ్న. వర్తించిందేపో. ఎన్నో ఉన్నాయిగదా మృగాలు అరణ్యంలో. అవి తమలో తాము వావి వరుసలు లేకుండా ఎలా ప్రవర్తిస్తున్నాయో. వాటి నన్నిటినీ అలాగే శిక్షించాలి గదా- శిక్షించాడా మరి. మూడవ ప్రశ్న. సుగ్రీవుడితో సఖ్యం చేశాను కాబట్టి అతడికి మేలు చేయాలనట మేమిటి. అసఖ్యం వాలితోనే చేయవచ్చు గదా. నాలుగవప్రశ్న.

వీటికి జవాబు రాముడి మాటలలోనే ఉంది బాగా ఆలోచిస్తే. దానికి తోడు పూర్వాపరాలు కలియబోసుకొని చూస్తే ఇంకా బాగా అర్థమవుతుంది మనకు. రాముడు రాజేమిటని గదా సందేహం. రామ భరత సంవాదంలో తెలుస్తుందీ రహస్యం మనకు. భరతుడూరక ప్రాణం తీస్తుంటే పట్టణానికి రమ్మని-రాజ్యపాలన చేయమని-రాముడతనితో ఇలా అంటాడు. త్వమ్ రాజా భరతభవస్స్వయం నరాణామ్-వన్యానా మహమపి రాజరాణ్మృగాణామ్ - నీవు జనపదంలో నరుల కందరికీ పాలకుడవై ఉండు. నేనీ జనస్థానంలో మృగ జాతులన్నీటికీ పాలకుడనై ఉంటాను. గచ్ఛత్వం పురవరమద్య సంప్రహృష్టః - సంహృష్టస్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే. ఇక నీవు సంతృప్తి పడి అయోధ్యకు వెళ్లు. నేనూ సంతృప్తితో దండక ప్రవేశిస్తాను. ఛాయాంతే దిన కరభాః ప్రబాధమానమ్-వర్షత్రమ్ భరత కరోతు మూర్ధ్ని శీతామ్ - నీకు ఎండ తగలకుండా శ్వేతచ్ఛత్ర మున్నట్టే. ఏతేషా మహమపి కానన ద్రుమాణామ్- ఛాయాంతా మతిశయినీమ్ సమాశ్రయిష్యే. నాకూ ఇక్కడ ఉన్న ఈ కానన ద్రుమాలు గొడుగు పట్టి నీడనిస్తాయి. శత్రుఘ్నఃకుశలమ తిస్తుతే సహాయః సౌమిత్రిర్మమ విహితః ప్రధాన మిత్రమ్, మరి నీకు మంత్రి శత్రుఘ్నుడయితే- నాకీ సౌమిత్రి మంత్రిగా ఉంటాడంటాడు. ఇలా ఇద్దరూ ఒకరు పట్టణాలలో ఒకరు అరణ్యాలలో రాజ్యం చేద్దామని ఒప్పందం

చేసుకొన్నారు. అందుకే మృగాదులను శిక్షించే భారం రాముడిమీద ఉంది. మరి మృగాలకు మానవ ధర్మమెలా వర్తిస్తుందని గదా ప్రశ్న. మృగ రూపాలలో ఉన్నారనే గాని వాలి సుగ్రీవులు మిగతా జాతి మృగాల లాంటి వారు కారు. రాజులై రాజ్యాలు చేస్తున్నారు. మానవులతో వ్యవహరిస్తున్నారు. కామరూపాది శక్తులున్నాయి వారికి. అందుకే నరుడిలాగా సంబోధిస్తాడు వానరుణ్ణి కూడా రాముడు. అయితే మృగాలను వేటాడటం మాకు ధర్మమని చెప్పే మాటకర్థ మేమిటని మరలా ప్రశ్న. మృగ స్వభావమే ఇక్కడ మృగమంటే. మృగాకృతిలో ఉన్నా మృగాతీత శక్తులతో విజ్ఞానంతో వ్యవహరించినంత వరకూ పరవాలేదు. కాని అవన్నీ ఏరదోలి కేవల ఉపాధి ధర్మాన్నే అనుసరించాడు వాలి. అంచేత మృగయా వ్యవహారాన్నే పాటించాను పొమ్మన్నాడు రాముడు.

మరి చాటునుంచి ప్రయోగించటం దేనికి బాణం. వాలి ఎదుటికి రావటానికి భయమా. అదేగా అన్నాడు వాడు. నీవు చాటునుంచి కొట్టావు కాబట్టి బ్రతికిపోయావు గాని నా కంటపడి ఉంటే చచ్చేవాడివని. అది కేవలం వాడి ఔద్ధత్యాన్ని సూచిస్తుంది గాని అర్థవంతమైన మాట గాదు. ఎందుకంటే చాటునుంచి వేసినా ఎదుటబడి వేసినా రామబాణం రామ బాణమే. దాని కెదురులేదు. వాలికాదు. ఎవరూ చెప్పలేరు దానికి జవాబు. పరశురాముడే చెప్పలేకపోయాడు-వాలి ఏమిటిక లెక్క. సప్త సాలాలు ఒక్కదెబ్బలో భంజించిం దాబాణం. ఎదుటబడి వేసినా ఒక్కటే. చాటు నుంచి వేసినా ఒక్కటే. ఎలా వేసినా గురి తప్పని దది. ఇది రాముడి బాణమని కూడా కాదు మనం చూడవలసిందిక్కడ. రామ వేషంలో ఉన్న పరమాత్మ బాణం. దేవుడి బాణం మనకెప్పుడూ చాటు నుంచే వచ్చి తగులుతుంది. ఎప్పుడెక్కడి నుంచి వచ్చి తగులుతుందో చెప్పలేమా దెబ్బ. ఎవరికీ తెలీకుండా చేశాము గదా ఈ పని అని సంతోషిస్తుంటాడు జీవుడు. కాని సర్వాంతర్యామి అయిన దేవుడన్నీ కనిపెట్టి చూస్తూనే ఉంటాడు.

చూచి చూచి ఎప్పుడు దెబ్బ తీయాలో అప్పుడు తీస్తాడు. అది ఎలా తీస్తాడో ఏ ప్రాణికీ అంతుపట్టదు. ఇది ఆ వానర జీవుడి మనసుకు తేవటానికే- అజ్ఞాతంగా దైవహస్త మొకటి పనిచేస్తుందని హెచ్చరించటానికే ఈ చెట్టు చాటు బాణ ప్రయోగ నాటకం.

మరి సుగ్రీవుడికి మాట ఇచ్చాను కాపాడుతానని అనటం దేనికి. ఆ మాట వాలికే ఇచ్చి అతనితో సఖ్యం చేయవచ్చును గదా. దీనికి రెండు జవాబులు చెప్పవచ్చు మనం. ఒకటి రాజనీతి. మరొకటి దండనీతి. వాలి అసహాయ శూరుడు. అంత బలవంతుడైనా అతని దగ్గర సహాయ సంపద లేదు. హనుమ జ్జాం బవదాది మహావీరులంతా సుగ్రీవుడి దగ్గరే ఉన్నారు. అతణ్ణిఆశ్రయిస్తే వారందరూకలిసి తనకు బాసటగా ఉంటారు. సీతాన్వేషణకు పనికి వస్తారు. పైగా సుగ్రీవుడికి భూమి నాలుగు దిక్కులూ తిరిగిన అనుభవమున్నది. ఎక్కడెక్కడి వర్తమానమూ సేకరించగలడు. వాలితోనే మైత్రి చేస్తే సహజంగా బలవంతుడైన వాలి మరీ బలవంతుడై పోతాడు. అతడి వల్ల తన కార్యం సానుకూలమైనా ఎప్పటికైనా తనకే అతడు ముప్పు తెచ్చి పెట్టవచ్చు. పైగా జయ మతనిదే అవుతుంది గాని తనదిగాదు. దానివల్ల లోకంలో గౌరవంలేదు తనకు. సుగ్రీవుడితోనే అయితే తద్ద్వారా బలవంతుణ్ణి రూపుమాపవచ్చు. బలహీనుడి కుపకారం చేసినట్టూ అవుతుంది. అలాటి వాడెప్పుడూ తన్ను మించిపోలేదు. మీదు మిక్కిలి తన కార్యమూ ఫలిస్తుంది. ఇది రాజనీతి.

పోతే సన్మార్గుణ్ణి కాపాడటమూ - దుర్మార్గుణ్ణి శిక్షించటమూ- దండనీతి లక్షణం. సుగ్రీవుడితో మైత్రి చేస్తేనే దాని కనుగుణంగా నడుచుకొన్న ట్టవుతుంది. లేకుంటే ఇన్ని ధర్మ పన్నాలు వల్లించిన తానే అధర్మపరుడని చెడ్డపేరు తెచ్చుకున్న వాడవుతాడు రాముడు. ఇదీ ఇక్కడ మనం చెప్పుకోవలసిన సమాధానం.

పోతే ఇంతకన్నా ఒక పెద్ద సమాధాన మున్నది. ఇది ఒక దైవ రహస్యం. వాల్మీకి దాన్ని తన కావ్యారంభంలోనే కొంత సూచన చేసి ఉన్నాడు. అదేమిటంటే అసలీ వాలిగాని సుగ్రీవుడుగాని ఎవరు వీరు. నిజంగా వానరులా. కారు. వానర రూపాలలో అవతరించిన దేవతలు. ఇంద్రాంశలో అవతరించినవాడు వాలి. సూర్యాంశలో పుట్టినవాడు సుగ్రీవుడు. ఎందుకిలా జన్మించారు. రామకార్యార్థమని పేర్కొన్నాడు మహర్షి. రాముడెవరు. సాక్షాద్విష్ణువే. రావణుడి వల్ల బాధలు పడలేక తన్ను వేడుకొంటే వారికోసమని చెప్పి మానవుడుగా అవతరించా డాయన. తనకా ఉద్యమంలో సహాయం చేయటానికే వానరాది రూపాలతో సుగ్రీవాదు లవతరించారు. అప్పటికది రామకార్యం కూడా కాదు. దేవకార్యమే. అంటే వాలి సుగ్రీవుల కార్యమే ఇది. రాముడి కార్యం కాదన్నమాట. వారలా అవతరించిన తరువాత ఋక్షవానరాది సైన్యాలంతా అన్నగారిని కొందరూ -తమ్ముణ్ణి కొందరూ ఆశ్రయించి వారిని సేవిస్తూ వచ్చారు. అన్నదమ్ము లిద్దరూ ఒద్దిక గలిగి కిష్కింధలో నివసిస్తున్నారు. వారి జీవిత ధ్యేయమంతా రావణాది రాక్షస సంహారార్థ మవతరించిన రాముడికి సహాయపడటమే. అంతేగాని తమలో తాము కీచులాడుకోటమా- పోట్లాడుకోటమూ కాదు. అది మొదలు చెడ్డబేరం. ఇలా మొదలు చెడ్డ బేరం చేసి కూచున్నా డిప్పుడు వాలి. అంత వరకూ కలిసి మెలిసి ఉన్నవాడు తమ్ముడితో నిష్కారణంగా రగడ పడ్డాడు. వాడెంతబ్రతిమాలినా వినలేదు. తరిమికొట్టాడు-చంపటానికి పూనుకొన్నాడు. చివరకు వాడి భార్యనే అపహరించాడు. చేసేది లేక సుగ్రీవుడు ఋశ్యమూకం మీద ఏదో నలుగురు నమ్మినబంట్లను చుట్టూ పెట్టుకొని నమోనమో అని బ్రతుకుతున్నాడు.

ఇది రామబ్రహ్మాని కెక్కడలేని ఆగ్రహం తెప్పించింది. తనకు ఇద్దరూ కలిసి తోడ్పడవలసి ఉండగా వారిలో ఒకడు అన్యాయంగా ఇంకొకడిని దురుసుగా వెళ్లగొట్టి-తన బలాన్నే తాను నమ్ముకొని తనంతవాడే లేడని

విర్రవీగుతున్నాడు. తన కోసమే పరమాత్మ అవతరించాడనే విషయమే మరచి పోయి పామరంగా బ్రతుకుతున్నాడు. అహంకరించాడు. ఆ అహంకారానికి తగిన చికిత్స చేసి అతడి కళ్లు తెరిపించాలి స్వామి. ఇది కథలో దాగి ఉన్న అంతరార్థం. దీనికి స్ఫోరకంగా సాగింది బాహ్యమైన కథ. అది రెండు విషయాలలో బయట పడుతుంది మనకు. కబంధుడు శాపవిమోచనానంతరం రాముడికి భావికర్తవ్యాన్ని బోధిస్తూ కిష్కింధకు పొమ్మని-వాలి సుగ్రీవులలో వాలితో గాక సుగ్రీవుడితోనే మైత్రి చేయమని చెబుతాడు. సుగ్రీవుడు ధర్మాత్ముడని అతణ్ణి వాలి అనవసరంగా బాధించాడని కూడా విన్నవిస్తాడు. ఇది రాముడి అంతశ్చేతనలో దాగి ఉన్న ఆత్మారాముడికి తన కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చింది. పోతే మరొక విషయం. సీతను రావణు డెత్తుకుపోయే సంరంభంలో ఆవిడ తన సొమ్ములు తీసి మూట గట్టి క్రిందికి చూచి సూటిగా ఋశ్యమూకం మీద కూచుని ఉన్న సుగ్రీవాదుల ముందే పడవేసింది. అంటే రాము డెప్పటికైనా రావలసిందీ సఖ్యం చేయవలసిందీ సుగ్రీవుడితోనే-వాలితో గాదని చెప్పినట్టయింది. అదే దైవ నిర్ణయం. దైవ నిర్ణయ మేమిటింతకూ. రావణ సంహారం. దానికోసమే రామావతారం. ఆయనకు తోడ్పడవలసినవారెవరు. వాలి సుగ్రీవులుగా అవతరించిన దేవతలే. అది విస్మరించిన వాడెవడిప్పుడు. వాలి. అందుకే వాడి విషయం చెప్పలేదు కబంధుడు. అమ్మవారు సొమ్ము లక్కడ న్యాసముంచలేదు. రామ కార్యార్థ మెదురు తెన్నులు చూచే సుగ్రీవుడు అందులకు పాత్రుడు. అందుకే అతనితో మైత్రిచేసి వాలిని వధించాడు. రాముడు. ఇది అన్ని ఆక్షేపణలకూ అంతర్యంలో ఇవ్వవలసిన ఆఖరి సమాధానం. తస్మాదనతి శంక నీయోయమ్ వ్యవహారః.

పోతే రాముడు సీతను పరిత్యజించటం ఎంతవరకూ సమర్థనీయ మనేది మరొక ఆక్షేపణ. వాలి వధ పరకీయమైతే ఇది స్వకీయమైన సమస్య. సీత తనకు సహధర్మచారిణే కావచ్చు. ఆవిడ మీద తన కెంత అధికారమున్నా

ఉండవచ్చు. కాని ధర్మ మార్గంలో తాను నడుస్తూ లోకాన్ని నడపవలసిన వాడు చేయవలసిన కార్యమా ఇది. నిజంగా అపరాధి అయితే శిక్షించవచ్చు. ఆవిడ చేసిన అపరాధ మేమిటి ఇందులో. రాక్షసుని బారినుండట మపరాధం కాదుగదా. ఆవిడది కాక పోయినా పరోక్షంలో వాడేదో దురుసుగా ప్రవర్తించి ఉంటాడనటానికి బలవంతంగా ప్రవర్తిస్తే తల వేయి వ్రక్కలవుతుందని శాపమే ఉంది గదా వాడికి. అందుకే గదా వాడొక సంవత్సరం తన ఆధీనంలో ఉన్నా ఆవిడనేమీ చేయలేకపోయింది. పోనీ అది ఎవడు నమ్మాడంటావా లంకలోనే రాక్షస, వానరులందరి సమక్షంలో ఆవిడ నిష్కల్మషత్వం ఋజువయింది గదా. అలాంటప్పు డయోధ్యలో ఎవరో కొందరు పామరులన్న మాటను పాటిగా తీసుకొని నిందుచూలాలని కూడా చూడక ఆవిడను పరిత్యజించటమా. ప్రజల కోస మంటావా, ఆవిడ మంచిదనే ప్రజలు కూడా అన్నారు గదా. వీరికోసం వదులుకోకపోతే వారికోస మేలుకో రాదా. ఒక్కడన్నా అది మాటే గదా అంటావా. అలాగైతే ఎవడో ఒకడు కావాలని ఎప్పుడొక అభాండం వేసినా వేయవచ్చు. ఎంతమందికెన్ని మార్లని నీవు జవాబు చెప్పగలవు. భార్యమీదగాక తల్లి మీదనే అపవాదం చేస్తే ఏమి చేయగలవు. అపవాదానికి పరిత్యాగమే పరిష్కారమైతే అన్నిటినీ పరిత్యజించి మానవుడిక బికారి అయి పోవలసిందే. కాబట్టి సీతా పరిత్యాగ మేవిధంగా చూచినా సమర్థనీయం కాదని ఆక్షేపణ.

ఇది మనమే కాదు. ఆనాటి కాళిదాసాదులు కూడా సరిపుచ్చుకోలేక నంది మీదా పందిమీదా పెట్టి మనసులోని అక్కసు వెళ్లగ్రక్కుతూ వచ్చారు. త్వాం ప్రత్యకస్మా త్కలుష ప్రవృత్తా- వస్త్యేవకోపో భరతాగ్రజేమే-అని వాల్మీకి చేతనే అనిపించాడు కాళిదాసు. మరి భవభూతి అయితే రాముడు చేసిన పనికి రాముడి చేతనే చిందులు ద్రొక్కించాడు చివర దాకా. ఇదంతా ఒక ధర్మ సూక్ష్మం గ్రహించలేక మనం పడుతూ ఉన్న మథనే గాని మరేది గాదు. ఆ సూక్ష్మమేమంటే సాహిత్యమంతా ఒకానొక సత్యానికి కేవలం

సంకేతమే. సత్యాన్ని ఆవిష్కరించటానికే సంకేతాన్ని ఆశ్రయిస్తాడు కవి. మనమీ సంకేతాల ద్వారా ఆ సత్యాన్ని అందుకోవాలని బాగుపడాలని కవి ఉద్దేశం. మనమేమి చేస్తున్నాము. సత్యాన్ని విడిచిపెట్టి సంకేతానికి ప్రాధాన్య మిస్తున్నాము. దాని వల్ల వచ్చిందీ ప్రమాదమంతా. సంకేతమేమిటి. కథ ఒక సంకేతం. పాత్రలొక సంకేతం. వారి ఆలోచనలూ మాటలూ ఒక సంకేతం. అవి సత్యంకావు. అయితే రామాయణ కథే అసలు జరగలేదా అని మరలా ఉలిక్కిపడరాదు. ఏ కొంచెమో జరిగి ఉండవచ్చు. జరిగింది కొంచెమైతే కొండంత కల్పన చేశాడు వాల్మీకి. అంతా జరగనూలేదు. అసలు జరగకనూ పోలేదు. రెండింటి మిశ్రణం ఇతిహాసం. కాబట్టి సీతను రాముడు పరిత్యజించాడనే చెప్పనక్కరలేదు. ఒక వేళ సాక్షాత్తుగా పరిత్యజించాడే ననుకొన్నా భయం లేదు. లౌకికంగా జరిగిందని చెప్పినా అదీ ఒక సంకేతమే. ప్రపంచమంతా ఒక సంకేతమనే గదా వేదాంతుల తీర్మానం. అలాంటప్పుడు కావ్యంలో జరిగితేనేమి. లోకంలో జరిగితేనేమి. దాన్ని గాదు మనం పట్టుకొని వ్రేలాడవలసింది.

అయితే మరేమిటంటారు. జరిగినా కవి కల్పించినా అసలీ సన్నివేశంలోని అంతరార్థమేమా - అది మనకు అందజేసే సందేశమేమా - అని. అదీ ఈ సంకేతం ద్వారా గ్రహించవలసిన సత్యం. ప్రస్తుతమా సత్య మేమిటిక్కడ. రాజైన వాడు ప్రజానురంజకంగా పాలనం చేయాలని - ప్రజాభిప్రాయాన్ని మన్నించాలని - ప్రజలు తన విషయంలో అసంతృప్తి పొందినా అపవాదం వేసినా దానికి సమాధానం చెప్పితీరాలని - ప్రజాకార్య నిర్వహణలో స్వార్థానికి చోటులేదనీ - అవసరమైతే వ్యక్తిగత సుఖాన్నైనా వదులుకోటానికి వెనుదీయరాదని - అప్పుడే రాజశబ్ద మతనికి సార్థక మవుతుందనీ - ఇలాటి గొప్ప ఆదర్శా లన్నిటికీ అది ఒక ప్రతీక. ఒక ఉదాహరణ సీతా పరిత్యాగ మనేది. సీత అంటే చాలా ఇష్టం రాముడికి. అయితే అంతకన్నా ఇష్టమైనది ధర్మం. ఆ ధర్మం కోస మిష్టమైన పత్నిని

కూడా పరిత్యజించవలసి వస్తే వెనుక ముందు చూడగూడదు. అప్పుడే రాముడు లోకాభిరాము డవుతాడు. లేకుంటే జానకీరాముడే అయి కూచుంటాడు. ఇక్కడ మన మొక విషయం గ్రహించాలి. భార్యను వదిలేయటమంటే ఎంత కావలసిన పదార్థమైనా వదిలివేయటానికి తయారయి ఉండాలని అర్థం. అంతేగాని భార్యనే సాక్షాత్తూ వదిలేయాలని కాదు. అయితే రాముడు భార్యనే వదిలాడు గదా అంటే అది ఒక సంకేతమే. ఒక వైద్యుడుమన రోగానికి పథ్యం చెప్పేటప్పుడు పచ్చి మంచినీళ్ళు త్రాగకూడదని చెపుతాడు. కాని అంత కఠిన పథ్యం చేస్తే చచ్చి కూచుంటాడు రోగి. మంచినీళ్లు కూడా తాగకూడదని ఎందుకన్నాడు మరి. అలా అనకపోతే కూడు తింటాడని భయం. దానితో రోగం తిరగ బెడుతుంది. చావుకు పెడితే లంకణాలకు దిగుతుందన్నట్టు అంత తీవ్రంగా చెబితే గాని జాగ్రత్తగా ఉండడు పథ్యం విషయంలో. అలాగే ఇక్కడా వ్యవహారం. భార్యనే పరిత్యజించాడని చూపటం పాలితుల పట్ల పాలకులెంత నిస్వార్థంగా ప్రవర్తించాలో పాలకలోకానికి మహర్షి మార్గాంతరంగా బోధించటమే. మరేదీగాదు. హరిశ్చంద్రాది రాజన్యుల కథలన్నీ కూడా ఇలాంటివే.

అయితే ఇక్కడ రాముడు చేసిన చర్యలో మరొక రహస్యం కూడా ఉంది మనం గ్రహించవలసింది. రాముడు హరిశ్చంద్రుడిలాగా మానవ మాత్రుడు కాదు. పరమాత్మే ఆ రూపంలో అవతరించాడు. ఆయన అవతార ప్రయోజనం కేవలం ధర్మపాలన. ఆ కార్యాన్ని సాధించటానికి తోడు చేసుకొన్న ఉపాధులే సీతా లక్ష్మణాది పాత్రలన్నీ. తన ప్రయోజనం తీరేంత వరకే వారితో ఆ ఉపాధులతో సంబంధ మాయనకు. తీరిన తరువాత ఇక అక్కరలేదు. ఏదో ఒక నెపం పెట్టి వారిని దూరం చేసుకోవలసి ఉంది. అలాటి దూరీకరణ ప్రయత్నంలో ఒక భూమికే ఈ సీతా పరిత్యాగం. ఇది మొదటి భూమిక అయితే లక్ష్మణ పరిత్యాగం రెండవ భూమిక. ఈ విడను త్యజించటానికి ప్రజాపవాదం మీద నెపం పెట్టాడు. అతణ్ణి త్యజించటానికి దుర్వాసుడి మీద నెపం పెట్టాడు. రెండూ బుద్ధి పూర్వకంగా చేశాడు.

మమాపి హృదివర్తతే – నాకూ ఇది మనసులోనే ఉందని యమధర్మరాజుతో చెప్పిన మాటలో ఇది కూడా ధ్వనిత మవుతూ ఉంది. మిగతా విభీషణాదులు అందరూ వదలి పోయినా రాముడికి సీతాలక్ష్మణు లిద్దరూ ఇంకా వదలలేదు. వీరినీ వదిలించుకొంటే గాని తాను సుఖంగా వైకుంఠయాత్ర వెళ్లలేడు. అయితే ఆ వెళ్లేలోపల రాజ్యానికొక వారసుణ్ణి ఇచ్చి వెళ్లాలి. అది కూడా నెరవేరుతుందని గ్రహించాడు సీత గర్భం ధరించటంలో. సరే ఒకమంచి మహూర్తం చూచుకొని ఈవిడను ఆడవికి సాగనంపాడు. మరో ముహూర్తం చూచి లక్ష్మణుణ్ణి దేశంలో నుంచి దూరంగా వెళ్లగొట్టాడు. ఏకో నారాయణః అని తానొక్కడే మిగిలాడు చివరకు. ఎవరికెవరు. ఎవరికి వారే ఈ జీవులు. తానే గదా వర్ణించాడు ఇంతకు ముందు అయోధ్యలో యథాకాష్ఠంచ కాష్ఠంచ – సమేయాతామ్ మహోర్ణవే – సమేత్యచ వ్యపే యాతామ్ – తథాదారా స్సుతాఃపితా – అని. జీవుల పరిస్థితే ఇలాంటిదని వర్ణించినప్పుడిక దేవుడి పరిస్థితి చెప్పేదేముంది. కాబట్టి ఈ అవతార రహస్యం తెలిస్తే మనమిక ఈ విషయంలో ఎలాంటి విమర్శా చేయబోము.

పోతే ఇక ఆఖరి ఆక్షేపణ రాముడి విషయంలో ఒక్కటే ఒకటున్నది. అది ఉత్తర కాండలో సీతా పరిత్యాగానంతరం జరిగిన శంబూక వధ. శంబూకుడేమి చేశాడని వాణ్ణి వధించటం. వాడొక శూద్రుడు. తపస్సు చేస్తున్నాడు. తపస్సు అనేది ఎవరినీ బాధించటం కాదు. వేధించటంకాదు. వాడిపాటికి వాడు చేసే పని. మంచిపనేగాని చెడ్డపనిగాదు. అది నేరమెలా అయింది. నేరం కాకపోతే వాణ్ణి చంపటం దేనికి. వాడి తపస్సు మూలంగా ఒక బ్రాహ్మణ కుమారుడు చచ్చాడనటం – అందువల్ల అది అధర్మమనటం – ఏమి సబబు. ఎవడి ప్రారబ్ధంవల్ల వాడు చస్తాడుగాని ఒకడు చేసిన దానివల్ల మరొకడు చచ్చేదేమిటి. పైగా ఆధర్మమెలా అయింది తపస్సు. కాకుంటే దానివల్ల పిల్లవాడు మరణించాడని చెప్పటమేమిటి. చూడబోతే ఇదంతా అగ్రజాతులు అవరజాతుల మీద చేసే దారుణమైనా అన్యాయమూ అక్రమమూ అని చాలా మంది ఈ రోజుల్లో చేస్తూన్న ఆక్షేపణ.

అరసిచూస్తే ఇది కూడా అర్థంలేని ఆక్షేపణే. వర్ణాశ్రమ ధర్మాలనేవి ఇప్పుడేర్పడినవి కావు. మానవుడీ భూమి మీద అవతరించినప్పటినుంచీ అతణ్ణి అంటిపెట్టుకొని ఉన్నవే. మనమిప్పుడు చూచే రూపంలో కాక పోయినా ఏదో ఒకరూపంలో ఉండితీర వలసిందే. సమాజంలో మేధావులు కొందరుంటారు. పాలకులు కొందరుంటారు. వ్యాపారులు కొందరైతే శ్రామికులు మరి కొందరుంటారు. నాలుగు వర్ణాలని కాక పోయినా నాలుగు వర్గాలైనా ఉండక తప్పదు. ఇప్పుడూ ఉన్నాయి కదా ఇవి అన్నిదేశాల్లో. అన్నిజాతుల్లో. ఉన్నాయంటే అవి ఎలా ఏర్పడ్డాయి. వారి వారి గుణాల వల్ల. గుణాలను బట్టే ఆయాకర్మలూ లేదా వృత్తులు. గుణమంటే మనమనుకునే మంచి చెడ్డకాదు. సత్త్వరజస్తమస్సులు. అందులో సత్త్వరజస్సుల హెచ్చుతగ్గుల వల్ల బ్రహ్మక్షత్రా లేర్పడితే – రజస్తమస్సుల హెచ్చుకుందుల వల్ల వైశ్య శూద్రులు. శూద్రుడు తమోగుణ ప్రధానుడు. లేదా తమో గుణప్రధానుడెవడో వాడు శూద్రుడు. తమస్సు మూఢత్వానికి మారు పేరు. చదువు సంధ్యలూ, సంస్కారమూ లేనివాడని అర్థం. అలాటివాడికి పరిచర్య తప్ప తపశ్చర్య పనికిరాదు. పెద్దలను పరిచరించి తద్వారా శమదమాదులూ – జ్ఞాన విజ్ఞానాలూ – గడించి క్రమంగా శూద్రత్వం పోగొట్టుకొంటే సంస్కారవంతుడవుతాడు. తపశ్చర్యాదుల కప్పుడర్హు డవుతాడు. అంతవరకూ అర్హత లేదు. ఇప్పుడూ అంతేగదా. ఒక వర్గం వాడుచేసిన పని మరొకడికి లాయకు కాదు. ఒకడు వైద్యశాస్త్రం చదివి మరొకవైద్యుడి వద్దకొన్నేండ్లు శిక్షణ పొంది తరువాత గదా వైద్య వృత్తి కర్హుడవుతాడు. అవిఏవీ లేకుండానే ఒక బోర్డు తగిలించుకొని వైద్యం చేస్తే ఒప్పుకొంటుందా ప్రభుత్వం. తగిన శిక్ష విధిస్తుంది.

అలాగే శిక్షించాడు రాముడు కూడా శంబూకుణ్ణి. విప్రుడు అకాలంగా మరణించిన తన కుమారుణ్ణి రాజద్వారం దగ్గర పెట్టి ఇదంతా నీ

పరిపాలనలో దోషమే. లేకపోతే కేనాద్య దుష్కృతేనాయం బాల ఏవ మమాత్మజః - అకృత్వా పితృకార్యాణి - గతోవైవస్వతక్షయమ్ - నాలోనూ నీలోనూ ఏ దోషమూ దొరలకుండానే నాకు పితృకార్యం చేయవలసిన నా పుత్రుడు అకాలంగా ఇంత చిన్న వయసులోనే కన్ను మూస్తాడా అనిమొర పెడుతాడు. అందుకు రాముడు మధన పడుతుంటే నారదుడు సలహా ఇస్తాడాయనకు. ఏమని. రామ ! యుగధర్మమని ఒకటున్నది. తపశ్చర్య అనేది కృతంలో బ్రాహ్మణుడూ - త్రేతలో క్షత్రియుడూ - ద్వాపరంలో వైశ్యుడూ - కలిలో శూద్రుడూ చేయాలి. ప్రస్తుతం శూద్రుడెవడో తొందరపడి ఈ త్రేతాయుగంలోనే చేస్తున్నట్టున్నాడు. ఆ ధర్మ వ్యతిక్రమం వల్లనే ఈ బ్రాహ్మణ బాలుడు మరణించి ఉంటాడు. కనిపెట్టమని చెబుతాడు. వెంటనే రాముడు పుష్పకాన్ని స్మరించి తదారూఢుడై నగరం నలుమూలలా వెదికితే దక్షిణ దిశగా ఒక సరస్సులో తల్లకిందులుగా వ్రేలుతూ తపస్సు చేసే శంబూకడనే శూద్ర తాపసి ఒకడు కనిపిస్తాడు. దగ్గరికి వెళ్ళి నీవే వర్ణం వాడివని ప్రశ్నిస్తాడు రాముడు. శూద్రయోన్యామ్ ప్రసూతోస్మి - అని నిజమే చెబుతాడు.వాడు. అంతే కాక సశరీరంగా స్వర్గానికి వెళ్లాలని ఈ దారుణమైన తపస్సు చేస్తున్నానంటాడు. అసలు శూద్రుడు తపస్సు చేయటమే తప్పు. దానికి తోడు తలకుమించిన ఫలితాన్ని ఆశించట మంతకాన్నా అపచారం. వెంటనే ఖడ్గమ్ సురుచిరప్రభమ్ - నిష్కృష్యకోశా ద్విమలం శిరశ్చిచ్ఛేద రాఘవః ఖడ్గం ఒరనుంచి పెరికి వాడి శిరస్సు నరికివేశాడట. ఏమిటీ ఘోరమని నీకూ నీకూ అనిపించవచ్చు ధర్మసూక్ష్మమనేది అలాగే ఉంటుంది. మనం ధర్మమని భావించింది ధర్మం కాకాపోవచ్చు. మన మ ధర్మమని చూచేది గొప్ప ధర్మమే కావచ్చు. మన మల్పజ్ఞులం. మన బుద్ధులూ - ఆ బుద్ధులతో చేసే నిర్ణయాలు - రెంటికీ హద్దులున్నాయి. గుణదోషాలు నిర్ణయించటానికే పరికరాలూ పనికిరావు. త్రికాలజ్ఞులైన మహర్షులు వారు సృష్టించిన వాఙ్మయం మనకు ప్రమాణం. అది ఎంత కఠినంగా శాసించినా

మనకు శిరోధార్యమే. ఈ కాలంలో మన రాజ్యాంగమూ - మన శాసనవిధానాలూ - ఎలా ఉన్నా మనకెంత సరిపడకున్నా ప్రశ్నించ గలుగుతున్నామా - చచ్చినట్టు దాన్ని మనం నెత్తిన పెట్టుకోవటం లేదా - అలాగే అనుకోండి ఏ ధర్మమైనా. అలాటి ఒకానొక ధర్మ సూక్ష్మమే ఈ శంబూక వధ కూడా. పైగా వధించిన వాడెవడు. మనలాటి నరుడా. లేక నరేంద్రుడా. కాదు. నరుడూ కాడూ. నరేంద్రుడూ కాదు. ఈ ఇద్దరి పరిధీ దాటిన నారాయణుడు. మరి నారాయణుడు చేసిన కృత్యం నరుల కేమంతు పడుతుంది. నారాయణుడి లీల నారాయణుడికే వేద్యం. కనుకనే శంబూక వధానంతరం అగస్త్యాశ్రమానికి వెళ్లితే రాము డగస్త్యు డాయనను చూచి త్వమ్మే బహుమతోరామ-గుణైర్బహుభి రుత్తమైః- సురాహికథయంతి త్వామాగతం శూద్రఘాతినమ్-నీవు శూద్రుణ్ణి వధించి బ్రాహ్మణ బాలుణ్ణి బ్రతికించి వచ్చావని దేవతలు చెబితే విన్నాను. చాలా మంచి పనిచేశావు. త్వంహినారాయణః శ్రీమాన్ త్వయి సత్యం ప్రతిష్ఠితమ్- నీవు సాక్షాన్నారాయణుడవు. నీలోనే సత్యం ప్రతిష్ఠిత మయి ఉన్నది. త్వం ప్రభుస్సర్వభూతానామ్ - సమస్త ప్రాణులకూ శాసకుడవు నీవే. నీవు చేసిన పని కాక్షేపణ ఏమున్నదని ప్రశంసిస్తాడు. ఇక మన మభిశంసించి ఏమి ప్రయోజనం. ఊరక మన అల్పజ్ఞతను చాటు కోటమే. కాకపోయినా నారాయణుడు చేసిన పని నరుడికెలా బోధపడుతుంది. ముహ్యంతి యత్సూరయః- అని గదా భాగవతం మ్రోగించిన సందేశభేరి- పైగా రాజదండన వల్ల యమదండన లేకపోవటమే గాక ఆ శూద్ర తపస్వికి అనుకోకుండా స్వర్గసుఖమే లభించింది. ఇది ఆగ్రహవ్యాజంతో భగవానుడు చూపిన అనుగ్రహమని భావిస్తే ఇక ఏ గొడవాలేదు. కాబట్టి ధర్మమే గాదు మనం గ్రహించవలసింది. ధర్మ సూక్ష్మం. అంతవరకూ దృష్టి సారిస్తే ఇక ఎలాటి ఆక్షేపణలకూ చోటు లేదు రామాయణంలో.

★★★

# - కృష్ణుడు -

నల్లనివాడు - పద్మనయనంబుల వాడు - కృపారసంబుపైఁ
జల్లెడు వాడు - మౌళి పరిసర్పిత పింఛము వాడు - నవ్వురా
జిల్లెడు మోమువాడొకడు - చెల్వల మానధనంబు దెచ్చె - నో
మల్లియలార! మీ పొదల మాటున - లేడు గదమ్మ - తెల్పరే -

Yallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# - కృష్ణ తత్త్వము -

కాబట్టి రాముడింతకూ లోకులకు ధర్మోపదేశం మాత్రం చేయవలసిన వాడు గనుక ఆయన జీవితం తావన్మాత్రం గానే సాగింది. పోతే కృష్ణుడు ధర్మోపదేశం కోసం కాదవత రించింది. ఆయన లోకులకు పరమ పురుషార్థ మైన మోక్ష ఫలాన్నే అందివ్వాలని వచ్చాడు. కనుకనే రామాయణ మితిహాస మైతే భాగవతం పురాణ మయిందని ఇంతకు ముందే మనవి చేసి ఉన్నాను. మోక్ష పురుషార్థమే భాగవతానికి వివక్షిత మైతే తత్ప్ర దాత శ్రీ కృష్ణుడే దానికి కథా నాయకుడయ్యాడు. కృష్ణ చరితమనే భాగవతానికి నామధేయం. కృష్ణతత్త్వమే ఈ పురాణ పారిజాతానికి మూలం. తత్తత్త్వ వేత్త తదంశ సంభవుడూ ఆయిన కృష్ణ ద్వైపాయనుడే ఆ మహత్త్వాన్ని లోకుల కందివ్వ గలిగాడు. అది శుక ముఖంగా ఆకర్ణించి తరించిన వాడూ కృష్ణ రక్షితుడై కృష్ణ స్మరణైక పరాయణుడైన పరీక్షిత్తే. మొత్తంమీద అంతా కృష్ణ మయ మీ పురాణం. ఇది గుర్తించే పైకి రామ భక్తుడని పేరు పడసిన పోతన కూడా కలం చేత బట్టి వ్రాత కుపక్రమించినప్పుడే కృష్ణ గుణ సంకీర్తనతో ఉపక్రమించాడు.

శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్- లోకర
క్షైకారంభకు- భక్త పాలన కళా సంరంభ కున్- దానవో
ద్రేకస్తంభకు- కేళి లోల విలస ద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు- మహా నందాంగనా డింభకున్

శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించిం దాయన ఎవరినో గాదు. కృష్ణ పరమాత్మనే. ఆయన నందాంగనా డింభకుడు. డింభకుడని పేరే గాని మహా డింభకుడు. మహా డింభకు డేమిటి- పెద్ద కుర్రవాడన్నట్టు.

Valluri Brahmasri www.advaitaveda.in

పెద్దవాడా కుఱ్ఱవాడా ఇంతకూ. కుఱ్ఱవాడుగా మన కంటికి కనిపిస్తున్నాడే గాని నిజానికి కుఱ్ఱ గాదు. పెద్దే. పెద్దంటే మామూలు పెద్ద గాదు. అణో రణీయాన్ మహతో మహీయాన్ అనే ఉపనిష ద్వాక్యానికిది ప్రతిధ్వని. అణువు కన్నా అణువూ మహత్తు కన్నా మహత్తు కూడా అది. అదే మహా డింభకుడని చతుత్కారంగా అన్నాడు మహాకవి.

పోతే ఇక ఈ పద్యంలో చేసిన వర్ణన అంతా కృష్ణావతార వర్ణనే. లోక రక్షై కారంభకు డాయన. లోక రక్ష ఎలా ఏర్పడుతుంది. అధర్మ విజృంభణా ధర్మ విప్లవమూ సాగినంత వరకూ అది సంభవం కాదు. అధర్మానికి ప్రతీక దానవులైతే ధర్మానికి ప్రహ్లాదాదులైన భాగవతులు. కనుక దానవోద్రే కస్తంభకుడై తద్వారా భక్త పాలన కళా సంరంభాన్ని చూపవలసిన వాడయ్యాడు. నిజాని కది సంరంభమే గాదు. ఆయన పాలిటి కది ఒకలీల. మన కోసం ప్రదర్శించే ఒక కళ. ఎందుకంటే అసలీ దుష్టులూ లేరు శిష్టులూ లేరు - ఆయన శిక్షించటానికీ - రక్షించటానికీ. అధర్మమూ లేదు - ధర్మమూలేదు- ఆయన లోకస్థితిని కాపాడటానికి. అంతా మిథ్యా - మాయ. ఇదంతా ఒక నాటకం. యత్రత్రిసర్గో మృషా అని మొదటనే ఘోషించింది భాగవతం. సృష్టే మృష అయినప్పు డాసృష్టిలోని దేవ, దానవ జాతులూ-వారి మంచి చెడ్డలూ - వాటి కోసం భగవదవతార సంరంభమూ ఇదంతా సత్య మెలా కాగలదు. అది మృష అయితే ఇది ఒక మిష అనే అనుకోవాలి మనం. అదే వ్యంగ్యంగా బయట పెడుతున్నాడు మహాకవి కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నానా కంజాత భవాండ కుంభకు డనే మాటలో. ఈ బ్రహ్మాండ భాండాలన్నీ ఆయన ఒక కుమ్మరి లాగా దండమూ, చక్రమూ, సూత్రమూ పెట్టుకొని సృష్టించలేదు. ఈ సృష్టి ఆయన దృగ్జాల సంభూతమట. దృగ్జాల మేమిటి. దృక్కే జాలం. దృక్కంటే దృష్టి. జాల మంటే మాయ- ఇంద్రజాల మనే మాటలో తెలుస్తుంది మనకు. జాల మంటే కేవలం మాయ. తన చైతన్య రూపమైన దృక్కును నిరంతరమూ ఆశ్రయించి ఉన్న ఏ మాయా

శక్తి ఉందో తద్వారా ఆవిర్భ వించిందీ సృష్టి అంతా. అంతే గాని వాస్తవం కాదిది. అద్వైతులు చెప్పే దృష్టి సృష్టి వాద మిది. తన సృష్టే ఇలా అయథార్థ మయినప్పుడు తాను జన్మించటం మాత్రమిక యథార్థ మెలా కాగలదు. కనుకనే నందాంగనకు డింభకుడుగా కనిపిస్తున్నా అది "మహాంతం విభు మాత్మాన" మన్నట్టు మహద్రూపమే విభూతే. అయినా అసత్యమైన ఈ సృష్టి సత్యంగా భాసించ జేస్తున్నాడు. అజాతుడైనా తానొక నంద యశోదలకు జన్మించినట్టు భాసిస్తూ వచ్చాడు. ఇదొక కేళి ఆయన పాలిటికి. ఆ కేళి లో లోలుడయి దాని ఫలితంగా ఇంత పెద్ద నాటకం మన కొక ఇంద్రజాలం లాగా చూపుతున్నాడు.

ఇదీ కృష్ణావ తార తత్త్వాన్ని గూర్చి మహాకవి అర్థం చేసుకొని మనకు చేసిన బోధ. మనం కూడా అలాగే అర్థం చేసుకోవాలా తత్త్వాన్ని. అసలు భాగవత ముద్దేశించింది కూడా అదే. "సర్వే వ్యంశ కలా విష్ణోః కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అని మొదటనే చాటుతున్నది భాగవతం. మిగతా మత్స్య కూర్మాదులన్నీ అంశ కళలే నట పరమాత్మకు. ఒక్క కృష్ణావతారమే పరిపూర్ణమైనది. ఇది విష్ణువుకు అంశ కాదు. సాక్షాద్విష్ణువే. ఆ హరి కృష్ణుండు బలాను జన్ము - డెడలే - దావిష్ణుడౌ నేర్పడన్. శుద్ధ సత్త్వోపాధి అయిన విష్ణు దేవుడే కృష్ణుడనే మరొక రూపంలో భాసిస్తున్నాడంత మాత్రమే. దీనికి ప్రబల మైన తార్కాణం మనకు భాగవతంలో ఒకచోట కనిపిస్తుంది. కృష్ణుడు కుశస్థలిలో ఉండగా ఒకనాడు ద్వారకలో హఠాత్తుగా ఒక బ్రాహ్మణుడు మృతుడైన తనశిశువును రాజ ద్వారం దగ్గర పెట్టి గట్టిగా విలపిస్తాడు. అప్పటి కది ఆయన భార్యకు తొమ్మిదవ కానుపు. పుట్టగానే ఎప్పటి కప్పుడు కాలుడా బిడ్డలను పొట్టన పెట్టు కొంటున్నాడట. రాజులు ధార్మికులయి సక్రమంగా దేశాన్ని పాలిస్తుంటే ఇలాంటి అత్యాహిత మెలా జరుగుతుంది-దీని కంతటికీ పాలకుడే కారణమని నిష్ఠురా లాడతాడా బ్రాహ్మణుడు. అప్పుడక్కడ సన్నిహితుడయి ఉన్న అర్జునుడా మాటలు విని

నేను వచ్చి ఆ శిశుహంతలను పట్టి శిక్షిస్తానని అభయ మిస్తాడు. బలరామ కృష్ణాది యాదవ వీరుల వల్లనే కాని నీ వల్ల కాదంటా డావిప్రుడు. వారిని మించిన బలపరాక్రమ శాలినని భీకరాలు పలుకుతా డర్జునుడు. ఇష్టం లేక పోయినా సరేనని చెప్పి వెంట బెట్టుకొని వెళ్లుతాడు బ్రాహ్మణుడు. శత విధాల పోరి కూడా అర్జునుడు తన ప్రయత్నంలో విఫలు డవుతాడు. ఆ బ్రాహ్మణు డతణ్ణి పడదిట్టి మరలా శ్రీకృష్ణుడి దగ్గరకి పరుగెత్తి కొనిపోయి మొరపెడితే ఆయన శైబ్యసుగ్రీవ మేఘ పుష్ప వలాహ కాలనే గుణ్ణాలను పూన్చిన రథ మెక్కి అర్జునుడితో సహా బయలు దేరి సప్త సముద్రాలూ సప్తకుల పర్వతాలూ దాటి అన్ని దిక్కులూ గడచిపోయి చివరకు క్షీర సాగరంలో ప్రవేశించి మహాంధ తమ సాన్ని ఛేదించుకొంటూ పోగా పోగా శేషశాయి అయిన ఆదినారాయణుడు దర్శనమిస్తాడు. "న నంద ఆత్మాన మనంత మచ్యుతో-విష్ణుశ్చ తద్దర్శన జాతసాధ్వసః" తన ఆత్మ స్వరూపుడే అయిన ఆ నారాయణమూర్తికి నమస్కరిస్తాడు కృష్ణుడు. ఆయన మందస్మితం చేస్తూ నరనారాయణులైన మిమ్ము ఒకసారి చూడాలని ఇక్కడి మహామునులు కోరితే విప్రబాలకుల నపహరించ వలసి వచ్చింది. అంతే గాని మరేమీ కాదని చెబుతూ వారికా బిడ్డల నందరినీ ఇచ్చి వీడ్కోలువుతాడు.

ఈ కథ ఒక్కటే చాలు మనకు శ్రీకృష్ణుడు సాక్షాత్తు నారాయణుడేనని చెప్పటానికి. మూల విరాట్టు దగ్గరికి మరలా పోయి రావటమనేది మరి ఏ అవతార చరిత్రలోనూ జరగ లేదు. రాముడు దేవేంద్రుని సందర్శనానికే నోచుకోలేక పోయాడు. మిగతా వారి సంగతి అసలు చెప్పనక్కరలేదు. ఒక్క కృష్ణావతారం లోనే ఇలాంటి మహిమలన్నీ. అందుకే తక్కిన అవతారాలన్నీ భగవదంశ లైతే ఇది భగవానుడే స్వయంగా. భగవచ్ఛబ్దం కృష్ణుడికి మాత్రమే వర్తిస్తుంది. భగవద్గీత అన్నారు. భాగవత మన్నారు. రెండుచోట్ల కృష్ణుడే ఆ భగవానుడు. ఆయన చెప్పిన మాట ఒకటైతే చేసిన చేష్ట మరొకటి. ఒకటి సిద్ధాంతం మరొకటి దాన్ని బలపరిచే దృష్టాంతం.

లోకానికీ రెండు విధాలా ఇచ్చాడాయన పరమ పురుషార్ధ సందేశం. భగవానుడు కనుకనే అలా చేయగలిగాడు. జ్ఞానైశ్వర్య బల వీర్య శక్తి తేజస్సులనే షడ్గుణాలకూ భగమని పేరు. భగోస్యాస్తీతి భగవాన్. అవి కలవాడే భగవానుడు. ఈషాడ్గుణ్య మాయన జననం దగ్గరి నుంచీ నిర్యాణం దాకానే. కాక నిర్యాణా నంతరం కూడా మనకవగత మవుతుంది.

కృష్ణ నిర్యాణంతో భాగవత మారంభ మవుతుంది. ఇది ఒక చమత్కారం. ఏదో యాదృచ్ఛికంగా దొరలింది కాదిది. సాభిప్రాయం గానే వర్ణించాడు మహర్షి. కృష్ణుడు బ్రతికి ఉన్నంత వరకూ లోకంలో ధర్మ ప్రతిష్ఠ అనేది ఎవరికీ అర్థం కాలేదు. పాండవులు తమ వల్లనే అంతా జరుగుతున్న దని భావించారు. యాదవు లంత కంటే, రాజర్షులు, బ్రహ్మర్షులూ అంతాకూడా తమ ప్రభావమే ననుకొని ఉండవచ్చు. ఇది మీరెవరి వల్లా కాదు మీరంతా నిమిత్త మాత్రం నేనుంటేనే మీరుసుమా అని అందరినీ మౌనంగా హెచ్చరించటానికే ఆయన మరణం. కృష్ణుడి ఈ మరణ వృత్తాంతం హరి వంశంలో కానరాదు. అది ఆయన విజయ పరంపరను వర్ణించటంతోనే ముగుస్తుంది. సత్యమేవ జయతే అని నిత్య సత్యమైన భగవత్తత్త్వాన్ని నిరూపించటమే దాని ఉద్దేశం. ఇక్కడ అలాకాదు. ఆయన మరణం కూడా ఒక ప్రబోధమే నని చెప్పటం ముని హృదయం. మరణానికి ముందే పోయారు యాదవులంతా. ఇంకా మృతశేషులు కొందరుంటే వారిని తానే హతమార్చాడు. మరణవార్త విన్నారో లేదో పాండవు లిక నిలవ లేక మహా ప్రస్థానానికి బయలు దేరారు. రాజ వంశాని కంతా పరీక్షిత్తొకడు మిగిలాడు. దేశమేలే బాధ్యత అంతా ఆయన మీదపడింది అయితే అప్పటికే కలియుగ మారంభ మవుతుంది. ఒకనాడు వేటకు వెళితే గో వృషభాల సంభాషణ వినిపించింది. అవి గో వృషభ రూపంలో దాగి ఉన్న ధరణీ ధర్మ దేవతలే. కృష్ణ భగవానుడు అస్తమించే సరికి లోకంలో సమస్త ధర్మాలూ – అస్తమించాయి గదా దీన్ని కాపాడే నాథుడే లేడా అని

వాపోతాయవి. ఆ తరువాతనే కలి పురుషుడు వాటిని తన్నటమూ పరీక్షిత్తు వాడి మీద చేయి చేసు కోవటమూ జరుగుతుంది.

ఏమిటీ ఉదంతంలోని ఆంతర్యం. ఇది ధర్మ భూదేవతల సంవాదం కాదు. తదప దేశంతో సాగిన పరమాత్మ మౌన సందేశం. ఎవరికా సందేశం. ఎవరు దేశాని కంతా పాలన భారం వహిస్తే వాడికి. వాడు ప్రస్తుతం పరీక్షిత్తే. "నా విష్ణుః పృథివీ పతిః" అన్నారు. విష్ణ్వంశ లేని వాడు ప్రజా పాలకుడు కాలేడు. సృష్టి, స్థితి, లయాలలో స్థితి కర్త విష్ణువు గదా. ఆ స్థితిని చూడ వలసిన వాడే క్షత్రియుడు కూడా. అది నేను లోకంలో అవతరించి చూడవలసి నంతగా చూచాను. నలుగురి చేతా చేయించాను. యుగాంతమై నేనిప్పుడు నిష్క్రమిస్తున్నాను. మరినాతో పాటు ధర్మంకూడా నిష్క్రమించ కుండా చూడవలసిన బాధ్యత మీ బోటి క్షత్రియుల మీద ఉన్నది. నేనున్నా లేకున్నా చూడాలి మీరు. అలా పరీక్షించి చూచే వాడవు గనుకనే నీ తండ్రి నుపేక్షించినా నేను గర్భంలోనే అంతరించ కుండా నిన్ను రక్షించాను. విష్ణురాతుడవైన నీవు విష్ణువు లాగా లోకస్థితి నెలా కాపాడ గలవో మరి - సకల ధర్మ నిర్మూలకమైన కలికాలం వచ్చి పడింది. దీని కేమిటి నీ సమాధాన మని పరీక్షిత్తుకు చేసిన పెద్ద హెచ్చరిక ఇది. అందుకే జన్మ వృత్తాంత మింకా ప్రస్తావన చేయక ముందే పురాణా రంభంలోనే కృష్ణ నిర్యాణ వార్త వినిపిస్తున్నాడు బాదరాయణుడు. ఈ విషమ మైన కలికాలంలో బ్రతికే రాజులేమిటి. ప్రజలేమిటి. ప్రతిఒక్కరికీ ప్రపంచ పరిస్థితులను జ్ఞాపకంచేస్తూ అందులో ఎవరి బాధ్యతలు వారెలా నిర్వర్తించాలో తద్ద్వారా విశ్వ ధర్మ ప్రతిష్ఠాపన కెలా సహకరించాలో చేసే బ్రహ్మాండమైన ప్రబోధ మిది. నిర్యాణా నంతరం పరమాత్మ చేస్తున్నా డిది మనకు మౌన భాషతో.

పోతే ఇక ఆయన జన్మ వృత్తాంత మెక్కడో దశమ స్కంధంలో గాని రాదు. నిర్యాణ మెంతో కృష్ణుడి జననం కూడా అంత పరమాద్భుతమైన విషయం. అక్కడకూడా ఆయన సాక్షాన్నారాయణతత్త్వం కొట్టవచ్చినట్టు

కనిపిస్తుంది. భూదేవి దుర్మార్గుల పాపభారం మోయలేనని బ్రహ్మతో పోయి మొరపెడితే ఆయన దేవతలతో సహా క్షీరసాగరానికి వెళ్లి నారాయణమూర్తికి వినకారు చేస్తే ఆకాశంలో ఆయన కొక వాణి వినిపిస్తుంది. అది విని బ్రహ్మ వారితో ఇలా అంటాడు.

వసుదేవ గృహే సాక్షా ద్భగవాన్ పురుషః పరః
జనిష్యతే- తత్ప్రాజార్థమ్ సంభవంతు సురస్త్రియః
వాసుదేవ కళా నంత స్సహస్ర వదనః స్వరాట్
అగ్రజో భవితా దేవో హరేః ప్రియ చికీర్షయా
విష్ణోర్మాయా భగవతీ యయా సమ్మోహితం జగత్
ఆ దిష్టా ప్రభుణా ంశేన కార్యార్థమ్ సంభ విష్యతి

సాక్షాత్తు భగవానుడే వసుదేవ గృహంలో జన్మిస్తాడు. ఆయన కళాంశమైన అనంతుడు బలరాముడుగా అవతరిస్తాడు. యోగ మాయ ఆయన కార్యం, నెరవేర్చటానికి యశోద కుదయిస్తుంది. దేవతా స్త్రీలంతా స్వామి వారి సేవకోసం భూమి మీద గోపికలుగా జన్మించ బోతారు.

తరువాత కొంత కాలానికి కంసుడికి ఆకాశవాణి హెచ్చరిక చేయటం- వాడు భయపడి దేవకిని వధించ బోవటం - వసుదేవుడి ఒప్పందంతో విరమించు కోవటం- జరుగుతుంది. అష్టమ గర్భం గదా తన వినాశానికి కారణ మని బరవసాతో వసుదేవుడు తెచ్చి ఇచ్చిన బిడ్డని గూడా వద్దని పంపుతాడు. కాని నారదుడు సందు చేసుకొని వచ్చి ఒకనాడతనితో వెట్టి వాడా వ్రేపల్లెలో ఉండే నందాది గోపకులూ - మధురలో ఉండే వృష్ణి వీరులూ అందరూ భగవత్కార్యార్థ మవతరించిన దేవతలే సుమా - నిన్నను సరించి ఉన్న జ్ఞాతులంతా అసురాంశలు - నీ వధ కోసమే విష్ణువు స్వయంగా దేవకికి జన్మించ బోతున్నాడు. ఆ దేవకీ వసుదేవులను నీవుపేక్షించ కుండా బంది ఖానాలో పడవేయమని చెప్పి

వెళ్లిపోతాడు. వాడికి వెంటనే ఒకటి జ్ఞప్తికి వస్తుంది. "ఆత్మాన మిహ సంజాతం జానన్ ప్రాగ్విష్ణునా హతం మహా సురం కాలనేమిమ్" ఇంతకు ముందు విష్ణువు చేత నిహతుడైన కాలనేమి అనే రాక్షసుణ్ణే నేనని గ్రహిస్తాడు వాడు. కాలనేమి అంటే కాల చక్రమే. అదే కంసా కారం. కంసమంటే గుండ్రని పాత్ర. అంటే చక్రమనే అర్థం. అది నిరంతర భ్రమణ శీలం. ధర్మా ధర్మాలు పరివర్తన చెందు తుంటాయి దానితో. తన్నిమిత్తంగా భగవంతు డవతరిస్తుంటాడు. కాబట్టి కాలనేమి-కంసుడనే పేర్లు కూడా సాభిప్రాయమే.

చూడబోతే ఇదంతా ముందుగానే పరమాత్మ వేసిన పథకంగా కనిపిస్తుంది. లేకుంటే నారదుడు రావట మేమిటి- ఈ దేవ రహస్యాలన్నీ వాడికి చెప్పట మేమిటి - మరలా దేవకీ వసుదేవులను జైలులో పెట్టించట మేమిటి. అంతా భగవల్లీల. భగవాను డొకనాడు వైకుంఠంలో కూచొని తన యోగ మాయ నిలా ఆజ్ఞాపిస్తాడు.

దేవక్యా జఠరే గర్భమ్ శేషాఖ్యం ధామ మామకం
తత్సన్ని కృష్య రోహిణ్యా ఉదరే సన్ని వేశయ

నా అంశ ఒకటి శేషాఖ్య మైనది దేవకి సప్తమ గర్భంగా ఏర్పడుతుంది. దానిని నీవు సంకర్షణ చేసి నందగోవ్రజంలో తలదాచు కొంటున్న రోహిణి గర్భంలో ప్రవేశ పెట్టు. "అథాహ మంశ భాగేన దేవక్యాః పుత్రతామ్ శుభే ప్రాప్స్యామి - నేను మిగతా అంశతో దేవకికి అష్టమ గర్భంగా అవతరిస్తాను- త్వం యశో దాయాం నంద పత్న్యాం భవిష్యసి- నీవు మాత్రం యశోదకు బిడ్డగా జన్మిస్తావు. నిన్ను లోకులు

దుర్గేతి భద్ర కాళీతి - విజయా వైష్ణ వీతిచ
కుముదా చండికా కృష్ణా-మాధవీ కన్యకేతిచ
మాయా నారాయణీ౽ శానా
శారదేత్యం బికేతిచ భజి ష్యంతి

ఈ ఈ సంజ్ఞలతో నిత్యమూ పూజిస్తూ పోతారు.

ఇక్కడ రెండు రహస్యాలు మనం గ్రహించ వలసి ఉంది. దేవకి అష్టమ గర్భమే కంస వధకు కారణం. అంత వరకూ కంసుడికి భయం లేదు. దాని కోసం ప్రతీక్షిస్తున్నాడు వాడు. ఆరు గర్భాల నప్పటికే హాత మార్చాడు. ఇక ఏడవ దాని కోసం చూస్తుండగా అది యోగ మాయ మూలంగా దేవకి నుంచి రోహిణికి రవాణా అయి పోయింది. ఇది తెలియక లోకులంతా ఆవిడ గర్భం దిగజారి పోయిందనుకొంటే కంసుడు కూడా అలాగే అనుకున్నాడు. ఇక వచ్చేది భగవదవ తారమే కదా అని వెయ్యి కళ్ళతో చూస్తుంటే తరువాత అది కూడా తారుమారవుతుంది. ఆ విజ్జోడు పడిన బిడ్డనే చూచి వాడష్టమ గర్భ మదే నని భ్రమించి విఫల ప్రయత్ను డవుతాడు. ఇదే వైష్ణవ మాయ. ఇంత కన్నా పెద్ద మాయ ఏమంటే రోహిణికి గర్భమెలా వచ్చిందో ఎవరికీ అంతు పట్టక పోవటం. వసు దేవుడికి దూరంగా ఎక్కడో నంద గోకులంలో ఉన్న రోహిణి గర్భం తాల్చుట మేమిటి. లోకులను మానించక పోవట మేమిటి. దానికి కూడా ఈ యెగ మాయాప్రభావమే సమాధానం. ఎక్కడి కక్కడ భగవన్మాయ పని చేస్తూనే ఉందని భాగవతమే మనకు సమాధాన మిస్తున్నది. యుక్త వయసు వచ్చిన తరువాత దేవకీ వసు దేవుల నొకసారి చూడటాడికి వెళ్లివారు తన మాహాత్మ్యాన్ని ప్రశంసించ బోతే వారెక్కడ తాను దేవుడని భావిస్తారో అని "మాభూదితి నిజామ్ మాయామ్ తతాన జన మోహినీమ్" సకల జన సమ్మోహిని అయిన తన మాయ వారి మీద ప్రయెగించా డట. దానితో వారు మామూలు కుర్ర వాడేనని భావించి మురిసి పోయారట. ఇదుగో ఇలాంటి సమ్మోహినీ మంత్రాన్నే వ్రేపల్లె లోని ప్రజల మీద కూడా ప్రయోగించి ఉంటాడు పరమాత్మ. అసలు యోగ మాయ జరిపిన కార్య మన్నప్పుడే అది మాయామయం. అది ఈ లోకుల లౌకిక ప్రజ్ఞ కంతు చిక్కే వ్యవహారం కాదు. కనుకనే రోహిణీ గర్భ వృత్తాం తాన్ని మామూలు విషయం గానే భావించారు గాని ఎవరు గాని ఇది ఎలాగబ్బా అని లేశ మాత్రం కూడా అవిడ శీలాన్ని శంకించిన వారు కారు.

ఇది ఒకటి రహస్యం. ఇది అయిన తరువాత మరొక రహస్య మేమంటే కాళి- భద్ర-కామేశ్వరి-దుర్గ-అంబిక అని యోగ మాయ కెప్పుడు పేర్లు పెట్టారో అప్పుడా విడ విష్ణు మాయే గాక శివ మాయ కూడా అనుకో వలసి వస్తుంది. దుర్గ-అంబిక-కాళి అన్నప్పుడు అవి పార్వతీ పర్యాయాలే గదా. పార్వతి శివ శక్తి. అవిడ విష్ణు శక్తి ఎలా అయింది. దీనిని బట్టే చెప్పవచ్చు మనం శివ కేశవులకు భేదం లేదని.

శివాయ విష్ణు రూపాయ - శివ రూపాయ విష్ణవే
యథా శివ మయో విష్ణు - రేవం విష్ణు మయ శ్శివః

అంతేకాదు. "యథాంతరం నపశ్యామి - తథామే స్వస్తి రాయుషి" వారిరువురికీ అంతరం చూడరా దంటున్నది వేద వాక్యం. ఇలా శివ కేశవు లిరువురూ ఒక్కటే తత్త్వం గనుకనే వారి శక్తులు కూడా భిన్నం కావు. అవీ ఒక్కటే. అందుకే యోగ మాయకు వైష్ణవ నామాలు శైవ నామాలూ రెండూ చెల్లుబడి అయినాయి.దుర్గ కాళి అంబిక ఇత్యాదులు శైవ నామాలైతే- వైష్ణవి- నారాయణి-కృష్ణా-మాధవి-ఇలాంటి వన్నీ వైష్ణవ సంజ్ఞలు. ఒకే శక్తి కలిగిన ఒకే ఒక తత్త్వం గనుకనే బాలకృష్ణుని లోనే శివమూర్తి దర్శించ గలిగాడు మహాకవి పోతన. ఆ మాయా శక్తే ప్రస్తుతం కృష్ణ సహోదరిగా జన్మించటం మూలాన్నే పరమ భాగవతు లావిడను "సరసి జనాభ సోదరీ" అని కూడా సంబోధించి గానం చేశారు. తుదకు శివ పార్వతుల నామం కలలో కూడా స్మరించటాని కిష్ట పడని వైష్ణవోత్తములు కూడా వైష్ణవ దుర్గ అని ఒక కొత్త పేరు పెట్టి ఆ పరాశక్తిని తమ వైష్ణవాలయాల్లో ప్రతిష్ఠించి ఆరాధిస్తూ వచ్చారంటే ఇంత కన్నా ఉభయ మత సామరస్యానికి నిదర్శన మేముంది.

అసలా మాటకు వస్తే ఈ శక్తి ఎవరో గాదు. సాక్షాత్తూ గాయత్రీ మంత్రాధి దేవత. మంత్రార్థ మంతా ఆవిడ వ్యవహారం లోనే మనకు స్పష్టంగా బోధ పడుతుంది. సవిత యొక్క వరేణ్య మైన తేజస్సది. సవిత అంటే ప్రపంచ సృష్టికీ తన అవతార సృష్టికీ కర్త అయిన పరమేశ్వరుడే. జ్ఞానాత్మిక

కాబట్టి ఆయన శక్తి తేజో రూపిణి-జీవుల శక్తి లాగా తమోరూపిణి గాదు. మన బోటి జీవు లంతా అజ్ఞాన తిమిరాంధులు కాబట్టి వీరి శక్తి కూడా తమోరూపిణే. తమో రూపిణి గనుకనే ఇది మనకు వరణీయ కాదు. వరణీయ ఎప్పటి కైనా తేజో రూపిణి అయిన పరమాత్మ శక్తే. అదే భర్గ మంటే.. దాని నెప్పుడో ఏ జన్మలోనో కోలు పోయాము మనం. మరలా దాన్ని పొందే ప్రయత్నం సాగించాలి. అందుకోసం నిరంతరం దాన్ని భక్తి తాత్పర్యాలతో ధ్యానించటం తప్ప మరొక మార్గం లేదు. అలా ధ్యానిస్తే అది మరలా మన బుద్ధులనీ తమస్సు నుంచి తప్పించి ఆ తేజస్సు వైపుకే తీసుకెళ్లు తుంది. సందేహం లేదు. ఈ గాయత్రీ రహస్యమంతా ప్రస్తుత మీ యోగ మాయ అవిర్భ వించటం లోనూ అంతర్ధానం చెందటం లోనూ గుప్తమయి ఉంది. పరమాత్మ అవతరించ టానికి ముందే అవతరించిం దాయన తేజో రూపిణి అయిన ఈ మాయ. అయన రాకను ముందుగా సూచించింది లోకానికి. దేవకీ గర్భాన్ని సంకర్షణ చేసిరోహిణీ గర్భంలో ప్రవేశ పెట్టటం జీవుణ్ణి ప్రాపంచిక మైన స్థాయి నుంచి పారమార్థిక మైన భూమికకు ప్రచోదన చేయటమే. అది నిత్యమూ మన దగ్గరే ఉన్నా దాని ప్రభావాన్ని మన అజ్ఞాన వశాత్తు గుర్తించలేము. దీనికి చిహ్నామే యశోదా నందాదు లకు దాని అస్తిత్వాన్ని గురించి స్మృతి లేక పోవటం. పోతే చూచి కూడా తెలుసుకోలేని మూఢులు కొందరుంటారు. కంసుడి లాంటి వాళ్లు. వాళ్లకదిఎప్పుడూ చిక్కదు. అతీతంగా విహరిస్తుంటుంది. ప్రచోదయంతీ పవనే ద్విజాతా అన్నట్టు అంతరిక్షంలోనే సంచరిస్తుంటుందా గాయత్రి. అష్ట భూజాలతో కనపడటం గాయత్రీ లక్షణమే. తుద కావిడ మహత్త్వాన్ని తెలుసు కొని నిత్యమూ భక్తి శ్రద్ధలతో జపించే వారికి సర్వ కామ ప్రదాత్రి అని వర్ణించటంలో కూడా "ఆయుః పృధివ్యాం ద్రవిణం బ్రహ్మ వర్చసమ్ దత్వా" అనే మంత్రో పాసకుల శుభ కామన మనకు బాగా వ్యక్త మవుతుంది.

ఈ విధంగా ఈ యోగమాయా వృత్తాంతం గాయత్రీ వృత్తాంతానికి అద్దం పట్టినట్టుగా కనిపిస్తున్నది. భాగవతారంభంలో మనమొక మాట చెప్పుకొన్నాము. వృత్రాసుర వధ-గాయత్రీ మంత్రార్థవివరణ ఎక్కడ వర్ణించ బడతాయో అది భాగవతమని. రెండింటి విషయమూ మొదటి రెండు శ్లోకాల లోనే భంగ్యం తరంగా స్ఫురింపజేశారని కూడా పేర్కొన్నాము. అందులో వృత్రాసుర వధ వృత్తాంతం భాగవత మారవ స్కంధంలో సూటిగానే వర్ణించ బడింది. పోతే రెండవ దైన గాయత్రీ వృత్తాంతమలా సూటిగా ఎక్కడా వర్ణించినట్టు కనిపించదు భాగవతంలో. ఇదుగో ఇక్కడ మనకది భాగవతం ఈ యోగ మాయా వ్యాజంతో చాటుగా నిర్దేశిస్తున్నది. నన్ను విరోధం చేసుకొని ప్రయోజనం లేదు. నిజంగా నీకు పరమాత్మ తత్త్వం గ్రహించాలని కోరికే ఉంటే నన్నవలంబనంగా చేసుకో - పరమాత్మ ఎక్కడ ఉన్నాడో నివేదిస్తాను. అలా కాక దూరం చేసుకొన్నావంటే నాకూ పరమాత్మకూ కూడా దూరమవుతావని కంసుడు నెపంగా మన బోటి జిజ్ఞాసు లోకానికంతా చేసే నిగూఢ ప్రబోధమిది.

మొత్తం మీద యోగమాయ హెచ్చరించినట్టుగానే జరిగింది కృష్ణజన్మ. కంసుడి కేమాత్రమూ అంతుపట్టలేదు. అష్టమ గర్భమని తెలియక కాదు. కంసుడికి. తెలిసి కూడా ఆ అష్టమ మైన గర్భం కృష్ణుడుగా గాక యోగమాయగా దర్శన మిచ్చింది వాడి దృష్టికి. అంతే మరి. రాజస తామస మైన దృష్టితో చూస్తే భగవత్తత్త్వ మెలా గోచరిస్తుంది. దానికి మారుగా తదాభాస అయిన మాయే మనకు గోచరమయ్యేది. అలాగే గోచరమయింది కంసుడికి. మాయ కనపించి మరలా మాయమయింది. పోతే తదా ధారమైన అసలు పదార్థమెక్కడ ఉన్నట్టు. అది ఆ పాటికే దేవకికి జన్మించనూ జన్మించింది. రాత్రికి రాత్రి యశోద వద్దకు చేరనూ చేరింది. అసలది జన్మ అయితే గదా. జన్మ అనుకొంటే జన్మ. కాకుంటే కాదు. నవమాసాలూ దేవకీ దేవి మోసింది ఖాయం. నవమాసాలూ నిండి శిశువు జన్మించిందీ

నిజం. కాని పుట్టాడో లేదో వెంటనే పెరిగి పెద్ద వాడైన ప్రౌఢ వయస్కుడి లాగా కనిపించాడు తల్లిదండ్రులకు. అది కూడా ఎలాంటి రూపంలో కనిపించాడు వారికి.

తమ ద్భుతమ్ బాలక మంబు జేక్షణం
చతుర్భుజం శంఖ గదా ద్యు దాయుధమ్
శ్రీ వత్స లక్ష్మం గళశోభి కౌస్తు భం
పీతాంబరం సాంద్ర పయోద సౌభగం

మహార్హ వైడూర్య కిరీట కుండల - త్విషా పరిష్వక్త సహస్రకుంతలమ్
ఉద్ధామ కాంచ్యంగద కంకణాదిభి - ర్విరోచ మానమ్ వసుదేవ ఐక్షత

ఇలాంటి వాణ్ణి దర్శించాడట వసుదేవుడు. అలోక సాధారణమైన ఈ అద్భుత వేషాన్ని వర్ణించటంలోనే తెలుస్తూంది మనకది సాక్షాత్తూ నారాయణ మూర్తేనని. కనుకనే అది చూడగానే వసుదేవుడు "విది తోసి భవాన్ సాక్షాత్పురుషః ప్రకృతేః పరః " అని ఆ మూర్తిని పరమ పురుషుడు గానే గుర్తించి కీర్తిస్తాడు. తల్లి దేవకి కూడా స్తుతిస్తుంది. అసలంతకు ముందు గర్భంలో ఉండగానే వచ్చి బ్రహ్మేం ద్రాది దేవతలంతా గర్భస్థు డైన స్వామినే ఎన్నో విధాలుగా స్తోత్రం చేసి పోతారు. ఇదంతా కృష్ణుడు సాక్షాత్తూ నారాయణడే నని చెప్పకుండానే చెబుతున్నది లోకానికి.

దేవకీ వసుదేవుల స్తోత్ర పాఠ మంతా విని స్వామి దేవకిని చూచి నీవు పూర్వ జన్మలో పృశ్నివి. ఇతడు సుతపుడనే ప్రజాపతి. ప్రజా సర్గం చేయమని మిమ్ములను బ్రహ్మ ఆదేశిస్తే మీరు ద్వాదశ దివ్యవర్ష సహస్రాలు నన్ను గూర్చి తపస్సు చేశారు. నేను ప్రత్యక్షమై వరం కోరమంటే నాలాంటి కొడుకు కావాలని కోరుకొన్నారు. జగన్మోహిని అయిన నామాయ పనిచేసి మీరు అపవర్గం కోరలేక పోయారు. దాని ఫలితంగా నేను మీకు మొదటి జన్మలో పృశ్ని గర్భుడనే పేర జన్మించాను. రెండవ జన్మలో అదితి కశ్యపులైన

Yalamanchili Srinivasa Rao
www.advaitavedanta.in

మీకు నేను వామనుడుగా అవతరించాను. ఇప్పుడు దేవకీ వసుదేవులైన మీకు నేను మూడవ జన్మలో ఈ రూపంతో ఆవిర్భవించాను. మీకీ జన్మాంతర స్మృతి కలగటానికే నేనీ అప్రాకృత మైన రూపం మీకు చూపవలసి వచ్చింది. మీరిక మీదట నన్ను పుత్ర భావంతోనూ, బ్రహ్మభావంతోనూ చూస్తూ తరించండి- అని బోధిస్తాడు. చూడండి. భగవ దుప దేశం ఇక్కడి నుంచే ఆరంభ మయింది. "వేదాహం సమ తీతాని" అన్న భగవ దుక్తి కిది నిదర్శనం. అతీతా నాగతవర్త మానాలు తెలిసిన వాడే సర్వజ్ఞుడు. వాడే భగవంతుడు. పైగా సంసారంలో ఉంటూనే గృహస్థులు తరించే ఉపాయం కూడా సెలవిచ్చాడు. పుత్ర మిత్ర కళ త్రాదుల నందరినీ తత్త్వద్విశేష రూపాలుగా కాక బ్రహ్మ రూపంగా దర్శించటమే ముక్తికి త్రోవ - అది నిరూపించ టానికే తాను జన్మించట మని కూడా చెప్పినట్టయింది.

తరువాత జరగ వలసిన పనులు కూడా వసుదేవుడికి అప్పగించి వారు చూస్తుండ గానే పసిబిడ్డ లాగా మారిపోతాడు. ఆయన ఆదేశించినట్టే కారాగృహ ద్వారాలు తెరుచు కొంటాయి. సుదుస్తర అయిన యమున కూడా దారి ఇస్తుంది. యోగ మయావశీ కృతులై దౌవారికులూ పౌరులు అంతా గాఢ నిద్రలో మునిగి ఉంటారు.

ద్వారస్తు సర్వాః పిహితా దుర త్యయా
బృహ త్కవాటా యసశృంఖలైః కిల

వసుదేవుడు బయటికి రాగానే ద్వారాలన్నీ యథా పూర్వంగా మూసుకొంటాయి. "శేషో న్వగా ద్వారి నివారయన్ ఫణైః" శిశువుకు శీతవాతాది దోషాలు తగల కుండా ఆదిశేషుడు ఫణా మండలం విప్పి గొడుగు పడతాడట. ఇదంతా భగవదను భావ విశేషం గాక మరేమిటి. మరే అవతారంలో ఇలాంటి సంరంభం చూడగలం. వసుదేవు డెప్పుడా యశోద వద్ద బాలుణ్ణి దించిందీ- ఆవిడ నుంచి మాయా కన్య నెప్పుడు

కొని తెచ్చిందీ ఇక్కడా అక్కడా ఎవరికీ అంతు పట్టలేదు. రాత్రికిరాత్రి అంతా జరిగి పోయింది. తెల్లవారు జామున బిడ్డ ఏడుపు విని ఉలికి పడి లేస్తారు కావలి వారు. అంతకు ముందేడవని బిడ్డ బొట్టు పెట్టినట్టప్పుడే ఏడవటం దేనికి. కంసుడికి వార్త తెలియట మెలా మరి. అందుకే ఆ ఏడుపు. అంత పనీ జరిగింది. కావలి వారు పోయి చెప్పటమూ కంసుడు రావటమూ క్షణాల మీద జరిగి పోయింది. అల్లుడు గాడిది మేనగోడలు-నీకు భయం లేదని చెల్లెలెంత మొత్తు కొంటున్నా లెక్కచేయక ఆవిడ చేతిలో నుంచి లాక్కొని పై కెగరేశాడు బిడ్డను. క్రింద కత్తి పట్టాడు దానికి సూటిగా నేల మీద. అది బిడ్డ అయితే గదా క్రింద పడటానికి. భగవ్మాయ అయె. "అదృశ్య తాను జావిష్ణో స్సాయుధాష్ట మహా భుజా దివ్యస్రగంబరా - ధనుశ్శూ లేష చర్మాసి శంఖ చక్ర గదా ధరా" అష్ట భుజాలతో ధనుశ్చక్రాది దివ్యాయుధాలతో సాక్షాత్కరిస్తుంది- అంతరిక్షంలో. సరిగా ఇది ముక్తా విద్రు మహేమ నీల ధవళ చ్ఛాయైర్ముఖైః అని వర్ణించిన గాయత్రీ మంత్రాధి దేవతే మరేదీ గాదు. "కిమ్మయా హతయా మంద" ఒరే నన్ను చంపి ఏమి ప్రయోజనంరా మూఢుడా, "జాతః ఖలు తవాంత కృత్" నిన్ను చంపే మహానుభావుడొక డీపాటికే జన్మించి ఉన్నాడు. తెలుసుకో అని కంసుణ్ణి హెచ్చరించి మాయ మవుతుంది. చూడండి. జన్మించాడని చెబుతుంది గాని ఎక్కడ జన్మించాడో ఎవడో చెప్పదు. ఇదే మాయ అంటే. తెలిసీ తెలియనిదే మాయ. అసలు తెలియక పోలే దిప్పుడు కంసుడికి - కొంత తెలిసిందా మాటల వల్ల. కాని పూర్తిగా తెలియలేదు. వాడికి మనోవ్యథ అయింది. అది ఛేదించే వరకూ వాడికిక నిద్రా హారాలు లేవు. ఇదే మనగతి కూడా. మృత్యు రహస్యాన్ని ఛేదించే దాకా మనకూ మథన తప్పదు.

అయితే చిత్ర మేమంటే తనకు మృత్యు వుందని తెలియక తానే మృత్యువు నని భ్రమపడ్డాడు కంసుడు. కాలనేమి గదా కంసుడు. కాలనేమి కాలచక్రమే. కాలమే చక్రా కారంగా తిరుగుతూ ప్రాణులందరినీ పొట్టన

పెట్టు కొంటున్నది. అదే కంసుడు చేసిన పని. కనపడ్డ బిడ్డలనందరినీ వధించమని ఆజ్ఞాపించటమదే. తిరుగులేని తన ఆయుధాన్ని భగవంతుడి మీద కూడా చివరకు ప్రయోగింప చూచాడు. ఇదే తెలివి తక్కువ. కాలాతీతమైన తత్త్వాన్ని కాలమేమి చేయగలదు. అయినా తన ప్రయత్నం మానదది. గిర్రుమని తిరుగుతూ తిరుగుతూ ఎప్పుడూ ఏదో ఒకటి భయంకరమైన అనర్థం మనమీద విసురుతూనే పోతుంది. కంసుడు కూడా విసిరాడలాటి ఉపద్రవాలు. ఆ విసురులే పూతనా శకట తృణా వర్తాదులు, పూతన వచ్చి చేతన కోలు పోయింది. తృణా వర్తుడు గాలి కెగిరి పోయాడు. శకటాసురుడు నడుములువిరిగి నేల కొరిగాడు. బకాసురా ఘాసురులు గతా సువులయ్యారు. వృషభాసురుడు నోరు తెరచి బావురుమన్నాడు. జితకాశి అయిన కేశి దానవుడు హతకాశి అయిపోయాడు. వ్యోమాసు రుడి ప్రాణాలు వ్యోమ మార్గాని కెగిరి పొయాయి. ఇలా కాలనేమి తనపై విసిరిన అసుర శక్తులన్నింటినీ కాల గర్భం లోనే కలిపి వేశాడు పరమాత్మ. ఆ కాలం ధరించిన మరొక రూపమే కాళియుడు. అది ఒక సర్పం. కాలసర్పం. కాలమే సర్ప రూపంగా దాగి ఉంది. ఎక్కడ కాళింది మడుగులో. మడుగు కాదది సంసార మనే మహా హ్రదమే. ఇందులో తెలియక పడ్డ ఎవరినైనా కాల మనేది అంత మొందించేదే. అయితే సర్వమూ తెలిసిన పరమాత్మ నది ఏమి చేయ గలదు. అప్పటికీ అవివేకంతో చుట్టుకొన్నది. సహస్ర ఫణాలు విప్పి విషం గ్రక్కింది. కాని విషాని క విషయమైన తత్త్వమని తెలియదు దానికి. వెంటనే మేను పెంచాడు కృష్ణుడు. పాదాలు పైకెత్తాడు. నర్తన క్రియ కుపక్రమించాడు. అయోఘ నాలవంటి ఆ పాదాల అవఘాతాని కది నుగ్గు నూచమయింది. ఇలా కాల కళలన్నిటినీ శిక్షించి చివరకు కాలాన్నే శిక్షించ దలచాడు భగవానుడు. దాని మొదటి పరివారం చాణూర ముష్టికులు. ఒకటి ఊరు బలం. మరొకటి ముష్టి బలం. కామ క్రోధాలే ఇవి. మొదటిది కామానికైతే రెండవది క్రోధానికి సంకేతం. ఈ ద్వంద్వాలను

జయిస్తే రెండవ పరివార మొకటున్నది. కువల యాపీడం. కువలయ మంటే భూవలయం. భూవలయాన్నంతా ఎలా పడితే అలా పీడించేది. కుత్సితంగా వలయం అంటే చుట్టి చుట్టు కొంటూ పోయేది. అదే అన్ని అనర్థాలకూ మూలమైన ఆవిద్యా పిశాచి. పెంజీకటి లాటి నల్లని రూపం దానిది. వచ్చి మీద పడటమే తప్ప మరేమీ తెలియదు దానికి, పట్టి పాలార్చాడు దాన్ని కృష్ణ పరమాత్మ. పోతే ఇక మూడవది ఆఖరిది ఒక్కటే. అదే కాలచక్రం. కంసుడి రూపంలో ఎదట కనిపిస్తున్న దది. అంత వరకూ మారు లేక మసలుతున్నది. ఒక్క దెబ్బతో దాన్ని జుట్టు పట్టి తమగంమీది నుంచి క్రింది కీడ్చి అంత మొందించాడు కృష్ణుడు. అంటే కాలానికే కాలుడయ్యా డన్నమాట. కాలోస్మి లోక క్షయకృత్ప్రవృద్ధః- అని గదా భగవద్వాక్యం.

ఇలా దుష్టులనే గాదు భగవానుడు. శిష్టులను కూడా ఒక విధంగా శిక్షిస్తూ వచ్చాడు. శిక్షించట మంటే ఇక్కడ దండించటం కాదు. బోధించటం కావచ్చు. అనుగ్రహించటం కావచ్చు. కృష్ణుడు మన్ను దిన్నాడని పిల్లలంతా వచ్చి సాడీలు చెప్పారు తల్లి యశోదకు. అన్నా మన్నేల మరి పదార్థము లేదే అని తల్లి మందలించింది. అమ్మా మన్ను దినంగ నేశిశువునో ఆకొంటినో వెట్టినో అంటాడు కుమారుడు. నిజమే. ఆయన శిశువు కాదు. ఆకలి దప్పులున్న వాడూ కాదు. జీవుల లాగా వెట్టివాడూ కాదు. సర్వజ్ఞు డైన భగవానుడు వెట్టి వాడెలా అవుతాడు. ఆకలి దప్పు లేమిటాయనకు. అయితే ఎందుకు తిన్నాడు మన్ను. యశోద కోసమే. తింటే గాని పిల్లలు వెళ్ళి చెప్పరు. చెబితే గాని ఆవిడ పిలిచి చీవాట్లు పెట్టదు. పెడితే చెబుదా మను కొన్నాడు. ఏమిటి. "కాదేనిస్ మదీయాస్య గంధ మ్మాఘ్రాణము చేసి నా వచనముల్ తప్పైన" దండించమని. అంటూనే నోరు తెరిచాడు. ఏముంది ఆనోటిలో. మన్నూకాదు మశాస్యమూ కాదు. జలధి పర్వత వన భూగోళ శిఖితరణి శశి దిక్పాలాది కరండమైన బ్రహ్మాండం కనిపించింది. అది కలో వైష్ణవ మాయో తెలియక ఉన్నట్టుండి జ్ఞానోదయమై "ఏ మతితిమి

గాని ఈతడీశుడు మాకున్" అని అర్భకుని ఈశ్వరత్వాన్ని గ్రహిస్తుందా తల్లి ఇలా సుకుమారంగా యశోదకు బోధిస్తాడు తన మహత్త్వాన్ని. మరొక మారు తల్లి తన అల్లరి భరించలేక ఉలూఖలానికి కట్టి పడవేస్తే దాన్ని ఈడ్చుకుంటూ రెండు మద్ది చెట్లనుంచి ప్రాకిపోతాడు. అవి రెండూ విరిగిపడి నలకూబరమణి గ్రీవులనే గంధర్వుల రూపంలో కనిపించి ఆయనకు నమస్కరించి వెళ్లిపోతారు. శాపగ్రస్తులైన దేవతల నానెపంగా అనుగ్రహిస్తాడు పరమాత్మ.

పోతే బ్రహ్మేంద్రాది దేవతలనూ నారదాది మహర్షులను కూడా ఎంతో సౌమ్యంగా శిక్షిస్తాడు పరమాత్మ. అఘాసురుడి బారి నుండి గోగోప బాలురను కాపాడ గలిగాడతని మహత్త్వ మెట్టిదో పరీక్షించి చూడాలని బ్రహ్మ ఎవరికీ తెలియకుండా వచ్చి వారందరినీ తీసుకుపోయి రహస్యంగా ఎక్కడో దాచాడు. తరువాత కృష్ణుడు వెతికి చూస్తే ఎక్కడా కనిపించలేదు. అదంతా విధి, వంచన అని తెలుసుకొని కృష్ణుడు "ఉభ యాయిత మాత్మానమ్ చక్రే విశ్వ దృగీ శ్వరః" విశ్వ రహస్యమంతా ఎఱిగిన ప్రోఢ కాబట్టి గోగోపకుల ఉభయ రూపాలూ తానే తన మాయా బలంతో ధరించి ఎవరికీ ఏ మాత్రమూ అనుమానం తగలకుండా సంచరిస్తూ వచ్చాడు. ఈ రీతిగా ఒక సంవత్సర కాలం గడచి పోయింది.

ఏవమ్ విమోహయన్ విష్ణుమ్ విమోహం విశ్వ మోహనం
స్వయైన మాయ యాఽజోపి స్వయ మేవ విమో హితః

విశ్వ మోహనుడైన పరమాత్మనే మోహితుణ్ణి కావింప బోయి తానే తదీయ మాయ చేత మోహితు డయ్యాడు పితామహుడు.

ఉత్థాయోత్థాయ కృష్ణస్య చిరస్య పదయోః పతన్-
ఆస్తే మహత్త్వం ప్రాగ్దృష్టం - స్మృత్వా స్మృత్వా పునః పునః

వెంటనే వచ్చి కాళ్ల మీద పడి అంతకు ముందు యుగాంత కాలంలో తాను చూచిన భగవద్విభూతి నంతా జ్ఞాపకం చేసుకొని పునః ప్రణామం

చేసి క్షమాపణ చెప్పుకొని వెళ్లిపోతాడు. ఏమిటీ సన్నివేశం. ఏమి చెబుతుంది మనకు. బ్రహ్మకు తాను సకల జగత్కర్త నని అహంకారమున్నది. తానే విష్ణు నాభి కమలం నుంచి సృష్టి అయిన వాడు తన కన్నా సృష్టి కర్త లేడని అహంకరించట మేమిటి. నీ సృష్టి ఎంత నీవెంత నేనిచ్చినదే గదా నీకా శక్తి - నీతో సహా ఈ చరా చర జగత్తునంతా సృష్టించిన వాడను నేను - కావలసి వస్తే చూడు నా మహిమఅని తన అఘటన ఘటనా పటీయసి అయిన ఐశ్వర్య శక్తిని తార్కాణచేయట మిది. దీనితో చతుర్ముఖుడికి సహజంగా ఉన్న రజోమాలిన్యం పోయి సత్త్వగుణ మలవడాలని కూడా ఇది ఒక ప్రబోధమే.

పోతే దేవేంద్రుడి దింకా రాజసమైన ప్రవృత్తి. బ్రహ్మకు సృష్టికర్తననే అభిమాన ముంటే ఇతడికి సృష్టి అయిన ఈ త్రిలోకాలనూ పాలించే అధికారంనాదే గదా అనే దురభిమాన ముంది. దానిని కూడా వదలించాలను కొన్నాడు భగవానుడు. నందాదులు ఏటేటా చేసే ఇంద్రోత్సవం అక్కర లేదని వారించాడు. "తస్మాద్గవాం బ్రాహ్మణానా- మద్రేశ్చా రభ్య తామ్ మఘః" దాని బదులు గోవులకు బ్రాహ్మణులకూ గోవర్ధనాద్రికీ ఉత్సవం జరపమని బోధించాడు. "ఏతన్మ మమతం తాతక్రియ తాం యది రోచతే-" ఇది నా అభిప్రాయం- మీ కిష్టమైతే చేయండి అని చెబుతాడు. సరేనని వారాయన చెప్పినట్టుగానే చేస్తారు. ఇంద్రుడి కెక్కడలేని ఆగ్రహం వచ్చి ఆగ మేఘాలుగా వర్షం కురిపిస్తాడు. వవృషుర్జల శర్కరాః- ఏక ధారగా శిలా వర్షం కురుస్తాయి మేఘాలు. దానికి భయకంపితులైన వ్రజనివాసి ప్రజల నందరినీ చూచి కృష్ణుడు గోవర్ధనాద్రిని ఒంటి వ్రేలితో పైకెత్తి

బాలుండీతడు కొండ దొడ్డది మహా భారంబు సైరింపగా
జాలం డోయని దీని క్రింద నిలువన్ శంకింపగా బోకు-డీ
శైలాం భోనిధి జంతు సంయుత ధరా చక్రంబుపై ఁబడ్డనా
కేలల్లాడదు బంధు లార నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్

అని ఆహ్వానిస్తాడు. వెంటనే వారంతా దాని క్రింద తల దాచుకొని ఆ జల ప్రళయాన్ని దాటి సుఖిస్తారు. అది చూచి విస్మితుడైన దేవేంద్రుడు "నిస్తంభో భ్రష్ట సంకల్పః స్వయం మేఘాన వారయత్" గర్వ భంగం చెంది మేఘ మండలాన్ని ఉపసంహరించి వెళ్లుతాడు. దేవగణాలన్నీ ఆకాశం నుంచి స్తోత్ర పాఠాలు చేస్తూ స్వామి వారి మీద పుష్ప వర్షం కురిపిస్తారు. దీనిని బట్టి గ్రహించవలసిన సత్యమేమంటే సృష్టించటానికి గాని రక్షించటానికి గాని సకల శక్తి సంపన్నుడైన పరమాత్మకు తప్ప మరెవ్వరికీ ఆ అధికారం లేదు. ఇంద్రాది దేవతలు ఆయా అధికారాలలో ఉన్నా వారి అధికారాలు పరిమితమే. అది తెలిసి మెలగితే వారు వివేక వంతులు. లేకుంటే వారికైనా గర్వభంగం కాక తప్పదు. తమ కార్యం కోసమే పరమాత్మ అవతరించాడని తెలిసి దేవకీ గర్భంలో ఉండగానే వచ్చి ఆయనను స్తుతించిన వారయి కూడా బ్రహ్మాదు లహంక రించా రంటే అది ఎంతటి అవివేకమో గదా. అలాంటి అహంకారం మానవులకెలా పనికి రాదో దేవతలకూ పనికి రాదు. కేనో పనిషత్తులో ఇలాంటిదే ఒక అఖ్యాయిక వస్తుంది. పరమాత్మ అనుగ్రహం వల్ల కలిగిన విజయం తను విజయంగా భావించి గర్వించారు దేవేంద్రాదులు. అప్పుడు వారి కంతు పట్టని ఒక అద్భుతా కారం సాక్షాత్క రించి అగ్నివాయ్వాది దేవతలకు గర్వభంగంచేసి వారికికనువిప్పుకలిగిస్తుంది. అలాంటి నేత్రో న్మీలనమే ఇక్కడా జరిగింది బ్రహ్మాదుల విషయంలో.

పోతే నారదాది మహర్షులను కూడా పట్టి చూస్తాడు భగవానుడు. పదహారు వేల రాజ కన్యలతో ఎలా విహరిస్తాడో ఆయన వైభవాన్ని పరీక్షించి చూడాలనే కుతూహలంతో బయలుదేరి పోతాడు నారదుడు ద్వారకా నగరానికి. వెళ్లి చూస్తే ఒక్కొక్క చోట ఒక్కొక్కతీరులో సాక్షాత్కరిస్తాడు శ్రీకృష్ణుడు. "తత్రాప్యా చష్ట గోవిందం - లాల యంతం శిశూన్ సుతాన్" ఒకచోట పిల్లల నాడిస్తుంటాడు. తతోన్యస్మిన్ గృహేఽ పశ్య న్మజ్జనాయ కృతోద్యమమ్ - ఒకచోట స్నానానికి లేవబోతుంటాడు. క్వాపి సంధ్యా

ముపాసీనమ్ జపంతం బ్రహ్మ వాగ్యతం - ఒకచోట గాయత్రి జపిస్తూ సంధ్యా వందనం చేస్తుంటాడు. "మంత్ర యంతంచ కస్మింశ్చి న్మంత్రి భిశ్చోద్ధ వాదిభిః" మరొక చోట ఉద్ధ వాదులైన మంత్రులతో మంత్రాంగం నడుపు తుంటాడు. ఇలా ఒకటని లేదు. ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క కృష్ణ విగ్రహం సాక్షాత్కరించి మతి పోతుంది నారదుడికి. పైగా ఆయన కెదురు వచ్చి భగవానుడు తాముపూర్ణ కాములై అపూర్ణ కాముడనైన నన్ను దర్శింప వచ్చారా అని ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నలోనే ఉన్నదెంతో మర్మం. పూర్ణకాముడు పరమాత్మ. ఆయన కుండ గూడదిక ఏ కోరికా. అయినా అన్నీ అనుభవిస్తూ కనిపిస్తున్నాడు తాను. అపూర్ణ కాముడు నారదుడు. అయినా పూర్ణ కాముడి లాగా పైకి కనపడుతున్నాడు. పై కలా కనపడుతున్నా కుతూహలం ఎక్కడికి పోతుంది. కనుకనే పూర్ణ కాముడైన పరమాత్మనే పరీక్షించాలని వచ్చాడు. ఎంత గంభీరమైన మాటో ఇది.

ఇలా శిష్టులను కూడా శిక్షిస్తూ వచ్చాడు భగవానుడు. అది వారి కప్పుడప్పుడు కలిగే అహంకారాన్ని, అభిమానాన్ని, చాపల్యాన్ని పోగొట్టి పరిశుద్ధమైన సత్త్వ గుణాన్ని వారికి ప్రసాదించి తత్త్వ ప్రబోధం చేయటమే తప్ప మరేదీగాదు. అందులో కూడా ఒక చమత్కార ముంది. సహజంగా పామర స్వభావులైన వారి కందరికీ అలౌకికమైన మహిమలు ప్రదర్శిస్తాడు. మరి వివేక విజ్ఞాన వంతులైన పెద్దలకు అలాంటి లీలలేవీ ప్రదర్శించ కుండా మామూలు గానే వ్యవహరిస్తాడు. యశోదాదులకు విశ్వరూపాది లీలలు చూపటమూ- భీష్మ విదురాదులు కవి ఏమీ చూపక సహజంగా కనిపించటమూ - గమనిస్తే తెలుస్తుంది. అది ఒక లీలా భేదం. తెలిసిన వారికి నిదర్శన మక్కర లేదు. తెలియని వారికే కావాలది. ఏదో అలౌకిక మైన దృశ్యం చూపితే గాని వారికి విశ్వాస మేర్పడదు. అందుకే ఈ ప్రదర్శన. ఒకప్పుడు తెలిసిన వారు కూడ వ్యామోహంలో పడవచ్చు. అప్పుడు వారికి మరలా జ్ఞానో దయం కలిగించటానికి కూడా పనికి వస్తుందీ ప్రదర్శన.

మరొకప్పుడు తన కన్నీ తెలిసి కూడా ఏమీ తెలియనట్టు కేవల మానవ మాత్రుడుగా వ్యవహరించడం కూడా కద్దు. అది కూడా ఒక లీలా భేదమే. మన కెంత శక్తి సామర్థ్యాలున్నా ప్రయోజనం లేదు. అది ఫలించటానికి కూడా ఇక కాల మంటూ ఉంది. ఏది ఎప్పుడెలా జరగాలో దాని కెవరు నిమిత్తం కావాలో అది విశ్వనియామకమైన ఒకానొక శక్తి వల్లనే ఏర్పడుతుందా ప్రణాళిక. ఎంతవాడైనా దాని ననుసరించి పోవలసిందే నని మాటలతో గాక చేతల ద్వారా తన జీవితానికే అన్వయించి లోకులకు చూపట మెంత చమత్కారం. లేకుంటే జరాసంధుణ్ణి తాను వధించలేని వాడా. అతడు తరుముతూ పోతే ఇరువది మార్లు పరుగెత్తి పోవటమేమిటి. అందుకోస మన్ని వైపులా ద్వారాలూ కవాటాలూ గల ఒక పట్టణాన్ని నిర్మించుకొని కాపుర ముండట మేమిటి. అది ఒక నటన. కాలాంతరంలో భీముడి చేత చంపించి పాండవులకా ప్రతిష్ఠ దక్కించాలనే ఈ ఉపేక్ష. కాలయవనుడనే రాక్షసు డిరువది ఒక్కదినాలు తన కోట ముందు పాగా వేశాడు తాను బయటికి వస్తే పట్టుకోవాలని, వాడి ధాటికి భయపడినట్టుగా లోపల దాగి ఉండి సమయం రాగానే మెల్లగా అడుగులో అడుగు వేసుకొంటూ కోట దాటి వెళ్లి పోతుంటాడు. వాడు గమనించి వెంటబడి తరిమితే వాణ్ణి ఎలయించుకొంటూ పోయి ఒక కొండ గుహలోకి జొరబడుతాడు. వాడూ జొరబడి చూడబోతే ఎక్కడా ఐవులేదు. ఇంతలో వాడి ఎదుట ఒక ఆజానుబాహుడైన పురుషుడు పడుకొని గురకపెట్టి నిద్ర పోతుండటం చూస్తాడు. వాడే కృష్ణుడనుకొని కాలితో తన్నుతాడు. అతడెవడో కాదు. ముచికుందుడు. కోపంతో అతడు కండ్లు తెరచి చూడగానే వీడు నిలువునా భస్మమై నేల రాలుతాడు. ఏమిటీ సన్నివేశం. కాలయవనుడు వాడు. కాలం తీరితే గాని చావడు. తీరిందప్పటికి. దానికి నిమిత్తమయ్యాడు తన భక్తుడు ముచికుందుడు.

మరొక కథ శమంత కోపాఖ్యానం. సూర్యోపాసన చేసి సత్రాజిత్తు సంపాదించిందా శమంతకం. అపురూప మైనదే గాక అది ఎన్నో బారువుల బంగారాన్ని ప్రసవిస్తుంది ప్రతిదినమూ. దానిని వద్దంటున్నా మెడలో ధరించి సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు వేటకు పోతాడు. అడవిలో వేటాడుతుంటే ఒక సింహం వచ్చి వాణ్ణి వధిస్తుంది. దాన్ని వధించి భల్లూక రాజు జాంబవంతు డామణి తీసుకొని తన నివాసానికి పోయి కూతురు జాంబవతి కిస్తాడు. ఇది ఇలా జరిగిందని తెలియక సత్రాజిత్తు కృష్ణుడే తన తమ్ముని చంపి మణి నపహరించాడని వుకారు పుట్టిస్తాడు. అది పాపుకోటానికి కృష్ణుడు స్వయంగా అడవికిపోయి జాంబవంతుని అడుగు జాడలను బట్టి అతని గుహలో ప్రవేశించి అతనితో యుద్ధం చేసి ఓడిస్తాడు. జాంబవంతు డాయన తన ఇష్టదైవమేనని గ్రహించి కన్యారత్నాన్నీ రత్నాన్నీ ఇచ్చి పంపుతాడు. అది తెచ్చి సత్రాజిత్తు కిస్తే అతడు సిగ్గుపడి క్షమాపణ చెప్పుకొని తానూ తన కన్యనూ శమంతకాన్నీ రెండింటినీ అప్పగించి స బహుమానంగా సాగనంపుతాడు. చూడండి ఎలాంటి మనోహరమైన సన్నివేశమో ఇది. ఎంతవారికైనా అపవాదు తప్పదని-మన మింత వారం కదా అని తామసించక నెమ్మదిగా దాన్ని తొలగించుకొనే యత్నం చేయాలని చేస్తే వచ్చిన అపవాదు పోవటమేగాక అనేక విధాల లోకుల మెప్పు కూడా పడయవచ్చుననీ ఎంత గొప్ప సందేశమో ఉంది. ఇలా మానవోచితంగా ప్రవర్తించటంలో కూడా తన దివ్య సందేశంతో లోకుల ఉద్ధరణకే బద్ధకంకణు డవుతాడు పరమాత్మ.

ఇంతకన్నా అతీతమైన దివ్యసందేశ మందించా డాయన గోపికలతో చేసిన విహారంలో. దీనిలో ఎంత దివ్యత్వముందో దానికి భిన్నంగా అంత దుర్విమర్శకు గురి అయింది లోకంలో. ఇది భాగవతం-భగవంతుడి చరిత్ర అని కూడా చూడకుండా ఎవరికి తోచినట్టు వారు చాలా తేలికగా మాటాడుతున్నారు. మరి నాస్తికులనూ హేతువాదులనైతే అసలు మనం

పట్టనేలేము. ఇంత గాలి దుమారం దీనిమీద లేచినట్లు మరి దేని మీదా లేవలేదు. సకల కల్యాణ గుణ సంపన్నుడూ సర్వలోకాదర్శ భూతుడూ అయిన భగవంతు డేమిటి-పర స్త్రీ లోలుడయి అహోరాత్రాలూ వారితో యధేచ్ఛగా క్రీడించటమేమిటి. అది మనమెంతో పవిత్రమైన కథా వస్తువుగా కనుల కద్దుకోవట మేమిటని వీరి ఆక్షేపణ. ఆ మాటకు వస్తే ఈ ఆక్షేపణ ఇప్పుడీ రోజుల్లో మనబోటి పాఠకులంగాదు. భాగవత కథాశ్రవణం చేస్తున్న పరమభాగవతుడు పరీక్షిత్తే లేవనెత్తాడు.దానికి సమాధానమిస్తూ శుకమహర్షి,

"నృణాంనిశ్శ్రేయసార్థాయ-వ్యక్తిర్భగవతో భువి
అవ్యయస్యా ప్రమేయస్య-నిర్గుణస్య గుణాత్మనః
నచైవమ్ విస్మయః కార్యో భవతా భగవత్యజే-

నీ విందులో అశ్చర్యపడ నక్కరలేదు. అగణుడయి కూడా భగవాసుడు సగుణుడుగా భావిస్తున్నాడంటే అది మన బోటి జీవులనను గ్రహింటానికే. యోగేశ్వరేశ్వరుడాయన. ఏదిచేసినా అయనకు దాని గుణదోషాలేవీ అంటవు.

అసలిది నీవుగాదు. కృష్ణుడే వేశాడీ ప్రశ్న గోపికలను. "ప్రతియాత వ్రజమ్ నేహ స్థేయం స్త్రీ భిస్సు మధ్యమాః" మీరిక్కడ ఉండరాదు. వెళ్లిపొండి. మాతరః పితరః పుత్త్రాభాతరః పతయశ్చవః మీకు తల్లీ దండ్రీ భర్తా బిడ్డలూ-ఉన్నారు గదా. "భర్తృ శుశ్రూషణం స్త్రీణాం పరో ధర్మో హ్యామాయయా-" భర్త పరిచర్యే కుల స్త్రీలకు సనాతనమైన ధర్మం. "దుశ్శీలో దుర్భ గోవృద్ధో-" ఏలాటి వాడైనా సరే. కట్టుకొన్న నాథుణ్ణి కాదనరాదు. "జుగుప్సితం చ సర్వత్రహ్యౌప పత్యం కులస్త్రీయః" కులస్త్రీ అయిన దానికి మిండటీక మనేది మహాపాతకం. అని మందలిస్తే కర్ణ కఠోరమైన ఆ మాటలు విని గోపికలు

"మైవం విభోర్హతి భవాన్ గదితుమ్ నృ శంసం
సంత్యజ్య సర్వ విషయాం స్తవ పాద మూలం
భక్తా - భజస్వ దురవ గ్రహ - మా త్యజాస్మాన్-
దేవో యధాది పురుషో భజతో ముముక్షూన్-

స్వామీ మీరిలాంటి మాటలనకండి-మేము వినలేము. ప్రాపంచికమైన సర్వ విషయాలూ పరిత్యజించి మీ పాదమూలాన్ని సేవించటానికి వచ్చాము. మీరు మమ్మల్నువిడిచి పెట్టకండి. అది పురుషుడు తన్నా శ్రయించిన ముముక్షువులను రక్షించినట్టు మమ్మురక్షించండి. “పతులన్ బిడ్డల బంధులన్ సతులకున్ పాటించుటే ధర్మ పద్ధతి యౌ నంటివి దేహ ధారిణులకున్ ధర్మజ్ఞ చింతింపుమా పతి పుత్త్రాదిక నామమూర్తివగుచున్ భాసిల్లునీయందు-త తృతి పుత్త్రాదిక వాంఛలం జలిపి సంభావించు ట న్యాయమే-” అని జవాబిస్తారు. అప్పుడు యోగీశ్వరేశ్వరుడైన కృష్ణు డాత్మా రాముండై వారలతో రమించాడట.

ఈ ప్రశ్నోత్తరాలను మనం బాగా పరిశీలించి చూస్తే భాగవత హృదయమేదో చక్కగా తేట పడుతుంది. అసలీ ప్రశ్నలూ లేవు. ఉత్తరాలూ లేవు. ఇది భాగవత కథలో వేసినవి కావు. కథ వినే మనలాటి పాఠకులు వేసే ప్రశ్నలివి. మన బోటి వారికి పురాణ ఋషి ఇచ్చుకొనే సమాధానాలవి. ఋషి అంటే క్రాంత దర్శి అని గదా చెప్పాము. క్రాంతదర్శి గనుకనే భూత భవిష్య ద్వర్తమానాలలో ఏకాలంలో మానవుడి కెలాంటిసంశయం రావచ్చునో ముందుగా ఉహించి తానే సమాధానమిస్తాడు. అలాగైతేనే దాని మీద మానవులకు విశ్వాస మేర్పడుతుంది. పరిపూర్ణమైన విశ్వాసం కుదిరితేనేగాని సాధన మార్గంలో పయనించలేడు మానవుడు. కనుకనే ఆయా కథా సన్నివేశాలు కల్పించి మనకు కలిగే అశంకలన్నింటినీ పరిహరిస్తూ పోతాడు మహర్షి. ఇక్కడ జరిగిన పరిహారమేమిటని అడగవచ్చు. గోపికలు కృష్ణుడని మనం బాహ్యార్థం తీసుకొని బాధ పడుతున్నాము. అంతర్యాన్ని పరిశీలిస్తేఅసలు గోపికలూలేరు. కృష్ణుడూలేడు. పురాణ కథలన్నీ సంకేతాలనే విషయం మనం మరచిపోరాదు. సత్యాని కల్లుకొన్న సంకేతమే కథ. సత్య మేమిటిక్కడ. గోపికా కృష్ణులంటే జీవేశ్వరులు. వారి రాస క్రీడాదులు జీవేశ్వరుల తాదాత్మ్యమే. గోపికా విరహ మనేది ఈశ్వర సాయుజ్యం కోసం



Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

జీవుడు పడే వేదన. మరి కృష్ణుడు వారిని నిష్ఠూరంగా మటాడటం ఉన్నట్టుండి తిరోహితుడయి పోవటం మరలా సాక్షాత్కరించటం-ఇవన్నీ జీవుల కీశ్వరుడు పెట్టే పరీక్షలే. దానికి తట్టుకొని నిలిచామన్నప్పుడే వారికా ఈశ్వరానుగ్రహ లాభం. ఈ రహస్య భావమే శుకుడి మటలలో చివరనిలా చాటుతాడు మహర్షి. "గోప జనములందు గోపికలందును - సకల జంతు లందు సంచరించు నా మహాత్మునకు - పరాంగన లెవ్వరు - సర్వమయుడుగాన సలిపె లీల-" ఇది అన్నిటికీ కలిపి ఇచ్చే సమాధనం.

మొదటి నుంచీ శ్రీ కృష్ణ లీలలన్నీ ఈ ఆధ్యాత్మిక రహస్య భావనతోనే సాగుతూ వచ్చాయి. వాటి నలాగే సమర్థిస్తూ వచ్చాడు పురాణ ముని. గోపికా వస్త్రాపహరణ మేమిటి లేకుంటే. సర్వేశ్వరుడు చేశాడు కాబట్టి సరిపోయింది గాని మరొకడైతే అది ఒక రౌడీ చేష్ట అనవలసిందే గదా. తన సర్వేశ్వరత్వాన్ని వారికి తెలపటానికే చేశాడా పని కృష్ణుడు. కృష్ణుడంటే కర్షించేవాడు-లాగి వేశే వాడని అర్థం. ఏమిటా లాగవలసింది. మానవుల కున్న దేహాత్మా భిమానం. అది ఉన్నంత వరకూ మనం గోపికలమే. "గోపాయితు మిచ్ఛతీతి గోపికా" అని శబ్దవ్యుత్పత్తి. తన్ను దాచుకోవాలని ప్రయత్నించటమే గోపనం. అలా గోపనం చేసుకొనేది గోపిక. అంటే దేహాభిమాన మున్న జీవుడు. వాడికీ దేహమే ఆత్మ అనే భావ ముంది. కనుక దానికి బాహ్యమైన దంతా వాడికి వ్యతిరిక్తమే. వ్యతిరిక్త మెప్పుడయిందో అప్పుడది తన్ను చూస్తుందేమో నని భయం. "యావద్ధి భయ మధ్యస్థో ఉ నిత్య మాత్మానమ్ మన్యతే- తావద్గో పాయితు మిచ్ఛత్యా త్మానమ్-" ఎంతదాకా ఈ అనిత్యమైన అత్మనే చూస్తూ భయ మధ్యస్థుడై ఉంటాడో అంత దాకా తన రూపాన్ని కప్పి పుచ్చు కోవాలనే చూస్తాడు జీవుడు. "యదాతు నిత్య మద్వైత మాత్మానమ్ విజానాతి-" నిత్యమైన అద్వయాత్మ స్వరూపాన్ని ఎప్పు డర్థం చేసుకొంటాడో "తదాకః కిమ్ కుతోవా గోపాయితు మిచ్ఛేత్"-అప్పుడెవడు దేన్ని దేనినుంచి దాచుకోవాలని

కోరుతాడు. అని ఈ ఆధ్యాత్మిక భావాన్ని అద్భుతంగా వివరించారు భగవత్పాదులు.

ఇదుగో గోపికల వ్యవహారం కూడా ఇదే. వారి వస్త్రాల నపహరించాడు కృష్ణు డంటే అవి వస్త్రాలు కావు. వారి దేహాత్మా భిమానాలే. అవే వస్త్రాల మాదిరి వారిని కప్పి ఉన్నాయి. దానితో వారు తాము వేరు పరమాత్మ వేరనే భావంతో ఆయా దేవతల పూజలూ, వ్రతాలూ చేసి ఏదో సాధిద్దామని యత్నిస్తున్నారు. అది వృథా ప్రయాస - దానిలో సిద్ధిలేదని తెలపటానికే వస్త్రాప కర్షణం చేశాడు కృష్ణుడు. వారు బయటికి వచ్చి ప్రాధేయ పడితే గాని ఇవ్వనంటాడు. అంటే దేహాభిమానం వదులు కొని సర్వమూ నేననే అద్వై తాత్మ భావంతో చూచినప్పుడే ఇస్తాను-అప్పుడీ వస్త్రాలు ధరించినా వాటితో తాదాత్మ్య ముండదు కాబట్టి ఫరవా లేదని భావం. కనుకనే వారు రావటానికి సంకోచిస్తుంటే కృష్ణుడు వారిని చూచి అనే వాక్యాలు వినండి- ఎలాంటి అర్థమిస్తున్నవో.

"శృంగార వతులార సిగ్గేల మిము గూడి పిన్న నాటను గోలె పెరిగినాడ-
ఎఱుగనే మీలోన నెప్పుడు నుండుదు-నేనెఱుంగని మర్మ మేమి గలదు"

పైకి చూస్తే ఇది పరమ బూతు. కాని లోతుకు దిగి చూస్తే అంతా తాత్త్విక రహస్యమే. "ఈశ్వర స్సర్వ భూతానా" మన్నట్టు అందరి హృదయాలలోనూ ఉన్నదా తత్త్వం. అది పుట్టినప్పటి నుంచీ మనలో చోటు చేసుకొనే ఉంది. నిజంలో దానికి తెలియని మర్మం మనలో ఏ మున్నదని. ఇక అది మన స్వరూపాన్ని చూచిందని సిగ్గు పడటమెందుకు. మన స్వరూపమే అది గదా - ఎంత వేదాం తార్థమో చూడండి.

ఈ గోపికలు నగ్నంగా జలకా లాడటమూ - గట్టున వారి చీర లుండటమూ అవి కృష్ణుడెత్తుకొని పోవటమూ - ఈ సన్నివేశం ఒక ప్రతి బింబమైతే దీనికి బింబ భూతమైన సన్నివేశం మనకు భాగవతా రంభం లోనే కనిపిస్తుంది. శుక మహర్షి ముందు పోతుంటే వ్యాసుడతని వెంట



Brahmasri Vallabhaneni Srinivasa Rao www.advaitavedanta.in

బడి పోతున్నపు డప్సరసలు దారిలో ఒక సరోవరంలో ఇలాగే జలక మాడుతుంటారు. నీళ్ల మీద నగ్నంగా ఈదుతున్నారో తేలుతున్నారో శుకుడు పట్టించుకో లేదు. అటు చూడను కూడాలే దా యోగీశ్వరుడు. అదే వ్యాసుడటు బయలు దేరి వచ్చే సరికి వారు హడావుడిగా వచ్చి వస్త్రాలు ధరిస్తారు. వ్యాసుడది తన కవమానంగా భావించి అడిగితే వారాయన కిచ్చిన సమాధాన మేమిటి. మనకు తెలుసును గదా. సరిగా అలాంటిదే ఇక్కడ కూడా సమాధానం. యోగేశ్వరుడైన శుకుణ్ణి చూచే అప్సరసలు భయపడ కుంటే యోగేశ్వరు డైన కృష్ణుణ్ణి చూచి మాత్రం భయపడటం దేనికి గోపికలు. ఈ గోపికలా అప్సరసలే గదా వాస్తవంలో. వారే గదా ఈ రూపాలతో జన్మించారు భగవత్కైంకర్యం కోసమని.

అంచేత గోపికా వస్త్రాప హరణమూ కాదు. వారితో రాసక్రీడాదులూ కావవి. జీవుల అభిమాన ధనాన్ని అపహరించటమే వస్త్రాపహరణం. విశుద్ధ సత్త్వులైన జీవులకు తన సాయుజ్యాన్ని ప్రసాదించటమే రాసక్రీడ. "రసోవైసః –" రస స్వరూపుడు పరమాత్మ. జీవుడూ రస స్వరూపుడే. వారి అన్యోన్యాత్మ భావమే రాసక్రీడ. ఇది గోపిక లెప్పుడో గ్రహించా రీరహస్యాన్ని. గోపికలు గ్రహించారో లేదో గాని పోతన దాని నెంతగానో శోధించి పట్టుకొని మన కొక పద్యంలో బయట పెట్టాడు. ఉన్నట్టుండి అంతర్హితుడైన కృష్ణుడెటు వెళ్లాడో ఎక్కడ దాగాడో దిక్కు తెలియక ఓపికలు కోలుపోయిన గోపిక లీచెట్టు ఆ పుట్టా పట్టుకొని మొర పెట్టే పద్యమిది.

"నల్లని వాడు - పద్మ నయనంబుల వాడు - కృపా రసంబు పైఁ
జల్లెడు వాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు - నవ్వు రా
జిల్లెడు మోము వా డొకడు - చెల్వల మాన ధనంబు దెచ్చె - నో
మల్లియలార! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే."

ఇది ఒక దొంగను వర్ణిస్తున్నదో పరమాత్మను వర్ణిస్తున్నదో ఏమైనదీ తెలియని చాలా చిత్రమైన పద్యం. నల్లని వాడన్నప్పుడు దొంగే వాడు. దొంగ మొగం

నలుపని కూడా అంటారు లోకులు. కాకపోయినా నల్లని ముసుగు వేసుకొని తిరుగుతాడు గదా దొంగ. రాత్రి అంతా మేలుకొని ఉంటాడు కాబట్టి వాడి నయనాలు పద్మాల లాగాగే ఎఱ్ఱబారి ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఎవరైనా మేలుకొంటే ప్రమాదమని వారు మత్తుగా పడి పోవటానికి ఏదో రస చూర్ణం వారి పైన చల్లటం కూడా సహజమే. అంతే గాక గారడీ వాడి లాగా ఒక నెమలి పింఛం కూడా కళ్ల మీద అటూ ఇటూ తిప్పి కనుకట్టు చేసే దొంగలు కూడా కొందరుంటారు. మరి దొంగతికం చేసి కూడా ఏమీ చేయనట్టు తెల్లవారి నలుగురిలో నవ్వు మొగం పెట్టి నిర్భయంగా తిరిగినా ఆశ్చర్యం లేదు. లేదా దొంగిలించిన ధనం ఎక్కడో దాచి ఏ పొద మాటున్నో దాక్కొని కూచున్నా కూచోవచ్చు. పైగా ఒకడట వాడు. ఒకడంటే ఎవడో ఒకడు. వాడు ఫలానా అని గుర్తించలేని వ్యక్తి. దొంగ మనకు నేను ఫలానా అని చెప్పి చేస్తాడా దొంగతనం. ఎప్పుడూ వాడు మన కంతు పట్టని వాడే. ఇవన్నీ దొంగ లక్షణాలే. ఒకటి కూడా దొర లక్షణాలు లేవిందులో. అందుకే తమ ధనం యావత్తూ కోల్పోయిన ఆ యువతులు బాధ పడుతున్నారు. మీరైనా చూచి ఉంటే వాడి జాడ తెలిపి మమ్మల్ను కాపాడమని ఓ మల్లియలార అని వాపోతున్నారు.

ఇది గోపికల వాపోవటం కాదు. భగవత్తత్త్వాన్వేషణ పరాయణుడైన ఒక సాధకుడి ఆక్రందన. ఆధ్యాత్మికమైన భావాన్ని అధి భౌతికమైన భూమికలో మరుగు పరచి చెప్పాడు మహాకవి. అది ఛేదించ గలిగితే దొంగ లక్షణాలుగా భాసించే వన్నీ నిజంలో దొర లక్షణాలే ననిపిస్తాయి. కాకపోయినా దొంగ ఎవడో గాదు. కృష్ణుడే గదా. గోపికల దృష్టిలో ఆయన దొరేగాని దొంగ కాదు. కృష్ణుడంటే నల్లని వాడే మరి. నీల మేఘ శ్యాముడు గదా. పద్మ నయనంబుల వాడు. కమలాక్షుడు పుండరీకాక్షు డని గదా ప్రసిద్ధి. మరి శిరసు పైన మయూర పింఛమూ ఆ ముఖంలో మందహాసమూ

- అశ్రితుల మీద దయా రసాన్ని చిందించటమూ- కృష్ణుడికి సహజ లక్షణాలే. చెల్వల మాన ధనాన్ని చూఱలాడటమూ వారి నేడిపించటానికి మాయమై పోవడమూ కూడా సహజమే ఆ రసికా వతంసుడికి.

పోతే ఇది కూడా కాదు కవి వివక్షితం. ఈ కృష్ణ వర్ణనలో కూడా దాగి ఉన్న ధ్వనిస్తున్న ఒకానొక పరతత్త్వ భావన. అదీ మనం పరిశోధించి పట్టుకోవలసిన ఆధ్యాత్మిక రహస్యం. ఏమిటది. నల్లని వాడు. గగనం లాగా నల్లని దాతత్త్వం. గగనం దూరానికి నల్లగానే కనిపిస్తుంది. కాని దగ్గరకి వెళ్లి చూస్తే ఆ నలు పక్కడ లేదు. అది ఒక దృగ్భ్రమ. వస్తువులో లేని గుణం మన దృష్టి ఆరోపిస్తున్నది. అలాగే పరమాత్మకు వాస్తవంగా ఏ గుణమూలేదు. ఏ రూపమూ లేదు. ఆయననొక కృష్ణుడని రాముడని మన మూహిస్తున్నా మొక రూపంలో. మరి పద్మ నయనంబుల వాడు. నిర్గుణుడైనా నిరాకారుడైనా ఆయన తన మాయా శక్తి చేత ఈ సృష్టి నంతా తయారుచేసి దీన్నిలా నడుపుతున్నాడు. నయన మంటే నడపటమే. పద్మాలీ బ్రహ్మాండ భాండాలు. మండ లాకారంగా ఉన్నాయివి. అది మధ్యాంతాలు మూడూ ఒక్కటే. వేటి కవి తానే. తన స్వరూపమే అది. పైపైన మన కందని సీమలో ఉండే ఆ రసాన్ని మన పైన చల్లుతున్నాడు. మన కందిస్తున్నాడు. అయితే మన మందుకో లేక పోతున్నాము. కారణం మౌళి పరిసర్పిత పింఛము వాడు. ఆయన మౌళి గాదిది మన మౌళి. మన బుద్ధుల చుట్టూ తిప్పు తున్నాడు తన మయూర పింఛాన్ని. అది రంగు రంగుల పింఛం. "అజామేకామ్ లోహిత శుక్ల కృష్ణామ్" త్రివర్ణాలంటే త్రిగుణాలే. త్రిగుణాత్మిక అయిన మాయే అది. అది త్రిప్పితే తిరుగుతున్నాయి మన బుద్ధులు. ఈ పరిభ్రమించే బుద్ధుల కా శుద్ధ బుద్ధ ముక్త స్వభావమైన తత్త్వ మెలా బోధ పడుతుంది, అందుకే నవ్వురా జిల్లెడు మోము వాడు. అది మీ స్వరూపమై కూడా మీరు గ్రహించలేక పోయారే- పైగా ఎక్కడో దూరంగా దాగి ఉందని వెతుకుతున్నారే ఏమిటి మీ అవివేక మని పరిహసించట మది. అదేమిటి

పరమాత్మ ఈ జీవాత్మ ఎలా అవుతాడని అడిగితే సమాధాన మిస్తున్నా డొకడు అని. ఒకే ఒక చైతన్య మయినప్పుడది ఇక జీవుడేమిటి దేవుడేమిటి. జీవేశ్వరు లనేది మన భ్రాంతి. ఈ భ్రాంతికి మూలం మన దగ్గరే ఉంది. అది మాన ధనం. దేహాత్మాభిమాన మని అర్థం. అది ఒక ధనం లాగా దాచుకొని ఉన్నాము మనం జీవితాంతమూ. అందుకే మనం గోపికలం. అది మనం వదులుకో నంత దనుకా ఆ తత్త్వ మిక్కడే ఉన్నా ఎక్కడో దాగి ఉన్నట్టే మన కదృశ్యం. అది మరలా దృశ్యం కావాలంటే ఈ సృష్టిలో కనిపించే ప్రతి పదార్థాలన్నీ అడుగుతూ పోవాలి మానవుడు. అడిగితే ఈ నామ రూపాత్మక మైన పదార్థాలన్నీ వాడి సృష్టే కాబట్టి ఫలానా అని వాడి స్వరూపాన్ని మనకు మౌన భాషలో సూచిస్తాయి. అయితే ఈ భాషను భేదించి తెలుసుకో గలిగి ఉండా లాతత్త్వ రహస్యాన్ని. లేకుంటే అది అక్కడే ఉన్నా మనకు తెర మరుగే.

చూడండి. ఎంత గంభీరమైన భావమో. పైకి అధి భౌతికంగా కనిపిస్తున్నా లోపల ఆధ్యాత్మికమైన తత్త్వమెలా ప్రవహిస్తున్నదో. ఇంకా చమత్కార మేమంటే మహాకవి కలం నుంచి ఇలాంటి పద్యమే మరొకటి వెలువడింది. పద జాలంతో సహా ఎత్తుగడతో సహా ఇలాగే నడుస్తుంది చలా వరకది. ఇది కృష్ణ వర్ణన అయితే అది రామ వర్ణన. రామ కృష్ణుల కుండే తేడా తెలిసే లాగా సాగిన వర్ణన అది. నల్లనివాడు పద్మ నయనంబుల వాడు. రాముడూ నల్లని వాడే. పద్మ నయనముల వాడే. నల్లని వాడంటే రూపంలోనే కాదు. గుణంలో కూడా. నల్ల అంటే మంచి అని కూడా అర్థ ముంది. చాలా మంచి గుణాలున్న వాడు. మానవోత్తముడని గదా రాముణ్ణి వర్ణించారు పెద్దలు. పద్మ నయనుడు కూడా ఆయన. పద్మ నయనుడంటే సూర్యుడని కూడా అనుకోవచ్చు. ఉజ్జ్వలమైన సూర్య వంశంలో జన్మించాడు రాముడు. మహా శుగంబులున్ విల్లును దాల్చువాడు. తన అభిజాత్యానికీ తన గుణ గణాలకూ తగినట్టు ధనుర్బాణాలు ధరించాడు. క్షాత్ర ధర్మాన్ని

సూచిస్తుందీమాట. దుష్ట నిగ్రహం చేసి ప్రజలకు క్షేమ కరంగా పరిపాలన సాగించటమే గదా ఉత్తమ క్షత్రియులు పాటించవలసిన కర్తవ్యం. కదు విప్పగు వక్షము వాడు. అయితే దానికి తగిన బల పరాక్రమాలు కూడా ఉండాలి క్షత్త్రియుడికి. “వ్యూఢోరస్కో వృషస్కంధః” అన్నట్టు అలాంటి శరీర సౌష్ఠవం కూడా అలవడినవాడని భావం. నిక్కిన భుజంబుల వాడని చెప్పటం కూడా దీనికి సూచకమే. మేలుపై జల్లెడు వాడనటంలో శిష్ట రక్షణం గోచరిస్తుంది. పోతే యశంబు దిక్కులం జల్లెడు వాడు నైన రఘు సత్తము డిచ్చుత మాక భీష్టముల్. ఇలాంటి గుణ సంపద ఉన్న వాడికే యశస్సంపద. వాడే లోకుల కభీష్ట ఫల ప్రదాత కాగలడు. ఉత్తమ మానవ మానవేం ద్రోచితమైన వర్ణన ఇది. మానవాతీతమైన వర్ణన ఇంతకు ముందరిది. అది నివృత్తి ధర్మ స్వరూపాన్ని - ఇది ప్రవృత్తి ధర్మ స్వరూపాన్ని లోకులకు సూచించటానికి మహాకవి చేసిన చిత్రరచన.

మొత్తం మీద భగవత్తత్త్వాని కెక్కడి కక్కడ అద్దం పట్టినట్టే కనిపిస్తుంది గోపికలు చేసే ప్రతి ఆలాపనలో. ఇలాంటి భగవల్లీలనే అక్రూరుడు కూడా దర్శించి ఎంతగానో కీర్తిస్తాడు.

కలలం బోలెడి పుత్త్ర మిత్ర వనితా గారాది సంయోగముల్
జల వాంఛారతి నెండమావులకు కాంక్షల్ సేయు చందంబునన్
తలతున్ సత్యములంచు మూఢుడ- వృథా తత్త్వజ్ఞుడన్ నాకునీ
విల సత్పాద యుగంబుఁ జూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ.”

అక్రూరుడు యాదవుల కుల పెద్దలలో ఒకడు. విభీషణుడి లాంటి స్వభావ మతనిది. భీషణుడు కానివాడు విభీషణుడైతే క్రూరుడే మాత్రమూ కాని వాడక్రూరుడు. అలాంటి వాడి నతి క్రూరుడైన కంసుడొక క్రూరమైన పనికి నియోగించాడు. ధనుర్యాగ మనే నెపంతో రామకృష్ణులను తీసుకురా వారి పని నేను చూచుకొంటా నని పంపుతాడు. అతడు కాదని చెప్పలేదు. ఇదీ

ఒక దైవ చేష్టితమే నని నిర్లిప్తతతో బయలు దేరి బృందావనం చేరుతాడు. రామకృష్ణులను దర్శించి రాజాదేశ మందిస్తే మందహాసం చేస్తూ వారతని వెంట బయలు దేరుతారు. దారిలో యమునా నదిలో దిగి స్నానం చేసి అతడు లేచి నిలబడగానే ఆ నీళ్లలో కనిపిస్తారు రామకృష్ణులు. ఇదే మా రథంలోనే కదా ఉన్నది వారీ నీళ్లలోకి ఎప్పుడు వచ్చారా అని చూస్తే మరలా రథంలోనే కనిపిస్తారు. ఇలా మార్చి మార్చి అక్కడ ఇక్కడా కనిపించటం చూచి అప్పుడర్థ మవుతుందాయన కెక్కడా ఉన్నది పరమాత్మే మరేదీ లేదని. అప్పుడు చేసిన స్తోత్రమిది. అద్వైత భావమంతా పుణికి పుచ్చుకొన్న పద్యమిది. మానవుడి శరీర మనః ప్రాణాదులతో సహా మనదీ అనుకొన్న సర్వమూ నిజంలో మనది కాదు. అవన్నీ కలలో చూచిన వస్తువుల లాంటివే. ఒక్కటీ నిజంగాదు. అనవసరంగా అవి యథార్థ మని నమ్మి ఎండమావుల కోసం పరిగెత్తే లేడి కూనల లాగా పరుగెత్తు తున్నారు మానవులు. అంతకన్నా మౌఢ్యం లేదు. తత్త్వమేదో తెలియక తత్త్వాభాస కోసం పెనగులాడటం మౌఢ్యం కాక ప్రౌఢి ఎలా అవుతుంది. మరి తత్త్వ మేమిటి. అది ఎలా దొరుకుతుంది. అదే లక్ష్మీపతి. నామ రూపాత్మకమైన జగత్తంతా లక్ష్మి అయితే దీనికి మూలమైన పదార్థం కాబట్టి అది ఈ లక్ష్మికి పతి. ఇది నామ రూపాత్మక మైతే అది అనామం. అరూపం. అంటే ఆవిషయ మైన మన ఆత్మచైతన్యమే. ఇలాంటి చైతన్యమే నే నని పట్టుకోవాలి దాన్ని. పట్టుకోటాని కేమిటి ఆలంబనం. ఆయన గారి పాద యుగమే. అంటే ఈ నామ రూపాలే. "పద్యతే అభ్యామితి పదమ్–పదమేవ పాదమ్." దేని ద్వారా తత్త్వాన్ని చేరగలమో అది పాదం. అది ఈ నామ రూపాలు రెండే. అవి ఎక్కడో అందరాని చోట లేవు. విలసత్ – వివిధ పదార్థాలలో మనచుట్టూ ఎక్కడ పడితే అక్కడ లసత్ – ప్రకాశిస్తూనే ఉన్నాయి. వీటిని పలకరిస్తే చాలు. దాని గుట్టు మనకు బయట పెడుతాయి. అయితే ఎంతో చిత్త సంస్కార ముండాలి దానికి. అది లేకుంటే దాన్ని ఎలాగైనా ప్రసాదించమని

ఆ తత్త్వాన్నే వేడుకోవాలి మనం. అదే లక్ష్మీపతీ నాకు నీ విలసత్పాద యుగంబు చూపమని వాపోతున్నాడు అక్రూరుడు. మనమూ అక్రూర చేతస్కులమై ప్రార్థిస్తేనే మనకది ప్రసాదిస్తాడు పరమాత్మ.

ఇలా చూస్తూ పోతే కృష్ణుడు పుట్టి పెరిగి చేసిన చేష్టలన్నీ మానవోచితం కావు. అవి మానవాతీత మైనవి. జన్మలేని ఈశ్వరుడే లోకంలో జన్మించి ఏ వ్యవహారమూ లేని ఈశ్వరుడే నలుగురితో వ్యవహరిస్తే ఎలా ఉంటుందో చూడాలంటే- దానికి కృష్ణ జననం దగ్గరి నుంచీ ప్రతిఒక్కటీ నిదర్శనమే. ప్రతి ఒక్కటీ ధర్మ సంస్థాపన కోసమే. అదే గదా అవతార ప్రయోజనం. దుష్ట నిగ్రహ మొక వైపయితే శిష్టానుగ్రహం మరొకవైపు. ఎవరెవరిని ఎప్పుడంత మొందించాలో ఒక ప్రక్క ఆలోచన. మరొక ప్రక్క ఎవరినెప్పుడెలా ఉద్ధరించాలో విచారణ. ఉద్ధవుడి కాయన చేసిన ఉపదేశ మాయన శిష్ట జనానుగ్రహంలో ఆఖరిది. చివర ఇక నిర్మాణమయి పోయే క్షణంలో జరిగిందది. ఆ నిర్యాణం కూడా ఎంత పరమాద్భుతంగా సాగిన వ్యవహారమో మన కర్థం కాదు. అసలాయన బంధు మిత్రాదులకే గాదు. భార్యా పుత్రులకే గాదు. ఏ ఒక్కరికీ అంతు పట్టలేదు. పట్టనీయ లేదాయన. అదీ ఒక లీలే. లేకుంటే మహర్షు లెవరో తన్ను దర్శించటానికి రావట మేమిటి. ఎవరో యాదవ కుమారులు చేసిన ఆగడానికి వారా వంశాన్నంతా శపించటమేమిటి. ఆ వంశ మెవరిది. తనదే గదా. తన దర్శనార్థం వచ్చిన వారు తన వంశానికే ఎసరు పెట్టట మేమిటి. పెట్టినవారు వారైతే గదా. వారి నెపంతో తానే పెట్టాడా ఎసరు. దానితో యాదవులంతా ఒక నలుసు మిగలకుండా తన కళ్ల ఎదుటనే చెల్లి పోయారు. ఇంకా ఒకరిద్దరు శేషించారని తెలిసి తానే వారిని నిశ్శేషం చేశాడు కూడా. తల్లి దండ్రులకు తానెక్కడికి వెళ్లేది చెప్పలేదు. అదే మంటే అర్జునుడికి కబురంపాను. వాడువచ్చి అన్నీ చూస్తాడని చెబుతాడు వారికి. షోడశ సహ స్రాంతఃపుర కాంతలున్నారు. ఒక్కరికీ చెప్పలేదు. చివర కంత ప్రాణపదంగా భావించిన

రుక్మిణికి గాని సత్యభామకు గాని ఒకరికీ తెలియ దాయన ఎక్కడికి వెళ్లాడో. ఎక్కడికో ఏమో. మార్గ మధ్యంలో బలరాము డనుజ్ఞ తీసుకొని వెళ్లి పోతాడు. యోగ మార్గంలో శరీర త్యాగంచేసి ముందుగా పోయి ఆయనకు పానువు సవరిస్తుంటాడు. దారుకుడు వచ్చి రథం తెస్తాను స్వామీ అంటే ఇంకా రథ మేమిటి వెళ్లి పొమ్మంటే ఆ రథమూ దాని పరికరాలూ ఆకాశంలోకి ఎగిరి పోయి అంతర్ధాన మవుతాయి. ఇంకా ముందుకు సాగిపోతుంటే అప్పు డెదురవుతాడు ఉద్ధవుడు. ఎన్నాళ్ళ నుంచి కని పెట్టుకొని ఉన్నాడో ఏమో స్వామి ఏకాంతం కోసం. అది అయాచితంగా ఇప్పుడు లభించిం దా మహానుభావుడికి. అడగ వలసిందంతా అడిగా డాయనను. చెప్పవలసిన దంతా చెప్పాడాయన. సెలవు తీసుకొని వెళ్లి పోయాడు.

ఇక జరగ వలసిందేమిటి. ఒక్కటే. అది నిర్యాణం. ఇంతవరకూ అందరి నిర్యాణమూ జరిపాడు. ఇక తన నిర్యాణం తానే చూచు కోవలసి ఉంది. నిందలేనిది బొంది పోదని దానికొక బోయ నిమిత్తమయ్యాడు. సరిగా గురి చూచి ఆయన బొటన వ్రేలినే కొట్టాడు. దానికే వచ్చి తగిలింది బాణం. మహాపచారం మన్నించమని కాళ్లా వేళ్లా పడ్డాడు. ఏది అపచారం ఏది ఉపచారం భగవానుడికి. ఆయన ప్రణాళికలో అది లేకపోతేగా వాణ్ణి తప్పు పట్ట వలసింది. తెలియక వాడు కంగారు పడ్డాడంత మాత్రమే. స్వామి వారి కది ఎప్పుడో తెలుసు. తెలిసే అది నిమిత్తంగా శరీరం వదిలేశాడు. తెలిసి వచ్చాడు. మరలా తెలిసి పోయాడు. ప్రతి ఒక్కటీ తెలియక చేయటానికి జీవుడు కాదు గదా. దేవుడాయె. దేవుడు గనుకనే జన్మ మొదలుకొని మరణం దాకా అన్నీ తెలిసే జరిపాడు. తానే అన్నాడు గదా అర్జునుడితో "వేదాహం సమతీతాని వర్తమానానిచార్జున– భవిష్యాణిచ భూతాని మాంతు వేద నకశ్చన" అర్జునా ఆది మధ్యాంతాలు మూడూ కరతలా మలకంగా నాకు తెలుసు గాని నన్నెవరికీ తెలియదు సుమా.

దీనికి తగినట్టే ఆయన జీవించి తమ మధ్య తిరుగు తున్నంత వరకూ తెలియలేదు పాండవులకు. ఆయనా తమ బంధు కోటిలో ఒకడని భావించారు. మహా అయితే అపద్రక్షకుడైన ఒక మహానుభావుడని మాత్రమే వారాయన నర్థం చేసుకొన్నది. అంతకు మించి పరమాత్మ అనే జ్ఞానం వారికి కలగలేదు. అడపా దడపా కలిగినా అది అప్పటికప్పుడే మరలా మంచు పొరలాగే విరిసి పోతూ వచ్చింది. పోతే ఆయన జీవించి ఉండగా గ్రహించలేని రహస్యం వారాయన మరణానంతరం గ్రహించ గలిగారు. అర్జునుడు ద్వారకకు వచ్చి స్వామి వారిని వెతుక్కుంటూ పోతాడు. పోగా పోగా ఎక్కడో సాగర తీరాన దర్శనమిస్తుందాయన మృత కళేబరం. కృష్ణుని కళేబరం చూస్తానని కలలో కూడా అనుకొని ఉండ దర్జునుడు. దాని మీద పడి ఎంత గానో విలపిస్తాడు. ఎంత విలపిస్తే ఏముంది. అయిందేదో అయి పోయింది. ఇక జాగుచేస్తే సముద్రం ముంచి వేస్తుంది పట్టణాన్ని. దారుణమైన ఈ వార్త చెప్పకుండానే మభ్యపెట్టి అవరోధ జనాన్నంతా హస్తినకు తరలిస్తాడు. అడవి దారిలో దొంగలు వచ్చి మీద పడితే గాండీవ ముండి బాణాలుండి కూడా వారికి జవాబు చెప్పలేక పోతాడు. అప్పుడే గ్రహిస్తాడు మొదటి నుంచీ తన గొప్ప ఏమీ లేదంతా ఆ ఈశ్వరుడిదే నని. నెమ్మదిగా అందరినీ రాజ భవనం దగ్గరికి పట్టుకు వచ్చి అక్కడ బయట పెట్టాడు మెల్లగా స్వామి వారి చావు కబురు. దుఃఖాక్రాంతలైన కాంత లంతా చితానలంలోకి దూకి పతి ననుగమిస్తారు. ఇదంతా ఏమిటీ ఘోరమని విస్తుపోయి చూస్తూన్న ధర్మజునికి శ్రవశ్శూలాయ మానమైన వార్త చెవిన వేస్తాడు. "మన సారథి మన సచివుడు- మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్- మన విభుడు గురుడు దేవర - మనలను దిగనాడి చనియె"నని వాపోతాడు. మన మన అని మన మనుకొవలసిందే. ఆయన అనుకోలే దింతకూ. ఆయనకు మన లేదు. తన లేదు. అసలు తనువే లేదాయనకు రావటానికి. వచ్చినట్టు పోయినట్టు నటన. ఎందుకా నటన.

"బలహీ నాంగులకున్ బలాధికులకున్ ప్రత్యర్థి భావోద్యమం బులు కల్పించి వినాశము న్నెఱపి ఈ భూభారముం బాపి నిశ్చల వృత్తిం గృతకార్యుడై చనియె"– ఆయన తానుగా చేయవలసిన కార్యమొకటే ఒకటున్నది. అది ఈ భూభారాన్ని పాపటం. భారమేమిటి. పాపట మేమటి. భార మధర్మ విజృంభణ. దాన్ని పాపట మంటే ధర్మ ప్రతిష్ఠాపనమే. అది దుష్ట శక్తులను శిక్షించటమూ – శిష్టులను రక్షించటం ద్వారానే జరగవలసి ఉంది. అలాగే జరిపాడు వెళ్లా "డా సర్వేశ్వ రుండచ్యుతుం డలఘుం డేమిని చెప్పుదున్" అంతా భగవదీయా యత్తమే మన ప్రజ్ఞ ఏమీ లేదని ఆక్రందన చేస్తాడు.

నిజంగా పాండవుల ప్రమేయ మేమీ లేదు. కర్తా కారాయితా చైవ అన్నట్టు అంతా ఆ పరమేశ్వరుడే. ఊరక వారు నిమిత్త మాత్రులే. అందుకే "చంచద్గర్వుల ధార్త రాష్ట్రుల ననిం జంపించి గోవిందు డిప్పించెన్ రాజ్య" మని చెప్పటం.. చంపించిందీ ఇప్పించిందీ ఆయనే. చివరకు మూడశ్వ మేధ యాగాలు చేయించి పాండవుల కఖండమైన కీర్తిని కల్పించింది కూడా ఆయనే. ఇప్పించె కల్పించె అనేక్రియా పదాలే చెబుతున్నాయి అంతా కృష్ణ గారడే పాండవుల పరాక్రమమేమీ లేదని. పాండవుల పరాక్రమమే అయితే అభిమన్యుడి ప్రాణాలు పోకుండా కాపాడుకోలేరా. పరీక్షిత్తు పిండాన్ని రక్షించలేరా. భగవంతుడుపే క్షించిన వాణ్ణి ఎవరు గానీ రక్షించలేరు. రక్షించ దలచిన వాణ్ణి ఎవరు గాని శిక్షించ లేరు. ఇవి రెండూ ఈ రెండు ఘట్టాలలో చూడనే చూచారు పాండవులు. చివర కవసానంలో అన్నిటికీ దాఖలా చూడ గలిగారు. ఇక చేయవలసిన దేముంది జీవితంలో. "సంసార మేవం నిస్సారమ్ దృష్ట్వా సార దిదృక్షయా ప్రవృజంతి" అన్న అభియుక్తోక్తి ననుసరించి మహా వైరాగ్యంతో ఒక మహా ప్రస్థానం చేయట మొక్కటే మిగిలి ఉంది. అంతకు ముందే యదు వంశ విధ్వంసమూ కృష్ణ నిర్యాణమూ రెండూ విని వారి తల్లి కుంతి శాంతి మార్గాన్ని అవలంబించి కృష్ణ ధ్యానం చేస్తూ తనువు చాలించింది. మహా భక్తుడు విదురుడు తీర్థ యాత్రాగతుడైన

వాడా వార్త మైత్రేయుని వల్ల ఆలించి యోగ మార్గంతో తనువు చాలించాడు. ఇందరికి నేర్పిన వైరాగ్యం పాండవులకు మాత్రం నేర్పక పోతుందా భగవన్నిర్యాణ వార్త. వారూ ద్వాపర నిర్గ మనమూ కలియు గాగ మనమూ అప్పుడే చూసి మనసులో రోసి దారి తీశారు ప్రస్థానానికి. ఎవరికి వారు యచ్ఛే ద్వాజ్మనసీ అన్న రీతిలో యోగ సమాధిగతులై ప్రాణ త్యాగం చేశారు. ఇంతకూ జీవిత కాలంలోనే కాక పరమాత్మ నిర్యాణా నంతరం కూడా తన ఆశ్రితులకు జ్ఞాన వైరాగ్యాల నుపదేశిస్తూనే వచ్చాడు. జీవితంలో వాగ్రూపంగా నైతే జీవితా నంతరం మౌన రూపంగా. నిర్యాణం జీవితం కంటే ఇంకా బలంగా ప్రభావం చూపింది ఆశ్రితుల స్వభావం మీద.

అయితే ఇదంతా మన వ్యామోహమే గాని అసలు పరమాత్మ జీవించట మేమిటి. మరణించట మేమిటి. ఆ మాటకు వస్తే ఆసలాయన జన్మించనే లేదు. జన్మ లేనపుడిక జీవితమూ నిర్యాణ మనే మాటల కర్థమే లేదు. అజుడూ, అచ్యుతుడూ అయినవాడెలా జన్మిస్తాడని. జన్మించకనే పోతే దుష్ట శిక్షణాది కర్మ మెలా చేస్తాడని. రెండూ అబద్ధమే. కనుకనే భాగవతా వతరణంలోనే ఇలా వ్రాస్తున్నాడు వ్యాస భగవానుడు.

ఏవం జన్మాని కర్మాణి - హ్యకర్తు రజన స్యచ
వర్ణ యంతిస్మ కవయో - వేద గుహ్యాని హృత్పతేః

జననము లేక కర్మముల జాడలఁ బోక సమస్త చిత్తవర్తనుడగు చక్రికిం గవు లుదార పదంబుల జన్మ కర్మము ల్వినుతులు సేయు చుండుదురు- వేదరహస్యము లందు నెందుఁజూచిన మతి లేవు జీవునకుఁ జెప్పిన కైవడి జన్మ కర్మముల్

జన్మ కర్మ అనేవి భగవానుడి కెప్పుడూ లేవు. ఉండటానికి వీలు లేదు. ఆయన అజుడూ అవ్యయుడూ- పైగా సమస్త చిత్త వర్తనుడైన చక్రి ఆయన.

"యః పృథివ్యామ్ తిష్ఠన్" అని చాటుతుంది అంతర్యామి బ్రాహ్మణం. గీత కూడా చెబుతుంది. "ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే ఉ ర్జున తిష్ఠతి" అని. అన్నింటి లోనూ ఉండి అన్నింటి లోపలా వెలుపలా వ్యాపించి వాటన్నిటినీ త్రిప్పుతూ ఉన్నదదే ఆయె. చక్రి అనే మాట ఎంతో సార్థకంగా ప్రయోగించాడు మహాకవి. భ్రామయన్ సర్వభూతాని అన్నప్పుడు చక్రం లాగా త్రిప్పే వాడనే గదా అర్థం. అలాంటి సర్వ వ్యాపకుడూ సర్వాత్మకుడూ అయినవాడెలా జన్మిస్తాడని. అయితే రామకృష్ణా ద్యవతారా లెత్తాడని చెప్పట మేమిటి. ఎత్తాడని చెబుతున్న దెవరు. వేద వ్యాసాదులైన కవులు. కవీశ్వరులు కాబట్టి గొప్ప గొప్ప వర్ణనలు చేస్తూ వచ్చారు పుట్టాడని చేశాడని. అవి వారి పొగడ్తలే గాని నిజంలో పరమాత్మ పుట్టా లేదు చేయాలేదు. శాస్త్రంలో ఎక్కడ ఏవాక్యం తడవి చూచినా జీవుడికి లాగే దేవుడికి కూడా జన్మాదులు లేవనే మనకు చాటుతుంది. జీవుడికే లేనప్పుడిక నిత్య ముక్తుడైన ఈశ్వరుడికి చెప్పటం హాస్యాస్పదం. అలాంటప్పుడు కృష్ణుడిక దేవకీ వసుదేవులకు జన్మించటమూ వట్టిదే. ఆయన చేసిన కంసవధాది కార్యాలూ వట్టివే.

అంతా వట్టిదే అయితే మరి ఈ లోకాలన్నిటినీ ఎవడు సృష్టించాడు. ఈ జీవుల నెవడు సృష్టించాడు. ధర్మ సంస్థాపన కోస మని ఈ అవతారాలన్నీ ఎవడు ధరించాడు. అంతా వట్టిదని కొట్టివేస్తే మరివన్నీ కొన్ని గాకపోయినా కొన్నైనా కనిపిస్తున్నాయి గదా. అనుభవాన్ని ఎలా కాదనగలం. అని ప్రశ్న వస్తుంది. దానికి సమాధాన మిస్తున్నాడు.

"సవా ఇదం విశ్వమమోఘ లీలః సృజత్యవ త్యత్తి-న సజ్జతేఽ స్మిన్ భూతేషు చాంతర్హిత ఆత్మ తంత్రః-షాడ్వర్గికం జిఘ్రతి షడ్గుణేశః-"
భువన శ్రేణి నమోఘ లీలు దగుచుం బుట్టించు రక్షించు - నం
త విధిం జేయు-మనుంగడందు-బహు భూతవ్రా తమం దాత్మతం
త్ర విహార స్థితుడై-షడింద్రియ సమస్త ప్రీతియున్ దవ్వులన్

దివి భంగింగొను–చిక్క డింద్రియములం ద్రిప్పున్ నిబంధించుచున్–
ఈ లోకాలన్నీ సృష్టించిన మాట వాస్తవమే. అయితే ఎలా సృష్టించాడని మీరను కోవటం. ఒక కుమ్మరి కుండలు సృష్టించి నట్టనా. కాదు. కుమ్మరి కంటే ఒక మట్టి అనే ఉపాదానం కావాలి. దండ చక్రాదులనే సహకారులు కావాలి. తనకు కర చరణా ద్యవ యవాలూ పని చేయాలి. ఇలాంటి కలాప మేదీలేదా ఈశ్వరుడికి. ఉన్న వాడాయన ఒక్కడే. ఉపాదాన మయినా తానే సహకారి అయినా తానే, మరి సర్వ వ్యాపకుడూ జ్ఞానైక రూపుడూ కాబట్టి తన కొక శరీర మంటూ లేదు. అలాంటి వాడు ఎలా సృష్టిస్తాడీ బ్రహ్మాండ భాండాలను, అదే వింత. ఏదీ లేకపోయినా ఒకటున్న దాయనకు. అదే ఆయనతో ఏకీభూతమై ఉన్న మాయాశక్తి. "పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే." అది ఆయన ఇచ్ఛను బట్టి ఎలా కావలిస్తే అలా మారి పోగలదు. పెంచుతున్నది. త్రుంచుచున్నది. పెంచుతున్నా. త్రుంచుతున్నా అది వాస్తవంలో మరలా పెంచటమూ కాదు త్రుంచటమూ కాదు. అది ఒక లీల. అమోఘమైన లీల. ఐంద్ర జాలికుడి లీల లాటిది. ఉన్నట్టుండి ఆకాశంలో గంధర్వ నగరంలాంటిది కల్పిస్తాడొక ఐంద్రజాలికుడు. అది అక్కడ ఉందనా చేసిందనా. ఏదీ లేదు. అది ఒక కనుకట్టు. అలాంటి కనుకట్టే మనకీ జతగ్సృష్టి.

పోతే మన మీదనే ఈ కనుకట్టు పని చేసేది. సృష్టించిన ఆయన సంటదది. కనుకనే ఆయన దానిలో మునుగడు. మనలను ముంచు తుంటాడు. మరి ఆయన పరిస్థితేమిటి. ఎక్కడ ఉన్నాడు. ఎక్కడో లేడు మరలా. ఈ సృష్టి అయిన చరా చర భూతాల లోనే నిండి ఉన్నాడు. అలా ఉన్నా మనలాగా అస్వతంత్రుడు కాదు. సర్వ స్వతంత్రుడు. తానేమి చేసేది తనకు తెలుసు. అచ్చమైన ఆ తెలివితోనే పంచేంద్రియాలకూ మనసుకూ చెందిన అన్ని సుఖాలూ అనుభవించగల డాయన. మనమూ అలాగే అనుభవిస్తున్నాము. ఆయన శుద్ధ చైతన్య రూపుడు కాబట్టి ఆకాశం లాగా

దూర దూరంగానే ఉండి అనుభవిస్తాడు. ఆకాశ మిప్పు డంతటా ఉంది. అన్నింటి లోపలా వెలుపలా వ్యాపించి కూడా ఆమూర్తం కాబట్టి అది దేనినీ అంటదు. దాని నేదీ అంటదు. అలాగే అమూర్తమైన ఆత్మ తత్త్వం కూడా సుఖదుఃఖాది భోగాల మధ్యే మెలగుతున్నా అదీ వాటి నంటి ముట్టదు. అలాంటప్పుడిక బంధ మేముంది. ఇంద్రియాలకు చిక్కదది. పైగా ఆ ఇంద్రియా లనే బంధించి తన ఇచ్ఛాను సారంగా త్రిప్పుతూ పోతుంది. అధోక్షజుడూ హృషీకేశుడని పరమాత్మకు పేరు వచ్చింది ఇందుకే. అక్షములంటే ఇంద్రియాలు. హృషీక మన్నా ఇంద్రియమే. వాటి జ్ఞానాన్ని అధః కరించిన వాడూ వాటిని వశీకరించుకొన్న వాడూ గనుక ఆయన అధోక్షజుడూ హృషీకేశుడూ అయ్యాడు. దీని మూలంగా మనం గ్రహించ వలసిన రహస్య మేమిటి. కృష్ణ దవతరించి నప్పటి నుంచీ నిర్యాణమయ్యే దాకా కనిపించిన ఆ నీల మేఘ శ్యామల మైన ఆకార మసలు వాస్తవంలో అక్కడ లేనే లేదు. అమూర్తమైన తత్త్వం మూర్తమెలా అయింది. అయిందంటే అది మాయామయం. యధార్థం కాదన్నమాట. కనుకనే “మాయైె షాహి మయా సృష్టా యన్మాం పశ్యసి నారద” నారదా నీవు చూస్తున్నది నా నిజ స్వరూపం కాదు- అది మాయ- అని చెప్పగలిగాడు నారదుడి కాయన. కాగా ఇక శరీర ధారణమే మాయ అయినప్పుడాయన ఆ శరీరంతో చేసిన అనుభవించిన ఇంద్రియ భోగాలు మాత్రం సత్యమెలా అవుతాయి. అవీ మాయే. అంటే అప్పటికీ గోపికల తోడి రాస క్రీడాదులూ - పదహారు వేల మందిని పరిణయ మాడటాలూ - ఇవన్నీ కేవల మొక మాయా విలాసమే నని అర్థం చేసుకోవాలి మనం. దీనితో ఆయన కంట గట్టిన జారత్వాది దోషా లెగిరిపోతాయి. అంతేకాదు. ఇంద్రియాను భవాలన్నప్పుడు సుఖమే కాదు. దుఃఖం కూడా. కనుక చివర కాయనకు కలిగిన బాణ ప్రహారమూ ప్రాణ ప్రహాణమూ- ఇవి కూడా ఒక నటనే నని గ్రహించ వలసి ఉంటుంది.

అయితే అంతా నటనే అంతా మాయామయమే నని తీర్మానించటాని కేమిటి సబబు. అది కేవలం మన స్వకపోల కల్పనేమో. కాదని చెప్పటాని కాధారమేమిటి మన కని ఒక ఆశంక చేయవచ్చు. దానికి పరిహారం చెబుతున్నాడు.

నచాస్య కశ్చిన్ని పుణేన ధాతు
రవైతి జంతుః కుమనీష ఊతీః
నామాని రూపాణి మనో వచోభిః
సంతన్వ తోనట చర్యామి వాజ్ఞః
జగదధి నాథుడైన హరి సంతత లీలలు నామ రూపముల్
తగిలి మనో వచో గతుల తార్కిక చాతురి యెంత గల్గియున్
మిగిలి కుతర్క వాది తగు మేరలు చేసి యెఱుంగ నేర్చునే
యగణిత నర్తన క్రమము నజ్ఞుఁడెఱింగి నుతింప నోవునే

ఈ జగత్తనే దున్నదంటే ఇది దాని పాటి కది ఆవిర్భవించలేదు. దీని ఆవిర్భా వానికి మరేదో కారణమై ఉండాలి. అది మరలా దీని లోనిదే అయితే సుఖం లేదు. దీని లక్షణాలకు విలక్షణమై దీని కతీతమైన దయి ఉండాలి. జగదధి నాథు డంటే అదీ అర్థం. ఇది పాంచ భౌతికమైతే ఈ జగత్తు - దీని కధి - అభౌతికమైన శుద్ధ చైతన్య రూపమది. అలాంటి ఆ హరి తత్త్వ మేదో అది మనకు గ్రహణ గోచరం కాదు. కారణ మది ఈ జగత్తు కతీతమైన భూమికలో ఉంది. పోతే మన బోటి జీవుల మీ జగత్తు కధీనమైన స్థితిలో ఉన్నాము. మన మున్నది దేశకాల వస్తువులనే త్రిపరిచ్ఛేదాల కధీన మయిన దశ. మరి ఆ తత్త్వమో తురీయ మైన దశ. అంచేత దాని అసలు రూప మేమిటో మనకు తెలియదు. అది మన కెప్పుడూ మరుగు పడే ఉంటుంది. పోతే మనకు కనిపించేది కేవలం దాని లీలలే. అవీ కంటికి నామ రూపాత్మ కం గానే కనిపిస్తాయి గాని భగవ ద్విభూతిగా అనుభవానికి రావు. ఎంచేత. మన మనస్సులు నామరూపాలనే ఎప్పుడూ తగిలి వర్తిస్తుంటాయి. వాటి

కతీతమైన తత్త్వాన్ని అవి ఎలా భావించ గలవు. పట్టుకోగలవు. ఇది ఎలాంటి దంటే ఆకాశంలో ఒక పక్షి ఎగిరి పోతుంటే దాని నీడ క్రింద నేల మీద కనిపిస్తుంది మనకు. ఈ నీడ పక్షి కాదు. అసలు పక్షి నేల మీద లేదు అది ఎక్కడో దీని కతీతంగా నింగిలో ఎగురుతోంది. దాని నీడ మాత్రమే ఈ నేల పైన కనిపిస్తుంది. దాని లాగా దీనికీ ఒక ఆకార ముంది. దాని లాగానే ఇదీ వేగంగా పోతుంది. అయినా ఇదే వాస్తవమైన పక్షి అనుకొంటే పొరబాటు. వాస్తవమైన దాని ఛాయ-అ-భాస- మాత్రమే ఇది. అలాగే వాస్తవ మైన తత్త్వం త్రిగుణాత్మక మైన జగత్తు కతీ తంగా ఉంటే దాని లీల లేదా నీడ మాత్రమే లోకంలో అది ప్రదర్శించే చేష్టలన్నీ. వాటి ద్వారా అసలు దాన్ని పట్టు కోవాలే గాని మానవుడా చేష్టల మేరకే చూచి అవే నిజమని భావించ రాదు.

అయినా మన మలా భావిస్తున్నా మంటే దానికి కారణం మన మనస్సే. అది నామరూపాలనే వలలో తగులు కొన్న చిలక. దానికి తోడు పోయినదే వచస్సు. మాట. మనస్సును బట్టే వచస్సు. ఒక దానితో ఆలోచిస్తాము. మరొక దానితో ఆవిష్కరిస్తాము. అయితే ఎంత ఆలోచించినా అవిష్కరించినా ఇదంతా మన తార్కిక చాతుర్యం మాత్రమే. ఎంతో గొప్ప గానే ఉండవచ్చు మన హేతువాదం. దాని కెన్నో దృష్టాంతాలు తోడు చేసుకొని చూప వచ్చు. అయినా అది కుతర్కమే గాని సుతర్కం కాదు. కారణమే మంటే నామ రూపాల సరిహద్దులు దాటి పోవటం లేదవి. దేశ కాలాదుల మేర లోకి దించి చూపటానికే ప్రయత్నిస్తుంది. అది శుష్కతర్కం గాక శుద్ధతర్కమెలా అవుతుంది. శుద్ధమైన తర్కమే కావాలంటే మానవుడు తన బుద్ధి బలంతో సాగించేది కావాలి. ఏమిటది. సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ-అయమాత్మా బ్రహ్మ-నేహ నా నాస్తి కించన-అనే నిష్ప్రపంచ బ్రహ్మాత్మ తత్త్వాని కను గుణంగా సాగే ఆలోచన. అలాటి ఆలోచనా పరుడే ప్రాజ్ఞుడు. మిగతా వారందరూ అజ్ఞులే. అజ్ఞుడంటే అద్వితీయాత్మతత్త్వం

తెలియని వాడు. వాడెప్పటికీ ఆ భగవత్త త్త్వాన్ని అర్థం చేసు కోలేడు. "అజ్ఞశ్చా శ్రద్ధ ధానశ్చ సంశ యాత్మా వినశ్యతి" అన్నారు. చేసుకోనంత వరకూ వాడు లోకంలో ఉన్నా లేని వాడే. వాడి జీవిత మంతా నిరర్థకమే. తత్త్వాన్ని దాని స్థాయి కెదిగి చూడలేక పోతే వాడేమి మానవుడు. వాడి దేమి జ్ఞానం. ఇది ఎలాటి దంటే ఒక గొప్ప నర్త కుడుంటాడు. వాడెన్నో భంగిమలలో ఎన్నో నాట్య రీతులు ప్రదర్శిస్తుంటాడు. అలా ప్రదర్శిస్తుంటే వాటిలో ప్రతి ఒక్కటీ చూచి ఆహా ఎంత బాగా చేస్తున్నాడని అభినందించే శక్తి ఉండాలి ప్రేక్షకుడికి. అలాటి యోగ్యతలేని పల్లెటూరి మొద్దు కేమని పిస్తుంది. అవన్నీ శివమెత్తి ఆడే చిందులుగానూ గంతులు గానూ భాసిస్తాయి. అనర్తన మెంత చిత్ర విచిత్రంగా ఉన్నా అందులో ఎంత గొప్ప క్రమ మున్నా వాడి బుద్ధి కది అంతా అలికినట్టు ఒకటి గానే - ఎంతో అవత తవక గానే కనిపిస్తుంది. అలాగే ఆ ఈశ్వరుడొక గొప్ప నర్తకుడు. ఆయన నర్తన మగణితమూ - సక్రమమూ ఆయిన నర్తన. అదే ఈ సృష్టి, స్థితి, లయాత్మకంగా సాగుతూన్న భువన వ్యవహారం. దీని నా ఈశ్వరుడి భూమిక కెదిగి చూచే ప్రాజ్ఞుడైతే గ్రహించగలడు దీని అంతర్యం. అలా కాని మూఢుడి కిది ఎలా బోధ పడుతుంది. మీదు మిక్కిలి ఇదంతా ఒకఅర్థం లేని హంగామాగా కనిపించి ఆక్షేపిస్తాడు. అలా ఆక్షేపించిన వారే రుక్మి శిశుపాల జరా సంధాదులు. దుర్యోధనాదు లాయన విశ్వ రూపంచూచి కూడా అది ఒక గారడీ పొమ్మన్నారు. వారెవరికీ బోధ పడలేదా తత్త్వం. విభూతి చూచి కూడా గ్రహించ లేకపోయారు. అదే భీష్మ విదురాదులైన భాగవతులైతే ఆ జగన్నాటక సూత్రధారి నటించిన ప్రతిలీలా విశేషం లోనూ ఆయన విశ్వాతిగమైన సచ్చిత్సు రూపాన్నే దర్శిస్తూ పోయారు.

అయితే ఎప్పుడో వారెవరో దర్శించారని చెబితే ఏమి ప్రయోజనం. అది అప్పుడూ ఇప్పుడూ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దర్శించ గలిగి ఉండాలి. దర్శించ గలిగితే ఇందరు నాస్తికులూ ఇందరు హేతువాదులూ

ఎలా ఏర్పడ గలిగారు. ఇప్పుడే గాదీ నాస్తికులు. అప్పుడూ ఆరోజులలో కూడా ఉన్నట్టే చాటుతున్నది పురాణం. వారే గదా ఆయన ఈశ్వర త్వాన్ని అనుక్షణమూ అధిక్షేపిస్తూ వచ్చిన శిశుపాలాదులు. మరి ఇలాంటి పరిస్థితిలో ఆ ఈశ్వర తత్త్వాన్ని అందుకొనే మార్గ మేమిటి. అది మన కెలా లభిస్తుందని ప్రశ్న. చెబుతున్నాడు దానికి సమాధానం.

సవేద ధాతుః పదవీమ్ పరస్య
దురంత వీర్యస్య రథాంగ పాణేః
యోऽమా యయా సంత తయాऽను వృత్త్యా
భజేత తత్పాద సరోజ గంధమ్

ఇంచుక మాయ లేక మది నెప్పుడుఁ బాయని భక్తి తోడవ
ర్తించుచు నెవ్వ డేని హరి దివ్య పదాంబుజ గంధ రాశిసే
వించు నతండు గాంచు నర వింద భవాదులకైన దుర్లభో
దంచిత మైన యా హరి యుదార మహాద్భుత కర్మమార్గముల్

మాయఅంటే అజ్ఞానం. అజ్ఞాన మనేది ఏ కొంచెమూ ఉండకూడదు. అంతా ఈశ్వరుడేనని సర్వాత్మభావం పూర్తిగా ఉండాలి. అది ఎప్పుడో మెరుపు లాగా తళుక్కు మని మెరిసి పోయే దైతే లాభం లేదు మరలా. ఎప్పుడూ పాయకుండా ఉండాలి. ఇలాంటి జ్ఞాన నిష్ఠకే భక్తి అని పేరు. అది కేవలం మదిలోనే గాక బాహ్య జీవితంలో కూడా ప్రతిఫలించాలి. అభ్యంతరంగా కలిగిన నిశ్చయ జ్ఞానం బాహ్యంగా మనం నడుచుకొనే ప్రతి నడతలోనూ కనిపించాలి. లోపలా వెలుపలా మనోవాక్కాయ వ్యాపారాలన్నీ తదాకారంగానే మారి పోవాలి. ఇదే వర్తించట మంటే. అలా వర్తించే వాడెవడైనా సరే. జాతి వర్ణ వయో లింగాది భేదం లేదిక. భగవత్తత్త్వాన్ని నిరంతరమూ అనుభవిస్తూనే ఉంటాడు. ఉంటాడంటే సన్న్యసించి ఎక్కడో ఏ అడవులకో కొండలకో పారి పోయి అక్కడ కూచుంటాడని కాదు. అక్కడికి పోయినా అదీ ఇలాంటి సంసారమే. నామ రూపా లెక్కడికి పోయినా



Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కనిపిస్తూనే ఉంటాయి. ఎటు వచ్చీ అలా కనిపిస్తున్నా వాటి నలా కనిపించే తీరులో చూడడు జ్ఞాని, మరెలా చూస్తాడు. ప్రతి ఒక్కటీ లోకంలో - పెండ్లాం బిడ్డలూ - ఇల్లూ వాకిలీ - అడవులూ కొండలూ - పట్టణాలూ ప్రజలూ - వ్యాపారాలూ వ్యవహారాలూ - ఏది చూచినా అది ఆ ఈశ్వర విభూతి గానే అనుసంధించు కొంటాడు. ఆ హరి పదాంబుజ గంధ రాశే ఈ నామ రూపాది కలాపమంతా. "పాదోస్య విశ్వాభూతాని" అని గదా శ్రుతి చెబుతున్నది. విశ్వమంతా దాని పాదం. అది ఒక అంబుజమే. "అప ఏవ ససర్జాదౌ" అని మొట్ట మొదట సృష్టి అయిన పదార్థ మంబువులే. పంచభూతాలకూ అది ఉపలక్షణం. పోతే ఈ భూత పంచకం నుంచి జన్మించినవే ఈ చరా చర పదార్థాలు. ఇవన్నీ ఆ పంచ భూతాల గంధం లేదా వాసనలతో కూడినవే. ఇలాంటి భూత రాశినే నిరంతరమూ సేవిస్తుంటాడు జ్ఞాని. అంటే నామ రూపాదుల తోనే వ్యవహరిస్తున్నా అదంతా భగవద్విభూతి గానే భావిస్తూ దానితోనే ముడిపెట్టి తదాకారం గానే దర్శిస్తుంటాడు.

అలాంటి ఏకాత్మ భావనతో జీవించే వాడే ఎప్పటికైనా ఆ ఈశ్వరుడి కర్మ మార్గాలేమిటో వాటిలో దాగి ఉన్న రహస్య మేమిటో తాను గ్రహించగలడు. మరొకరికి వ్యాఖ్యానించి చెప్పగలడు. ఎలాంటి కర్మ మార్గాలవి. అరవింద భవాదులు-బ్రహ్మేంద్రాదులకు కూడా తల మించి పోయినవి. వారికి కూడా దుర్లభమే. అందరానంత ఎత్తులో ఉన్నాయి ఉదంచితం. ఎంతో మించి పోయి ఉన్నాయి. బ్రహ్మేంద్రాదులకు మించి ఉన్నాయనే విషయం కృష్ణుణ్ణి వంచించ బోయి వారే ఆయాసందర్భాలలో పరా భూతులు కావటమే మనకు నిదర్శనం. కాబట్టి హేయో పాదేయ భేదం లేకుండా సకల సృష్టిని ఈశ్వర లీలగా విభూతిగా దర్శించిన వాడికే ఆయన తన జీవితంలో చేసిన చేష్టలు బోధ పడతాయి. లేకుంటే వాటిలోని ఆంతర్యం గ్రహించలేక ఇది రంకు అది బొంకు అని శిశు పాలాదుల

మాదిరి మనం కూడా ఈశ్వర దూషణ చేయటానికే ఉద్యుక్తుల మవుతాము. ఇంతకూ "యేయథా మాం ప్రపద్యం తేతాంస్త థైవ భజా మ్యహ" మన్నాడు భగవానుడే. ఎవరే దృష్టితో చూస్తే వారి కాయన అలాగే దర్శన మిస్తాడు. "అస న్నేవ స భవతి అసద్బ్రహ్మేతి వేద చేత్" లేదు లేదని వాదిస్తే వాడికాయన లేనేలేడు. అంతే కాదు. ఉన్న తత్త్వాని కేమీ హాని లేదు. వీడు లేదన్నా అది ఉండనే ఉంటుంది. కాని హాని. వీడికే. ఎందుకంటే ఉన్న దాన్ని వదిలేసి లేని ప్రపంచాన్ని పట్టుకొన్నాడు వీడు. అది ఎప్పుడూ లేనిదే కాబట్టి దీన్ని పట్టుకొని ఊగులాడిన నేరానికి వీడూ లేకుండానే పోతాడు. అలా కాక "ఆస్తి బ్రహ్మేతి చేద్వేద సంత మేనం తతో విదుః" ఎవడా బ్రహ్మ తత్త్వాన్ని విడవకుండా పట్టు కొన్నాడో వాడు దాని లాగానే ఎప్పటికీ ఉంటాడు. "తస్యాహం నప్రణ శ్యామి-సచమే నప్రణ శ్యతి" అని గదా భగవానుడి హామీ. ఆయన వీడి దృష్టికి లేకుండా పోడు. కాబట్టి వీడూ ఆయన దృష్టికి లేకపోడు. అంటే జనన మరణాలు లేని నిత్య స్థితిని పొందుతాడని భావం. ఇలాంటి బ్రాహ్మీ స్థితిని సోదాహర ణంగా కీర్తిస్తున్నాడు ప్రస్తుతమీ అయిదవ పద్యంలో.

అథేహ ధన్యా భగ వంత ఇత్థమ్ -
యద్వాసు దేవే - ఖిల లోక నాథే -
కుర్వంతి సర్వాత్మక మాత్మ భావమ్ -
నయత్ర భూయః పరివర్త ఉగ్రః

హరి పాద ద్వయ భక్తి మీ వలన నిట్లా రూఢమై యొప్పునే
తిరుగం బాఱదు చిత్త వృత్తి హరిపై దీపించి మీలోప లన్
ధరణీ దేవత లార మీరలు మహా ధన్యుల్ సమస్తజ్ఞు లున్
హరిచింతన్ మిముచెంద వెన్నడును జన్మాంత వ్యథా యోగముల్

ధరణీ దేవత లిక్కడ శౌనకాది మహర్షులే. వారినే సంబోధించి చెబుతున్నాడు భాగవత ప్రచారకుడు సూతుడు. వారి ద్వారా మనందరికీ చేసే బోధ ఇది.

భగవత్పాద ద్వయ భక్తి ఉండాలి. మొదట మనకు. హరి పాద ద్వయ మీ కనిపించే నామ రూపాలే. "పద్యతే గమ్యతే ఇతిపాదః" అని పాద శబ్దానికి వ్యుత్పత్తి చెప్పారు భగవత్పాదులు. ఏది పరతత్త్వాన్ని చేరుస్తుందో అది పాదం. అవి ఈ నామ రూపాలే. ఇవి ఆ పరమాత్మ సృష్టించినవే గనుక ఈ సృష్టిని పట్టుకొంటే అ(స్రష్ట గుట్టుమనకు పట్టి ఇస్తాయి. అందుకే నేమో త్యాగ బ్రహ్మ "పవ మాన సుతుడు పట్టు పాదార విందములకు – నీ నామ రూపములకు నిత్య జయ మంగళ" మని గానం చేశాడు. పవమాన సుతుడు పట్టిన పాదా లేవో కావు. నిజాని కవి నామరూపాలే త్యాగయ్య దృష్టిలో. ఇదే జ్ఞాన దృష్టి. ఈ దృష్టి ఆ రూఢమై ఉండాలి. ఆరూఢమైనందు కేమిటి దాఖలా. ఏది చూస్తున్నా చేస్తున్నా నామరూపాత్మకంగా కాక భగవ ద్రూపంగా ప్రతి ఒక్కటీ దర్శన మివ్వాలి. అంటే ఇది ఫలానా – అది ఫలానా – అని గాక ప్రతి ఒక్కటీ కేవలం అస్తి భాతి అని మాత్రమే చూడ గలగాలి. అప్పుడిక చిత్త వృత్తు లిన్ని లేవు. ఒకే ఒక అఖండాకార వృత్తిగా మారి ఎప్పటికీ అది ఇక చలించదు. మరొక విజాతీయ భావ ముంటే గదా చలింటాని కంతా హరి మయమే అయి పోయింది. అలా అయి పోయిన జీవులే ధన్యులు. వారి జీవితమే ధన్య జీవితం. అంతే కాదు. నిరంతర హరి చింతన మూలంగా వారికిక జనన మరణాలనే ప్రసక్తే లేదు. నిత్య ముక్తుడైన పరమాత్మ లాగా వారు కూడా ముక్తులే అవుతారు. ఇదే భాగవత సందేశ మసలు.

ఉదాత్తమైన ఈ దివ్య సందేశమే అందిస్తున్నది మనకు కృష్ణావతార చరిత్ర. అర్థమైన వాడి కది అమృతం. కాని వాడి కది హాలాహలం. కనుకనే భాగవతము తెలిసి పలుకుట కష్టం బని చాటింది. భాగవత మంటే భగవత్తత్త్వమే. అది కృష్ణావతారంలో వ్యక్తమైనంతగా మరే అవతారంలోనూ కాలేదు. దాని నున్న దున్నట్టు పట్టు కోవాలంటే సామాన్యం కాదు. లోక సామాన్యమైన బుద్ధులతో లోకాతిశాయి అయిన ఆ తత్త్వాన్ని గ్రహించ

లేము. అది ఏమిటో దాని నెల గ్రహించాలో లోకానికి బోధించ టానికే మహర్షి భాగవతారంభంలోనే ఈ పద్యపంచకాన్ని రచించాడు. భాగవత సౌధాంతః ప్రవేశాని కిది ముఖ ద్వారం లాంటిది. దీని ద్వారా పోతేనే భగవ త్స్వరూపాన్ని మనం దర్శించగలం. భాగవత పురాణ రహస్య మంతా అసలీ అయిదు పద్యాల లోనే గుంభిత మయి ఉంది. భగవదవతార తత్త్వ మంతా ఇందులోనే గర్భిత మయి ఉంది. దీని నర్థం చేసుకొని ఇదే ఒక కర దీపికగా చేత పట్టుకొని లోపల ప్రవేశించిన వాడు పురాణ ప్రాసాదంలో ఆయా కక్ష్యాంత రాలు గడచి పోయి క్షేమంగా వచ్చి బయట పడ గలడు. లేదా వాడి పాలిటి కది ఒక మయ సభ లాగా మారిపోయి ఉన్నది లేనట్టూ లేని దున్నట్టూ దృగ్భ్రమ గొలిపి దిగ్భ్రమకే దారి తీస్తుంది. దానితో అసలు భాగవతమూ అర్థం కాదు. భగవ దవతారాలూ అర్థం కావు. అన్నిటి కన్నా కృష్ణావతారమూ దాని లీలలూ అసలే అంతు పట్టే వ్యవహారం కాదు.

❖ ❖ ❖

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# లీలా వినోదము

ఇంతెందుకు కుంతీదేవి వృత్తాంతం పరిశీలిస్తేనే మనకు తెలిసి పోయింది. ఒక ఉత్తమ వంశంలో పుట్టి జీవితంలో కష్ట సుఖాలు రెండూ చవిచూచిన ఒక భారతీయ మహిళకు ప్రతీక ఈవిడ. అన్నీ ఉండి ఏదీ లేని జీవితం. పుట్టింది యాదవ వంశంలో పెరిగింది కుంతి భోజుని ఇంట. కన్యగా ఉండే బిడ్డను కన్న దన్న దుష్కీర్తికి పాలయింది. యౌవనం లోనే భర్తను కోలుపోయింది. తరువాత కన్న కుమారులకు దూరమై వారి కపకారులైన వారి ఇంట్లోనే చాలాకాలం తలదాచు కోవలసి వచ్చింది. చివరకు తాను ప్రచ్ఛన్నంగా కన్న కుమారునికీ మిగతా కుమారులకూ పోరాటం జరుగుతూంటే వీరు ఆ వీరుణ్ణి హతమారిస్తే తీరని మనో వేదనతో కుమిలి పోయింది. ఇంత అలజడి పాలయిన జీవిత మావిడది. కనుకనే నేమో బాగా అనుభవం పండి చివరకు దాని పరిణామం అన్ని భావాలకూ స్వస్తి చెప్పి భక్తి భావ మొక్కటే నిండి పోయింది.

కృష్ణ పరమాత్మ ఆమెకు మేనల్లుడే. వసుదేవుని తోడ బుట్టిందావిడ. అంచేత చిన్నప్పటి నుంచీ ఎక్కడ ఉన్నా పరమాత్మ ఆమెకు సన్నిహితుడే. అయితే ఆయన పరమాత్మ అనే భావ మంత గాఢంగా లేకపోవచ్చు. అలాగని కేవలం మేనల్లుడే ననే సామాన్య భావమూ లేదు. ద్రౌపదీ వస్త్రాప హరణం దగ్గర నుంచీ రణ సంరంభం ముగిసే దాకా తన కుమారుల నాయన ఎంత కంటికి రెప్పలా కాపాడిందీ ఆమెకు తెలుసు. అందరితో పాటు ఆయన విశ్వరూపాన్ని సభా ముఖం గానే తిలకించిన ఎలనాగ. అలాంటి దాని కాయన భగవంతు డని తెలియక పోవటమేమిటి. చక్కగా తెలుసు. అయితే స్త్రీ స్వభావం మూలంగా కొంతా జన్మాంతర సంస్కార మంతగా లేని కారణంగా కొంతా- అంత బలంగా కుదర లేదా భక్తి భావం. కేవల మొక ఆపద్బాంధవుడైన మహాపురుషుడి లాగానే చూస్తూ వచ్చింది.

"చతుర్విధా భజంతేమా"మ్మన్నట్టు- అందరికీ ఒకే విధమైన అధికార సంపత్తి ఉండదు. కొందరార్తులేతే కొందరు జిజ్ఞాసువులు. కొంద రర్థార్థులైతే కొందరు జ్ఞానులు. కుంతిది ఆర్త భక్తి. అయితే జీవితంలో ఒడుదుడుకు లన్నీ తిన్న తరువాత అదే జీవితంలో జిజ్ఞాసగా జ్ఞానంగా పరిణ మించిం దావిడకు.

ముఖ్యంగా పాండవు లైదుగురు తప్ప వారి బలగా న్నంతటినీ రాత్రికి రాత్రి అంత మొందించి వారి కొడుకులను కూడా వధించి కడకు ఉత్తర గర్భానికి కూడా ఎసరు పెట్టిన అశ్వత్థామ చర్య కామె పరతపించి పోయింది. దానితో ఇక తన వంశమే విచ్ఛిన్న మవుతుందని తహతహ లాడింది. అలాంటి సందర్భంలో ఎవరికీ అంతుపట్టకుండా కోడలి గర్భంలో ప్రవేశించి దారుణమైన ఆ బాణాగ్నిని రూపుమాపి గర్భస్థ శిశువును కాపాడిన కృష్ణుని చర్య తిలకిస్తే ఆయన లోక సామాన్యమైన వ్యక్తి కాదు - పరమాత్మే ననే భావం ఆమెకు బాగా మనసుకు నాటింది. అంతవరకూ బీజరూపంగా ఉన్న భక్తి మొలకెత్తి చిగురొత్తి పుష్పించి ఫలించి నలుదెసల పరిమళాలు గుబాళించింది. అత్తా ! వెళ్లి వస్తానని అన్నమాట మేనల్లుడి మాటగా అనిపించ లేదా విడకు. కనుమరుగైతే మరలా కనిపిస్తాడో లేదో నని దగ్గరగా వచ్చి

శ్రీకృష్ణా యదు భూషణా నరసఖా శృంగార రత్నాకరా
లోకద్రోహి నరేంద్ర వంశ దహనా - లోకేశ్వరా - దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా - నిర్వాణ సంధాయకా
నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవ లతల్ నిత్యాను కంపానిధీ

అని వాపోతుంది.

ఈ మాటలు బాగా గమనించండి. ఆయన యదు భూషణుడట- నరసఖుడట. అంటే తన పుట్టినింటి వాడు కాబట్టి తన పుత్త్రుడైన అర్జునుడికి అన్నిటా బాసట అయి నిలిచాడు. అంతేకాదు. శృంగార రత్నాకరుడు.

ఏది చేసినా అది ఒక లీల ఆయనకు. ఏమటది. లోక విద్రోహులైన దానవులను శిక్షించట మొకటి. లోకోత్తరులైన దేవతాదులను రక్షించట మొకటి. అంతేకాక మహాజ్ఞానులైన వారికి నిర్వాణ సుఖం కూడా ప్రసాదించ గల దయామయుడు భగవానుడు. అంతటి దయాళుడవు గనుకనే నా భవలతలను కూడా త్రుంచి వేయమని బ్రతిమాలుతున్నది. భవబంధములను త్రుంచి వేసే భారం భగవంతుడి మీద పెడుతున్న దావిడ. భగవంతుడు గాదు త్రుంచి వేయవలసింది. ఎవడి బంధం వాడే త్రుంచుకోవలసి ఉంది. "ఉద్ధరే దాత్మ నా త్మానమ్." ఆత్మోద్ధరణకు చేయవలసిన ప్రయత్న మంతా జీవుడిదే. దేవుడిది గాదు. స్వప్రయత్నం లేకుండా ఈశ్వరుడు తానుగా ఎవ్వరికీ మోక్షాన్ని ప్రసాదించడు. ఏమిటా ప్రయత్నం. తన కనాది సిద్ధంగా ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టు కోటం. జ్ఞానం వల్ల గాని సంభవం కాదది. కాబట్టి ఆత్మజ్ఞానం కోస మెవరికి వారు ప్రయత్నిం సాగిస్తూ పోవాలి. అలాంటి ప్రయత్నం లేదు కుంతికి. అందుకు కూడ నాకు శక్తి లేదు – నీవే దాని ననుగ్రహించమని అడుగుతున్నది. "యాదవు లందు – పాండవుల యందు నధీశ్వర నాకు మోహ విచ్ఛేదము సేయుమయ్య." మోహమంటే అజ్ఞానం. దానివల్ల కలిగే అభిమానం. దానితోనే వీరు నావారు– వీరు పరాయి వారనే భావం మానవులకు. అది తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించ మంటుంది. "ఘన సింధువుఁ జేరెడి గంగ భంగి – నీ పాదసరోజ చింతనము పై ననిశంబు మదీయ బుద్ధి – న త్యాదర వృత్తితోఁ గది యు నట్లుగఁ జేయ గదయ్య." నీ పాదాల మీద నా మనసు నిలుస్తుందో లేదో అది నిలిచేలాగా నీవే అనుగ్రహించ మంటుంది. అప్పటికి మోహ విచ్ఛేదం చేయ వలసిందీ భగవంతుడే. భగవత్తత్త్వాన్ని భజించే భావాన్ని కలిగించ వలసిందీ భగవానుడే కుంతి దృష్టిలో.

ఇదే సగుణ భక్తుల దృష్టి. వారు భగవంతుణ్ణి ఎప్పుడూ సగుణంగానే భావిస్తారు. సగుణ మనే సరికి ఒక నామంతో ఒక రూపంతో తమ మధ్య

తిరుగుతూ చేస్తూ ఉన్న వ్యక్తి గానే చూస్తుంటారు. ఒకవేళ ఎప్పుడైనా ఆయన సామాన్యమైన వ్యక్తి కాదు- విశ్వరూపుడైన పరమాత్మ అనే జ్ఞాన మున్నట్టు కనిపించినా - అది వారికి శ్రుతమైన జ్ఞానమే గాని ఒంటబట్టిన అనుభవ జ్ఞానం కాదు. పెద్దలు చెబుతూ వచ్చిన - తాము వింటూ వచ్చిన - మాటలనే ఏకరువు పెడుతుంటారు. అలాగే ఏకరువు పెట్టింది కుంతి కూడా. మొదట పరీక్షిత్తును చావకుండా కాపాడిన సందర్భం చూడగానే తాత్కాలికమైన భావా వేశం పట్టజాలక ఇలా కీర్తిస్తుం దాపరమాత్మ నావిడ

పురుషుండాధ్యుడు ప్రకృతికిఁ
బరుఁడవ్యయు డఖిల భూత బహిరంతర్భా
సురుఁ డనవ లోక నీయుడు
పరమేశ్వరుడైన నీకు ప్రణవములు హరీ

అని కృష్ణుని నిర్గుణ తత్త్వాన్ని ఎంతో తాను గ్రహించిన దాని లాగా ప్రశంసిస్తుంది. "జననము నైశ్వర్యంబును ధనమును విద్యయును గల మదచ్చన్నులకు" నీవగోచరుడవు. అవి లేని పరిశుద్ధ మనస్కులకే సులభుడ వనే ధర్మ సూక్ష్మాన్ని వెల్లడిస్తుంది. కొందరు నీవు దేవకీ వసుదేవుల కిచ్చిన వర ప్రకార మవతరించా వంటే - కొందరు భూభారాన్ని పాపటాని కంటే - మరి కొంద రజ్ఞాన కామ్య కర్మరుల మూఢత్వాన్ని తొలగించి వారికి శ్రవణ చింతనాది భక్తి మార్గాన్ని బోధించటాని కవతరించావని - చెబుతున్నారని భగవజ్జన్మ రహస్యాన్నీ ప్రయోజనాన్నీ బయట పెడుతుంది. "నిను జింతించుచు బాడుచుం బొగడుచున్ నీ దివ్య చారిత్రముల్ వినుచుం" జూచినదే నిజమైన చూపని వర్ణిస్తుంది.

ఎంత వర్ణించినా ఇదంతా శ్రుత పాండిత్యమే. అభ్యాస జన్మమైన అనుభవం కాదు. అలాంటి అనుభవమే ఉంటే అది జ్ఞానం. జ్ఞానోదయ మైతే మోహ విచ్ఛేదం దానిపాటి కదే ఏర్పడుతుంది. విచ్ఛేదం చేయమని



Yalamanchili Srinivasa Rao www.advaitavedanta.in

భగవంతుణ్ణి ప్రాధేయపడ నక్కర లేదు. మనం ప్రాధేయ పడినా ఇంకా మనకు యోగ్యత లేకపోతే భగవంతుడు సర్వ సమర్థుడయి కూడా మనకది ప్రసాదించబోడు. మీదు మిక్కిలి ఇంకా మన కది బలం చేసి పోతాడు. ప్రస్తుతం కుంతి విషయంలో ఇలాగే జరిగింది. నాకు మోహ విచ్ఛేదం చేయమని ఆవిడ ప్రార్థిస్తే విచ్ఛేదం చేయక పోగా దాన్ని ద్విగుణీకృతంగా ఆవహించా డావిడకు శ్రీకృష్ణుడు.

పృథయేత్థమ్ కలపదైః - పరిణూతాఖిలోదయః
మందమ్ జహాస వైకుంఠో - మోహయన్నివ మాయయా

ఈ విధంగా మేనత్త అవీ ఇవీ వలపోస్తూ ఉంటే ఏమీ మాట్లాకుండా ఒక మందహాసం చేసి వెంటనే రథమెక్కి ద్వారకకు వెళ్లిపోయాడట. ఆవిడ అన్ని విధాల ప్రాధేయ పడుతూంటే దానికి మందహాసమా జవాబు. పైగా ఇంకా కొంత కాల మిక్కడనే సన్నిధి చేసి మాకు తరణోపాయం బోధించమని ఆవిడ బ్రతిమాలు తుంటే దానికి ఏమీ బదులు చెప్పక రథారోహణం చేసి పోవటమా అంతకన్నా జవాబు.

అవును. నిజమాలోచిస్తే పరమాత్మ దృష్టిలో అదే జవాబు. జీవుడికి దేవుడిచ్చే జవాబదే. ఇచ్చట కుంతిది అనన్య మైన నిర్గుణ భక్తి కాదు. సగుణ భక్తి. పరమాత్మ నేదో ఒక పరిచ్ఛిన్న మైన రూపంలో చూచి దాన్నే కలకాలమూ తన దగ్గర నిలుపు కోవాలని కోరుతున్నది. పైగా స్వప్రయత్న మేకొంచెమూ లేకుండా తన సంగతి అంతా చివరకు తనకు కలగ వలసిన మోక్షం కూడా ఆయనే ప్రసాదించా లని ఆసిస్తున్నది. ఇది వట్టి పేరాస. భక్తి మార్గంలో దీన్ని మార్జార కిశోర న్యాయమంటారు. ఒక పిల్లి తన పిల్లలను తానే నోట గరచుకొని పోతుంది. పిల్లల కేమీ జవాబు దారీ లేదు. అంతా తల్లిదే. అలాగే భక్తుడి బాగోగులన్నీ భగవంతుడే చూచుకోవాలనే సిద్ధాంత మిది. మంచిదే. కాని దానికి కూడా నూటికి నూరు పాళ్లూ చిత్త



Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

శుద్ధి ఉండాలి. ఎలాంటి వ్యాజమూ పనికి రాదు. అంతా తెలిసినట్టు నటించటమూ - తన జీవిత ప్రయోజనాల కోస మర్థించటమూ- ఇదీ వ్యాజ మంటే. ఇవి రెండూ ప్రస్తుతం కుంతీదేవికి లేకపోలేదు. కావలసి నంత ఉంది. "పురుషండాద్యుడు ప్రకృతికి పరుడని" భగవానుడి పరతత్త్వాన్ని ఎంత గానో కొనియాడింది. అంత విషయం తెలిసిన మనిషి కిక మోహ మెక్కడిది. లేకుంటే మరలా నాకు మోహవిచ్ఛేదము సేయమని ప్రార్థించట మేమిటి. అంతేకాదు. కృష్ణుడు తన వారినీ తన్నూ మొదటి నుంచీ ఎలా కాపాడుతూ వచ్చాడో ప్రశంసిస్తూ అలాగే ఇక మీదట కూడా మమ్మల్ను కంటికి రెప్పలాగా కాపాడుతూ మా ఇంటనే ఉండి పొమ్మంటుంది. ఇది ఇంకా అవివేకం. ఆపదలలో కాపాడితేనే పరమాత్మ అవసరం. లేకుంటే అక్కర లేదనే భావానికి కొంత తావున్న దీమాటలలో. పైగా తాను చేసుకోవలసిన మోహ విచ్ఛేదం పరమాత్మ కప్పగించట మేమిటి. సర్వవ్యాపకుడైన ఆ దేవుని తన దగ్గరే కట్టి వేసుకొనే అభిలాష ఏమిటి. సగుణంలో ఇది చాలా క్రింది స్థాయికి చెందిన ఆర్తభక్తి. కనుకనే సర్వజ్ఞుడైన పరమాత్మ ఆవిడ ఎంత దీనాలాపాలు చేస్తున్నా ఒక్క నవ్వు నవ్వి వెంటనే రథ మెక్కి వెళ్ళి పోయాడు. మోహం వదలించమని ఆవిడ కోరితే మోహాన్ని ఆపాదించి పోయాడు. ఆయనకు తెలుసు నావిడ మనస్తత్త్వం. దానికి తగినట్టే ఉందాయన ప్రవర్తన. పిండికొద్దీ రొట్టె.

"యే యథామాం ప్రపద్యంతే తాంస్త థైవ భజామ్యహ" మని తానే గదా చెప్పాడు. మేనత్త అంతస్తుకు తగినట్టే ఉంది మేనల్లుడి వ్యవహారం.

కుంతి అయిన తరువాత పాండవులు. ఆవిడ కుమారులే వీరు. ఆవిడ మేనల్లుడని చూస్తే వీరూ బావగారనే భావం వదలకుండానే చూచా రాయనను. మహా అయితే ఆయా సమయాల్లో ఆర్తత్రాణ పరాయణుడుగా భావించారు. ఒక్కొక్కప్పుడు భగవంతుడనే భావం కూడా ఉంది. లేకపోలేదు.

కాని అది ఈ బాంధవ్య మనే నివురు గప్పిన నిప్పు లాగా ఉండి పోయింది. జాజ్వల్య మానంగా ప్రకాశించ లేదు. కనుకనే నారద మహర్షి ఒక సందర్భంలో ధర్మారాజును చూచి ఇలా అంటాడు. "ప్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రింగంటిమి" ప్రేమ చేత ఆచ్ఛాదితమైన భక్తే గాని అచ్ఛమైన భక్తి కాదట. మరి ఆ ప్రేమ తమకన్ని విధాలా సాయపడి నంత వరకే ఉంటుంది వ్యక్తి మీద. లేకుంటే లేదు. మరి కృష్ణుడు వారికి చేసిన ఉపకార మింతా. అంతా. "చెలియై మేన మఱంది యై సచివుడై చిత్త ప్రియుండై మహా ఫల సంధాయకుడై మెలంగుటది నీ భాగ్యంబు రాజోత్తమా" అని ఆ నారదుడే ప్రశంసిస్తాడు. జలజాత ప్రభ వాదులు కూడా చర్చించి దర్శించలేని పరమాత్మ వారికి తనకు తానే వశవర్తియై చెప్పినవీ చెప్పనివీ అన్ని పనులూ చేసి పెట్టాడు. మహాఫలాన్నే ప్రసాదించాడట వారికి. ఏమిటా మహా ఫలం. మహాఫల మంటే ఇక్కడ మోక్షం గాదు. అది పరిపూర్ణ జ్ఞానంతో రావలసిందే గాని కేవల భక్తితో - అదీ సవ్యాజమైన భక్తితో రాదు.

కాబట్టి మహా ఫలమంటే ఇక్కడ జీవితంలో అంత కంతకు కలిగే అభ్యుదయమే. ఉపద్రవాలన్నీ దూరం చేసి ఎనలేని ఐశ్వర్యాన్ని ప్రసాదించటమే మహాఫల సంధాయకత్వం. అది ఎలాంటిదో ఇంతకుముందే అభివర్ణించాము.

పాంచాలీ కబరీ వికర్షణ మహా పాప క్షతాయుష్కులం
జంచద్గర్వుల ధార్త రాష్ట్రుల ననిం జంపించి గోవిందుఁడి
ప్పించెన్ రాజ్యము పాండ వేయులకుఁ గల్పించెన్ మహాఖ్యాతిఁజే
యించెన్ మూడుతురంగ మేధములు దేవేంద్ర ప్రభా వోన్నతిన్

ద్రౌపదీ వస్త్రాపహరణ మనేది ఎంతటి అవమానకరమైన సన్నివేశం. అలాంటి ఎన్నో క్లేశాల నుంచి తప్పించిన వాడా పరమాత్మే. చివరకు ప్రాజ్యమైన సామ్రాజ్యాన్ని ధర్మజుని చేతి కందించిన వాడూ ఆయనే. మూడు అశ్వమేధ యాగాలు చేయించి దేవేంద్రుని కంటే గొప్ప కీర్తి ప్రతిష్ఠలా పాండువుల కార్జించి పెట్టిన వాడూ ఆ భగవానుడే.

అయితే చిత్ర మేమంటే ఇంత మహో పకారాలు గావిస్తున్నా లోకోత్తరమైన చర్యలప్పు డప్పుడు ప్రదర్శిస్తున్నా - విశ్వ రూపాదులే చూపి తన భగవత్తత్త్వాన్ని బాహాటంగా చాటుతున్నా - తెలుసుకోవలసినంత గాఢంగా తెలుసుకోలేక పోయారు పాండవులు. ఏమి కారణం. నల్లనివాడు పద్మనయ నంబుల వాడని సగుణం గానే భావిస్తున్నా రాయనను వారు. ప్రేమతోనే తప్ప జ్ఞానంతో దర్శించటం లేదా తత్త్వాన్ని. కడకు ఆ మహాత్ముడి ముఖతః భగవద్గీత లాంటి మహోపదేశాన్నే విన్న అర్జునుడు కూడా నోచుకోలేదా జ్ఞానానికి. అయితే తన తల్లి కుంతి లాగానే అతడూ ఎంతగానో గ్రహించినట్టు చేసి నట్టూ అభినయిస్తాడు. "నష్టో మోహః స్మృతి ర్లబ్ధా" నాకు అజ్ఞాన తమస్సంతా విరిసిపోయింది. జ్ఞాన జ్యోతి దేదీప్య మానంగా వెలిగి పోతుందని ప్రజ్ఞలు చెప్పుకొన్నాడు. ఇంత భీకరాలు పలికిన వాడే యుద్ధానంతరం కృష్ణుడు తమరి నందరినీ వీడ్కొని పోయేటపుడు అన్న మాట లేమిటో చూడండి.

యద్యద్భగవతా ప్రోక్తమ్ - పురా కేశవ సౌహృదాత్
తత్సర్వమ్ పురుష వ్యాఘ్ర - నష్టమ్ మే భ్రష్ట చేతసః
మమ కౌతూహలం త్వస్తి - తేష్వర్థేషు పునః పునః

బావా నీ వింతకు ముందేదో ఒక గొప్ప విషయం చెప్పావు నాకు. అది ఇప్పుడు నా మనసులో లేదు. నేను చాలా దురదృష్ట వంతుణ్ణి. అది మరలా ఒకసారి వినాలని నాకు కుతూహలంగా ఉంది. చెబుతావా అని అడుగుతాడు. చూడండి. అంతకుముందు నా అజ్ఞానమంతా తొలగిపోయిందన్న పెద్దమనిషి ఇప్పుడా విషయమే జ్ఞాపకం లేదంటున్నాడు. పైగా మరలా వినాలని కుతూహలంగా ఉందట. అతడన్నట్టు కుతూహలమే ***Curiosity*** అది. నిజమైన జిజ్ఞాసా ధారణాకాదు.

ఇలాంటి వ్యవహార మంటేనే సరిపడదు పరమాత్మకు. అజ్ఞుడినైనా మెచ్చుతాడు గాని జ్ఞానాన్ని అభిన యించే వాణ్ణి ఏమాత్రమూ మెచ్చడీశ్వరుడు.

వెంటనే ఇలా చీవాట్లు పెడతాడు. "శ్రావితస్త్వమ్ మయా గుహ్యమ్-జ్ఞాపితశ్చ సనాతనమ్" నీకు నేనెంతో గొప్ప రహస్యాన్ని బోధించాను. పరమ సత్యాన్నే తెలియ జెప్పాను.

అబుద్ధ్యా నాగ్ర హీర్యత్త్వమ్ - తన్మే సుమహ దప్రియమ్

అది నీ మనసుకు పట్టలేదంటే ఎంత బుద్ధి హీనుడవో నీవు. ఇలాంటి వ్యవహారం నాకే మాత్రమూ పనికిరాదు. అసలు భగవద్గీతారంభంలో కూడా అర్జునుణ్ణి ఇలాగే చీవాట్లు పెట్టాడు.

అశోచ్యా నన్వ శోచస్త్వమ్ - ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే

నిజమైన ప్రజ్ఞ లేకున్నా ప్రజ్ఞలు పలికితే ఒప్పుకోడు భగవానుడు. జిజ్ఞాసతో విషయం తెలుసు కోటానికి ప్రయత్నించాలి మానవుడు. అదే ఆత్మోద్ధరణకు తోడ్పడేది. అప్పుడే భగవంతుడు కూడా చేయూత నిచ్చేది. కుంతిలాగే అర్జునుడి కలాంటి స్తిమితత లేదు. ఇంకా అది అంతో ఇంతో ఉన్నవాడు - ధర్మరాజు. కృష్ణుడి వల్ల కాకపోయినా భీష్ముడి వల్ల విన్నాడత డెన్నో ధర్మాలు. భగవద్గీత అర్జునుడు వింటే తత్తుల్యమైన మోక్ష ధర్మాన్నే శ్రవణం చేశాడు. చేసినందుకు తగిన పరిపాకం కూడా గడించాడు.

అయితే పామరత్వ మనేది అతణ్ణి వదల లేదు. అదీ కొంచె మంటి పట్టుకొనే ఉంది. పట్టువదలకనే.

తన దేహంబునకై యనేక మృగ సంతా నంబుఁ జంపించు దు
ర్జను భంగిన్ గురు బాలక ద్విజ తనూజ భ్రాతృ సంఘంబుని
ట్లనిఁ జంపించిన పాప కర్మునకు - రాజ్యా కాంక్షికిన్ నాకుహా
యనల క్షావధినైన ఘోర నరక వ్యాసంగ ముల్ మానునే

అని వాపోతాడు. రణరంగంలో జరిగిన మారణ హోమ మంతా తన వల్లనే జరిగిందని అతని భ్రాంతి. పైగా ధర్మ యుద్ధం వల్ల రాజులకు

పాపమంటదని శాస్త్రం చెప్పినా అది కేవలం సమర్థించ టానికి చెప్పిన మాటేనని పొరబాటు పడతాడు. అశ్వమేధాది యాగానుష్ఠానంతో పాపం నిర్మూలమై పోతుందనే మాట కూడ పాడి గాదు. అది పంకంబున పంకిల స్థలమునకూ మద్యంబున మద్య భాండంబునకూ గలిగే శుద్ధి లాంటి దేనని ఆక్షేపిస్తాడు. జీవహింసతో గూడిన యాగ కర్మల చేత మానవునికి పాప బాహుళ్యమే గాని పాప నిర్ముక్తి ఎలా కలుగుతుందని ప్రశ్నిస్తాడు. వాటన్నిటికీ భీష్ముడతని కొకే ఒక సమాధానమిస్తాడు. "ఈశ్వరుండు విష్ణు డెవ్వేళ నెవ్వని కేమి సేయు - పురుషుడేమి యెఱుగు-నతని మాయలకు మహాత్ములు విద్వాంసు లడగి మెలగుచుందు రంధులగుచు" ఇవీన్న నీ ప్రయోజకత్వ మని భ్రాంతి పడుతున్నావు. నీ కిందులో ఎలాంటి కర్తృత్వమూ లేదు. అన్నీ ఆ మహాత్ముడి మాయా విలాసమే అని ప్రబోధిస్తాడు. ధర్మరాజు కప్పటినుంచీ జ్ఞానం కొంత ఒంటబట్టి ఈశ్వరాధీనుడై బ్రతుకు సాగిస్తూ పోతాడు.

ఇంతకూ వీరందరూ మార్జార కిశోరాలే. మర్కట కిశోరాలుగారు. మార్జార కిశోరం తల్లి ఆలనా పాలనే కోరుతుంది. మర్కట కిశోరం లాగా తాను దాని నంటి పట్టుకొనే ప్రయత్నం చేయదు. పైగా నామ రూపాత్మకం గానే భగవతత్త్వాన్ని భావించటం వల్ల ఆ మూర్తి ఎప్పుడూ తమతో ఉండాలనీ - తమ పనులు చేసి పెడుతుండాలని కాంక్షిస్తుంటారు. తత్త్వం తెలిసి కాదది. తమ కాతత్త్వం ఉపయోగ పడుతుందని. తన్ని మిత్తంగానే ఆ ప్రేమ భావం. ఒక నిమిత్తంగా ఏర్పడిందెప్పుడూ ఆ నిమిత్తం పోతే తొలగి పోయే ప్రమాద ముంది. ఇలాంటి ప్రమాదానికే గురి కావలసి వచ్చింది పాండవులు. ఉన్నట్టుండి ఒక్కసారిగా మాయమైపోయాడు పరమాత్మ. దానితో పాటు ఆయన సహకారం కూడా కరవయి పోయింది వారికి. ఇది వారికి భగవానుడు పెట్టిన పరీక్ష. ఈ రెంటికోసమే నా మీరు నన్ను ప్రేమించటం భజించటం - లేక ఇవి దూరమైనా నన్ను భజించే నేర్పున్నదా మీకని మౌనంగా ఆయన వేసిన ప్రశ్న. అదే కృష్ణ నిర్యాణం.

పాండవ నిర్యాణానికి ముందే జరిగింది కృష్ణ నిర్యాణం. వారు బ్రతికి ఉండగానే తాను పోయాడు. ఏమిటి దీనిలో అంతరార్థం. ఎప్పటికైనా వారు తెలుసుకోవా లోక రహస్యం. తానే గదా బోధించా డర్జునుడికి. "అంత వంత ఇమే దేహా- నిత్యస్యోక్తా శ్శరీరిణః" అని. దేహి అయిన జీవుడే నిత్యంగాని అతడు ధరించిన దేహం నిత్యం గాదు. అది జీవుడి దేహమైనా సరే - ఈశ్వరుడి దేహమైనా సరే అనిత్యమే. జీవుడి దంటే కావచ్చు గాని ఈశ్వరుడి శరీర మనిత్య మెలా అవుతుందని అపోహలో ఉండ వచ్చు పాండవులు. ఉన్నారు కూడా. లేకుంటే నిత్యమూ మాదగ్గరే మమ్మల్ను అంటి పెట్టుకొని ఉండమనే మాటరాదు. కుంతీ అన్న దామాట. పాండవులూ అన్నారు. ఇంకా వారికి శరీరభ్రాంతి పోలే దనుకున్నాడు పరమాత్మ. అంతేకాదు. తన్ను కూడా ఈ నీలమేఘ శ్యామలమైన శరీరం మేరకే దించి చూస్తున్నారని గ్రహించాడు. ఎప్పటికైనా ఈ శరీరమే కాదాత్మ అంటే దీనికి విలక్షణమైన తత్త్వమనే భావం దృఢ పడాలని ఆలోచించాడు. అలా దృఢ పడాలంటే తన శరీర మింకా దృగ్గోచర మవుతున్నంత వరకూ వారి కది కలిగే అవకాశం లేదు. ఇంకా ఆ మైకంలోనే ఉండి పోతారు. అంచేత వారు జీవించి ఉండగానే తాను కన్ను మూశాడు. శరీర మిక్కడే విడిచి పోయాడు. అది దైవికంగా అర్జునుడి కంటనే పడేట్టు చేశాడు. అది చూచే సరికి అంతకు ముందువిన్న సాంఖ్యయోగం బాగా తల కెక్కింది అర్జునుడికి. దేహం వేరు - దేహి వేరనేది ఎంత విన్నా అది సిద్ధాంతమే. దృష్టాంతంగా చూచినప్పుడే అది బాగా ఒంట బట్టేది. అనుభవంగా మారేది. అది పరమాత్మ విషయంలోనే చూచే సరికి హడలి పోయా డర్జునుడు. ఇక కైముతిక న్యాయం చేత తమ శరీరా లశాశ్వతమని చెప్పనే అక్కర లేదతనికి. అప్పుడర్థ మయిందతనికి ఎవరి శరీరమైనా శాశ్వతం కాదని. అంతేకాదు. శరీరమే కాకపోతే తన్మూలంగా ఏర్పడిన ప్రాపంచిక భోగ భాగ్యాలసలే గాదు. కనుక వాటినిక ఏ మాత్రమూ అంటివట్టు కోరాదు. అంటి పట్టు కోవలసిన దెప్పటికైనా శాశ్వత మైన ఆ పరమత్మ తత్త్వాన్నే. ఇదే గాక ఇంకొక రహస్యం కూడా బోధపడిం దర్జునుడికి. అంతకు ముందంతా

తమ కర్తృత్వంతో ఏదో సాధించామనీ పడబొడిచామనీ అనుకొన్న దంతా వట్టి భ్రమే. అందుకు నిదర్శనం కృష్ణుడు వెళ్లిపోగానే తన అసహాయ స్థితి. అశక్తత. "మయైవైతే నిహతాః పూర్వమేవ - నిమిత్త మాత్రమ్ భవ సవ్య సాచిన్" అన్న భగవ ద్వాక్యం కూడా వట్టి సిద్ధాంతం కాదు - దృష్టాంత మని అప్పు డర్థ మయిందా మానవుడికి.

ఎంత పలవించినా ఇక ప్రయోజనం లేదని చెప్పి రామకృష్ణాదుల శరీరాల కగ్ని సంస్కారం చేసి బయలు దేరుతా డర్జునుడు హస్తినాపురానికి. పదహారు వేల మంది కృష్ణ కాంతలను కూడా వెంట బెట్టుకొని వస్తాడు. వచ్చీ రావటంతోనే అన్న గారి కాళ్ల మీద బడి బోరు మని ఆక్రందనం చేస్తాడు. ఇంగిజ్ఞుడైన ధర్మజుడా ఆకృతిని చూడగానే భయపడతా డేదో కొంప మునిగిందని. మరేదోగాదు. మాధవుని మరణమే. అందుకే ఆతుర్దాగా అడుగుతాడు.

అన్నా ఫల్గున భక్త వత్సలుడు బ్రహ్మణ్యుండు గోవిందుడా
పన్నా నీక శరణ్యు డీశుడు జగద్భద్రాను సంధాయి శ్రీ
మన్న వ్యాంబుజ పత్త్ర నేత్రుడు సుధర్మా మధ్య పీఠంబు నం
దున్నాడా బల భద్రు గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్

ఉత్సాహియై ఉన్న మాట వాస్తవమే గాని అది ద్వారకలో గాదు వైకుంఠంలో. ఆ మాటే చెబుతా డర్జును డిం కెక్కడి కృష్ణు డెక్కడి ద్వారక.

బలహీనాంగులకున్ బలాధికులకున్ ప్రత్యర్థి భావోద్యమం
బులు కల్పించి వినాశము న్నెఱపి ఈ భూభారముం బాపి ని
శ్చల వృత్తిం గృత కార్యుడై చనియె నా సర్వేశ్వరుం

డని అసలు విషయం బయట పెడుతాడు. కృష్ణుడంటే సర్వేశ్వరుడని- కేవలం భూభార పరిహారార్థమే అవత రించాడని పూర్తిగా గ్రహించా డర్జునుడు.

అంతేగాదు, అతడు తమ బావ అని- తమ ల నేదో ఆవత్సమయా లలో ఆదుకొంటూ వచ్చిన ఆపద్బాంధవుడనే సంకుచిత భావం కూడా అతనికి తొలగిపోయింది. అది అతని మాటలలోనే మనకు దాఖలా అవుతుంది.

భూతముల వలన నెప్పుడు
భూతములకు జన్మ మరణ పోషణములు ని
ర్ణీతములు సేయు చుండును
భూతమయుం డీశ్వరుండు భూత శరణ్యా

సకల చరాచర సృష్టి స్థితి లయాలూ ఆ పరమేశ్వరుడి చేతి లోనివి. చరాచర భూతమయుడూ ఆయనే - వాటి కతీతుడూ ఆయనే. మన మంతా కేవలం నిమిత్త మాత్రులమే నని తన పరా వర విజ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు అర్జునుడు. అంతమాత్రమే గాదు. అంతకు ముందు భగవత్సన్నిధిలో ఎంత గీతా శ్రవణం చేసినా ఒంట బట్టని ఆత్మ జ్ఞాన మిప్పుడాయన అసన్నిధి లోనే పాకానికి వచ్చింది.

"వాసుదేవాం ఘ్ర్యను ధ్యాన పరి బృంహిత రంహసా-
భక్త్యా నిర్మథితాశేష కషాయ ధిషణో ఽ ర్జునః-
గీతమ్ భగవతా జ్ఞానం - యత్తత్సంగ్రామ మూర్ధని
కాల కర్మ తమోరుద్ధమ్ - పున రధ్యగమద్విభుః-

నిరంతర భగవచ్చింతా ప్రభావంవల్ల అతనికి పట్టిన మనః కాలుష్య మంతా ప్రక్షాళితమై పోయింది. అంతకు పూర్వ మెప్పుడో రణరంగంలో విన్న గీతోపదేశం కాలకర్మముల ప్రాబల్యం చేత మరుగు పడిన దంతా ఒక్క సారిగా మనసుకు స్ఫురించింది. "విశోకో బ్రహ్మ సంపత్త్యా సంభిన్న ద్వైత సంశయః" దానితో బ్రహ్మాకార వృత్తి నిలకడ చెందగా సంశయ శోకాలు రెండూ నశించి నిర్మల జ్ఞాన సంపన్ను డవుతా డతడు.



Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అంతకు ముందే విరక్తు డయినాడు ధర్మజుడు.

యయాౖ హరద్భువో భారం - తాం తనుం విజహా వజః
కంటకం కంటకేనేవ - ద్వయం చాపీశితు స్సమమ్ -
యథా మత్స్యాది రూపాణి ధత్తే - జహ్యాద్యథానటః
భూ భారః క్షపితో యేన - జహౌ తచ్చ కళేబరమ్

మత్స్యాది శరీరాలు ధరించటం పరమాత్మ కొక లీల. భారావతారణమే వాటి ప్రయోజనం. ముల్లు ముల్లుతో తీసి తరువాత ఆ రెండు ముండ్లూ పారవైచిన ట్లొక శరీరమెత్తి మిగతా శరీరాలను నిర్మూలించి ఆ తరువాత రెంటినీ వదలి వేసి పోయాడాయన కవి రెండూ సమానమే. అని అర్జునుడనే మాటలు గాటంగా నాటాయి ధర్మరాజునకు. ఇక ఏ మాత్ర మాలసించినా అది పామరత్వమే నని భావించాడు. తాము నమ్ము కొన్న విలువైన సొమ్మే కాల ప్రవాహంలో నష్టమై పోయింది. ఇక తాముండి సాధించే దేముంది. వెంటనే తీవ్రమైన వైరాగ్య భావంతో తమ్ములూ తానూ పరీక్షిత్తును రాజ్యాభిషిక్తుణ్ణి చేసి సర్వమూ పరిత్యజించి ఉత్తర దిశగా పయన మవుతాడు. అంతకు పూర్వమే వారి తల్లి కుంతి యోగంతో శరీర త్యాగం చేసింది. తాము కూడా "మనసా ధారయా మాసు ర్వైకుంఠ చరణాంబుజమ్" మనసులో వైకుంఠుని మూర్తిని నిలుపుకొని "తస్మిన్ నారాయణ పదే" ఆ నారాయణుని మార్గంలోనే "ఏ కాంత మతయో గతి మవాపుః" అనన్య మనస్కులే అన్య జన దుర్లభమైన ఉత్తమ గతి చెందారట.

విధూత కల్మషే స్థానే విరజే నాత్మ నైవహి-
విదురోపి పరిత్యజ్య ప్రభాసే దేహ మాత్మవాన్
కృష్ణా దేశేన తచ్చిత్తః-పితృభిః స్వక్షయమ్ యయౌ"

వారి పినతండ్రి విదురుడు కూడా అక్కడక్కడా తీర్థ యాత్రలు చేస్తూ వచ్చి వచ్చి చివరకు ప్రభాస మనే తీర్థంలో మునిగి దేహ త్యాగం చేస్తాడట.



Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఆయనను తీసు కెళ్లటానికి పితృ దేవతలు వస్తారు. వారితో కలిసి పోయి యథా పూర్వంగా యమలోకంలో తన అధికార స్థానాన్ని అలంకరిస్తా డాయన.

చూడండి. ఇక్కడ మన మొక విషయం గమనించ వలసి ఉంది. కుంతి మొదలుకొని వీరంతా సగుణ భక్తులే గాని నిర్గుణ భక్తులు కారు. అంటే పరిపూర్ణ జ్ఞాన యోగులు కారని అర్థం. అక్కడక్కడా వారికి జ్ఞాన వైరాగ్యాలు కలిగినట్టు వర్ణించినా అది సగుణ మైన జ్ఞానమే. తన్మూలంగా ఏర్పడిన ప్రాపంచిక విషయ పరాఙ్ము ఖత్వమే. సమ్యగ్ జ్ఞాన రూపమైన అద్వైత దర్శనం కాదు. అద్వైత దర్శనమే అయితే కృష్ణా దేశ మనే మాట గాని వైకుంఠ చరణాంబుజ మని మాట గాని రాకూడదు. "వాసుదేవ స్సర్వమితి" అని విషయ జగత్తుతో సహా సర్వమూ తద్రూపంగానే భావించ వలసి నప్పుడిక కృష్ణు డేమిటి - వైకుంఠు డేమిటి. అలా అంటే అది పరిచ్ఛిన్న మైన తత్త్వం. అఖండ తత్త్వం కాదు. అఖండాన్ని పట్టుకొంటేనే జ్ఞానం. దాని వల్లనే ముక్తి. అంత వరకూ ముక్తికి నోచు కోలేడు మానవుడు. ఎంతటి భక్తుడైనా నోచుకోలేడు. వాడు నోచుకొనేది కేవలమా మూర్తి తోడి సాయుజ్యమే. అదీ మోక్షమని ఎక్కడైనా పేర్కొంటే అది కేవలం సాపేక్షమైన మోక్షమే గాని నిరపేక్షం గాదు. ఇలాంటి సాపేక్ష ముక్తినే పడయగలిగారు పాండవులూ - విదురుడూ. దీనికి తార్కాణ మొక్కటే. వారు చివరకు ధారణా ధ్యాన సమాధి రూపమైన యోగ మార్గం లోనే శరీర త్యాగం చేశారు. అంతేగాదు. వారు ఉత్క్రమణ చెంది పోయి చేరింది వారివారి పూర్వ స్థానాలేవో అవేగాని సర్వాత్మ భావం కాదు. సర్వాత్మ భావ మనేది పూర్ణ జ్ఞానం వల్లనే పొంద గలిగేది. అప్పుడు వాడి కుత్క్రమణా లేదు - ఎక్కడికో పోయి చేరటమూ లేదు. "నతస్య ప్రాణా ఉత్క్రామంతి - ఇహైవ సమవ నీయంతే" అని శాస్త్రం. అంచేత "ప్రేమన్ మీరలు" అని నారదుడు చెప్పినట్టుగా పాండవులది కేవలం భగవత్ప్రేమరూపమైన సగుణ భక్తే.

పోతే ఇక గోప గోపికల భక్తి. ఇది కూడా సగుణమే. "కామో త్కంఠత గోపికల్" అని ఇది కూడా కామ మనే వ్యాజంతో కూడిందే. అందులో గోపికలది కామమైతే గోపకులది సఖ్యం.దశమ స్కంధమంతా వీరి వ్యవహారం తోనే నిండి నిబిడీ కృత మయి ఉంది. కృష్ణుడు పుట్టింది మధురలోనైనా పెరిగింది వ్రేపల్లెలోనే. బాల్య మంతా అక్కడే గడచి పోయింది పరమాత్మకు. అయినా ఆయనకు బాల్య మేమిటి. పౌగండ మేమిటి – కౌమర మేమిటి – వార్ధక్య మేమిటి. అదంతా ఒక నటన. ఒక క్రీడ. తన క్రీడకు మరి కొందరు క్రీడాకారులను తోడుచేసుకోవలసి వచ్చింది. వారేగోపకులు. యాదవు లెవరో చెప్పింది భాగవతం–వారంతా కృష్ణప్రీతితో జననమందిన అమరులే నని.

యాదవ కులమున సమరులు
మేదినిపైఁ బుట్టఁ జనుడు మీ యంశములన్

అని బ్రహ్మ దేవుడు ముందుగానే వారి నాజ్ఞాపిస్తాడు. అంతేగాదు.

హరి పూజార్థము పుట్టుడు.
సుర కన్యలు భూమి యందు సుందర తనులై

అని దేవతా స్త్రీలను కూడా ఆజ్ఞాపిస్తాడు. వారే గోపికలయి జన్మించారు. అప్సరః స్త్రీలు గోపికలైతే గోపకు లెవరప్పటికి. వారా అప్సరః కాముకులైన గరుడ గంధర్వాది దేవతలే కావాలి. సందేహం లేదు. యాదవులే దేవతలని చెప్పినా–గోపకులు ఫలానా అని చెప్పక పోయినా–ఇది మన మూహించు కోవచ్చు.

అయితే ఎందుకిలా జన్మించారు వీరంతా. హరి సహాయార్థమా. పరమాత్మకు వీరు చేసే సహాయ మేమిటి. అలా చేసినట్టు ఒక సందర్భం కూడా కనిపించదు వారి జీవితంలో. మీదు మిక్కిలి అడుగడుగునా కృష్ణ భగవానుడే వారి నాదుకో వలసి వచ్చింది. అలాంటప్పు డెందుకు వీరిలా జన్మించటం. ఎందుకో గోపికల విషయంలోనే బయట పెట్టాడు మహర్షి.

హరి పూజార్థమని. భగవ దారాధన కోసమే వీరందరి ఆవిర్భావమూ. భగవంతుడికి తాము చేసే దేమీ లేదు. తమ కోసమే తమ ఆత్మోద్ధరణ కోసమే తాము జన్మ ఎత్తారు లోకంలో. దేవతలకు కూడా జన్మ ఉందా అని ఆశ్చర్యపడ నక్కర లేదు. జన్మ రాహిత్య మయ్యే వరకూ ఎవరైనా సరే జన్మించవలసిందే. వారు దేవతలే కాదు. మానవులే కాదు. జన్మ రాహిత్య మెప్పుడవుతుంది. జ్ఞానోదయమైతే. అది ఎప్పుడు. భక్తి యోగం పరిపాకానికి వస్తే. అంటే సగుణం నిర్గుణంగా మారితే. మొదలు సగుణానికే నోచుకో లేదు దేవతలు. కారణ మేమంటే వారు భోగ లాలసులు. కర్మ యోగులై తత్ఫలంగా స్వర్గాది లోకాలు చేజిక్కించు కొన్న వారు కొందరైతే - అసలు జన్మతోనే స్వర్గ వాసులుగా జన్మించిన వారు కొందరు. ఇందులో మొదటి వారు కర్మదేవతలు. రెండవ వారు ఆ జాన దేవతలు. ఆజాన దేవతలూ అనాదిలో ఎప్పుడో ఒకప్పుడుత్తమ కర్మాచరణ మూలంగా అలా అయిన వారే. మొత్తానికి ధర్మానుష్ఠాన పరిపాక ఫలమే దేవతా జన్మ. ఇది కర్మ సమాధి యోగాలు రెంటివల్ల లభించే పదవే గాని భక్తి జ్ఞానాల మూలంగా కాదు. అందుకే ఈ సుర కిన్నర గరుడ గంధర్వ సిద్ధ చారణాది దేవయోను లందరూ చాలా వరకు భోగ దాసులే గాని పరమాత్మ దాసులు కారు. కారు గనుకనే వారికి భక్తి భావాన్ని కరపి బాగు చేయటానికా అన్నట్టు పరమాత్మ అప్పుడప్పుడు వారికి అసుర శక్తుల వల్ల వల్లమాలిన ఉపద్రవాలు కలిగిస్తుంటాడు. దానికి హడలిపోయి వారు కూడా పరమాత్మను శరణువేడి తదను గ్రహంతో ఆ ముప్పు తప్పించుకొని అప్పటి కప్పుడు బ్రతికి బయట పడతారు. అయితే అది సహజం కాదు గనుక పబ్బం గడవ గానే మరలా యథా ప్రకారం గానే భోగ మయమైన జీవితాలు గడుపు తుంటారు. ఇదీ వీరి వరుస.

ఇలాంటి పశుప్రాయమైన జీవితాన్ని తప్పించి వారి కప్పుడప్పుడు తదతీత మైన భగవద్భక్తి నంకురింప జేసి క్రమంగా ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించ

టానికి వారినీ కర్మభూమిలో జన్మింప జేస్తాడా ఈశ్వరుడు. కర్మభూమిలో దేనికంటే ఇక్కడ దేవలోకంలో ఉండే భోగ భాగ్యాలూ లేవు. అణిమాద్యష్ట సిద్ధులూ లేవు. దీర్ఘ కాలిక మైన జీవితం కూడా లేదు. మీదు మిక్కిలి అడుగడుగునా ఆధ్యాత్మ కాది తాపాలూ క్లేశాలే తారసిల్లు తుంటాయి. అవి నిత్యమూ అనుభవిస్తేనే గాని జీవిత భోగాల మీద ఏవగింపు పుట్టదు వారికి. అయితే ఈ నిర్వేద మనేది ప్రతి లోమమే గాని అనులోమ మార్గం కాదు. అనులోమం భగవద్భక్తి. అది ఎలా లభిస్తుంది. ఎప్పుడో కష్టం వచ్చినప్పుడనే గాక కష్టంలో సుఖంలో అన్ని దశల్లో ప్రతి నిమిషమూ ఆ పరమత్మతో కలిసి మెలిసి కాపురం చేసినప్పుడే. అందుకే ఈ గోవ గోపికల జన్మ. అది కర్మ సమాధి పరాకాష్ఠ నందుకొన్న దేవజాతి భక్తి జ్ఞానాలలో శిక్షణ పొందటాని కని భూమి మీద ప్రభవించిన వ్యవహారం. దీని కనుగుణం గానే సాగింది వారి జీవిత వ్యవహారమంతా. గోపికల దొక రకంగా అయితే గోపకులది మరొక రకంగా.

మొదట గోపకుల వృత్తాంతమే తీసుకొని చూతాము. కృష్ణుడితో పాటు పుట్టారు పెరిగారు వీరు. కృష్ణు డెక్కడో పుట్టినా వచ్చి పెరిగింది వీరి మధ్యనే. పరమాత్మ వెతుక్కుంటూ వచ్చా డప్పటికి తన భక్తజనాన్ని. లేకుంటే ఆయన ఎక్కడ ఉన్నాడో అర్థం చేసుకొనే తాహతు లేదు గదా వారికి. ఇలా తన సన్నిధానం వారి కనుగ్రహించటం వారి ప్రయత్నానికి చేయూత నీయటం. అది చక్కగా అందు కొన్నారా బాలురు.

గోవల్లభుడ నేను గోవులు మీరని - వడి అంకె వై చుచు వంగి యాదు రాజనే భటులు మీరలురండు రండని-ప్రాభవంబున పెక్కు పనులుపనుచు ఇలా కృష్ణు డెలా పంచితే అలా పనులు చేస్తూ పసితనం నుంచీ ఆయనకు పరిచర్య చేస్తూ వచ్చారు. అంతేకాదు.

కపులమై జలశాశి గట్టుదమా యని- కట్టుదు రడ్డంబు కాలువలకు మునులమై తపములు మొనయుదమా యని మౌనులై యుందురుమాటలేక

ఇలా ఆయన చేసే చేష్టలన్నింటినీ తామూ అనుసరిస్తూ వచ్చారు. మరి ప్రతి రోజు ఆల కదుపులను తోలుకొంటూ పోయి ఆయనతో పాటు బంతి చలుదు లారగిస్తారు. "ఒకనొకని చల్దికావడి నొక డొక డడకించి దాచు" "ఒక్కడు మున్నె మటిచన నొక్కడు బలు బొబ్బవెట్టు నులికి పడంగన్" ఇలా తమ లో తా మెన్ని అల్లరి చేష్టలు చేసినా "వనజాక్షుడు మున్నరిగిన మునుపడ నేనేనె యతని ముట్టెద ననుచున్" పరమాత్మ వెంట పరుగిడే వారు. వారి చేష్టలు వర్ణించి చెబుతూ ఇలా అంటాడు శుక మహర్షి.

> ఎన్నడునైన యోగి విభు లెవ్వరి పాద పరాగ మింతయుం
> గన్నులఁ గాన రట్టి హరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్ట బట్టుచున్
> తన్నుచు గ్రుద్దుచున్ నగుచు తద్దయుఁ బై వడి కూడి యాడుచున్
> మన్నన సేయు వల్లవ కుమారుల భాగ్యము లింత యొప్పునే

"యచ్చావ హాసార్థ మసత్కృ తోసి విహార శయ్యాసన భోజనేషు" అని ఇలాంటి పనులు చేసినందు కెంతో ఒద్దుకొంటా డొకప్పు దర్జునుడు. అతడు కేవల భక్తుడూ కాదు. కేవలజ్ఞానీ కాదు. కనుకనే అలా వాపోయాడు. మరి ఈ గోపబాలురో కేవల మూఢ భక్తులు. వీరికి పరమాత్మ నిలా చేస్తున్నామే అనే భయం గాని సంకోచం గాని లేదు. విహార శయ్యాస నాదులే గాదు. ఒకరి నొకరు తన్నుతూ, గుద్దుతూ కూడా మెలగుతూ వచ్చారు. పైగా అది అపచార మనుకోలేదు వారు. ఆయన మీద చూపే ఒక గొప్ప మన్ననగా భావించారు. అది యోగుల వ్యవహారం కంటే సన్నిహిత మైనదట. అంటే కర్మ సమాధి యోగాల కన్నా భక్తి భావమే గొప్పది. అది ఎంత మూఢమైనా గాఢమే. అందుకే "మందులకు బాలుడగు హరి పొందు గని" రని మందులైనా వారి కతిసులభుండా భగవంతుడని చాటుతాడు.

మరి మూఢ భక్తి అంటే సామాన్య మని భావించ రాదు. మూఢత్వంలో కూడా అనన్య భావన అది. పరిపూర్ణ విశ్వాస మది. అలాంటి వారిని

పరమాత్మ ఎప్పుడూ తప్ప జూడదు. యే యథా మా మన్నట్టువారి ప్రపత్తికి తగినట్టే వారి నాదు కొంటాడు. ఒకనాడొక రాక్షసుడు గోగోప బాలుర నందరినీ మ్రింగుతా నని చెప్పి అజగరా కారుడై దారిలో పడి ఉంటాడు. గోపబాలురది చూచి కూడా

బకునిం జంపిన కృష్ణుడుండ మనకుం బామంచు చింతింపనే
టికి రా పోదము దాటి – కాకయది కౌటిల్యంబుతో మ్రింగు డున్
బకు వెంటంజను కృష్ణు చేత

అని తమలో తాము సమాధానం చెప్పు కొంటూ నిర్భయంగా వెళ్లి పోతారు. పరమాత్మ అది చూచి అయ్యో వీరు "నిర్భయులై యెదుర్కొనిరి నేఁగల నంచు" అంచేత వీరి నుపేక్షింప రాదని చెప్పి దాని కడుపులో దూరి పెరిగి దాని కడుపు చించి వారిని కాపాడుతాడు. మరొక పర్యాయం బ్రహ్మ బాలురను మాయం చేస్తాడు. కృష్ణుడది కనిపెట్టే ఒక ఏడాది కాలం ఆ గోపకుల వేషాలు తానే ధరించి ఎవరికీ అంతు పట్టకుండా వ్యవహరిస్తాడు. బ్రహ్మ తన చర్యకు తానే సిగ్గు పడి కాళ్ల మీద పడి మన్నింప మని ప్రాధేయ పడతాడు. అంతేకాదు.

ఏలా బ్రహ్మ పదంబు వేదములకున్ వీక్షింపగా రాని ని
న్నీ లోకంబున నీవనాంతరము నందీ మందలో – కృష్ణయం
చాలా పాది సమస్త భావములు నీయందే సమర్పించు నీ
వ్రేలం దొక్కని పాద రేణువులు పై వేష్టించినం జాలదే

అని వాపోతాడు. దీనిని బట్టి బ్రహ్మ పదంలో ఉన్నా బ్రహ్మ తత్త్వం అంతు పడుతుందని నమ్మకం లేదు. అంత కన్నా ఏ ఉన్నత పదంలో లేకపోయినా సామాన్యుడికే అది సులభం కావచ్చు. దానికి కారణమొక్కటే. అది అలాపాది సమస్త భావములూ అయన కర్పించి జీవించటమే. మరేదీ కాదు.

ఇలా జీవించారా గోపకులు. జల జాతాక్షుడు రాముడున్ నటనముల్ సల్పంగ గోపాలమూర్తులతోఁ గొల్చునిర్జరులు సంతోషించి వేణు స్వనంబులు గావించుచు కొమ్ము లూదుచు శిరంబుల్ ద్రిప్పుచున్ బాడుచు తిరుగు తుండేవారు. మాపాలికి బల కృష్ణులు భూపాలకులంచు నెగిరి బొబ్బిలిడుచు వారిని నేలమీద నడవ కుండా భుజాల మీద మోసుకొని పోయేవారు. ఆయన కేదైనా ఆపద జరిగిందంటే భరించ లేక తల్లడిల్లేవారు. కాళియుడు కృష్ణుని చుట్టివేసి నప్పుడా దృశ్యం చూచి ఇలా ఆక్రందన చేస్తారు.

అదె మన కృష్ణునిం గఱచి యంతటఁ బోక భుజంగమంబు దు
ర్మదమున మేనుఁ జుట్టుకొని మానక యున్నది - యింక నేమి సే
యుద మెటఁ జొత్త మే పురుషు లోపుదు రీయహి నడ్డపెట్ట

నని పెద్దపెట్టున గోల పెట్టారు. అంతేకాదు. తమకెలాటి ఆపదలు వచ్చినా సరే ఆయనే రక్షకుడని భావించి మరలా మొర పెడతారు. "నీ పద పద్మంబులు గాని యొండెఱుగ మోపద్మాక్ష యోకృష్ణ మ్రొక్కెద మో రామ మహా పరాక్రమ" "నీ పాదంబులు నమ్మిన నాపద లెక్కడివి జనులకు నీ చుట్టాలకు నాపదల్గలుగునే - మేమెల్ల నీవార - మన్యాచారంబు లెఱుంగ మీశుడ" వని ఈశ్వర తత్త్వ మెంతో తెలిసిన వారిలాగా కూడా కనిపిస్తారు. ఇంతెందుకు. తెలుసునో - తెలియదో - ఆ పరమాత్మ తత్త్వం వారికి. మొత్తానికి కృష్ణ పరమాత్మే లోకంగా ఆయనే తమ జీవిత సర్వస్వంగా బ్రతికారా గోపకులు. "మన్మ నాభవ మద్భక్తో మద్యాజీ మాం న మస్కురు మయ్యర్పిత మనో బుద్ధిః" అన్న భగవద్వాణి కుదాహరణ ప్రాయం వారి జీవితం. అంతే గాదు. అన్యాచారంబు లెఱుంగ మని వారన్నట్టు అది కూడా "యే శాస్త్రవిధి ముత్సృజ్య య జంతే శ్రద్ధయాన్వితాః- అన్యేత్వేవ మజా నంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే" అనే భగవద్వాక్యాని కనురూపమే.

పోతే ఇలాంటి వ్యవహారమే గోపికలది కూడా. వారూ భగవదర్పిత సమస్త భావనలే. అయితే ఉపాధిలోనే తేడా ఇరువురికీ. వారు పురుషో

పాధిలో ఉన్న దేవతలు. వీరు స్త్రీ ఉపాధులలో ఉన్న దేవ కన్యలు. కనుకనే సగుణంలో కూడా వారిది దాస భక్తి - సఖ్య భక్తి అయితే - వీరిది కామ భక్తి. కామోత్కంఠత గోపికల్ - అని గదా భాగవత వచనం. కామ మంటే ఇక్కడ స్త్రీ పురుష సంబంధం. ఇది కేవలం లౌకికమైతే గర్హణీయం. పరమేశ్వర విషయం కాబట్టి ప్రశంసనీయ మయింది. పరమేశ్వరు డొక్కడే వారి దృష్టిలో పురుషుడు. పూర్ణత్వ మున్న వాడెవడో వాడు పురుష డంటే. అలాంటి పూర్ణత్వం భగవంతుడికిగాక మరెవరికి. కనుకనే పురుషుడైనా పురుషోత్తముడైనా వాస్తవానికా భగవానుడే. మరెవరూ కాదు. కాదు గనుకనే తమ తమ భర్తలను అత్త మామలను ఎవరినీ లెక్క చేయక ఇది లోక నింద్య మని కూడా సంకోచించక కృష్ణుని వెంటబడి పోయారా గోపికలు. పైగా ఆయనే సంకోచించి మీరేమిటిలా నామీద దాడి చేస్తున్నారు. మీకు భర్తలులేరా-అత్తమామలు లేరా - వారా గ్రహించరా - లోకు లాడి పోసుకోరా - అని ప్రశ్నిస్తే కూడా - భర్త లేమిటి బంధువు లేమిటి అంతా నీ స్వరూపమే గదా నీలోనే మేమీ ప్రపంచాన్నంతా చూస్తున్నప్పుడిక మాకు పాపమేమిటని - సమాధాన మిస్తారు. భక్తిలో ఇది పరాకాష్ఠ. దీనినే మధుర భక్తి అంటారు భక్తి తత్త్వ విశారదులు.

మధుర భక్తి ఏమిటి. మామూలు భక్తి కాదా ఇది. కాదు. మామూలు భక్తి పురుషులకు పురుషోత్తముడి మీద అయితే - ఇది స్త్రీలకా పురుషోత్తముడి మీద, వాస్తవానికి పురుష డొక్క పరమాత్మే నని చెప్పాము. ఆ దృష్టితో చూస్తే లోకంలో ఉన్న స్త్రీ పురుషులంతా స్త్రీలే. అయినా ఆ భావం పురుషులకు కలగటం కష్టం. వారి పురుషోపాధి వారి కడ్డం వస్తుంది. స్త్రీలకైతే అలాంటి చిక్కులేదు. వారి శరీరాలు స్త్రైణాలే కాబట్టి సహజం గానే మేము స్త్రీలం- ఆయన పురుషుడు - ఆయనకు మేమధీనల మనే భావ మేర్పడుతుంది. ఈ అధీన భావం లోకంలో స్త్రీకి తన పురుషుడి విషయంలో స్వాభావికమే. స్త్రీ శరీర నిర్మాణమే దానికి హేతువు. అది

సహజం గానే పురుషుడి కధీనమై పోతుంది. అతనికి వశవర్తి అవుతుంది. అతని ఇచ్ఛాను సారం నడుస్తుంది. ఒదుగుతుంది. కరుగుతుంది. కలిసి పోతుంది. అనిర్వచ నీయమైన ఆనందమిస్తుంది. పొందుతుంది. చివర కతడూ తాననే భేదం లేకుండా అభేదాన్నే భజిస్తుంది. లోకంలో చూచే ఈ వ్యవహారంలో ఎంత మాధుర్యముందో అదే సరిగా గోపికలకూ గోపికా వల్లభుడికీ మధ్య ఉన్న వ్యవహారంలో కూడా. అయితే ఇది మాధుర్యమే గాని భక్తి కాదు. అది మధురమూ భక్తీ కూడా. కారణం. ఇది కేవలం లౌకికం. అది లోకోత్తరం. ఇక్కడ కేవలం స్త్రీ పురుషులమే మన మని శరీర ధర్మాలే చూస్తున్నారు. అక్కడ ఈ స్త్రీ నేనొక పరమ పురుషుణ్ణి భజించే భక్తురాల ననీ - ఆయనకే ఈ తనుధన మనః ప్రాణాలన్నీ సమర్పితమనే పరిపూర్ణ భక్తి భావంతో ప్రవర్తిస్తుంది. ఆ పురుషుడు కూడా అశరీరుడూ నిత్య ముక్తుడూ అయిన పరమ పురుషుడు కాబట్టి ప్రత్యేకంగా నేనొక స్త్రీ శరీరంతో భోగిస్తున్నాను- దీని మూలంగా నా కెనలేని నిర్వృతి కలుగు తున్నదనే సవిషయ భావంతో ఉండడు.

ఇలాంటి ఆంతర్య మిందులో ఇమిడి ఉంది గనుకనే ఇది మధుర భక్తి. ఇది లౌకికం కాదు - లోకోత్తరమని చెప్పాము. లోకోత్తరం గనుకనే మనకది అర్థం కాదు. అర్థం కాకపోతే దాని మాధుర్య మెలాంటిదో చవి చూడలేము. కాబట్టి మన కోసమని పురాణ కర్త దాన్ని లౌకికమైన స్థాయిలో వర్ణించ వలసి వచ్చింది. అలౌకి కానికి లౌకిక మనేది ప్రతి బింబమే గదా. అది బింబమైతే ఇది దానికి ప్రతిబింబం. ప్రతిబింబం వట్టిదే. మిథ్యాభూతమే. మిథ్యా భూతమైనా ఇది ఆ తథ్యమైన బింబాన్ని మనకు పట్టి ఇస్తుంది. ఒక పక్షి ఆకాశంలో ఎగురు తూంటే దాని నీడ మనకు నేల మీద కనిపిస్తుంది. ఇదే ఆ పక్షి కాదు. కాని అది కనిపించగానే పైకి చూస్తాము మనం.. ఎందుకు. ఈ నీడ ఎక్కడిదా అని. చూస్తే తప్పకుండా పైన ఎగిరే పక్షి కంట బడుతుంది. అప్పటికీ ప్రతి బింబమే గదా ఆ బింబాన్ని చూపింది

మనకు. అలాగే లౌకికమైన ఈ గోపికా కృష్ణుల శృంగారమంతా లోకోత్తరమైన శృంగారానికి ఒక ఛాయ, అయితే ఏమిటా లోకోత్తరం అని అడగ వచ్చు. అదే జీవేశ్వరుల పరస్పర సంబంధం. గోపిక లంటే ఎవరో కాదు. జీవులే. గోపికా వల్లభుడైన కృష్ణుడా ఈశ్వరుడే. సహజంగా జీవుడు పరిపూర్ణుడు కాడు. కనుక పురుషుడు కాదతడు. స్త్రీ. ఈ స్త్రీ పరిపూర్ణత నందు కోవాలంటే పూర్ణ పురుషుణ్ణే భజించాలి. ఆ స్వరూపంతో ఏకత్వం భజించాలి. "సతా సోమ్య తదా సంపన్నో భవతి" - అంటున్న దుపనిషత్తు. అంతే కాదు. "యథాస్త్రియా సంపరిష్వక్తో - న బహిర్వేద - నాంతర"మ్మని లోకంలో స్త్రీ పురుష వ్యవహారాన్నే జీవేశ్వరైక్యాని కుపమానంగా వర్ణిస్తుంది.

దీనిని బట్టి గోపికా కృష్ణుల వ్యవహార మెట్టిదో ఇక మనం బాగా అర్థం చేసు కోవచ్చు. పైకి భౌతికంగా అశ్లీలంగా కనిపించినా అది అభౌతికం. ఆదర్శప్రాయం. బాల్యం నుంచీ కృష్ణుడు వారి పట్ల చేసిన అల్లరి చేష్టలన్నీ భగవంతుడు భక్తులను అజ్ఞాన నిద్ర నుంచి మేల్కొలపటమే. వారిని రెచ్చ గొట్టటమే. తన ఉనికి నెఱిగించటమే. ఎలయించటమే. అది గమనించారా గోపికలు కొంతకాలానికి. ఆయనసాంగత్యంకోస మాసించారు. తమ సర్వస్వమూ సమర్పించారు. క్షణమాలస్య మైతే భరించలేక పోయారు. కనిపించకపోతే కలవరపడ్డారు. అయితే నిజంగానే వీరు తనకు సర్వస్వమూ అప్పగించారా లేదా అని ఆ పరమాత్మ వారిని తాను కూడా పరీక్షిస్తుంటాడు. అలాంటి ఒక పరీక్షే వస్త్రాపహరణం. లోతుకు దిగకుండా పైకి చూస్తే ఇది మహా బూతు. రౌడీ చేష్ట. కాని భౌతికం కాదని గదా ముందే చెప్పాము. భౌతికమైన ఈ తెరమరుగున ఎంతో ఆధ్యాత్మిక మైన భావ మున్నది. ఏమటది. వస్త్ర మంటే జీవులకున్న దేహాభిమానం. అది ఉన్నంత వరకూ ఈశ్వర సాయుజ్యానికి నోచుకోలేదు. జీవుడు తన పాటికి తాను వదులుకో లేడది. ఈశ్వరానుగ్రహం కూడా తోడు కావాలి దానికి. అందుకే వారి నేమరించి వారి వస్త్రాలపహరించాడు కృష్ణుడు. నీళ్లలో నుంచి ఇవతలికి

రమ్మన్నాడు. ఆ కొలను సంసారమే. దానిలో నుంచి ఎంతగా పరమాత్మ హెచ్చరించినా బయట పడట మిష్టం లేదు వారికి. చివరకు పడక తప్పింది. కాదు. చేతు లెత్తమనికూడా అంటాడు. ఇదిమరీ అన్యాయంగా కనిపిస్తుంది. కాదు. చేతులతో గోప్యాంగాన్ని కప్పి పుచ్చు కొన్నారు వారు. పరమార్థంలో కప్పి పుచ్చుకో వలసిం దేదీ లేదు. ఎందుకంటే సర్వత్రా ఉన్నాడీశ్వరుడు. "అంతర్బ హిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః" అలాంటప్పుడు కప్పిపుచ్చినా కనపడక పోదు గదా. ఇక ఏమిటి కప్పుకొనేది మనం. "తేనత్యక్తేన భుంజీథాః" అన్నట్టు మనకున్న సర్వమూ త్యజిస్తే గాని ఆ తత్త్వంతో సాయుజ్యాన్ని భజించలేము మనం. ఇదే ఈ కథలోని సారాంశం.

పోతే రాస క్రీడలు. జల క్రీడలు. ఇవన్నీ జీవేశ్వరుల సంసర్గమే. మరేదీ గాదు. అనన్యమైన సగుణ భక్తికిది పరసీమ. ఇందులోని ఆంతర్యం భాగవతమే బయట పెట్టింది. పరీక్షిత్తు లౌకికంగా భావించి ప్రశ్నిస్తే - శుకుడు దాని కలౌకిక మైన స్థాయిలో సమాధాన మిస్తాడు. సర్వ భక్షకుడైన అగ్ని హోత్రుడికే దోషమూ ఎలా అంటదో పూర్ణ జ్ఞానైశ్వర్య సమన్వితుడైన పరమాత్మ కేవ్యవహారమూ అంటదు పొమ్మంటాడు. అలాంటి పరిపూర్ణత లేదు గనుకనే మనబోటి మానవులకే ఈ ధర్మా ధర్మాది విచికిత్స అని కూడా జవాబిస్తాడు. ఒకవేళ మానవుడు కూడా ఆ స్థాయి కెదగ గలిగితే మరీ మంచిదే. వాడికి లేదలాటి ద్వంద్వ ప్రసక్తి అని కూడా అర్థం చేసుకోవాలి మనం. కనుకనే తమ ప్రవర్తన గూర్చి కృష్ణు డాక్షేపించి నప్పుడు అన్ని ధర్మములూ తెలిసిన నీవేనా ఇలా మాటాడ వలసించ దని మరలా ఆయనను మందలిస్తారు గోపికలు. ఇంత ధైర్యంగా అన గలిగారంటే అది అనన్యమైన వారి మధుర భక్తికి నిదర్శనం.

ఇలాంటి భక్త్యావేశంతో ఆ గోపిక లెక్కడ బడితే అక్కడే ఆ పరమత్మను చూడ గలుగుతారు. ఆయన వియోగం క్షణ కాలం కూడా సహించలేరు. సర్వత్రా తన మూర్తిని దర్శించ వలసిన వారలా తపన చెందట మిష్టం

Vallamrajusri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

లేదు పరమాత్మకు. అందుకోస మున్నట్టుండి ఆయన వారి మధ్యలో నుంచి మాయ మయి పోయేవాడు. అది వారి అనన్యమైన భక్తి కొక పరీక్ష ఆయన దృష్టిలో. కాని వారి దృష్టిలో ప్రగాఢమైన విరహం. దానితో తపించి పోయి వారు "పున్నాగ కానవే పున్నాగ వందితు – తిలకంబ కానవే తిలక నిటలు" అని తమ ప్రాణ నాథుణ్ణి అక్కడా ఇక్కడా వెదకుతూ పోతారు. "నల్లని వాడు పద్మనయనంబుల వాడు–" అంటూ ఆయన చిరునామా చెప్పి ఇలాంటి వాడొకడు మా మానధనాన్ని దోచుకొని పోయాడు – మీ పొదల మాటున లేదు గదా చెప్పండని కనపడ్డ మల్లె తీవల నన్నింటినీ అడుగుతూ పోతారు. ఇంకా విరహోన్మాద మెక్కువయి "అదె నంద నందను డంతర్హి తుండయె – పాటలీ తరులార పట్ట రమ్మ – హేలా వతుల కృష్ణ యేల పాసితివని–యై లేయ లతలార యడుగరమ్మ" అని నోరులేని చెట్లులనూ గుట్టలనూ ప్రాధేయ పడేవారు. అంతే గాదు.

కిటియై కౌగిట్టఁ జేర్చెను
వటుడై వర్ధిల్లి కొలిచె వడి కృష్ణుండై
యిట పద చిహ్నములిడె– క్రిం
దటి బాముున నేమి నోచితమ్మ ధరిత్రీ

అని భూదేవి సౌభాగ్యానికి మురిసి పోతారు. ఇంకా వెఱ్ఱి తల కెక్కితే

పూతనయైయొక్క పొలతిచరింపంగ శౌరియై యొక కాంత చన్నుగుడుచు బాలుడై యొక భామ పాలకు నేడ్చుచో బండినేనని లేమ పాఱదన్ను. ఇలా కృష్ణుని బాల్య చేష్టలు తమ మీద ఆపాదించు కొని తృప్తి పడతారు.

సగుణో పాసకుల వ్యవహారమే ఇంత. అందులోనూ ఉపాసకులు స్త్రీలయినప్పు డిక చెప్పనే అక్కర లేదు. చేతనా చేతన వివేచన ఉండదు వారికి. తన్మ యత్వ మెక్కువయ్యే కొద్దీ చరా చర ప్రకృతి అంతా తమ ఉపాస్య దేవతా మయం గానే భాసిస్తుంది వారికి. ప్రకృతిలో ఏది చూచినా



Brahmasri Vallabhajosyula Srinivasa Rao www.advaitavedanta.in

అది తమ దైవానికి ప్రతికృతే. ఆయన మూర్తిని పట్టి ఇచ్చే ప్రతీకమే. లేకుంటే

కొమ్మకు పువ్వులు గోసినాడిక్కడ మొనసి పాదాగ్రంబు మోపినాడు
సతినెత్తు కొని వేడ్క జరిగినాడక్కడ – తృణములో లేదిదె తెలవజాడ
ఒక యెలనాగచే యూదినాడిక్కడ సరసనున్న వినాల్గు చరణములును
ఒక నీలవేణితో నొదిగినా డిక్కడ – మగజాడలో నిదెమగువ జాడ

అంటూ ఇలా ఎక్కడ బడితే అక్కడ భగవత్పద ముద్రలు దర్శన మీయవు వారికి. భక్తుడికీ ప్రపంచమంతా భగవ ద్విభూతే. తత్స్వ రూప ముద్రా ముద్రితమే. ఇందులో ఏ ముద్ర చూచినా అది ఆరూపాన్ని పట్టి ఇచ్చే గట్టి లాంఛనమే. అయితే అలా చూచే దృష్టి ఉండాలి సాధకుడికి. ఉన్ననాడిక సృష్టి అంతా స్రష్ట రూపమే మరేదీ గాదు. అలాంటి అంతర్దృష్టి తోనే దర్శించ గలిగా రాగోపికలు.

అలా దర్శించటంలో వారి కప్పు డప్పు డాయన కేవలమూ తమ్ము వలచి వలపించే వల్లభుడే కాదు. సకల జగ దంతర్యామి అయిన ఆ పరమాత్మేనని భావన కూడా ఉదయించేది. "నీవు యశోద బిడ్డడవె – నీరజ నేత్ర సమస్త జంతు చేతో విదితాత్మ వీశుడవు – తొల్లి విరించి దలంచి లోక రక్షా విధ మాచరింపు మని సన్నుతి సేయగ సత్కులంబునన్ భూ వలయంబు గావ నిట పుట్టితి గాదె మనోహరా కృతిన్" ఒక ఆకృతి అంటూ లేని పరతత్త్వ మింత మనోజ్ఞమైన ఆకృతి ధరించి ఆవిర్భవించిం దంటే అది భూ భారావతార ణార్థమే నని ఎంతో ఆర్ష దృష్టి తమ కున్నట్టు కనిపిస్తారు. కాని అంతలోనే "నీ నగవులు నీ చూడ్కులు నీ నానా విహారణములు నీ ధ్యానంబుల్ నీ నర్మాలాపం బులు మానసములు నాటి నేడు మగుడవు కృష్ణా– నీ యధ రామృత సంసేవన విధి నంగజు తాప మెల్ల విడిపింపఁగదే" అని సగుణ భావనలో తల మునకలుగా మునిగి

పోతారు. ఆ నల్లని ముగ్ధమోహన రూపంతోనే కనిపించి తమ వియోగ వహ్ని చల్లార్చ మని బ్రతిమాలుతారు.

మరి ఆయన సామాన్యుడా. "యే యధామా మన్నట్టు"వారెంతో తానూ అంతే.

తను రావే యని చీరి యేడువ జగత్త్రాణుండు - త్రైలోక్య మో
హనుడై మన్మథ మన్మథుం డయి - మనోజ్ఞా కారియై - హారియై
ఘన పీతాంబర ధారియై పొడమె -

వారు కోరిన రూపంతోనే ప్రత్యక్ష మవుతాడు. వెంటనే తమ వల్లభుడు విచ్చేశాడని వికసిత ముఖులై ఆ సఖులు ఆయన కేలు పట్టుకొంటే ఒకతి చేయి భుజం మీద వేసుకొంటే - ఒకతె తాంబూల మాసిస్తే - మరొకతె ఆయన మృదులమైన పదాలు తన పరితప్త కుచాల మీద పాదు కొల్పుతుంది. ప్రేమాతి శయంతో నిష్ఠు రోక్తు లాడుతారు. అంతే కాదు.

కొలిచినఁ గొలుతురు కొందఱు
కొలుతురు తముఁ గొలువ కున్న కొందఱు పతులన్

అని సాభిప్రాయంగా మాట్లాడుతా రాయనతో. దాని కాయన జవాబిస్తూ "ఏనిం దెవ్వడ నైనంగాను-మానస బంధుడ - నిత్య ధ్యానము మీ కొసగ వలసి తలగితి" నని తన అంతర్ధానంలోని అసలు రహస్యాన్ని బయట పెటతాడు. ఇంకా ఒక మంచి చురక పెడతాడు వారికి.

నను సేవించు నున్న వారలకు నేనా రూప ముం జూపఁ జూ
చిన భావించి మదించి వారు మఱినన్ సేవింప రోయంచు

ఇది భగవానుడి భయం. ఒక విశిష్టమైన రూపంతో కనిపిస్తే ఇదే శాశ్వతం ఇంతకన్నా మరేమికాదు-మరి ఇదెప్పుడు మనతో తిరుగుతూ మన ఆధీనంలో ఉన్నదే గదా అనే సంకుచిత భావ మేర్పడు తుంది భాగవతులకు.



Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అలాకాక వారికీ విశాల విశ్వమంతా భగవద్రూపమే ననే దృష్టి ఏర్పడాలంటే తాను తన రూపాన్ని ఉపసంహరించాలి. అప్పుడా రూపాన్ని చూడాలనే తహ తహతో సృష్టిలో ప్రతి ఒక్కటీ అన్వేషిస్తూ పోతాడు సాధకుడు. భగవదంతర్ధానాన్ని తమ కేర్పడిన మాన ధనాన్ని అపహరించి తమ కసలైన తత్త్వాన్ని చాటటంగా కూడ అర్థం చేసుకొంటారు. ఇదే అప్పు డప్పుడు కృష్ణుని అంతర్ధానంలో ఇమిడి ఉన్న ఆంతర్యం. వియోగానంత రోపనత మైనపుడే సంయోగంలోని విలువ గుర్తిస్తాడు సాధకుడు. అలాగే గుర్తించారు గోపికలు. తనివి దీఱ ఆయనతో రాసక్రీడాదుల నుభవించారు. రస సంబంధియే రాసం. రసో వైసః. రసం పరమాత్మ స్వరూపమే. తత్సాహ చర్యాన్ని అనుభవించటమే రాసక్రీడ. తన్మూలంగా కలిగే నిర్వృతి ఏదుందో అదే జలక్రీడ. జల మంటే ఉపశమనం. మౌనం. భగవత్సాహ చర్యాను భూతి చివరకు మౌనం తోనే పర్యవ సిస్తుందని చెప్పటమే రాసక్రీడా నంతర జలక్రీడా వర్ణనం.

ఇలాంటి నిర్వాణ భూమిక నందుకొన్న తరువాత ఇక న్యాయమైతే వారక్కడి నుంచి తిరిగి రాకూడదు. అంటే తగ్గు స్థాయిలో కలిగే ఆలోచనలు మనసులో ప్రవేశించరాదు. అయినా ప్రవేశించాయా గోపికలకు. కారణం వారింకా సగుణ భూమికలో నుండటమే. నిర్గుణం లాగా భాసించే సగుణ భక్తి ఇది. జ్ఞానుల లాగా అప్పు డప్పు డుపన్యసించినా తదాభాసే గాని తత్త్వం కాదది. దీనిని బయట పెట్టటానికే అక్రూరాగమనం. కంసుని ఆదేశాన్ని శిరసావహించి రామ కృష్ణులను తోడ్కొని పోవటానికి వచ్చా డక్రూరుడు. అది మహా క్రూరమైన చర్యగా కనిపించింది వారికి. కృష్ణుడు తమకు మరలా దూర మవుతున్నాడే అని వారి బాధ. దూరం కావాలను కొన్న వాడసలు కృష్ణుడే. తానే దూరం కావాలను కొని దానికి కంసుణ్ణి అక్రూరుణ్ణి ఒక నిమిత్తం చేసుకొన్నాడా పరమాత్మ. అది అల్పమేధసలైన ఆ గోపికల కంతు పట్టలేదు. పైగా అక్రూరుడే కావాలని తీసుకెళ్లు తున్నాడని



Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఆయన నెక్కడ లేని శాపనార్థాలు పెడతారు. "అక్రూరుండని పేరు పెట్టుకొని నేడస్మన్మనో వల్ల భుం జక్రిన్ మాకడc బాపి కొంచు నరుగన్ చర్చించి యేతెంచినా దక్రూరుండట క్రూరుడీత"దని తిట్టి పోస్తారు. "హరి నేలాకొని పోయె దంచు మన మా యక్రూరుc బ్రార్థింతమా" అని మరలా సామానికి దిగుతారు. ఇది కూడా పనిచేయక పోయే సరికి "మము గృపం బాటింపు గోవింద మాధవ దామోదర యంచు" సుజాతం బైన గీతంబులతో విలపిస్తారు. దానికీ లెక్కచేయక వారు వెళ్లిపోతుంటే "అదె చను చున్న వాడు ప్రియుడల్లదె తేరదె వైజయంతి" అని ఒకరి కొకరు వేలు పెట్టి చూపుతూ కండ్ల కబ్బినంత దూరం చూస్తూ నిలబడి పోతారు.

ఏమిటిదంతా. సగుణ చింతనలో ఉన్న దౌర్బల్యమే ఇది. కనిపిస్తే ఆహ్లాదం. కనపడ కుంటే విషాదం. ఎప్పుడూ ఏక రూపంగా ఉండే స్థితి కాదిది. అలాంటి స్థితే కావాలంటే అది నిర్గుణం లోనే. సగుణంలో దొరకదా నిధానం. కనుకనే పెన్నిధి కోలుపోయిన పేదలలాగా కృష్ణుని సన్నిధి కోలుపోయిన గోపిక లోపికలు లేక చీకాకు పడసాగారు. మరలా వారి నేడిపించటానికా అన్నట్టు కృష్ణుడు వారి చెంత కుద్ధవుణ్ణి పంపుతాడు. "నాపై జిత్తము లెప్పుడున్ నిలుపుచున్ నారాకcగాంక్షించుచున్ గోపాలాంగన లెంత జాలిcబడిరో చూచి రమ్మని పంపుతాడు. పైగా "సందేహము మానుండర విందా ననలార మిమ్ము విడువను - వత్తున్" "నాకాశ్రిత రక్షణములు నై సర్గికముల్" అని ఆయన ద్వారా తన హృదయాన్ని ఆవిష్కరిస్తూ వారికొక సందేశం పంపుతాడు. అయితే ఆయన వ్రేపల్లెకు వచ్చి ఆ సందేశ వచనాలు వారికి వినిపించే లోపలనే వారు సహనం కోలుపోయి వచ్చిన వాడినీ - పంపిన వాడినీ - ఎవరినైనదీ తెలియని దశలో దిశ దిశలూ మారు మోగే లాగా నానా విధాలైన నిష్ఠురోక్తులూ సాగిస్తారు. దగ్గరగా తిరుగుతూన్న ఒక భ్రమరం మీద నెపంపెట్టి ఎగ్గు లాడుతారు. "భ్రమరా దుర్జన మిత్ర ముట్టకుము మా పాదాబ్జముల్ -"



Yallamraju Srinivasa Rao
www.avadhoota.in

ఎందుకని. "నాగర ప్రమదాళీ కుచకుంకు మాంకితల సత్ప్రాణేశ దామ ప్రసూన మరం దారుణి తాన నుండ వగుటన్." అంతేకాదు నిలకడ కూడా లేనిదానివి నీవు. "ఒక పువ్వందలి తేనెద్రావి మధుపా యుత్సాహివై నీవు వేఱొకటిం బొందెడి దానవే గద. ఇలా నిష్ఠూరంగా మదనోన్మాదలై పలుకుతుంటే ఉద్ధవుడు వారి నూరడిస్తూ "విశ్వేశుపై మీకజ ప్రపటుధ్యానము లిట్లు నిల్చునే" ఎంత చిత్రమో గదా మీ చరిత్ర–" కృష్ణుడు మీకు చెప్పమన్న మాటలివి. "కలఁగని లేచి మున్ను గలఁగన్న సమస్త విధంబు గల్గాఁ దలచిన భంగి" తద్జ్ఞుడైన వాడీ ప్రపంచాన్ని చూస్తాడు. మీరూ ఆతద్జ్ఞుల మార్గంలో మెలగాలని నా ఆశ. అందుకే ఈ మార్గంలో నన్ను మీరలు చింతించుచు నుండఁగోరి యిటు దూరస్థత్వముం బొందితిన్" "తలకం బోలదు నన్ను గూడెదరు నిత్య ధ్యాన పారీణలై" ఇదే ఆఖరి మాట. ఇక కృష్ణుడు వచ్చింది లేదు. వారిని చూచింది లేదు. నిత్య ధ్యాన పారీణలై ఉండటమే వారు పాటించవలసిన విధి.

ఇదే చివరకే భక్తుని విధి అయినా. సగుణ భక్తి మానవుని తరింప జేయదు. అది ఒక అలంబన మాత్రమే. దానిని విడవ కుండా నిత్యమూ పట్టుకొని కూచున్న వాడికదే కొంత కాలానికి నిర్గుణంగా పరిణమిస్తుంది. దానికి భగవన్మూర్తి ఇక కనిపించ గూడదు. అది పూర్తిగా అంతర్హితమై పోవాలి. అప్పుడే నిలకడ భక్తికి. ఇలాంటి భక్తి నలవరుచుకొని జన్మ తరింప చేసుకోటానికే జన్మించారీ గోపికలూ ఆ గోపకులు. గోపకులు దేవతలైతే గోపికలా దేవతాస్త్రీలైన అప్సరసలేనని పేర్కొన్నాము. అదీ ఒక సంకేతమే. వాస్తవానికీ దేవతలూ దేవకన్యలూ ఎవరో గాదు. మానవుడి ఇంద్రియ వ్యాపారాలే దేవతలు. దీవ్యతి ప్రకాశతే ప్రత్యర్థ – మితి దేవః దేవతా. శబ్ద స్పర్శాదులైన ప్రతి ప్రాపంచిక విషయమూ దేనివల్ల ప్రకాశిస్తున్నదో అది దేవత. త్వక్చక్షు రాదీంద్రియ వ్యాపారాల మూలంగానే కదా అది. అవి అనంత కోటి ఆ వ్యాపారాలు. అనంతకోటి దేవతలీ వ్యాపారాలే. వీరే

గోపకులు. గోపన శీలమైన ఇంద్రియ వ్యాపారాలే గోపకులు. పోతే తజ్జన్యమైన అనుభూతు లేవో అవి గోపికలు. గోప గోపిక లంటే ఇంద్రియ వ్యాపారాలు - వాటి అనుభూతులే ఇంతకూ. ఇవి మామూలుగా అయితే బాహ్య ప్రపంచాభి ముఖంగానే ప్రసరిస్తుంటాయి. అందులో సుఖాన్నే చూర గొనాలని ఆసిస్తుంటాయి. దాన్ని దాచుకొని దగ్గర పెట్టుకోవాలనే తాపత్రయ పడతాయి. అదే గోపనమంటే. కాముకులైన దేవజాతులకిది నిసర్గసిద్ధం. అది ఉన్నంత వరకూ ముక్తి లేదు. భక్తి ఉంటే గదా ముక్తి. దానికే నోచుకోలేదు మొదట వారు. అంచేత ప్రపంచాభి ముఖంగా వెళ్ళే వాటిని భగవదభి ముఖంగా మళ్లించాలి మొదట. అందుకే దేవ యోనులైన స్త్రీపుంస వర్గమంతా ఇలా గోప గోపికలుగా అవతరించింది. కృష్ణవేష ప్రతిచ్ఛన్నుడైన పరమాత్మ నలా అనుక్షణమూ సేవిస్తూ వచ్చింది. పరమాత్మ నుంచి జనించిన ఈ కళలన్నీ ఎప్పటికైనా ఆ పరమాత్మను చేరవలసిందే. అందులో లయం చెంద వలసిందే. "యథా నద్యః స్యందమానా స్సముద్రేஉ స్తం గచ్ఛంతి నామ రూపే విహాయ - తథా ఇమాః కలాః పురుషాయణాః పురుషమ్ ప్రాప్య అస్తమ్ యంతి" అనే శాస్త్ర వాక్యాని కిది శేష భూతమైన అర్థవాదం. అంతకన్నా మరేమీ లేదు.

గోప గోపికా జన వృత్తాంతమైన తరువాత ముఖ్యంగా పరిగణించ వలసిన పరమ భాగవతులిద్దరే ఇద్దరున్నారు. ఒకడు అక్రూరుడు. మరొకడు ఉద్ధవుడు. వీరిద్దరూ కృష్ణుని వంశంలో జన్మించిన వారే. ఆయనకు సంబంధులే. "సంబంధులై వృష్ణులున్" అని నారదుడు చెప్పినట్టు వీరిది సంబంధ భక్తి. అయితే అలా చెప్పటం కూడా అంతసరి గాదేమో. ఏమంటే సంబంధు లాయన కెందరు లేరు. ఉగ్రసేన, శూరసేన కంసాదులంతా సంబంధులే గదా. వారందరికీ ఆయన యెడల భక్తి ఉందా పెట్టిందా. కాబట్టి సంబంధమనేది అకించిత్కర మిక్కడ. అది ఉన్నా లేకున్నా భక్తి అనేది ఉన్నవాడి కున్నది. లేని వాడికి లేదు. అక్రూరోద్ధవులు యదువంశంలో

పుట్టట మనేది యాదృచ్ఛికం. బహుశా యోగ భ్రష్టులయి ఉంటారా మహానుభావులు, పూర్వమెప్పుడో యోగాభ్యాసం చేసి చేసి అది ఫలించ కుండానే మరణించి ఉంటారు. "అధవా యోగినా మేవకులే భవతి" అన్నట్టు దాని ఫలితంగా ఈజన్మలో యోగీశ్వరేశ్వరుడైన కృష్ణ భగవానుడి వంశంలో వచ్చి పడిఉంటారు.

ఇందులో ఉద్ధవు డాయన కమాత్యుడూ - ఆచార్యుడూ - ప్రాణ స్నేహితుడూ అయితే - అక్రూరుడు వరుసకు తండ్రిలాంటి వాడాయనకు. బంధుండవు సద్యోహిత సంధుండవు - వావిజూడ జనకుడవని కృష్ణుడే అంటాడా మాట. అయినా పరమాత్మకు తండ్రులేమిటి. తల్లులేమిటి. అది ఒక నటన. అందరూ ఆయనకు భక్తులే. తదీయ గుణగణాసక్తులే. అలాంటి వాడే ఈ అక్రూరుడు. క్రూరుడు కాని వాడక్రూరుడు. అయన పేరే చెబుతున్న దాయన ఎంత సౌమ్య స్వభావుడో. అయితే అక్రూరుడైనా క్రూరుడైనా కంసుణ్ణి కాదనలేక పోతాడు. సరిగా రామాయణంలో విభీషణుని లాంటివాడు. భీషణుడు కానివాడు విభీషణు డయినట్టే క్రూరుడు కాని వాడక్రూరుడు. అన్నగారి దుండగా లాయన సహించినట్టే సహించాడు అక్రూరుడు కూడా కంసుని దుండగాలు. ఆయన చివర కన్నను కాదని వెళ్ళిపోయినట్టే ఈయనా సందేశమనే నెపంతో కంసుని పట్టణం విడిచి వెళ్ళిపోయాడు.

కృష్ణుడు వ్రేపల్లెలో ప్రచ్ఛన్నంగా వసిస్తున్నాడని నారదుడు చెప్పగా విని దానికి తగిన జాగ్రత్తలన్నీ తీసుకొన్న తరువాత ఏలాగైనా రామకృష్ణులను దగ్గరికి రప్పించి వారిని మట్టు పెట్టదలచాడు కంసుడు. అందుకోసం ధనుర్యాగమనే ఒక మిష కల్పించాడు అప్పుడ క్రూరుణ్ణి పిలిపించి బుజం మీద చేయి వేస్తూ ఇలా అంటాడు. "అక్రూరత్వము తోడ నీవు మనగా నక్రూరనామంబు నిర్వక్రత్వంబునఁ జెల్లె మైత్రిసలుపన్ వచ్చున్ నినుంజేరి నీ వక్రోధుండవు" కనుక నిన్ను పంపుతున్నాను. నీవు పోయి బలరామ కృష్ణులను నాకు తెచ్చి ఒప్పగించ మంటాడు. చూడండి. క్రూరుడైన కంసుడు

కూడా ఆయనను అక్రూరడని సంబోధిస్తాడు. అలాంటి నీతో మైత్రి సలపటం ఎవరికైనా శ్రేయస్కరమే నంటాడు. క్రూర స్వభావుల వల్ల కూడా సేబాసనిపించే ప్రశంసా పత్ర్త మందుకొన్నాడంటే అది ఎంత గొప్ప తనమో చెప్పబనిలేదు. పైగా మైత్రి సలుప వచ్చు నట. సజ్జను లెప్పుడూ ఇరుపక్షాల వారికీ విహితంగానే ఉంటారు. పరస్పరం కారాలు మిరియాలు నూరుకొనే ఇరువాగుల వారు కూడా అలాంటి వారంటే ఎవరికి వారు తమ మనిషిగానే భావిస్తుంటారు. ఇది లోకసహజం. అయితే సజ్జనులు వారిని సత్కార్యాలకు నియోగిస్తే దుర్జనులు దుష్కార్యాలకు వాడుకొంటారు. అదీ లోక సహజమే. ఇది వారి సాధుత్వాని కొక కఠిన పరీక్ష కూడా.

ఇలాంటి పరీక్షే ప్రస్తుతమీ అక్రూరునికి కూడా ఎదురయింది. నారాయణుడే దేవతల కార్యార్థమై యదు వంశంలో పుట్టినందుని ఇంట పెరుగుతున్నాడని విన్నాను. అన్న బలరాముడు కూడా అతనితోనే ఉన్నాడు. వారినిక్కడికి తీసుకురా-నేను వారి ప్రాణాలు తీయటానికి సిద్దంగా ఉన్నానని చెబుతాడు కంసుడు. దానికా పరమ భాగవతుడిచ్చిన సమాధానమిది.

పంపినఁబోని వాడనె-నృపాలక-మానవు లెన్నఁ దమ్మునూ
హింపరు- ధైవయోగముల నించుక గానరు-తోచినట్లుని
ష్కంపగతిం జరింతు రది కాదన వచ్చునె-ఈశ్వరేచ్ఛ ద
ప్పింపగ రాదు నీ పగతు బిడ్డలఁ దెచ్చెదఁ బోయి వచ్చెదన్

చూడండి. ఇందులో ఎంతగంభీరమైన భావ మిమిడి ఉన్నదో. భగవత్సంకల్పమే సర్వమూ-మంచి అయినా చెడ్డ అయినా అంతా అయన ప్రణాళికే. అందుకే నీకి దుర్బుద్ధి పుట్టింది. బహుశా ఇది ఒక నెపంగా నీకు ధనుర్యాగం లోనే ఆయువు మూడి ఉంటుందాయన చేతిలో. అది ఈశ్వరేచ్ఛే అయినప్పుడలాగే కానీ. దానిని తప్పించటానికి మనమెవరం. ఆ ఈశ్వర సంకల్పానికి నేనూఒక సహకారినైతే అంతకన్నా కావలసిందేముంది. తప్పక అలాగే నడచుకొంటాను.

భక్తుడెప్పుడూ స్వతంత్రుడుకాడు. సర్వావస్థలలోనూ భగవదిచ్ఛానువర్తి అయి బ్రతుకు సాగిస్తుంటాడు. అది మంచి ఇది చెడ్డ అని చూడడు. చెడ్డ అయినా భగవదిచ్ఛ అయితే అది మంచే అతనిపాలికి. కనుక ఏది ఎప్పుడెలా జరుగుతున్నా ఎదురాడ రాదు. "నద్వేష్టి సంప్రవృత్తాని" అన్నట్టు దాని ననుసరిస్తూ పోవటమే భగవత్కైంకర్యంగా భావిస్తాడు. ఇలాంటి సేవా బుద్ధితోనే బయలుదేరాడు అక్రూరుడు. నంద గోకులం చేరాడు. చేరాడో ఇక కృష్ణ సందర్శనం తనక వశ్యంగా లభిస్తుంది గదా అని ఎంతో మురిసిపోతాడు. అంతేకాదు.

సూరులు దొల్లియే విభుని శోభిత పాద నఖ ప్రభావళిం
జేరి భవాంధకారములఁ జిక్కక దాటుదు-రట్టి దేవరన్
వైరము తోడనైన పిలువన్ ననుబంచి శుభంబుసేసె-ని
ష్కారణమైన ప్రేమనిదె కంసుని బోలు సఖుండు గల్గునే

అని తంతే పూల పానుపు మీద పడ్డట్టు కంసుడే ఉద్దేశంతో చేసినా అది తన పాలిటి కొక మహా భాగ్యమని అనందిస్తాడు. ఇంకా ఆయన కొక అద్భుతమైన అలోచన వస్తుంది. "ఇతడా కంసుని చేత పంపువడి నన్ హింసింప నేతెంచినా - డతి దుష్టుండని చూచునో" ఇంతకు పూర్వం పూతనాది రాక్షసు లెందరో కంసుని చేత పంపబడి వచ్చి అయన చేత చంపబడ్డారు. అలాగే వీడు కూడా కంసుని దూతగా వస్తున్నాడు- నన్ను హింసించటానికే మోనని నన్నుకూడా రూపుమాపడు గదా ఆపరమాత్మ అనిసందేహించి మరలా వెంటనే "సకల భూతాంతర్బహిర్మధ్య సంగతుడౌటం దలపోసి నన్ను సుజనుంగాఁజూచునో" అయినా నాకెందుకీ భయం-అయన పరమాత్మ గదా-సకల భూతాంతర్యామి అయిన ఆ మహాత్ముడికి నా అంతరంగ మెలాంటిదో తెలియదా అని ధైర్యం తెచ్చుకొంటాడు. ఇందులో మొదటిది లౌకికమైన అలోచన. రెండవది భక్తుడికి కలిగే పరిశుద్ధభావన. ఇది ఆ మొదటిదాన్ని త్రోసి రాజని ముందుకు వస్తుంది. సాధకుని ముందుకు నడుపుతుంది. కనుకనే

మాపటి వేళ నేనుజని మాధవు పాద సమీప మందు దం
డా పతి తుండ నైన - నతడా శుగ కాల భుజంగ వేగ సం
తాపిత భక్త లోక భయ దారణ మైన కరాబ్జ మౌదలన్
మోపి హసించి నా కభయమున్ కృప తోడుత నీయ కుండునే

అని తనలో తానే సమాధానం చెప్పుకొంటాడా మహాభక్తుడు. దాసుని తప్పులు దండంతో సరి అన్నారు పెద్దలు. శత్రువునైనా శరణంటే మన్నించే పరమాత్మ పాత్రుడైన వాడుపాద పతితుడైతే ఉపేక్షిస్తాడా. ఆమెలకువ తెలిసిన వాడక్రూరుడు. కనుకనే అలాంటి పవిత్రమైన అలోచన కలిగిందా మనసుకు.

మనస్సును మించిన స్యదస్సుతో వెళ్లాడు ముందుకు. బృందావనం ప్రవేశించాడు. అక్కడ జలజాంకుశాది రేఖలు గల హరిపాదముల చొప్పు తిలకించాడు. భక్తిభావంతో పులకించాడు. అనతి దూరంలోతన సర్వస్వమైన రామకృష్ణుల దివ్యమూర్తులను దర్శించాడు. అవశుడై పోయి వారి పాదములను స్పృశించాడు. వారాయనను కౌగిలించుకొని బంధు మిత్రాదుల క్షేమ మడిగి వచ్చిన కార్య మెఱిగింపు మంటారు. ధనుర్యాగ విషయం విన్న విస్తాడక్రూరుడు. నిజమే అలాగే వెళ్లిచూడాలి తప్పదు గదా. పాలు పెరుగు నెయ్యి కట్నాలుగా కట్టి పెట్టండని హెచ్చరిస్తాడు గోపాలురను కృష్ణుడు. ఇంతలో గోపికలంతా అయ్యో అక్రూరుడు వచ్చి మన గోపాల కుమారుణ్ణి కొని పోతున్నాడే అని గగ్గోలు పడతారు. అక్రూరుడని పేరు పెట్టుకొన్నాడే గాని నిజాని కింతకన్నా క్రూరుడు లేడని ఆడిపోస్తారు. ఉఱుముఱిమి మంగలం మీద పడిందని చూడండి ఎలాంటి నీలాప నింద వచ్చిందో ఆ మహాత్ముడికి. కంసుడిలాంటి క్రూరుడే అయన నక్రూరుడని అంతగా మెచ్చు కొంటే గోపికల లాంటి భక్తులే అయనను క్రూరుడని తిట్టిపోస్తున్నారు. అభక్తులచేతనే అక్రూరు డనిపించుకొన్నవాడు పరమభక్తులకు క్రూరుడెలా అయినాడు. ఇదే మనవుల దృష్టి భేదం. ఎవరి దృష్టితోవారు చూస్తారు భాగవతుణ్ణి. ఆ చూడటం కూడా తమ ప్రయోజనాన్ని బట్టే. తమకు పనిబడితే దుర్మార్గులకు కూడా మనకు సన్మార్గుడనే బిరుదు

నిచ్చి పూజిస్తారు. తమ పనికి విఘాతం కలిగితే ఎంత సన్మార్గుడైనా వారి పాలిటికి దుర్మార్గుడు గానే కనిపిస్తాడు. ఇది కేవలం లోకుల దృష్టిమాత్రమే. అంత మాత్రాన ఒక సజ్జనుడు దుర్జనుడు కాదు. ఆయన సౌజన్య మెప్పుడూ సౌజన్యమే. అది లోకులకు తెలియదు. లోకేశ్వరుడైన పరమాత్మకే తెలిసినతత్త్వం.

అందుకే తన్ను నిత్యమూ అంటి పట్టుకొన్న గోపికలను లెక్కచేయక వారి పట్టు విడిపించుకొని పయన మయినా డక్రూరుడితో. దారిలో యమునా నది తారసిల్లింది. దిగి స్నానాదులు గావించి రామసహితుడై కృష్ణుడు రథంలో వచ్చి కూచుంటాడు. అక్రూరుడు కూడా నదిలో దిగి మజ్జనం చేసి వేద మంత్రాలు జపిస్తూ అలా చూచే సరికి జలమధ్యంలో రామకృష్ణుల రూపాలు కనిపిస్తాయి. ఇదేమిటి వీరు రథంలో గదా వెళ్లి కూచున్నారు. ఈ జలంలో కెప్పుడు వచ్చారని తలపయికెత్తి చూచేసరికి మరలా రథంలో కనిపిస్తారు. అశ్చర్యపోయి ఇంతకూ జలంలోనా,రథంలోనా అని మార్చి మార్చి చూడగానే ఇటూ అటూ కూడా ఏకకాలంలో గోచరిస్తారు. ఇది ఏదో దేవరహస్యం భేదించాలని మరలా శిరోదఘ్నంగా నీటిలో మునిగి చూచే సరికందులో అజస్ర సహస్ర ఫణా మండల మండితుడైన అదిశేషుడూ-అ శేషతల్పంమీద అనల్పప్రభా భాసురమైన పీతాంబరం ధరించి శిరస్సున కిరీటమూ-ఉరస్సున మహాలక్ష్మి - కరార విందములలో శంఖ చక్రాది దివ్యాయుధాలూ-పదార విందములలో దివ్యమణి నూపురాలూ దాల్చిన శ్రీమహావిష్ణువు దివ్యమంగళ రూపం సాక్షాత్కరిస్తుంది. అది చూచి తన జన్మ ధన్యమయిందని చెప్పి ఆ పురాణపురుషుని వేనోళ్ల పొగడుతా డక్రూరుడు. కలలం బోలెడి పుత్ర మిత్ర వనితా గారాదులన్నీ ఎండ మావుల లాంటివి. అయినా వాటినే యథార్థమని నమ్మి ఇంతకాలమూ పరమార్థానికి దూరదూరంగానే ఉండిపోయాను. ఇది తత్త్వజ్ఞాన మెలా అవుతుంది. కనుక తత్త్వమేదో దాన్ని తెలుసుకొనేందుకు నాకు నీ పాద యుగం చూపమని ప్రార్థిస్తాడు. పాదయుగ మేదో గాదు. అది ఈ నామరూపాలే. వీటి ద్వారానే వీటి

వెనకాల దాగి ఉన్న ఆపరతత్త్వాన్ని అర్థం చేసుకోవాలి సాధకుడు. అది ఆ భగవదనుగ్రహం వల్లనే సిద్ధించాలి. ఇదే భక్తుడి కాంక్ష.

అది కనిపెట్టిన పరమాత్మ వెంటనే తన రూపం మాపుచేసి ఎప్పటిలాగా రథంలో ఉన్నట్టు దర్శనమిస్తాడు. అక్రూరుడది చూచి రథాన్ని సమీపించగానే ఏమి టక్రూరా! ఎంతసేపయింది నీవు నదిలోకి వెళ్లి-ఇంత తడవక్కడ ఏమిచేస్తున్నా వెక్కడా లేనిచోద్యమేదైనా నీకక్కడ కనిపించిందా అని ఏమీ తెలియనట్టు ప్రశ్నిస్తాడు. అప్పుడా మహాభక్తుడదంతా భగవన్మాయేనని అర్థంచేసుకొని మహాత్మా!

నీలోన లేని చోద్యము – లే లోకము నందు
జెప్పనీశ్వర నీటన్ నేలన్ – నింగిని నున్నవె

ఉన్న చోద్యాలన్నీ నీలోనే ఉన్నాయి పొమ్మంటాడు. భగవంతుని మర్మం భాగవతుడికే ఎఱుక.-మరి ఎవరికీ గాదనేందు కీదే నిదర్శనం. తరువాత మధురాప్రవేశమూ-కంసవధా జరుగుతాయి. అన్నీ కన్నులార చూచి అక్రూరుడు భగవ దంకిత సర్వ జీవనుడయి తన గృహంలోనే కాలక్షేపం చేస్తుంటాడు.

ఆ తరువాత కొంత కాలానికి మరలా అక్రూరుడి దగ్గరకు స్వయంగా వస్తాడు కృష్ణుడు. భక్తు డెక్కడ ఉన్నా ఉండవచ్చు. భక్తి భావ మనేది నిశ్చలంగా ఉండాలే గాని భగవంతు డలాంటి భాగవతుడి కెప్పుడూ దూరం కాదు. వెతుక్కొంటూ వస్తా డక్కడికి. ఉద్ధవుడితో కలిసి వచ్చాడు. ఉద్ధవుడూ తన లాంటి మహా భక్తుడే. రాగానే ఉద్ధవుణ్ణి గాఢంగా కౌగిలిస్తా డ క్రూరుడు. భక్తి అనే సూత్రమెంత గాఢ మయిందో అది సజాతీయాన్ని సజాతీయంతో కలపటంలో ఎనలేని పటిమ గలది. తన ఇష్ట దైవతం పాదాలు తొడల మీదే ఇడుకొన్నా డక్రూరుడు. ఆయన పరతత్త్వ ప్రభావమూ – అవతార ప్రయోజనమూ – నానా విధాల స్తోత్రం చేస్తాడు. "ఏ పుణ్యాతి శయ ప్రభా వముననో ఈ జన్మ మందిక్కడన్ నీ పాదంబులు గంటిని – నా భవ

బంధాలు పాప" మని ప్రార్థిస్తాడు. సరేనని సర్ది చెబుతూనే ఆయనకు సంసార మోహాన్ని కీలు కొలుపుతూ ఆ పరమాత్మ ఆయన కొక ఉద్యోగాన్ని అప్పగిస్తాడు. అక్రూరా నీవు గుణవంతుడవు - పరమ భాగవతుడవు - విగ్రహారాధనలు - తీర్థాట నాదులు - చేసే వారి కన్నా మత్పద భక్తులైన మీబోటి వారు చాలా గొప్పవారు. అలాంటి నీకొకపని అప్పగిస్తున్నాను. అది ఏమంటే పాండవులు మనకు బంధువులు. చాలా కావలసిన వారు. వారు తమ తండ్రిని కోలు పోయి హస్తినాపురానికి వచ్చి ఉన్నారు. వారి పెద తండ్రి ధృతరాష్ట్రుడు వారి నంత ప్రేమగా చూడటం లేదు. కాబట్టి నీవు నా తరపున పోయి ధృతరాష్ట్రుడికి నా మాటగా బుద్ధిచెప్పి వారిని చక్కగా చూచేలాగా చేసి రమ్మని రాయబారిగా పంపుతాడు.

చూడండి. ఇది ఎంత చిత్రమైన కథో. అక్రూరు డెవరు. పాండవులెవరు. వారి దగ్గర కితడు రాయబారిగా వెళ్లట మేమిటి. భారత పాత్రలు పాండవులు. భాగవత పాత్ర అక్రూరుడు. ఒకరికొకరికి సంబంధమే లేదే. బట్ట తలలకు మోకాళ్లకు ముడిపెట్టినట్లున్న దిది. ఇదే మహర్షి కథా కల్పనా పాటవం. ముందే మనవి చేశాను. ఒకానొక సత్యాన్ని చాటటానికి సంకేతమే కథలని. అలాంటి సత్యాన్నే చాటుతున్నదిది. ఏమిటా సత్యం. భారతంలో సంజయుడి రాయబార మని ఒకటున్నది. అది కౌరవుల దగ్గరి నుంచి పాండవుల దగ్గరకు నడచిన రాయబారం. ధృతరాష్ట్రుడు తమ్ముని కొడుకులకు రాజ్య భాగ మివ్వదలచుకోలేదు. దుర్యోధనుని కంటే దుర్మార్గుడు ధృతరాష్ట్రుడు. అతడు పలువ అయితే ఇతడు సాధు పలువ. తీయని మాటలు చెప్పి ప్రాణాలు తీసే యత్నమిది. దానికి తగిన వాడినే ఎన్నుకొన్నాడు రాయబారిగా. వాడే సంజయుడా ముసలాయనకు నమ్మినబంటు. ప్రజ్ఞాచక్షుని మించిన అఖండ ప్రజ్ఞాశాలి. నెత్తురు కూడు తినేదాని కన్నా అయిదుగురూ కలిసి బిచ్చమెత్తుకొని బ్రతకటమే మీనడవడికి తగిన పని అని నిండు సభలో ధర్మరాజుకు సలహా ఇచ్చేటంత సాహసి అతడు.

అలాంటి ఛద్మ రూపమైన దౌత్య మేదో చూచాము భారతంలో. అది ఛద్మ స్వభావులైన భారత వీరులకు తగినట్టే సాగిందక్కడ. అదే సాధు స్వభావుడైన ఒక భాగవతుడి ద్వారా నడిస్తే ఎలా ఉంటుందో చూపదలచా డిక్కడ మహాముని. అది క్రూర స్వభావుడిదైతే ఇది అక్రూర స్వభావుడిదీ రాయబారం. సాధు పలవ ఎలా మాటాడుతాడో మనకు తెలుసు. అదే ప్రస్తుతం సాధు శీలుడైన వాడెలా మాట్లాడుతాడో తెలుసుకోవలసి ఉంది. ఇందులో స్వార్థం లేదు. ఛద్మం లేదు. కేవల లోకహితమే ప్రయోజనం. భగవానుడి ఉద్యమమే అది. భగవద్దత్తాధి కారులైన లోక సంగ్రహ పరాయణు లది కూడా అదే. ఏత దర్థ నిరూపణార్థమే ఈ సన్నివేశం.

అక్రూరుడు మహా ప్రసాదమని కృష్ణుని వీడ్కొని కరిపు రాని కరిగి ధృత రాష్ట్రాదులనూ - కుంతీ విదుర సమేతులైన పాండవేయులనూ ఇరువాగుల వారినీ కలుసు కొంటాడు. కొన్ని రోజూ లేదీ బయట పెట్టకుండా అలాగే ఉండిపోతాడు. కుంతి తమ పుట్టింటి వారి క్షేమ సమాచారాలన్నీ అడుగు తుంది. తన బిడ్డలకు కలిగిన ఆపదలన్నీ వలపోసుకొని బాధపడు తుంది. వారి ఆపదలను పాపటానికి కృష్ణ డిప్పటికైనా సంసిద్ధుడేనా అని ప్రశ్నిస్తుంది. అక్రూరుడు విదురునితో కలిసి ఆమె నోదార్చిన తరువాత ధృతరాష్ట్రుని కొలువు కూటంలో దర్శిస్తాడు. నలుగురూ వినేలాగా కొలువులో అత్యద్భుతంగా ఉపన్యసిస్తాడు. అది సంజయునిదీ గాదు. కృష్ణునిదీ గాదు. అక్రూరుని ఉపన్యాస మది. ఒక మహా భక్తుడూ విరక్తుడూ అయిన వాడు కేవల లోక హితం కోరి ఎలా ధాటిగా నిర్మొగమాటంగా చెబుతాడో అలా చెప్పాడు. ఈ రాజ్యధనాదులు శాశ్వతమని భ్రాంతి పడుతున్నావు ధృతరాష్ట్రా. మీన జీవన భూత మిళిత జల మిది. ఒక చేప మ్రింగి క్రక్కిన జల మింకొక చేప మ్రింగుతుంది. అదీ క్రక్కవలసిందే మరలా. కాబట్టి

నిందం బొందకు మయ్య ఈ తనువు తానిద్రా కళా దృష్టమౌ
సందోహంబు విధంబు- నిల్వదు సుమీ- జాత్యంధతం బొందియున్
మందప్రజ్ఞత నేల చేసెదవు సమ్యగ్ జ్ఞాన చక్షుండవై
సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వం సహా భాగమున్

అని తెగ వేసి ముక్త సరిగా ఉన్న సత్యాన్ని బోధిస్తాడు. శారీరకంగా వచ్చిన గ్రుడ్డి తనాన్ని ఏమీ చేయ లేక పోవచ్చు. కానీ మానసికంగానైనా గ్రుడ్డి వాడను కాదని నిరూపించుకోరాదా అని ఎంత నాజూకుగా మందలిస్తాడో చూడండి ఆ మహా నీయుడు. దాని కా ముదుసలి నీ మాట మంచిది - నిశ్చయంబని మెచ్చుకోక తప్పింది గాదు. అయినా ధృతరాష్ట్రుడు ధృతరాష్ట్రుడే గదా. నాదే ముంది అంతా ఈశ్వ రేచ్ఛ అది ఎలా ఉంటే అలాగే జరుగుతుం దని లౌక్యం ప్రదర్శించబోతాడు. లోకోత్తరుడైన మహా భక్తుడి దగ్గరనా ఈ లౌక్యం. దాని కక్రూరుడిచ్చిన జవాబు చూడండి. నీ తలంపు గనుంగొంటి. నీ కిష్టం బగునట్లు వర్తింపుము. అంటే నీ తలంపే దుష్టమైనది. దానికి తగినట్టే నీ ప్రవర్తన. మరి ఆ ప్రవర్తనకు తగిన ఫలితమే చవి చూడబోతావు చివరకని హెచ్చరిక. ఈ హెచ్చరిక చేసి ఇక ఇతనికి చెప్పుట మనవసర మను కొన్నాడో ఏమో, వెంటనే మధురకు బయలు దేరుతాడు. ఇదీ అక్రూరుని భాగవత సేవ.

పోతే ఈజంటలో రెండవవా డుద్ధవుడు. ఇతడూ యదు వంశోద్భవుడే. యాదవ వృద్ధుడే. కృష్ణుని కితడు స్నేహితుడూ - అమాత్యుడూ - ఆచార్యుడూ - చివరకు శిష్యుడూ కూడా. ఇన్ని భూమికలలో సేవించాడా పరమాత్మను. ఉద్ధవం - ఉత్సవం - ఇవి రెండూ పర్యాయ పదాలు. పండుగ అని శబ్దార్థం. భగవంతుడి సాహచర్యమే అతని కొక పండుగ. ఒక విందు భోజనం. అది తప్ప అన్య మెఱుగని వాడు. ఎఱిగినా అంత కన్నా మెఱుగ నని వాడు. మరి తన స్వామి చేతనే తాను సిద్ధ విచారుడనీ - గభీరుడనీ - వృద్ధవచో వర్ణ నీయుడనీ వృష్ణి ప్రవరుడనీ - బుద్ధి నిధి అనీ - అమర గురుసముడనీ - ఎంతగానో ప్రశంస లందుకొన్న మహనీయు డాయన. కనుకనే ఏదైనా తన కాంతరంగిక కార్య ముంటే అది అక్రూరుని లాగానే ఉద్ధవుడికే అప్పగిస్తుంటాడా పరమాత్మ.

రమ్మా యుద్ధవ గోప కామినులు నారాకాల్ నిరీక్షించుచున్
సమ్మోహంబున నన్నియున్ మఱచి యే చందంబునం గుందిరో -

తమ్మున్ నమ్మిన వారి దిగ్గ విడువన్ ధర్మంబు గాదంద్రు-వే
పొమ్మా ప్రాణములే క్రియన్ నిలిపిరో ప్రోద్యద్వియోగాగ్నులన్

అని అక్రూరుణ్ణీ పంపినట్టే రాయబారం పంపుతాడు గోపికల వద్దకు. అయితే అక్రూరు డాయనను మధురకు తీసుకు పోవటానికైతే - ఉద్ధవుడాయన రాక తెలపటానికి.

ఇదంతా ఒక నటన పరమాత్మకు. నిజానికిది తన కోసం కాదు. భక్తుల కోసం. ఒక భక్తుడి చిత్త వృత్తి ఎట్టిదో మరొక భక్తుడు గ్రహించాలి. తనదే కాదు భక్తి అంటే. అంతకు మించిన భక్తి మరొకరికికూడా ఉండవచ్చు లోకంలో. అది స్వయంగా పోయి కనులారా చూస్తే చెవులారా వింటే లన మనసులో దాగి ఉన్న గర్వగ్రంథి విరిసి పోగలదు. నిరహంకార మైన భక్తే నిజానికి భక్తి. అంతే గాదు. తన సమక్షంలోనే కాదు. పరోక్షంలో కూడా భక్తి నిలవాలి మానవులకు. అదే నిజమైన దీక్ష. అది నీకు నిజంగా ఉందో లేదో మరొకరిని చూచి అయినా తెలుసుకోమని భగవానుడు చేసే పరీక్ష అయినా కావచ్చు. అంతే కాదు. ఒక చోట కూచొని నా మూర్తి ని దర్శిస్తూ నన్ను స్మరించటమే గాదు. నా మూర్తి నందరిలో దర్శిస్తూ నా పనులు చేసి పెడుతూ - తద్ద్వారా నా లోకహిత చర్య నీవూ కొంత పంచుకొని చేసినప్పుడే అది భాగవత భక్తి ప్రచారమని కూడా కావచ్చు. ఇన్ని మార్మికమైన అంత రార్థా లున్నాయిందులో. ఈ దృష్టితోనే ఇలాంటి కార్యాలీ మహా భాగవతుల కప్పుడప్పుడూ పురమాయిస్తుంటాడు పరమాత్మ. వీరిరువురకే పురమాయించా డంటే ఆయనకు వీరెంత సన్నిహితులో చెప్పబని లేదు. ఉద్ధవుణ్ణి పంపేటపుడు పైగా ఒకమాట అంటాడు. "లౌకిక మొల్లక నన్నా - లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా లోకనముల బోషింతును. నాకాశ్రిత రక్షణములు నైసర్గికముల్" ఇది ఎంతో సాభిప్రాయమైన మాట. లౌకిక విషయ వాగురలో తగులు కొనక అలౌకికమైన తన భావాన్ని అంటి పట్టుకొన్న వారి నెప్పుడూ తాను తప్ప జూడదట. వారిని రక్షించటమే తనకు నైజమట. ఇది గోపికలకు చెప్పమని ఉద్ధవుడితో అన్నాడంటే ఉద్ధవుడి విషయంలోనూ అది వర్తిస్తుందనే

గదా భావం. అందుకే మందహాసం చేస్తూ ఆయనను సాగనంపుతాడు. ఈమందహాసమే కొంపదీసే మందహాసం. దీని సంగతి తరువాత మనవిచేస్తాను.

సరే. ఉద్ధవుడు బయలు దేరుతాడు. నంద గోకులానికి పోయి నందాదులను కలుసుకొంటాడు. ఆపుణ్యాత్ముని కౌగిలించుకొని నందాభీరు డానందియై మాపాలింటికి కృష్ణు డీతడనుచున్ మన్నించి పూజించాడట. చూడండి. ఇక్కడ విశేషం గమనించాలి మనం. అక్రూరుడి కంటే ఉద్ధవుడి స్థాయి ఇంకా ఒక మెట్టెక్కువగా కనిపిస్తున్నది. అక్రూరు డాయన విరూద్రూపాన్ని దర్శించ గలిగాడంత వరకే. ఈయన అలాగాదు. ఆ రూపాన్నే తన రూపంగా భావించ గలిగిన పరమ భక్తుడు. అందుకేనేమో ఆయనను చూచే సరికి కృష్ణుడే తమ దగ్గరికి నడచి వచ్చిన ట్లనిపించింది నందాదులకు. అంతే కాదు. తరువాత గోపికలు కూడా ఆయన ఎక్కడో ఒక ఏకాంత ప్రదేశంలో ధ్యాన నిమీలిత లోచనుడై కూచొని ఉంటే పార జూచి

రాజీవాక్షుడు సుందరాస్యుడు మహోరస్కుండు-సీతాంబరుం
డాజానుస్థిత బాహు డంబురుహ మాలా లంకృతుం డుల్లస
ద్రాజత్కుండలు డొక్క వీరు డిచటన్ రాజిల్లు చున్నాడు మా

రాజీవాక్షుని భంగి నని భ్రాంతి పడతారు. సగుణ భక్తిలో ఇది సారూప్య మనే భక్తి భూమిక. భగవద్రూపమే సంక్రమిస్తుంది భాగవతుడికి. అంతకన్నా స్పృహణీయ మైన దేముంది.

ఉద్ధవుడి కిలాటి భగవ ద్రూపమే గాదు. భగవత్తత్త్వ విషయమైన జ్ఞానం కూడా ఉంది.

బలుదుం గృష్ణుడు మర్త్యులే - వసుమతీ భారంబు వారింప
వారల రూపంబునఁ బుట్టినాడు హరి -

అని చెబుతాడు గోపకులకు. అంతే కాదు. ఆ నారాయణు డఖిలాత్ముడు-అఖిల భూతములతో ఇంధన జ్యోతి లాగా మెలగుతున్న తత్త్వ మది. దానికి

జననీ జనకదార సఖిపుత్త్ర బాంధవ శత్రు ప్రియా ప్రియ జనులంటూ ఎవ్వరూ లేరు. ఆయనకు జన్మ కర్మము లును జన్మంబు లును లేవు. గుణ విరహితు డయ్యు గుణ వంతుడయి సర్వ రక్షణ వినాశకేళి సలుపుతున్నాడా మహానుభావుడు. అలాంటి పర తత్త్వాన్ని చింతించు పరమ భక్తుడు కూడా "అలఘు శ్రేయము బొందు బ్రహ్మ మయుడై - నిత్యుడై" అని భక్తి మార్గ నిర్గళిత రహస్యాన్ని కూడా బయట పెడతాడందరికీ.

అయితే ఉద్ధవుని ఇంత భాగవత దీక్షా పని చేయలేదా గోపకాంతల దగ్గర. వారు తమ్ము మోసగించిన ధూర్త గోపాలునే గాక ఆ ధూర్తునికి దూతగా వచ్చాడని చెప్పి ఇతణ్ణి కూడా ధూర్తుడు గానే భావించి ఉపాలంభించ సాగారు. అక్రూరుడి లాగానే ఉద్ధవుణ్ణి కూడా అనరాని మాట లంటారు. "భ్రమరా దుర్జన మిత్ర." ఆ కృష్ణుడు దుర్జనుడైతే ఆయన మిత్రుడవు నీవు ఇద్దరూ భ్రమర స్వభావులే. కృష్ణుడు మంచివాడని మాకెందుకు ఘోష పెడతావు. మరెవరి దగ్గరైనా ఏకరువు పెట్టు నీకింత తిండి పెడతారు. ఇదంతా ఉపా లంభం కాదు. కేవలమూ కృష్ణ విప్రలంభ జనిత తృష్ణాతిరేక ప్రేమాతి శయ విజృంభమే. అర్థమయింది ఉద్ధవుడికి. అనురాగం శ్రుతి మించితే భక్తుడి మనస్తత్త్వ మలాగే ఉంటుందని. ఆ వాలు గంటుల భక్తి ముందు తన భక్తి కూడా చాలదని భావించాడు.

జప దాన వ్రత హోమ సంయమ తపః స్వాధ్యాయ ముఖ్యం బులన్
నిపుణల్ గోరియునే విభున్ మనములో నిల్పంగలే - రట్టిస
ద్విపులా కారునిపై మహా మహిము సై విశ్వేశుపై మీ కజ
స్రపటు ధ్యానము లిట్లు నిల్చునె భవ చ్చారిత్రముల్ చిత్రముల్

అని వారి నెంతగానో కీర్తిస్తాడు. నిపుణులనే మాటలో ఎంతైనా అర్థముంది. పండితులకు పాండిత్య గర్వ విక్షేపాదు లడ్డు తగులుతాయి భక్తి మార్గంలో. అందుకే వారి కంత గట్టిగా నిలవ దది. పామరుల కలాటి విక్షేపాదు లుండవు కాబట్టి గట్టిగా నిలుస్తుందని భావం. కృష్ణ మూర్తి తప్పక మిమ్ము అచిర కాలంలోనే కలుసు కొంటాడు. మిమ్ము తలక వలదని నాచేత చెప్పి

పంపాడని చెప్పి వారి ననున యిస్తాడు. వారి మధుర భక్తి జనిత విధుర వచనాల నాలకిస్తూ కొన్ని మాసాలా వ్రజపురంలో గడపి తరువాత ప్రవ్రజితుడై మధురకే పయనమై వస్తాడు. కృష్ణుడికి వారి ప్రతి సందేశం వినిపిస్తాడు.

అక్రూరుడి లాగానే ఉద్ధవుడు కూడా యాదవకుల శ్రేష్ఠుడూ - విద్యా వరిష్ఠుడూ గుణ గణ జ్యేష్ఠుడే సందేహం లేదు. ఇరువురూ భగవద్భక్తి సాగరంలో కంఠ దఘ్నంగా మునిగిన వారే అనుమానం లేదు. అయినా విద్యావతులు కాని గోపికల నిసర్గ మధురమైన భక్తి భావమెంత నిర్వ్యాజమో ఎంత గాఢమో తెలుప దలచాడు వారికా ఈశ్వరుడు. భక్తిలోని గాఢత్వాని కొక్కటే నిదర్శన మది భగవ ద్వియోగా సహిష్ణుత. తన్నిమిత్తంగా సాగే నిష్ఠురోక్తులూ. ఇది మనకు గోపికల పట్టుననే కనిపిస్తుంది. మరి ఎక్కడా కనుపట్టదు. వారు కృష్ణ వియోగ మొక్క క్షణకాలం సహించరు. అక్రూరోద్ధ వుల నాడి పోసుకొన్న దందులకే. కడకు తమ ప్రాణ నాథుడైన కృష్ణుణ్ణి కూడా నిష్ఠురా లాడేందుకు వెనుదీయలేదా సుందరులు. వారి ప్రగాఢమైన భక్తి ఎలాంటిదో ప్రౌఢులైన ఉద్ధవాదులు కూడా గ్రహించాలనే పరమాత్మ వారి కలాటి సుకుమారమైన రాయబారం అప్పగించటం.

ఉద్ధవుడు మరలా మనకు కృష్ణుడు రాజసూయ యాగానికి బయలు దేరే ముందు కనిపిస్తాడు. రాజ సూయానికి వెళ్లటమా - మానటమా - అని తేల్చి చెప్పమని ఉద్ధవుని అడుగుతాడు కృష్ణుడు. పైగా "అనఘ చారిత్ర నీవు మా అక్షియుగము వంటి వాడవు - మనకు నవశ్య మగుచుఁ జేయఁ దగినట్టి కార్యంబుఁ జెప్పు" మని తనకు తెలిసినా ఆ భక్తుడికి మర్యాద ఇచ్చి మాట్లాడుతాడు. ఇది మర్యాద ఇవ్వట మయినా కావచ్చు. ఆయన భక్తి మర్యాద ఎంతటిదో పరీక్షించటమైనా కావచ్చు. ఆ భక్తుడెప్పుడో గమనించాడా మాటలలోని మర్మం. అతని పాదాంబు జంబుల మనంబున నిడుకొని వృద్ధాను మతంబుగా నాయెఱింగిన తెఱంగు విన్న వించెద

నంటాడు. ఆ తెలి గత డెటిగిస్తే అక్కడ ఉన్న యాదవులు సదస్యులు నారదుడు - అందరూ ఆయన నభినందిస్తారట. అలా తన భక్తుణ్ణి నలుగురూ అభినందించాలనే అప్పటికా నంద నందనుడి ఆశయం.

మరలా ఇక ఉద్ధవుడు మనకు సకల యదువంశ సంక్షయమైన తరువాత గాని కనిపించడు. అదే ఇక ఆఖరుసారి కనిపించటం. యుగక్షయ మయిపోతున్న దిక నీవూ మాకు దూరమవుతున్నావు. నీదాసులమైన మాకేదైనా తరణోపాయం ప్రసాదించి పొమ్మని ప్రాధేయ పడతా డుద్ధవుడు. దానికా నందాత్మజు డానందించి ఆయన కెవరికీ చెప్పని జ్ఞాన యోగ రహస్యాలన్నీ సోదాహరణంగా వర్ణించి చెప్పి చివరకు -

గచ్ఛోద్ధవ మయా దిష్టో - బదర్యాఖ్యమ్ మమాశ్రమమ్
తత్ర మత్పాద తీర్థోదే - స్నానో పస్పర్శనైశ్శుచిః
ఈక్షయాలక నందాయా - విధూతా శేష కల్మషః
వసానోవల్క లాన్యంగ వన్యభు క్సుఖనిస్స్పృహః
తితిక్షు ర్ద్వంద్వ మాత్రాణాం - సుశీల స్సంయ తేంద్రియః
శాంత స్సమాహి తధియా - జ్ఞాన విజ్ఞాన సంయుతః
మయాను శిక్షితం యత్తే - వివిక్త మను భావయన్
మయ్యా వేశిత వాక్చిత్తో - మద్ధర్మ నిరతో భవన్
అతిక్రమ్య గతీస్తి స్రో - మామేష్యసి తతః పరమ్

అని శేష జీవితం ఎలా గడపాలో ఉపదేశించి - అలా గడిపితే అవసానం లో తన అనుగ్రహం ఎప్పటికీ ఉంటుందని హామీఇచ్చి - సాగనంపుతాడు. అలాగే తన జీవిత శేషం బదరికాశ్రమంలో చరితార్థం చేసుకొని ఆ పరమా భాగవతుడు

యథోపదిష్టాం జగదేక బంధునా - తపస్స మా స్థాయ హరేరగాద్గతిమ్

ఇదీ ఉద్ధవుడి భాగవత చరిత్ర. ఉద్ధవుడి చరిత్ర హరి వంశంలో లేదు. అక్రూరుడి వృత్తాంత ముంది గాని అతని దౌత్య వ్యవహారం కానరాదు.

మొత్తం మీద కుంతి దగ్గర నుంచీ ఉద్ధవుని దాకా సగుణ భక్తి అనేది ఏమిటో ఎలాంటిదో ఏకరువు పెడుతూ వచ్చాము. ఇందులో ఎన్నో భూమికలూ ఎంతో వ్యవహార ముంది. అది కూడా ఆయా వ్యక్తుల చిత్త వృత్తులనూ భక్తిలో వారి కుండే మంద మధ్యమ తీవ్ర తీవ్ర తరాది వేగాలనూ బట్టి నానా విధాలుగా మనకు దర్శన మిస్తుంది. అయితే ఎంత తీవ్రాతి తీవ్రమైన ఇది సగుణమే ననే మాట మనం మరచి పోరాదు. కడకు అక్రూరోద్ధవులది కూడా సగుణమే. పరమాత్మ వారి కెంత సన్నిహితుడైనా కావచ్చు. ఎన్ని శాస్త్ర రహస్యాలైనా బోధించి ఉండవచ్చు. సంసార తారణమే వాటన్నిటికీ ప్రయోజనమే కావచ్చు. అయినా అది సగుణ సీమ దాటి పోదు. కృష్ణ సందర్శనమే వారి ధ్యేయం. ఆయనతో సహ శయ్యాసనాది సుఖమే వారుకోరుకొనేది. ఆయన తోడి క్షణకాల విరహం కూడా వారికి సహస్ర యుగోపమం. గోపికలే కారు – ఉద్ధవాదులే కారు. అందరికీ అదే పిచ్చి. అది భక్తిలో ఒక భూమికే గాని భక్తి సర్వస్వం కాదని తెలుసు పరమాత్మకు. అందుకే వారితో ఉన్నట్టే ఉండి అదృశ్య మవుతాడు. వారి నాదరించినట్టే ఆదరించి ఒక మందస్మితం చేసివారిని మరలా మాయలో పడ దోస్తాడు. ఈ మందహాసమే మహామోసం. నవ్వు రాజిల్లెడు మోమువా డన్నట్టు ఇది ఒక అంతు పట్టని గుణం. ఈ గుణ జాల మొక ఇంద్ర జాలం మాదిరందరి మీదా ప్రయోగించి వారి మనో విహంగమాల నాజాలంలో బందీ చేయటంలో అందె వేసిన చేయి ఆయనది. ఇది తెలుసుకో లేక వారాయన మనవాడే గదా అని ఏమేమో కోరుతారు. ఇస్తాడని ఆశ పడతారు. ఇవ్వడూ. చేయడు. ఇచ్చినట్టు కనిపిస్తాడంతే. కనుకనే గోపికలను కలుసు కొంటానని చెప్పి మరలా కన్నెత్తి చూడలేదు. అక్రూరుని వీడ్కొలిపి మరలా ఆలోచించ లేదాతని సంగతి. ఒక్క ఉద్ధవునికే ఏదో చెప్పినట్టు కనిపిస్తాడు. అది కూడా సగుణ భావన ఉన్నంత వరకూ పని చేయదు – అపేక్షితమైన మోక్ష ఫల మందీయదు. కాబట్టి జీవిత శేష మంతా అంతవరకూ పట్టుకొన్న గుణ చింతనకు స్వస్తి చెప్పి తత్పరి పాక రూపమైన

జ్ఞాన విజ్ఞానాల నాలంబనం చేసుకొని తరించమని చివరకు బోధ చేస్తాడు. ఇంతకూ కేవల సగుణ దృష్టి ఉన్నంత వరకూ త్రిగుణాత్మక సృష్టి నుంచి ముక్తి లేదు భక్తుడికి. అది ప్రకృతి గుణాలే కావచ్చు. భగవద్గుణాలే కావచ్చు. గుణాలు గుణాలే. అవి అపరిచ్ఛిన్నమైన తత్త్వాన్ని పరిచ్ఛిన్నం చేసి చూపుతాయి. అలా చూపటం వల్లనే కడపటి దాకా కృష్ణుని దివ్య సుందర విగ్రహాన్నే చూస్తూ ఆయన మధురమైన మాటలే వింటూ – ఆయన గారి లీలలే తిలకిస్తూ – పరవశులై బ్రతుకులు సాగిస్తూ పోతే చాలు – అదే పరమ పద ప్రాపకమని నమ్ముతూ వచ్చారా గోప గోపికాదు లంతా. అక్రూరాదులూ అలాగే విశ్వసించారు. అది ఎప్పటికైనా తుప్పు రాలినట్టు రాలిపోతే తప్ప అసలైన భగవత్తత్త్వాన్ని మీరు పట్టుకోలేరని బోధించటానికే భగవానుడు చివరకు వారందరినీ ఎక్కడ వారి నక్కడ దూరంగా సాగనంపి తాను కూడా వారికి దూరమై పోతాడు. ఆయన అలా భౌతికంగా దూరమై పోవటంలో ఇదీ పరమార్థం. అలా ఆయన దూరమై నప్పుడే అర్జునాది పాండవులు గానీ– అక్రూరాది యాదవులు గానీ – అందులోని అంతరార్థాన్ని గ్రహించి బాగుపడ గలిగారు. కృష్ణ లీలంటే నిజంగా లీలే.

★ ★ ★



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in